ఈనాడు
THE LARGEST CIRCULATED TELUGU DAILY
హైదరాబాద్ 12-3-2018 సోమవారం సిటీ సంపుటి 44 . సంచిక 211
రూ. 5-00 పేజీలు 16+24 www.eenadu.net
Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

దిల్లీలో సత్తా చాటుతాం

- 2019 వరకు ఇక్కడే ఉంటా
- ఆ తర్వాత దేశ రాజకీయాల్లోకి వెళ్తా
- సమర్థులను నా వెంట తీసుకెళ్తా
- గుజరాత్‌ను అభివృద్ధి చేసి మోదీ దిల్లీ వెళ్లారు
- తెలంగాణ సీఎంగా నాదీ అదే పంథా
- రాష్ట్రంలో 106 అసెంబ్లీ స్థానాలు తెరాసకే
- ప్రస్తుత ఎంపీ, ఎమ్మెల్యేలందరికీ మళ్లీ అవకాశం
- తెరాస శాసనసభాపక్ష సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యాఖ్యలు

-2లో

- సమావేశాలయ్యాక కోటాపై దిల్లీలో ధర్నా
- రాజ్యసభ అభ్యర్థుల్లో బీసీలకు పెద్దపీట వేశామని వెల్లడి



తెలంగాణ భవన్‌లో నిర్వహించిన తెరాస శాసనసభాపక్ష సమావేశంలో రాజ్యసభకు ఆ పార్టీ తరఫున ఖరారైన అభ్యర్థులు జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, బండ ప్రకాష్ ముదిరాజ్‌లను పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. చిత్రంలో ఎంపీలు జితేందర్‌రెడ్డి, కేశవరావు

నేటి నుంచి శాసనసభ 6 లో

> ‘దేశ రాజకీయాలకు తెరాస అవసరం ఏర్పడింది. దేశానికి తెలంగాణ దారి చూపాలి. మోదీ గుజరాత్‌ను అభివృద్ధి చేసి దిల్లీకి వెళ్లి ప్రధాని అయ్యారు. తెలంగాణను అభివృద్ధి చేసినందున.. మోదీ మాదిరే దిల్లీకి వెళ్లి జెండా ఎత్తాలన్నదే నా లక్ష్యం. జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ కూటమి ఆలోచన ఇప్పటిది కాదు. ఎన్నో రోజుల నుంచి నా మనస్సులో ఉంది. మా చొరవతో ఏర్పడే కూటమి మూడోది కాదు.. మొదటిది అవుతుంది’
>
> - ముఖ్యమంత్రి కేసీఆర్

బీసీలకు రెండు, ఓసీకి ఒకటి

- తెరాస రాజ్యసభ అభ్యర్థుల ఖరారు
- జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్ ముదిరాజ్‌లు

-2లో

ఇక జీవితకాలం అతడే.. చైనా చక్రవర్తి



- జీవితాంతం అధ్యక్షుడిగా జిన్‌పింగ్
- పదవికి కాలపరిమితి తొలగింపు

-13లో

- చైనా పార్లమెంటు సమ్మతి
- ఉపాధ్యక్ష పీఠానికీ వెసులుబాటు

కార్పొరేటు కరాళనృత్యం



- లక్షల్లో ఫీజులు పిండేస్తున్న ప్రైవేటు కళాశాలలు
- తల్లిదండ్రులను అప్పులపాలు చేస్తున్న ఇంటర్ విద్య
- ఏటా రూ.3 వేల కోట్లకు పైగా వ్యాపారం
- బోర్డు నియంత్రణ కరవు

-11లో

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- 37 మందికి స్థానచలనం
- రహదారి భద్రతామండలి ఛైర్మన్‌గా కృష్ణప్రసాద్
- హైదరాబాద్ కమిషనర్‌గా అంజనీకుమార్
- సైబరాబాద్‌కు సజ్జనార్

-16లో

జూన్ 2 నుంచి రైతులకు రూ.5 లక్షల బీమా అమలు

2 లో

దిల్లీలో సత్తా చాటుతాం

ఈనాడు - హైదరాబాద్

తాను 2019 వరకు రాష్ట్ర రాజకీయాల్లోనే ఉంటానని.. ఆ తర్వాత దేశ రాజకీయాల్లోకి వెళ్తానని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. 2019 తర్వాత జాతీయ స్థాయిలో తెరాస కీలకపాత్ర అవుతుందని, తనతోపాటు సమర్థులైన నేతలను దిల్లీ తీసుకెళ్లి సత్తా చాటుతామని స్పష్టంచేశారు. గుజరాత్ నుంచి జాతీయ స్థాయికి వెళ్లిన ప్రధాని మోదీ చూపిన దారిలోనే తాను వెళ్తున్నానని చెప్పారు. తమ చొరవతో ఏర్పడే కూటమి మూడోది కాదని.. మొదటిది అవుతుందన్నారు. శాసనసభ సమావేశాలు ముగిసిన వెంటనే దిల్లీకి వెళ్లి రిజర్వేషన్ల పెంపు బిల్లు ఆమోదానికి జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తామని వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో తెరాస 106 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధిస్తుందని చెప్పారు. ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలందరికీ టికెట్లు ఇస్తామని.. బలహీనంగా ఉన్న వారిని తానే దగ్గరుండి గెలిపించుకుంటానని పేర్కొన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో తెరాస శాసనసభాపక్ష సమావేశంలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. రాజ్యసభ అభ్యర్థుల విషయంలో బీసీలకు పెద్దపీట వేశామని కేసీఆర్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో అంతా అప్రమత్తంగా ఉండాలని, ఉద్దేశపూర్వకంగా సభకు ఆటంకం కలిగించేవారిని సెషన్ మొత్తం సస్పెండ్ చేయాల్సిందేనన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో గొడవ చేసిన వారిని మహారాష్ట్రలో మూడేళ్లపాటు సస్పెండ్ చేశారని.. అదే విధానాన్ని మనం పాటించాలని సూచించారు. దేశ రాజకీయాలకు తెరాస అవసరం ఏర్పడిందని కేసీఆర్ పేర్కొన్నారు. మోదీ గుజరాత్‌ను అభివృద్ధి చేసి దిల్లీకి వెళ్లి ప్రధాని అయ్యారంటూ... తెలంగాణను అభివృద్ధి చేసినందున మోదీ మాదిరే దిల్లీకి వెళ్లి జెండా ఎత్తాలన్నది తన లక్ష్యమని స్పష్టం చేశారు. జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ కూటమి ఆలోచన ఎన్నో రోజుల నుంచి తన మనస్సులో ఉందన్నారు.

"చైనా, జపాన్‌లు 25 ఏళ్లలోనే గొప్ప ప్రగతిని సాధించాయి. సింగపూర్‌ది గొప్ప విజయగాథ. తెలంగాణను కూడా మూడున్నరేళ్లలోనే అభివృద్ధి చేశాం. హిమాలయాల అవతల ఉన్న చైనా స్థాయిలో ఇవతల ఉన్న మన దేశాన్ని ఎందుకు ముందుకు తీసుకెళ్లలేమన్న ప్రశ్నతో నేను ముందుకొచ్చా. ప్రత్యామ్నాయ కూటమి అధికారం కోసమో, పదవుల కోసమో కాదు. అన్ని రాష్ట్రాలను, ప్రజలందరినీ ఒకేతాటి మీదికి తెచ్చే యత్నం. మూస పద్ధతిలో నడుస్తున్న రాజకీయాల్లో సమూల మార్పులు తేవాలి. దేశాన్ని అగ్రస్థానంలో నిలిపేలా ప్రజోపయోగమైన పనులు జరగాలి. దేశంలోని భాజపా, కాంగ్రెస్సేతర పార్టీలు ఏకం కావాలి. మరో ప్రబలమైన శక్తి ఆవిర్భవించాలి. ఇందు కోసం అన్ని పార్టీలతో మాట్లాడుతున్నాం. 2019 వరకే నేను రాష్ట్ర రాజకీయాల్లో ఉంటా. ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తా. బాగా పనిచేసే వారు నాతో వస్తారు. శాసనసభ సమావేశాల తర్వాత దిల్లీకి వెళ్తా. ముస్లిం, గిరిజన రిజర్వేషన్ల పెంపు బిల్లు కేంద్ర ఆమోదానికి ప్రయత్నిస్తా. కేంద్ర వైఖరి మారకపోతే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలందరితో కలిసి దిల్లీలోనే ధర్నా చేస్తా. పలు పార్టీల నేతలను కలిసి ప్రత్యామ్నాయ కూటమి గురించి కూడా చర్చిస్తా.



తెరాస శాసనసభాపక్ష సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్

శాసనసభ సమావేశాలు కీలకం: సోమవారం నుంచి జరుగనున్న రాష్ట్ర శాసనసభ సమావేశాలు చాలా కీలకం. కాంగ్రెస్ పార్టీ గొడవ చేయాలనుకుంటోంది. సభలో అల్లరి చేసి బయటికి వెళ్లిపోదామనే ఆలోచనలో ఉంది. కాంగ్రెస్ వాళ్లు పుస్తకాలను చించి గవర్నర్ మీద వేయాలనుకుంటున్నారని సమాచారమందింది. కావాలని గొడవ చేస్తే సహించేది లేదు. సస్పెండ్ చేయాల్సిందే. మనకు ప్రజలు, ప్రజా సమస్యల పరిష్కారం ముఖ్యం. రాజకీయాల కోసం సభకు ఆటంకం కలిగించడాన్ని అడ్డుకోవాలి. మంత్రులు, ఎమ్మెల్యేల హాజరు నూటికి నూరుశాతం ఉండాలి. మన విజయాలను ప్రజలకు వివరిద్దాం.

కమలాకర్, విద్యాసాగర్ కోపం తెచ్చుకోవద్దు: శాసనసభలో ఎవరైనా గొడవ చేస్తే మనం ఓపిక పట్టాలి. గంగుల కమలాకర్, విద్యాసాగర్‌రావులు ఉత్సాహవంతులు. వారికి పార్టీపై అభిమానం ఎక్కువ. మరోవైపు కోపం కూడా ఎక్కువే. సభలో ఎవరైనా అడ్డుతగిలితే.. వారిమీద ఆగ్రహం వ్యక్తంచేస్తుంటారు. ఈ సారి వారిద్దరూ కొంచెం ఓపిక పట్టి.. శాంతంగా ఉండాలి.

రాజ్యసభ ఎన్నికల్లో మనదే విజయం: రాజ్యసభ ఎన్నికల్లో మనదే విజయం. కాంగ్రెస్ పోటీలో ఉండదనే అనుకుంటున్నా. బరిలో ఉంటే ఆ పార్టీ తగిన మూల్యం చెల్లించుకుంటుంది. మజ్లిస్ ఇప్పటికే మనకు మద్దతునిచ్చింది. సీపీఐ ఎమ్మెల్యేగా గెలిచిన రవీంద్రకుమార్ పార్టీని తెరాసలో విలీనం చేస్తున్నట్లు లేఖ ఇచ్చారు. దానిని ఆమోదించి, తెరాసలోకి విలీనం చేసుకుందాం. నేను దిల్లీకి వెళితే తోడుగాఉంటారని సంతోష్‌కుమార్‌ను ఎంపీగా చేస్తున్నాం. తెలంగాణలో యాదవ, ముదిరాజ్‌లు బీసీల్లోని బలమైన సామాజికవర్గాలు. వారిని నేరుగా పెద్దల సభకు పంపేందుకు ఎంపిక చేశాను.

కేటీఆర్, హరీశ్‌లకు కీలక బాధ్యతలు: రాజ్యసభ ఎన్నికలు కీలకమైనవి. వాటి బాధ్యతలను కేటీఆర్‌కు అప్పగిస్తున్నా. కడియం శ్రీహరి, ఈటల, జగదీశ్‌రెడ్డిలతో కలిసి సమన్వయం చేసుకోవాలి. మరోవైపు అత్యంత ప్రాధాన్యం గల శాసనసభ సమావేశాల సమన్వయ బాధ్యతలను హరీశ్ చూస్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారికి సహకరించాలి" అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో మళ్లీ తెరాసదే గెలుపు

వచ్చే శాసనసభ ఎన్నికల్లో మనం ఘనవిజయం సాధిస్తాం. తాజా సర్వే ప్రకారం 106 సీట్లు తెరాసకే వస్తాయి. ముగ్గురు, నలుగురు మినహా ఇప్పుడున్న వారందరికీ టికెట్లు వస్తాయి. వారు కూడా పద్ధతి మార్చుకుంటే టికెట్లు ఇస్తాం. అందరూ విజయం సాధిస్తారు. ఎవరైనా గెలవలేని పరిస్థితి ఉంటే నేను స్వయంగా వెళ్లి గెలిపించుకుంటా. ఎమ్మెల్యే బొడిగ శోభ వైఖరి మార్చుకోవాలి. రాజకీయ భవిష్యత్తును పాడుచేసుకోవడం సరికాదు. ఒక కార్యకర్త మీద దాడిచేస్తే విషయం కేసు వరకు వెళ్లింది. అలా చేయడం సబబు కాదు. మనం హుందాగా వ్యవహరించాలి. లేకపోతే లేనిపోని చిక్కులొస్తాయి. నిత్యం ప్రజల్లో ఉండాలి. చేసినవి చేసినట్లు చెప్పుకుంటే చాలు మనం ఘన విజయం సాధిస్తాం. రైతుల అభివృద్ధికి మనం చేస్తున్న కృషి గొప్పది. రైతుసమన్వయ సమితులువారికి గొప్ప మేలు చేస్తాయి. మన ప్రభుత్వ కృషిని అన్నదాతలకు చాటాలి.

జూన్ 2 నుంచి రైతులకు రూ.5 లక్షల బీమా

- వ్యవసాయ శాఖ నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం(జూన్ 2) నుంచి రైతులకు బీమా పథకాన్ని అమలుచేయాలని తెలంగాణ వ్యవసాయ శాఖ తాజాగా నిర్ణయించింది. వచ్చే నెల ఒకటి నుంచే ఈ పథకాన్ని ప్రారంభించాలని తొలుత యోచించారు. కానీ, ఇంతవరకూ రైతులెందరనే లెక్కలింకా పక్కాగా తేలకపోవడం, ప్రీమియం చెల్లింపునకు నిధుల విడుదలలో బడ్జెట్ పరంగా సాంకేతిక సమస్యలను దృష్టిలో పెట్టుకుని జూన్ 2 నుంచి అమల్లోకి తేవాలని నిర్ణయించారు. బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.500 కోట్లు కేటాయించాలని వ్యవసాయ శాఖ ప్రతిపాదించింది. కానీ, ఎల్ఐసీతో చర్చించిన తరవాత ప్రీమియం సొమ్ము రూ.600 కోట్లను దాటే అవకాశాలున్నాయని అంచనా.

భూముల పత్రాల పరిశీలన ఆధారంగా రాష్ట్రంలో రైతుల సంఖ్య 71.75 లక్షలుగా రెవెన్యూ అధికారులు నివేదించారు. అయితే, క్షేత్రస్థాయిలో పంట సాగుచేసేవారిని మాత్రమే 'రైతు'గా గుర్తించాలని పేర్కొంటూ మరోసారి పరిశీలన జరపాలని ప్రభుత్వం ఇటీవల రెవెన్యూ శాఖను ఆదేశించింది. గ్రామాలు, పట్టణాల సమీపంలో ఆస్తుల రూపంలో కొని నిరుపయోగంగా భూములు ఉంచితే.. వాటి యజమానులను రైతులుగా గుర్తించొద్దని ప్రభుత్వం సూచించింది. మరోవైపు వ్యవసాయశాఖ గత జూన్‌లో చేసిన అధ్యయనం ప్రకారం 45 లక్షల మంది పంటలు సాగుచేస్తున్నట్లు ప్రభుత్వానికి తెలిపింది. మరో 10 లక్షల మంది రైతులు సాగు చేస్తున్నప్పటికీ వారి భూములు వివాదాల్లో ఉన్నట్లు వివరించింది. ఇవన్నీ కలిపినా మొత్తం రైతుల సంఖ్య 55 లక్షలు దాటదని వ్యవసాయ శాఖ అంచనా. కానీ అసైన్డ్ భూములు సాగుచేస్తున్నవారినీ కలిపితే 71.75 లక్షల మంది రైతులున్నట్లు రెవెన్యూశాఖ వివరించింది. ఈ లెక్కల గందరగోళాన్ని త్వరగా తేల్చి గత వానాకాలం, ప్రస్తుత యాసంగిలో వాస్తవంగా పంటలు సాగుచేసిన రైతులను గుర్తించి వారి సంఖ్యను తెలపాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇదంతా మరో వారం రోజుల్లో కొలిక్కి వచ్చే అవకాశాలున్నాయి. గరిష్ఠంగా 60 లక్షల మంది వరకూ రైతులున్నట్లు తేల్చేస్తారని అంచనా. వీరిలో ఒక్కొక్కరికి రూ.5 లక్షల జీవిత బీమా చేయించాలంటే 'సంయుక్త బీమా పథకం' కింద కనీసం రూ.1000 చొప్పున ప్రీమియం కట్టాలని అంచనా. ఈ లెక్కను తీసుకుంటే కనిష్ఠంగా రూ.600 కోట్లను ప్రీమియంగా కట్టాల్సి ఉంటుందని ప్రాథమికంగా లెక్క తేల్చారు. కానీ ప్రీమియం రూ.1000 సరిపోతుందా లేక ఇంకా ఎక్కువ అవసరమా అన్నది ఎల్ఐసీ ఇంకా ఏమీ చెప్పలేదు. పైగా ఒకే బీమా కంపెనీతోనే పథకం అమలుచేయాలా లేక మరిన్ని కంపెనీలకు అమలు బాధ్యత అప్పగించాలా అన్నదానిపైనా కసరత్తు జరుగుతోంది. ఈ ప్రక్రియంతా పూర్తయి బడ్జెట్ నుంచి నిధులు విడుదల కావాలంటే మే వరకూ సమయం పడుతుందని, జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి పథకం అమలు చేయాలని నిర్ణయించారు. రైతు కన్నుమూస్తే అతని కుటుంబానికి రూ.5 లక్షల బీమా పరిహారం అందించాలన్నది పథకం లక్ష్యం. ప్రస్తుతం రైతులు ఆత్మహత్య చేసుకుంటే తక్షణ పరిహారంగా రూ.5 లక్షలు ఇచ్చి మరో రూ.లక్ష అప్పులకు చెల్లిస్తున్నారు. బీమా పథకం అమల్లోకి వస్తే ఆత్మహత్య చేసుకున్నవారికి సైతం దీనికిందనే పరిహారం వస్తుందని అంచనా.

బీసీలకు రెండు, ఓసీకి ఒకటి



రాజ్యసభకు తెరాస పార్టీ తరపున ఖరారైన అభ్యర్థులు బండ ప్రకాష్ ముదిరాజ్, జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జరిగే రాజ్యసభ ఎన్నికలకు తెరాస అభ్యర్థులుగా ముగ్గురు ఎంపికయ్యారు. పార్టీ ప్రధాన కార్యదర్శులైన జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్ ముదిరాజ్‌ల పేర్లను ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడించారు. వివిధ సమీకరణాల నేపథ్యంలో సీఎం ఇద్దరు వెనుకబడిన తరగతుల వారికి, ఒకరు ఓసీకి అవకాశం ఇచ్చారు. పూర్వ కరీంనగర్, నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి ఒక్కొక్కరూ ఈ జాబితాలో ఉన్నారు. ఆదివారం తెలంగాణభవన్‌లో జరిగిన తెరాస శాసనసభాపక్ష కార్యాలయంలో వీరి పేర్లను ఆయన అధికారికంగా ప్రకటించారు. సంతోష్‌కుమార్ సీఎంకు అత్యంత సన్నిహితునిగా ఉన్నారు. ముఖ్యమంత్రి వ్యక్తిగత వ్యవహారాలు, రాజకీయ అంశాలను ఆయన పర్యవేక్షిస్తూ, సమన్వయ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. పార్టీలో ఒక స్థానాన్ని యాదవులకు ఇస్తామని ఇప్పటికే సీఎం ప్రకటించారు. దీనిపై దక్షిణ తెలంగాణ నుంచి యాదవులకు అవకాశం ఇవ్వాలనే భావనతో పలువురి పేర్లను పరిశీలించారు. మంత్రి జగదీశ్‌రెడ్డితో పాటు నల్గొండ జిల్లాకు చెందిన నేతల వినతి మేరకు చివరికి బడుగుల లింగయ్య యాదవ్‌ను ఎంపిక చేశారు. మరోవైపు బీసీలలో బలమైన సామాజికవర్గం ముదిరాజ్‌ల నుంచి అభ్యర్థి ఎంపికకు పెద్దగా పోటీలేనప్పటికీ మంత్రి ఈటల రాజేందర్, పలువురు నేతల విజ్ఞప్తి మేరకు ముదిరాజ్ సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా ఉన్న బండా ప్రకాశ్‌ను ఎంపిక చేశారు. లింగయ్య యాదవ్ తెదేపా నుంచి, బండా ప్రకాశ్ కాంగ్రెస్ నుంచి తెరాసలో చేశారు. రాజకీయ ఏకీకరణ పరిణామాల నేపథ్యంలో ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి అవకాశాలుంటాయనే భావన కలిగించేందుకు సీఎం ఈనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

సీఎంకు కృతజ్ఞతలు: పార్టీ తరఫున రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేసినందుకు ఈ ముగ్గురూ సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన చూపిన బాటలో నడుస్తానని, తెలంగాణ అభ్యున్నతికి కృషి చేస్తానని సంతోష్ చెప్పారు. బలహీనవర్గాలకు చెందిన తమకు అవకాశమివ్వడం కేసీఆర్ మానవతా హృదయానికి నిదర్శనమని లింగయ్య, ప్రకాశ్‌లు పేర్కొన్నారు. తాము బీసీల అభ్యున్నతి, తెలంగాణ హక్కుల సాధనకు కృషి చేస్తామన్నారు.

అభ్యర్థులకు అభినందనలు: తెరాస అభ్యర్థుల పేర్లను ప్రకటించిన వెంటనే వారి అభిమానులు తెలంగాణభవన్ బయట పెద్దఎత్తున బాణాసంచా కాల్చారు. వారిని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు అభినందించారు. యాదవ్, ముదిరాజ్ సంఘాల నేతలు, తెలంగాణ బీసీ సంఘాధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎంబీసీ సంక్షేమ సమితి జాతీయ కార్యదర్శి సంగెం సూర్యారావులు వారిని అభినందించారు.

అభ్యర్థుల నేపథ్యం..

జోగినపల్లి సంతోష్‌కుమార్: వయస్సు 42 సంవత్సరాలు, విద్యార్హత: ఎంబీఏ, చొప్పదండి నియోజకవర్గంలోని బోయినపల్లి మండలం కొదురుపాకకు చెందినవారు. విద్యాభ్యాసం పూర్తయిన తర్వాత సీఎం కేసీఆర్ వెంట నడిచారు. ఆది నుంచి ఆయనకు వెన్నుదన్నుగా ఉన్నారు. ఇటీవలే ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

బడుగుల లింగయ్య యాదవ్: వయస్సు 58 సంవత్సరాలు, విద్యార్హత బీఏ, బీఈడీ, నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం బీమారం. 1982లో తెదేపాలో చేరిన ఆయన సుదీర్ఘకాలం ఇదే పార్టీలో కొనసాగారు. 2009లో మహాకూటమి అభ్యర్థిగా నేతి విద్యాసాగర్‌పై స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయారు. 2015 మార్చి 16న తెదేపాకు రాజీనామా చేసి సీఎం సమక్షంలో తెరాసలో చేరారు. ఆయన్ను పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

బండా ప్రకాశ్ ముదిరాజ్: వయస్సు 64 సంవత్సరాలు, విద్యార్హత ఎంఏ, పీహెచ్‌డీ, వరంగల్ హంటర్ రోడ్డులోని నందిహిల్స్ ప్రాంతవాసి. పలు సామాజిక, స్వచ్ఛంద సంఘాలకు అధ్యక్షునిగా, కార్యదర్శిగా ఉన్నారు. వరంగల్ పురపాలక సంఘం ఉపాధ్యక్షునిగా, కౌన్సిలర్‌గా పనిచేశారు. గతేడాది తెరాసలో చేరగా ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.

శ్రీలంక, బంగ్లాదేశ్ అధ్యక్షులతో మోదీ భేటీ

దిల్లీ: ప్రధాని నరేంద్రమోదీ ఆదివారం శ్రీలంక అధ్యక్షుడు మైత్రిపాల సిరిసేన, బంగ్లాదేశ్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్‌లతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అంతర్జాతీయ సౌర కూటమి వ్యవస్థాపక సదస్సుకు హాజరైన నేతలతో మోదీ వివిధ అంశాలను చర్చించినట్లు విదేశీ వ్యవహారాల శాఖ అధికార వర్గాలు తెలిపాయి. అనుసంధానత, అభివృద్ధి పనుల్లో సహకారం వంటి అంశాలు చర్చకు వచ్చాయి. అబుదాబి యువరాజు షేక్ హమీద్ బిన్ జయేద్ బిన్ అల్ నహ్యాన్‌తో మోదీ సమావేశమైనప్పుడు రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఆహార, ఇంధన భద్రత వంటి అంశాలను చర్చించారు.

గ్రహం అనుగ్రహం

12-3-2018 సోమవారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ ఉత్తరాయణం
శిశిర రుతువు; ఫాల్గుణ మాసం; బహుళ పక్షం
దశమి: ఉ. 11-07 తదుపరి ఏకాదశి
పూర్వాషాఢ నక్షత్రం: ఉ. 9-40 తదుపరి ఉత్తరాషాఢ
అమృత ఘడియలు: ఉ. 6-55 వరకు
వర్జ్యం: సా. 6-31 నుంచి 8-17 వరకు
దుర్ముహూర్తం: మ. 12-33 నుంచి 1-27 వరకు
తిరిగి మ. 2-55 నుంచి 3-43 వరకు
రాహుకాలం: ఉ. 7-30 నుంచి 9-00 వరకు
సూర్యోదయం: ఉ.6-15; సూర్యాస్తమయం: సా.6-05

నేడు తెరాస రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్లు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో జరిగే మూడు రాజ్యసభ స్థానాలకు తెరాస అభ్యర్థులు సోమవారం ఉదయం 11 గంటలకు నామినేషన్లు దాఖలు చేయనున్నారు. జోగినపల్లి సంతోష్‌కుమార్, బడుగులు లింగయ్య యాదవ్, బండా ప్రకాశ్ ముదిరాజ్‌లను ఆదివారం పార్టీ అభ్యర్థులుగా తెరాస ఎంపిక చేసింది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి వీరు శాసనసభలో ఎన్నికల రిటర్నింగు అధికారి నర్సింహాచార్యులుకు నామినేషన్ పత్రాలు అందజేస్తారు.



ఆదివారం దిల్లీలో అంతర్జాతీయ సౌర కూటమి సమావేశం సందర్భంగా వివిధ దేశాధినేతలతో ప్రధాని మోదీ

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
గుంటూరు	38.5	20.2
మెదక్	38.0	21.4
మహబూబ్‌నగర్	38.0	21.0
కర్నూలు	37.5	23.2
ఖమ్మం	37.0	21.0
సూర్యాపేట	36.5	25.0
హన్మకొండ	36.0	21.0
హైదరాబాద్	35.5	25.0
రామగుండం	35.0	24.0
తిరుపతి	34.5	18.6
ఆదిలాబాద్	34.1	19.1
కరీంనగర్	34.0	20.0
నిజామాబాద్	31.0	21.0

సౌర విద్యుత్తుకు ఆర్థిక భరోసా

- రాయితీతో కూడిన రుణాలు ఇవ్వడం అవసరం
- అన్ని దేశాలకూ చౌకలో సహజ ఇంధనం
- సూర్యుడే జీవనాధారమని వేదాలు ఎప్పుడో చెప్పాయి
- వర్ధమాన దేశాలకు రూ.9300 కోట్ల సాయం
- ఐ.ఎస్.ఎ. తొలి సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ
- నవకల్పనల్ని ప్రోత్సహిద్దాం: మెక్రాన్

దిల్లీ

చౌకగా లభ్యం కావడంతో పాటు కర్బన ఉద్గారాలను తగ్గించేందుకు ఉపకరించే సౌర విద్యుత్తుకు చేయూతనివ్వడానికి రాయితీతో కూడిన రుణాలను, తక్కువ నష్టభయం ఉండే ఫండ్లను అందించాలని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చారు. భారత్ పర్యటనకు వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో కలిసి ఆదివారం ఆయన దిల్లీలో 'అంతర్జాతీయ సౌర కూటమి' (ఐఎస్ఏ) తొలి సదస్సులో పాల్గొన్నారు. పునరుత్పాదక ఇంధన వనరుల ద్వారా 2022 నాటికి 175 గిగావాట్ల విద్యుత్తును భారత్ ఉత్పత్తి చేయబోతోందనీ, ప్రస్తుత సామర్థ్యం కంటే ఇది రెట్టింపు అనీ ప్రధాని వివరించారు. ఈయూలో చేపట్టిన విస్తరణ కంటే ఇది ఎక్కువ అని చెప్పారు. సౌర కూటమిలో 121 దేశాలు రావడానికి కీలకపాత్ర పోషించిన మోదీ... ఈ సదస్సు వేదికగా 10 కార్యాచరణ అంశాలను ప్రతిపాదించారు. సౌర విద్యుత్తు సాంకేతికత అందుబాటు ధరలో అన్ని దేశాలకూ చేరాలనీ, కాంతి విద్యుత్ ఘటాల ద్వారా జరిగే విద్యుదుత్పత్తి వాటా పెరగాలనీ, ఈ రంగాన్ని ప్రోత్సహించేలా ప్రమాణాలు/ నియంత్రణలను తీర్చిదిద్దాలనీ అభిప్రాయపడ్డారు. వేర్వేరు అవసరాలకు పరిష్కారాలు సూచించే నవకల్పనల్ని ప్రోత్సహించాలన్నారు. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా వెయ్యి గిగావాట్ల సౌర విద్యుత్తు ఉత్పత్తి అయ్యేలా చూడాలనీ, దీనికి అవసరమైన ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.67 లక్షల కోట్లు)ను సమీకరించాలనీ ఐ.ఎస్.ఎ. లక్ష్యంగా పెట్టుకున్న విషయాన్ని ప్రస్తావించారు. ఇలాంటివి సాకారమయ్యేందుకు నైపుణ్య కేంద్రాలతో విస్తృత వ్యవస్థను సృష్టించాలన్నారు. అభివృద్ధిపరమైన సంపూర్ణ దృష్టితో సౌర విధానాన్ని చూడాలనీ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను చేరుకునేలా ఐఎస్ఏను మరింత వృత్తిపరమైన సంస్థగా తీర్చిదిద్దాలని చెప్పారు. వర్ధమాన దేశాల్లో సౌరవిద్యుత్తు ప్రాజెక్టులకు 1.4 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9300 కోట్లు) విరాళాన్ని భారత్ ఇస్తుందని ప్రకటించారు.

సూర్యునితో సుసంపన్నత

మెక్రాన్ మాట్లాడుతూ సౌర విద్యుదుత్పత్తి పెరగడం వల్ల కర్బన ఉద్గారాలు తగ్గి, సుసంపన్నత సాధ్యమవుతుందని చెప్పారు. ఈ వనరు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వ్యవసాయం, వంట పనుల్లోనే కాకుండా వివిధ అవసరాలకు సౌర విద్యుత్తును వాడుకునేలా నవకల్పనల్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. 2020 నాటికి ఒక టెరావాట్ సౌర విద్యుదుత్పత్తిని సాధించడానికి అయ్యే భారీ వ్యయం దృష్ట్యా ప్రైవేటు భాగస్వాముల్నీ ప్రోత్సహించాలన్నారు. పారిస్ ఒప్పందం నుంచి వైదొలగినందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఆయన పరోక్షంగా నిందించారు. సౌర కూటమిని సాకారం చేస్తున్న భారత్‌ను కొనియాడారు. తొలి సదస్సు ద్వారా ఐఎస్ఏను లాంఛనంగా ప్రారంభించినట్లయింది. 23 దేశాధినేతలు సహా అనేకమంది సదస్సులో పాలుపంచుకున్నారు. భవిష్య తరాలకోసం పరిశుభ్రమైన భూగోళాన్ని అందించడానికి సౌరవిద్యుత్తుకు ప్రాధాన్యమిస్తామని వారు ప్రకటించారు. సీషెల్స్‌లో 2050 నాటికి 100% విద్యుత్తు పునరుత్పాదక వనరుల ద్వారానే లభించేలా చూస్తామని ఆ దేశాధ్యక్షుడు డేనీ ఆంటోనీ చెప్పారు.

మానవాళి మెరుగుకు ఉమ్మడి పథం

చిన్నచిన్న లక్ష్యాలను విడిచిపెట్టి, మానవాళిని మెరుగుపరిచే సమర్థ ప్రయత్నాల దిశగా ఉమ్మడిగా కృషి జరగాలని మోదీ ఆకాంక్షించారు. 2020 నాటికి కేవలం సౌరవిద్యుత్తు ద్వారా 100 గిగావాట్లను ఉత్పత్తి చేయాలనేది లక్ష్యం కాగా ఇప్పటికే దీనిలో అయిదోవంతును సాధించామని చెప్పారు. భారత్‌లో సౌర, పవన విద్యుత్తు ధరలు ప్రపంచంలోనే అతి తక్కువ అని తెలిపారు. సౌర విద్యుత్తుపరమైన సాంకేతికతను ఇతర దేశాలకు అందించడానికి ఒక మిషన్‌ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విద్యుత్తును పొదుపు చేయడానికి దేశవ్యాప్తంగా 28 కోట్ల ఎల్ఈడీ బల్బుల్ని పంపిణీ చేసినట్లు తెలిపారు. 'ప్రపంచంలో అనేక నాగరికతలు విలసిల్లడానికి సూర్యుడు దోహదపడ్డాడనేది వాస్తవం. అయితే సూర్యునికి భారతదేశం ఇచ్చిన ప్రాధాన్యం ఎంతో ప్రత్యేకమైనది. సూర్యుడే సకల ప్రాణికోటికి జీవనాధారమని భారతీయ వేదాలు అనేక వేల సంవత్సరాల క్రితమే ప్రపంచానికి చాటాయి. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటున్న మనం ఈ విషయంపై దృష్టి సారించాలి' అని మోదీ చెప్పారు. 2015లో చిన్నస్థాయిలో మొగ్గ తొడిగిన ఆలోచన చివరకు విశ్వవ్యాప్తమయిందని హర్షం వ్యక్తం చేశారు.

ఇదీ సంగతి!



భయపడాల్సిందేమీ లేదు సార్. శాంతి చర్చల కోసం ఉత్తరకొరియా ఆహ్వానం పంపించింది అంతే!





గుండెలన్ని బీడు.. ఆశలన్ని మోడు

ఆదివారం ముంబయి చేరుకున్న రైతుల మహా పాదయాత్ర (అంతర చిత్రంలో) తెగిపోయిన చెప్పులను కట్టుకుని, చెప్పులు లేకుండా ఎంతో యాతన పడి మరీ యాత్ర సాగిస్తున్న రైతులు

ఆదరించు నాథుడెవ్వరు

- ముంబయి చేరిన 'మహా'రైతు పాదయాత్ర
- తరలివచ్చిన 50 వేల మంది అన్నదాతలు
- నేడు అసెంబ్లీ ఎదుట నిరసన

ముంబయి

మండుటెండలో దాదాపు 200 కిలోమీటర్లు నడుచుకుంటూ వేల సంఖ్యలో మహారాష్ట్ర రైతులు ఆదివారం ముంబయి చేరుకున్నారు. పంట రుణాలు, విద్యుత్ బిల్లులను సంపూర్ణంగా మాఫీ చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులను అమలుచేయాలని రాష్ట్రంలోని భాజపా ప్రభుత్వాన్ని వీరు డిమాండ్ చేస్తున్నారు. దీనికోసం ఆరు రోజుల క్రితమే వీరు పాదయాత్ర మొదలుపెట్టారు. వామపక్ష అనుబంధ సంఘం అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో నాసిక్ నుంచి (180 కి.మీ.) వీరు ర్యాలీతీశారు. వీరి చేతుల్లోని జెండాలతో ముంబయి రోడ్లు ఎర్ర రంగు పులుముకొన్నాయి. వీరి కోసం సోమయ్య మైదానంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేశారు. ఇక్కడి నుంచి వీరు అర్ధరాత్రి ఆజాద్ మైదానానికి వెళ్లారు. చివరగా సోమవారం రాష్ట్ర అసెంబ్లీ ఎదుట నిరసన తెలుపుతారు. నిరసనల నేపథ్యంలో ముంబయి ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనదారులకు ప్రత్యేక సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లనూ కట్టుదిట్టంచేశారు.

ముంబయివాసులకు ఇబ్బంది కలిగించం: "35,000 మందితో ర్యాలీ మొదలుపెట్టాం. ఇప్పుడు దీనిలో పాల్గొంటున్న వారి సంఖ్య 50,000కు పెరిగింది. ముంబయి మహానగరవాసులకు ఎలాంటి ఇబ్బందీ కలిగించం. పదో తరగతి పరీక్షలురాసే విద్యార్థుల గురించీ ఆలోచించాం. అందుకే సోమవారం 11 గంటలు దాటిన తర్వాతే ర్యాలీ ప్రారంభిస్తాం'అని ఏఐకేఎస్ అధ్యక్షుడు అశోక్ ధావ్లే తెలిపారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి గిరీశ్ మహాజన్‌ను ఉదయం కలిసినట్లు ఆయన వివరించారు. తమ డిమాండ్లను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ దగ్గరకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. రైతులకు కాంగ్రెస్, ఎన్‌సీపీలతోపాటు మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్ఎస్), శివసేన కూడా మద్దతు పలికాయి.



ప్రమాదం నుంచి బయటపడిన విద్యార్థినులతో మాట్లాడుతున్న తేని జిల్లా కలెక్టర్ పల్లవి

కార్చిచ్చుకు నలుగురు విద్యార్థినుల బలి!

తమిళనాడులో విషాదం

చెన్నై, న్యూస్‌టుడే: పర్వతారోహణకు వెళ్లిన విద్యార్థినులు నలుగురు కార్చిచ్చుకు బలైన సంఘటన ఆదివారం తమిళనాడులో చోటుచేసుకుంది. మొత్తం 25 మంది విద్యార్థినులు మున్నార్ ప్రాంతంలోని సూర్యనెల్లి నుంచి తమిళనాడులోని తేని జిల్లాలో కురంగణి ప్రాంతానికి పర్వతారోహణ శిక్షణ కోసం వచ్చారు. కొండెక్కే సమయంలో అకస్మాత్తుగా అడవిలో కార్చిచ్చు రేగింది. ఈ మంటలలో చిక్కుకుని నలుగురు మరణించినట్లు మదురై సర్కిల్ కన్సర్వేటర్ ఆర్‌కే జగేనియా ఓ ఆంగ్ల పత్రికకు తెలిపారు. ఆ ప్రాంతంలో వెలుగు తక్కువగా ఉండటంతో సహాయ కార్యక్రమాలకు ఇబ్బందిగా మారింది. 15 మంది విద్యార్థినులను హెలికాప్టర్ల సాయంతో రక్షించామని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ ట్విట్టర్‌లో తెలిపారు. అటవీశాఖ సిబ్బంది, సమీప ప్రాంతాల ప్రజలు కార్చిచ్చును అదుపు చేసే ప్రయత్నాలతోపాటు విద్యార్థినులను రక్షించే చర్యలు కూడా చేపట్టారు. ఘటనాస్థలిని జిల్లా కలెక్టరు పరిశీలించారు.

నార్మ్.. వ్యవసాయ ఉద్యోగ స్వర్గధామం

- ప్రాంగణ నియామకాలకు 35 ప్రముఖ కంపెనీలు
- పీజీడీఎంఏ ఉత్తీర్ణులందరికీ ఉద్యోగాలు
- నేటితో ముగియనున్న ప్రవేశ దరఖాస్తు గడువు

ఈనాడు - హైదరాబాద్

వ్యవసాయ రంగ కోర్సులంటే ఉద్యోగావకాశాలు ఉండవన్న ఆపోహ ఈ తరంలో ఉంది. రాజేంద్రనగర్‌లోని 'జాతీయ వ్యవసాయ పరిశోధన, నిర్వహణ'(నార్మ్) సంస్థలో విద్యనభ్యసిస్తున్న పట్టభద్రులకు లభిస్తున్న ఉద్యోగావకాశాలను గమనిస్తే ఈ అభిప్రాయం తప్పని ఒప్పుకుంటారు. ఈ సంస్థలో 'పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ మేనేజ్‌మెంట్-అగ్రికల్చర్' (పీజీడీఎంఏ) పూర్తిచేసిన వారికి ఉద్యోగాలిచ్చేందుకు 35 ప్రముఖ కంపెనీలు బారులుదీరాయి. ఇటీవల నార్మ్‌లో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో ఈ కోర్సు చదువుతున్న వారందరికీ ఉద్యోగాలు ఇవ్వడంతోపాటు.. కనిష్ఠంగా రూ.6 లక్షల నుంచి గరిష్ఠంగా రూ.11 లక్షల వరకూ వార్షిక వేతనాలనూ ప్రకటించాయి.



కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు

'ఈ సారి ప్రాంగణ నియామకాల్లో ఆదిత్య బిర్లా రిటైల్ లిమిటెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, మహీంద్ర అగ్రి సొల్యూషన్స్, ర్యాలీస్ ఇండియా, చంబల్ ఫెర్టిలైజర్స్ తదితర ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ యంత్రాలు, పరికరాల తయారీ కంపెనీలు పీజీడీఎంఏ ఉత్తీర్ణులను చేర్చుకోవడానికి బాగా ఆసక్తి చూపుతున్నాయి. సంస్థల మేనేజ్‌మెంట్, కన్సల్టెంట్ వంటి విభాగాల్లో ఉద్యోగాలిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు చేరువ చేసే నిపుణులైన మానవ వనరులను కొరత అధికంగా ఉన్నందున పీజీడీఎంఏ వంటి కోర్సులు పూర్తిచేసిన వారికి గిరాకీ పెరుగుతోంది.' అని నార్మ్ సంచాలకుడు శ్రీనివాసరావు 'ఈనాడు'తో తెలిపారు.

ప్రవేశం ఎలాగంటే..

దేశంలోని వ్యవసాయ విశ్వవిద్యాలయం లేదా విశ్వవిద్యాలయాల సంఘం(యూజీసీ) గుర్తింపు ఉన్న సంస్థ నుంచి వ్యవసాయ డిగ్రీ పూర్తిచేసిన వారు పీజీడీఎంఏ కోర్సులో చేరడానికి అర్హులు. క్యాట్ స్కోర్ కూడా ఉండాలి. రెండేళ్ల కాల వ్యవధి గల ఈ కోర్సులో చేరడానికి నార్మ్ సంస్థ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయాలి. 2018-20 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి సోమవారంతో దరఖాస్తు గడువు ముగుస్తోంది. ప్రవేశం లభిస్తే నార్మ్ ఆవరణలోని ఆహ్లాదకర వాతావరణంలో వసతి కల్పిస్తారు. రెండేళ్లకు కలిపి రూ.6 లక్షల వరకూ రుసుం చెల్లించాలి.

సుశిక్షితులుగా తయారుచేస్తాం

- సీహెచ్ శ్రీనివాసరావు, సంచాలకుడు, నార్మ్

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో నార్మ్‌కున్న గుర్తింపు కారణంగా ఈ కోర్సుకు గిరాకీ పెరుగుతోంది. ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్(ఏఐసీటీఈ)తో పాటు.. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ గుర్తింపు సైతం ఈ కోర్సుకుంది. వ్యవసాయ డిగ్రీ పూర్తిచేసిన వారు ఉన్నతస్థాయి ఉద్యోగాలు పొందడానికి ఇది రాజమార్గం లాంటిది. విద్యార్థులను అన్ని కోణాల్లో సుశిక్షితులను చేసేలా ఈ కోర్సును తీర్చిదిద్దాం.

అతిక్రమణకు తప్పదు.. భారీ మూల్యం

- ట్రాఫిక్ ఉల్లంఘనలపై కొరడా
- జాతీయ రహదారుల్లోనూ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు
- 50 కి.మీ.లకు ఒకటి ఏర్పాటు చేసే యోచనలో పోలీస్ శాఖ
- 400 గస్తీ వాహనాలతో తనిఖీలు ముమ్మరం చేయాలని నిర్ణయం

ఈనాడు - హైదరాబాద్

నానాటికీ పెరిగిపోతున్న ట్రాఫిక్ ఉల్లంఘనలు..తద్వారా జరిగే ప్రాణనష్టాలను నివారించేందుకు పోలీసుశాఖ సమాయత్తమవుతోంది. మరిన్ని కఠిన చర్యలు తీసుకోవడం, ప్రధాన రహదారుల్లో నిరంతరం గస్తీ నిర్వహించడం ద్వారా ట్రాఫిక్ అతిక్రమణలను కట్టడం చేయడంతోపాటు.. ప్రమాదాలు తగ్గించాలని భావిస్తోంది. ఇందులో భాగంగా జాతీయ రహదారుల్లో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసే కసరత్తు ముమ్మరం చేసింది. గస్తీ కోసం నాలుగు వందల వరకూ వాహనాలు కొనుగోలు చేయాలనే ఆలోచనతోనూ ఉంది. రాష్ట్రంలో ఏటా 22 వేలకుపైగా ప్రమాదాలు జరుగుతుండగా..అందులో ఏడు వేల మంది మరణిస్తున్నారు. మరో 23 వేల మంది వరకూ గాయాలపాలవుతున్నారు. ఈ పరిణామాలకు ప్రధాన కారణం ట్రాఫిక్ ఉల్లంఘనలేనని పోలీసు శాఖ విశ్లేషించింది. అతివేగం, ప్రయాణికుల వాహనాల్లో పరిమితికి మించి ఎక్కించుకోవడం, తప్పుడు మార్గంలో ప్రయాణించడం, సిగ్నల్ పడినా ఆగకపోవడం..ఒకటేమిటి అనేక రకాల నిబంధనల ఉల్లంఘనలు రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయన్న అంచనాకు వచ్చింది. ముఖ్యంగా నగరాల్లో ఈ తరహా ఉల్లంఘనల వల్ల ప్రమాదాలతోపాటు..తరచుగా ట్రాఫిక్ నిలిచిపోతోంది. కేసులు నమోదు చేసి అపరాధం వసూలు చేసినా..ఉల్లంఘనుల్లో మార్పు కలగడం లేదు.

రోజూ 20 వేలకు పైగా కేసులు

ట్రాఫిక్ నిబంధనల అతిక్రమణలపై 2016లో 71,07,173 కేసులు నమోదుకాగా..2018 నాటికి ఇవి 81,94,953కి పెరిగాయి. వసూలైన అపరాధ రుసుము రూ.124 కోట్ల నుంచి రూ.169 కోట్లకు పెరిగింది. సగటున ప్రతిరోజూ రాష్ట్ర వ్యాప్తంగా 20 వేలకుపైగా కేసులు నమోదవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితి ఇలా ఉంటే.. ఎవరికివారు నిబంధనలు పాటించేలా చేయగలిగితే ప్రమాదాలు నివారించవచ్చని పోలీసుశాఖ భావిస్తోంది. ఇందులో భాగంగా రాబోయే రోజుల్లో ట్రాఫిక్ ప్రత్యేక డ్రైవ్‌లు మరింత ఉద్ధృతం చేయాలని నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. 'ఇప్పటికే వికారాబాద్ జిల్లాలో మన్నెగూడ, కొడంగల్‌లలో ఇలాంటివి ఏర్పాటు చేశాం. ముమ్మందు ప్రతి 50 కిలోమీటర్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. రాబోయే రోజుల్లో నిబంధనల ఉల్లంఘనలను తగ్గించడంతోపాటు.. ప్రమాదాల సంఖ్య గణనీయంగా నియంత్రించడమే మా ముందున్న లక్ష్యం' అని ఓ అధికారి 'ఈనాడు'తో తెలిపారు.

సుతిమెత్తని రోబోలకు సరికొత్త లోహం

వాషింగ్టన్: 3డీ ముద్రణకు అనువైన సరికొత్త లోహ మిశ్రమాన్ని పరిశోధకులు తయారుచేశారు. మృదువైన రోబోలు, స్మార్ట్ కంప్యూటర్ తెరలు, ఎలాకావాలంటే అలా వంచగలిగే ఎలక్ట్రానిక్ పరికరాలకు ఇది బాటలు పరుస్తోంది. ద్రవరూపంలో ఉండే గాలిన్‌స్టన్ లోహం అధిక విద్యుత్ వాహకతను కలిగివుంటుంది. అయితే దీనితో కొంచెం పొడవైన వస్తువులను ముద్రించడం కాస్త కష్టమే. ఈ సవాల్‌ను అధిగమించడమే లక్ష్యంగా అమెరికాలోని ఆరేగాన్ వర్సిటీ నిపుణులు తాజా పరిశోధన చేపట్టారు. గాలిన్‌స్టన్‌కు వారు నికెల్ సూక్ష్మకణాలను జోడించారు. దీంతో ఇది ముద్రణకు వీలుగా కాస్త గట్టిపడింది. తాజా లోహంతో పది మిల్లీమీటర్ల పొడవు, 20 మి.మీ.వెడల్పున్న నిర్మాణాలను తాము ముద్రించినట్లు పరిశోధకులు యిగిట్ మెన్‌గ్యాక్ వివరించారు.

చివరి అస్త్రాన్నీ చిత్తుచేస్తున్న బ్యాక్టీరియాలు


చివరి అస్త్రంగా ప్రయోగించే యాంటీబయోటిక్స్‌నూ తట్టుకుంటూ బ్యాక్టీరియాలు మనుగడ సాగించేస్తున్నాయని తాజా పరిశోధనలో తేలింది. అమెరికాలోని ఎమోరీ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. క్లెబ్సియెల్లా న్యూమోనియే(కేపీ)గా పిలిచే బ్యాక్టీరియాతో మూత్రనాళ ఇన్ఫెక్షన్లు చుట్టుముడతాయి. మృదువైన కణజాలాన్నీ ఇది దెబ్బతీస్తుంటుంది. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య సదుపాయాల్లోని పది శాతం ఇన్ఫెక్షన్లకు ఇదే కారణమని అంచనాలున్నాయి. దీనిపై శక్తిమంతమైన యాంటీబయోటిక్స్ కోలిస్టిన్ ప్రభావాన్ని అమెరికాలోని ఎమోరీ వర్సిటీ నిపుణులు పరీక్షించారు. దీంతో కోలిస్టిన్‌ను తట్టుకొని కేపీ మనుగడ సాగిస్తున్నట్లు వెలుగులోకి వచ్చింది.

అటవీ అధ్యయనానికి మంచి భవిష్యత్తు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: అంతర్జాతీయంగా పర్యావరణ పరిరక్షణ, సమతుల అభివృద్ధిపై విస్తృతచర్చ సాగుతున్న నేపథ్యంలో అటవీ అధ్యయనానికి మంచి భవిష్యత్తు ఉందని వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు బీఎస్సీ అటవీశాస్త్రం చదువుతున్న విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. గతంలో డిగ్రీలో అటవీశాస్త్రం చదివి ప్రస్తుతం ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్‌లుగా సేవలందిస్తున్న ఉన్నతాధికారులు ఆదివారం దూలపల్లి ఫారెస్ట్ అకాడమీని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమిళనాడు మెట్టుపాలెం కళాశాలలో అటవీశాస్త్రం అభ్యసించిన 150 మంది విద్యార్థులు సివిల్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారని, అదే ఒరవడి తెలంగాణలోనూ రావాలనేది ముఖ్యమంత్రి ఆకాంక్ష అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం ఓఎస్‌డీ ప్రియాంకవర్గీస్, మంచిర్యాల కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, మైనారిటీ కమిషన్ వీసీ అండ్ ఎండీ షఫీయుల్లా, ఒరిస్సా సంబల్పూర్ అటవీ అధికారి అర్ధనారి, కళాశాల ఇన్‌ఛార్జి చంద్రశేఖర్‌రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో పెరిగిన యాత్రికుల రద్దీ

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో యాత్రికుల రద్దీ ఆదివారం పెరిగింది. శ్రీవారి ధర్మదర్శనానికి వైకుంఠం-2 ఎదుట అర కిలో మీటరు పొడవున యాత్రికులు వరుసల్లో వేచి ఉన్నారు. ధర్మదర్శనానికి 10 నుంచి 12 గంటల సమయం తీసుకుంది. దివ్యదర్శనం (కాలి నడక భక్తులు), ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన యాత్రికుల సందడి కనిపించింది. ఆదివారం శ్రీవారికి రూ.2.59 కోట్ల హుండీ ఆదాయం వచ్చింది. సోమవారం రద్దీ సాధారణంగా ఉండనుంది. ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సునీల్‌చౌదరి, జస్టిస్ ప్రవీణ్‌కుమార్ తిరుమలకు వచ్చారు. శ్రీవారిని వీరు సోమవారం దర్శించుకోనున్నారు.





ఈనాడు

ఆవలి తీరానికి... కారుణ్య వారధి!

పుట్టుట గిట్టుట కొరకేనన్న సార్వకాలీన సత్యం అందరికీ తెలిసిందే అయినా, అనాయాస మరణం అందని మానిపండై, నయం కాని రోగాల అంపశయ్యపై జీవచ్ఛవాలుగా మిగిలి పొగులుతున్న బాధాసర్పదష్టులు ఎందరో లెక్కే లేదు. అవసాన దశకు చేరుకొన్న రోగి లేదా దీర్ఘకాలం అచేతనంగా ఉన్న వ్యక్తి కోలుకొంటారన్న ఆశ లవలేశమైనా లేని సందర్భాల్లో మరణ ప్రక్రియను వేగవంతం చేసి, వేదన కాలాన్ని తగ్గించడమూ గౌరవప్రద జీవన హక్కులో అంతర్భాగమేనంటూ 'సుప్రీం' ధర్మాసనం ఇచ్చిన తీర్పు చరిత్రాత్మకమనడంలో సందేహం లేదు. వైద్యరంగంలో అద్భుత ఆవిష్కరణల వల్ల కాటికి కాళ్లు చాచుకున్న రోగుల మరణాన్ని ప్రాణాధార ఔషధాలు, సాధనాల సాయంతో నెలల తరబడి 'వాయిదా' వేసే వీలున్న తరుణంలో- చికిత్సను నిరాకరించే హక్కు ప్రస్తావనకు వస్తోందంటూ అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు- నైతికాంశాలపై సాగే పలు చర్చోపచర్చలకు తెర దించుతోంది. తన శరీరాన్ని ఏం చేయాలన్నదానిపై ముందస్తు నిర్ణయం తీసుకొనే హక్కు, మానసిక ఆరోగ్యం సరిగ్గా ఉన్న ప్రతి వయోజనుడికీ ఉంటుందన్న అమెరికా న్యాయపాలిక వ్యాఖ్యను ఉదాహరిస్తూ- పరోక్ష కారుణ్య మరణంతోపాటు, సజీవ వీలునామా (లివింగ్ విల్)కూ కోర్టు చట్టబద్ధత కల్పించింది. భవిష్యత్తులో కోలుకోలేని రోగాల పాలబడి అచేతన స్థితికి జారిపోయినప్పుడు వేదనాకలిత వైద్య ప్రక్రియను నిలిపివేయడం ద్వారా పరోక్ష కారుణ్య మరణానికి సంసిద్ధత చాటుతూ ముందుగా రాసే 'లివింగ్ విల్'ను గుర్తించేందుకు- ఈ వ్యాజ్య విచారణ సందర్భంగా కేంద్రప్రభుత్వం నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. అయినప్పటికీ కోమాలో కొట్టుమిట్టాడుతున్న రోగుల గౌరవప్రద మరణానికి బాటలు పరుస్తూ- ఏ దశలోనూ అది దుర్వినియోగం కాకుండా రెండు అంచెల్లో మెడికల్ బోర్డుల సలహా సంప్రతింపులకు చోటు పెట్టిన రాజ్యాంగ ధర్మాసనం మార్గదర్శకాలు కట్టుదిట్టంగా ఉన్నాయి. వాటికి అనుగుణంగా పార్లమెంటు చట్టం చేసేదాకా అవే కారుణ్య మరణాలకు దారిదీపం కానున్నాయి!

భిన్న ప్రమాదాలు, విభిన్న రోగాలు రొష్టులు బాధితుల ప్రాణదీపాల్ని ఆర్పేయకుండా అరచేతిని అడ్డుపెట్టి జాగ్రత్తగా కాపాడటం వైద్యరంగం మౌలిక విధి. ఓ వ్యక్తి ప్రాణాన్ని వైద్యపరంగా హరించడంలోని సంక్లిష్టతను కేంద్రప్రభుత్వం 2016 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టుకు నివేదించింది. గ్రీకు పరిభాషలో 'యుథనేసియా' అంటే మంచి చావు- మరో విధంగా చెప్పాలంటే, అనాయాస మరణం! మరణం ద్వారా రోగి బాధా నివారణకు బాటలు పరచాలంటూ 1980లో మూల్‌చంద్ దాగా అనే ఎంపీ పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుకు తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తింది. నయంకాని భయానక వ్యాధులతో క్షణక్షణం చస్తూ బతికేకన్నా 'హుందాగా మరణించే హక్కు' చట్టబద్ధంగా దక్కాలని ప్రజాసంఘాల నుంచే డిమాండ్లు పోటెత్తాయి. గౌరవప్రద మరణాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించి తదనుగుణంగా చట్టాల్లో సవరణలు చేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్న విజ్ఞప్తితో 'కామన్ కాజ్' సంస్థ 2005లో ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేసింది. భారత న్యాయసంఘం వెలువరించిన 196వ నివేదిక అనుసారం- తగు చట్టసవరణలకు పుష్కర కాలం క్రితం సమకట్టిన మన్మోహన్ ప్రభుత్వం- నిపుణుల అభిప్రాయ సేకరణ దరిమిలా వెనక్కి తగ్గింది. అరుణా రామచంద్ర షాన్‌బాగ్ కేసులో కారుణ్య మరణానికి సమ్మతిస్తూ 2011లో 'సుప్రీం' ఇచ్చిన తీర్పు కేంద్రప్రభుత్వానికి కర్తవ్యబోధ చేసింది. ప్రాణాంతక సూదిమందుల ద్వారా ప్రత్యక్షంగా ప్రాణాలు హరించే పద్ధతిని నిష్కర్షగా నాడే తిరస్కరించిన సుప్రీం ధర్మాసనం- 'లివింగ్ విల్'కు చోటుపెడుతూ తాజాగా వెలువరించిన విస్తృత తీర్పు మరింత ప్రభావాన్వితమైనది. 'అనాయాస మరణ వీలునామా'లు ఏ విధంగానూ దుర్వినియోగం కాని కట్టుదిట్ట యంత్రాంగాల కూర్పులో తగు జాగ్రత్తలు తప్పనిసరి!

మారిన కాలమాన పరిస్థితుల్లో పరోక్ష కారుణ్య మరణాలే పలు దేశాల్లో అమలవుతున్నాయి. తనకు తాను నిర్ణయం తీసుకోదగ్గ స్థితిలో ఉన్న రోగి తన ప్రాణాధార వైద్యప్రక్రియను నిలిపేయాలని కోరడం ఆత్మహత్యాయత్నం కిందకు రాదా... అని కేంద్రప్రభుత్వమే సందేహించిన సందర్భాలూ ఉన్నాయి. 'సుప్రీం' నిర్దేశాల అనుసారం- దీర్ఘకాల వ్యాధిగ్రస్తుల వైద్యచికిత్స (రోగులు వైద్యుల రక్షణ) బిల్లును 2016 మే నెలలో ప్రతిపాదించిన మోదీ ప్రభుత్వం- దానికి చట్టరూపం ఇచ్చేందుకు గట్టికృషి చేస్తోంది. కారుణ్య మరణాన్ని పొందడానికి వివరాలు వెల్లడించేటప్పుడు ఎవరైనా అబద్ధాలు చెబితే వారికి పదేళ్ల వరకు జైలుశిక్ష, కోటి రూపాయల దాకా జరిమానా విధించేలా మొన్న డిసెంబరులో ఆ బిల్లులో సవరణలు చేసింది. తాజాగా రాజ్యాంగ ధర్మాసనం నిర్దేశాల వెలుగులో 'లివింగ్ విల్'కూ చోటుపెడుతూ పాతబిల్లులో కొత్త మార్పులు తప్పనిసరి! ప్రతి కేసునూ కోర్టులు పరిశీలించాలనడంలోని సాధ్యాసాధ్యాలపై తర్కించాలంటూ, మెదడు మృతి చెందినట్లు ధ్రువపత్రం ఆధారంగా కారుణ్య మరణాల్ని ప్రసాదించే యంత్రాంగం ఏర్పాటు కావాలన్న సూచనలు లోగడే వెలుగుచూశాయి. అద్దె గర్భాల కోసం విదేశీయులు ఇండియా వైపు చూపు సారిస్తున్నట్లే, రేపు కారుణ్య మరణాల కోసమూ 'క్యూ'కట్టే అరాచకం ప్రబలకుండా పటిష్ఠ బిగింపులు చట్టబద్ధంగా ఉండాలన్న హెచ్చరికలూ చెవిన పడుతున్నాయి. వాటిని మన్నిస్తూనే- దీర్ఘకాల రోగుల సంరక్షణను తక్కువ ఖర్చుతో పర్యవేక్షించే సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్న జస్టిస్ జీవన్ రెడ్డి సారథ్యంలోని కమిషన్ నివేదికాంశాల పట్లా దృష్టి సారించాలి. బాధిత రోగుల జీవన-మరణాలకు బంధువులు వైద్యులు ప్రభుత్వాల కారుణ్యమే మానవీయ వంతెన కావాలి!



పైన పటారం... లోనంతా లొసుగులమయం

రుణాల ఎగవేత సమస్య బ్యాంకింగ్ వ్యవస్థను కొంతకాలంగా కుదిపివేస్తోంది. పారుబాకీలతోనే బ్యాంకులు సతమతమవుతున్నాయని ఇప్పటివరకు భావిస్తున్నారు. రుణగ్రస్తులు ఆ స్థాయినీ దాటి పూర్తి ఎగవేతకు సిద్ధపడుతున్నారని నీరవ్ మోదీ, విక్రమ్ కొఠారి ఉదంతాలు వెల్లడిస్తున్నాయి. బ్యాంకులకు సంబంధించి గడచిన సెప్టెంబరు నాటికి పారుబాకీలు లేదా నిరర్థక ఆస్తుల మొత్తం తొమ్మిది లక్షల కోట్ల రూపాయలని తేలింది. ఇప్పటికి అది పది లక్షల కోట్ల రూపాయల స్థాయిని దాటి ఉండవచ్చు. రెండు వేల కోట్ల రూపాయలు లేదా అంతకంటే ఎక్కువ బకాయిపడిన సంస్థలు 50 వరకు ఉన్నాయి. వాటి మొత్తం విలువ రూ.2.5 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. అంటే కొద్దిమంది బడా ఖాతాదారులే బ్యాంకింగ్ వ్యవస్థ మొత్తాన్నీ ఛిన్నాభిన్నం చేసే గడ్డు పరిస్థితులున్నాయి. దీన్ని ఎదుర్కొనే క్రమంలో వివిధ బ్యాంకులు రిజర్వ్‌బ్యాంకు నిబంధనల్ని తు.చ.తప్పక అనుసరిస్తున్నాయి. ప్రమాణాలు పాటిస్తున్నాయి. నిరుటి సెప్టెంబరులో ప్రభుత్వరంగ బ్యాంకులు మొత్తంగా రద్దుచేసిన పారుబాకీలు రూ.53,625 కోట్లు. అదే గత ఆర్థిక సంవత్సరంలో రద్దుపరచిన బాకీల మొత్తం రూ.81,683 కోట్లు. ఇందులో స్టేట్‌బ్యాంకుది అగ్రస్థానం. 2017-18 ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు వరకు ఎస్‌బీఐ రద్దుపరచిన బాకీలు రూ.20,339 కోట్లు. బ్యాంకులు గత అయిదేళ్ల కాలంలో సుమారు రూ.2.50 లక్షల కోట్ల మొండి బాకీల్ని రద్దు చేసుకొన్నాయి. ఏ ప్రమాణాల ఆధారంగా విశ్లేషించినా ఇది ఎంతో పెద్దమొత్తం! రాని లేదా మొండి బాకీల పరిస్థితి ఈ విధంగా ఉంటే- మోసాలకు సంబంధించి, బ్యాంకులకు కొత్త తలనొప్పి ఏర్పడింది. వాటికి నకిలీ పత్రాలు సమర్పించి, భారీమొత్తాల్లో రుణాలు పొంది, ఎగవేయడం అనేది పలు బోగస్ కంపెనీలకు పరిపాటిగా మారింది. పంజాబ్ నేషనల్ బ్యాంకు, ఇతర బ్యాంకులు నీరవ్, కొఠారి సంస్థల ద్వారా ఇటువంటి వంచనలకు గురయ్యాయి. అంతా కలిపి రూ.20,000 కోట్ల మేరకు మోసం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. గడచిన అయిదు ఆర్థిక సంవత్సరాల (2012-13 నుంచి 2016-17 వరకు) కాలంలో పీఎన్‌బీ మొత్తం రూ.8,999 కోట్లు ఇటువంటి కార్యకలాపాల వల్లనే నష్టపోయింది. ఆ తరవాతి స్థానాల్లో ఎస్‌బీఐ (రూ.6,228 కోట్లు), బ్యాంక్ ఆఫ్ బరోడా (రూ.4,412 కోట్లు), సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.3,944 కోట్లు), ఐఓబీ (రూ.3,339 కోట్లు) ఉన్నాయి. బ్యాంకులు భారీ నష్టాలు చవిచూడాల్సి వచ్చింది.

ఖాతాదారుల ఆందోళన

డిపాజిటర్ల పరంగా దేశం మొత్తంమీద ఒక విధమైన అనిశ్చిత వాతావరణం నెలకొంది. ఖాతాదారులందరూ బ్యాంకులనుంచి తమ ధనాన్ని ఉపసంహరించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. డిపాజిట్ల ఉపసంహరణ కోసమే ఇటీవల పీఎన్‌బీ శాఖల వద్ద పెద్దపెద్ద బారులు కనిపించాయి. ఒక బ్యాంకు వైఫల్యం చెందితే ఆ ప్రభావం ఇతర బ్యాంకుల పైనా పడుతుంది. స్వాతంత్ర్యానికి ముందు (1920 ప్రాంతాల్లో) బ్యాంకుల దివాలాలు ఎక్కువగా ఉండేవి. అవే స్థితిగతులు ఇకముందూ పునరావృతమవుతాయన్న ఆందోళన కనిపిస్తోంది. డిపాజిటర్ల రక్షణకు ఇంతవరకు అమలులోగల చట్టం ప్రకారం, ప్రతి ఖాతాదారుడికీ నిర్ణీత మొత్తంలో బీమా ఉంది. దీని స్థానంలో తెస్తారంటున్న ఆర్థిక తీర్మానం, డిపాజిట్ బీమా (ఫైనాన్షియల్ రిజల్యూషన్, డిపాజిట్ ఇన్సూరెన్స్) అనే చట్ట ముసాయిదాలో బీమా మొత్తం ఎంతనేది అస్పష్టం. బిల్లులోని 29వ సెక్షన్ ప్రకారం, డిపాజిటర్‌కు ఎంతమేరకు రక్షణ కల్పించాలనే అంశాన్ని క్రమబద్ధీదారు (రెగ్యులేటర్) నిర్ణయిస్తాడు. అంటే ప్రస్తుతం ఉన్న భరోసా పోయినట్లే! అందుకే ప్రభుత్వం ఈ బిల్లును పూర్తిగా ఉపసంహరించుకోవాలని ప్రతిపక్షాలు డిమాండు చేస్తున్నాయి. ప్రస్తుత కుంభకోణం తీరుతెన్నులను పరిశీలిస్తే, మోసకారి ఖాతాదారులు తమ డొల్ల కంపెనీలు, వ్యక్తుల ద్వారా బ్యాంకుల్ని సులభంగా తప్పుదారి పట్టిస్తున్నారని విశదమవుతోంది. ప్రభుత్వం 1.75 లక్షల డొల్ల కంపెనీల్ని రద్దుపరచిందని గతంలోనే ప్రకటించారు. ఇప్పటివరకు రెండు లక్షల నకిలీ సంస్థల్ని మూసివేయించినట్లు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ వెల్లడించింది. అసలు అటువంటి సంస్థలు ఎన్ని ఉన్నాయన్నదే సామాన్యుడి ప్రశ్న. వాటిని కనిపెట్టేందుకు ప్రభుత్వం అనుసరిస్తున్న నియమ నిబంధనలు; ఆయా కంపెనీల ప్రమోటర్లు, డైరెక్టర్లపై తీసుకున్న లేదా తీసుకుంటున్న చర్యలు ఏమిటన్నవీ సందేహాలే! డొల్ల కంపెనీల నమోదుకు అవకాశం ఎందుకు ఏర్పడుతోందన్నది కీలకమైన విషయం. గతంలో కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వశాఖ 'కనుమరుగవుతున్న (వానిషింగ్) కంపెనీల'పై సమగ్ర సర్వే జరిపింది. దాని ప్రకారం- డైరెక్టర్లుగా చూపే వ్యక్తుల చిరునామాలు సరైనవి కావు. ఆ చిరునామాలో కంపెనీ ఉండదు. గణనీయ సంఖ్యలో బోగస్ కంపెనీలు పుట్టుకొచ్చాయని చెబుతున్నా, అవి అసలు ఏ విధంగా నమోదుపత్రం పొందాయన్నది ఎవరూ పరిశోధించడం లేదు.

రుణ మంజూరులో మతలబులు

కీలకమైన 'రుణ వితరణ' విధానాన్ని కేంద్రప్రభుత్వం, రిజర్వ్‌బ్యాంకు కూలంకషంగా అధ్యయనం చేయాలి. ఒక సాధారణ ఖాతాదారు బ్యాంకు నుంచి రుణం పొందాలంటే అనేక ప్రశ్నలు సంధిస్తారు. పెద్దయెత్తున రుణ మొత్తాల్ని బడా పారిశ్రామిక వర్గాలకు మంజూరుచేయడంలో కనీస సంప్రదాయాలు, పద్ధతులనైనా పాటించరు. ఇది నిగ్గు తేలాల్సిన అంశం. 'పెద్దనోట్ల రద్దు' సందర్భంలోనే కొన్ని బ్యాంకుల పనితీరు సందేహాస్పదంగా మారింది. రెండువేల రూపాయలు తీసుకోవడానికి ప్రజలు పడిన బాధ వర్ణనాతీతం.



దిద్దుబాటు చర్యలపై బ్యాంకుల అనాసక్తతే శాపం

అదే ఆదాయపు పన్ను దాడుల్లో దొరికిన 'కొత్త పెద్దనోట్ల' విలువ అపారం. పట్టుబడిన వ్యక్తులకు అంత మొత్తంలో నోట్లు బ్యాంకుల ద్వారా రావలసిందే తప్ప, రిజర్వ్‌బ్యాంకు ప్రత్యక్షంగా వారికి బట్వాడా చేయదు. అప్పట్లో ఆయా బ్యాంకులు ఆ అపవాదును మూటకట్టుకొన్నాయి. మోసపూరిత సంస్థలకు రుణాలు మంజూరు అవుతుండటం బ్యాంకింగ్ వ్యవస్థ చిత్తశుద్ధినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. కొన్ని బ్యాంకులు ఎంతో 'ఉదారం'గా పారిశ్రామిక వర్గాలకు రుణాలు మంజూరు చేస్తున్నాయి. రిజర్వ్‌బ్యాంకు రుణ పంపిణీ విధానం ప్రకారం, బ్యాంకులు తమ మొత్తం రుణాల్లో కనీసం 40 శాతాన్ని ప్రాధాన్య రంగాలకు కేటాయించాలి. వ్యవసాయం, చిన్న పరిశ్రమలు, చిల్లర వర్తకం, ఎగుమతులు వంటి రంగాలకు ప్రాముఖ్యం ఇవ్వాలి. అనేక కారణాలను చూపిస్తూ, ఆయా రంగాలకు అందించాల్సిన ఆర్థిక సహాయాన్ని బ్యాంకులు నిర్లక్ష్యం చేస్తున్నాయి. రంగాలవారీగా విశ్లేషిస్తే, గత మూడేళ్లలో (2014 నుంచి 2017 వరకు) వ్యవసాయ రంగానికి మంజూరు చేసిన రుణాలు 18.79 శాతం నుంచి 4.0 శాతానికి పడిపోయింది. చిన్న పరిశ్రమల రుణాల్లోనూ స్వల్ప తరుగుదల నమోదైంది. ప్రతి ప్రాధాన్య రంగంలోనూ ఇదే తరహా మార్పు చోటుచేసుకొంది. ఒక అంచనా ప్రకారం దేశంలోని మొదటి పది పారిశ్రామిక గ్రూపు సంస్థలు- దాదాపు ఆరులక్షల కోట్ల రూపాయలు బ్యాంకులకు రుణపడి ఉన్నాయి. అందువల్లే బ్యాంకులు ఎప్పటికప్పుడు ఉద్దేశపూరిత ఎగవేతదారుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. వారి వివరాలను బహిర్గతం చేయాలి. అలా చేస్తున్న బ్యాంకులు తక్కువ. విక్రమ్ కొఠారి విషయంలో బ్యాంక్ ఆఫ్ బరోడా దెబ్బతిన్న తరవాత ఇతర బ్యాంకులు మేలుకొని చర్యలు చేపట్టవలసి ఉంటుంది. ఇటీవలి కాలంలో సంభవించిన ఈ రెండు పరిణామాలు డిపాజిట్‌దారులతో పాటు పర్యవేక్షణ సంస్థలు, రిజర్వ్‌బ్యాంకు, ప్రభుత్వాలను మేలుకొలిపాయని భావించవచ్చు. దీన్ని ఓ 'నీటిబుడగ' వ్యవహారంగా పరిగణించకుండా, గట్టి పరిష్కార మార్గాలు కనుగొనాలి. తాను రూపొందించిన నియమ నిబంధనలు ఏమేరకు అమలు జరుగుతున్నాయనే అంశంపై రిజర్వ్‌బ్యాంకు శ్రద్ధ వహించాలి. ద్రవ్యోల్బణాన్ని అరికట్టడం, పరపతిని నియంత్రించడం దాని ముఖ్యమైన బాధ్యతలు. కోట్లమంది తమ శ్రమ ఫలితాన్ని మదుపు చేసుకొంటున్న సంస్థల పట్ల నిర్లక్ష్యం పనికిరాదు.


ఆచార్య కోదాటి వియ్యన్నరావు

వ్యవస్థల బిగింపులు అవసరం

డిపాజిట్‌దారుల విశ్వాసానికే పెనుముప్పు ఏర్పడిన సందర్భంలో, రిజర్వ్‌బ్యాంకు తప్పక స్పందించాలి. దేశంలోని బ్యాంకులపై తన అజమాయిషీని ఎంతో కట్టుదిట్టం చేయాలి. దీనికి ప్రస్తుతం అమలులో ఉన్న 'బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం- 1949'లోని నిబంధనలు సరిపోతాయి. దేశంలోని బ్యాంకుల మధ్య సమన్వయం ఉన్నట్లు గోచరించడం లేదు. రుణవితరణలో ముఖ్యమైనది- బ్యాంకుల మధ్య సమాచార మార్పిడి. ఒక వ్యక్తి లేదా సంస్థను ఒక బ్యాంకు 'ఉద్దేశపూరిత ఎగవేతదారు'గా ప్రకటించినప్పటికీ, ఇతర బ్యాంకుల నుంచి సహాయం పొందగలుగుతున్నారు. నిశితంగా పరిశీలిస్తే అసలు విషయం తేటతెల్లమవుతుంది. ఇప్పటికైనా రిజర్వ్‌బ్యాంకు 'కేంద్ర సమాచార వ్యవస్థ'ను బ్యాంకుల మధ్య ఏర్పాటుచేయాలి. బ్యాంకులకు తగిన హెచ్చరికలు జారీచేసే వ్యవస్థగా అది రూపొందాలి. బ్యాంకు శాఖల అంతర్గత తనిఖీ వ్యవస్థ విస్తరించాలి.

ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న 'నిరర్థక ఆస్తుల' గణాంకాల్ని పరిశీలిస్తే- బ్యాంకులు ముఖ్యంగా ప్రభుత్వరంగంలోనివి ఈ అంశంపై ఏమాత్రం శ్రద్ధ వహించినట్లు కనిపించదు. బ్యాంకు సిబ్బంది కార్యకలాపాలు, వ్యవహారశైలిపై ఆర్‌బీఐ దృష్టి సారించాలి. గడచిన రెండేళ్లలో ప్రభుత్వరంగ బ్యాంకులకు చెందిన 5,200 మంది ఉద్యోగులు తాము పనిచేస్తున్న సంస్థలనే మోసగించినట్లు వెల్లడైంది. వీటిపైన విచారణ మందకొడిగా సాగడం, కొన్ని సందర్భాల్లో బ్యాంకులే పరిశోధక సంస్థలకు తగిన సమాచారాన్ని ఇవ్వకపోవడం తీవ్రమైన విషయం. బ్యాంకుల డైరెక్టర్ల నియామక వ్యవస్థను సంస్కరించాలి. ఆయా కార్యకలాపాలపై నిర్ణయాధికారం డైరెక్టర్ల బోర్డుదేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. బ్యాంకింగ్ ఫైనాన్షియల్(ఆర్థిక) వ్యవస్థ ఇప్పటికే దాదాపు 70 శాతం కేంద్రప్రభుత్వ అధీనంలో ఉంది. అందువల్ల బ్యాంకుల తప్పిదాలకు ప్రభుత్వమూ బాధ్యత వహించాలి.

సామర్థ్యం, నిజాయతీ గల వ్యక్తులను ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నియమించేందుకు అనువుగా 2016లో మాజీ కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ వినోద్‌రాయ్ ఆధ్వర్యాన బ్యాంక్స్ బోర్డు బ్యూరో (బీబీబీ) ఏర్పాటు చేశారు. నియామకాలు మాత్రం జరపడం లేదు. బ్యూరోను దృఢతరం చేయడం ద్వారా పరిస్థితిని కొంతవరకు చక్కదిద్దవచ్చు. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల కార్యకలాపాలపై 'సామాజిక ఆడిటింగ్' వ్యవస్థ ఏర్పాటుకావాలి. సంబంధిత రంగాల్లో విశేష అనుభవం గలవారితో 'పర్యవేక్షక వ్యవస్థ' రూపొందితే మరికొంత ఫలితం ఉండవచ్చు. ఇది చట్టప్రకారం అజమాయిషీ చేసే సంస్థలా మాత్రమే కాకుండా- పరిస్థితులు, పోకడల పరిశీలక వ్యవస్థలా పనిచేయాలి. వినూత్న నిర్ణయాలు, ప్రభుత్వం చేపట్టే గట్టి చర్యల కారణంగానే బ్యాంకులు తిరిగి ప్రజల విశ్వాసాన్ని చూరగొంటాయి!

(రచయిత- పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

దళారుల వలలో జాలర్లు

వ్యవసాయరంగానికి అనుబంధమైన మత్స్యసంపదకు తొలినుంచీ అధిక ప్రాధాన్యముంది. పెరుగుతున్న జనాభా ఆహార అవసరాల రీత్యా దాని ప్రాముఖ్యం మరింత పెరుగుతోంది. దేశం ఒక్క వ్యవసాయ ఉత్పత్తులపైనే ఆధారపడి మనుగడ సాగించలేదు. పోషకాహార లభ్యత, భద్రతకు దోహదపడే మత్స్యరంగంపైనా దృష్టి సారించాల్సి ఉంటుంది. ఉపాధి కల్పన, ఆర్థికాభివృద్ధిలో మత్స్యరంగానిది గణనీయ పాత్ర. అపార సముద్ర ప్రాంతం, నదులు, సరస్సులు, చెరువులు, కుంటలు గల భారత్‌లో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయి.

విస్తరిస్తున్న విపణి

చేపల ఉత్పత్తిలో ప్రపంచంలో భారత్‌ది మూడో స్థానం. 'ఆక్వా కల్చర్'లో రెండో స్థానంలో ఉంది. ప్రపంచ చేపల ఉత్పత్తిలో 6.3 శాతం భారత్ నుంచే కొనసాగుతోంది. వార్షిక ఎగుమతులు రూ.33,442 కోట్లమేరకు ఉంటున్నాయి. 1.4కోట్ల మందికి ఉపాధి, ఉద్యోగిత కల్పిస్తున్న రంగమిది. 2016-17లో చేపల ఉత్పత్తి దాదాపు కోటీ 15లక్షల మెట్రిక్ టన్నులు. 2017-18లో మత్స్య ఉత్పత్తి కోటీ 25లక్షల టన్నులు మించవచ్చని అంచనా. దేశమంతటా 32,888 సముద్రతీర, మత్స్యతీర గ్రామాలున్నాయి. మొత్తం 1,511 మత్స్యకార 'లాండింగ్ సెంటర్లు' నెలకొన్నాయి. సుమారు 40 లక్షలమంది సముద్ర మత్స్యకారులు ఉన్నారు. వారు 72,559 యంత్ర వాహనాలతో పాటు 71,311 మోటారు పడవలు, 50,618 సంప్రదాయ పడవలూ వాడుతున్నారు. వివిధ రకాలైన వలలతో చేపలు పడుతున్నారు. చేపల నిల్వ కోసం 195 శీతలీకరణ ప్లాంట్లు ఉన్నాయి. ఇతరత్రా 1,227 ప్లాంట్లు, 85 చేపల ఆహార ప్లాంట్లు, 317 షెడ్లు, 405 పడవ తయారీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. చేపల సహకార రంగంలో 8.40 లక్షల మంది సభ్యులు ఉన్నారు.

అందమైన రంగురంగుల చేపలకు గిరాకీ విపరీతంగా పెరుగుతోంది. అలంకరణ, అందం-ఆనందం, ఆరోగ్య లబ్ధి కోసం దేశ విదేశాల్లో వీటిని విరివిగా కొనేవారున్నారు. రకరకాల గాజు తొట్టెలు, రంగురాళ్లు, ఇతర ఉపకరణాల అమ్మకాలపై యువత లాభాలను ఆర్జిస్తోంది. కనుక ఆక్వేరియాల నిర్వహణను విస్తరించాలి. ఆకర్షణీయమైన చేపల పార్కుల్ని, మత్స్యదర్శినుల్ని ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించాలి, నిర్వహించాలి. ఇది పర్యావరణ టూరిజం ప్రగతికి ఎంతగానో తోడ్పడుతుంది.

చేపల కూరకు ఆదరణ అంతకంతకు పెరుగుతోంది. 2020నాటికి 65 కోట్ల టన్నుల మేర చేపలు కావాల్సి వస్తుందని అంచనా. నేడు వార్షిక తలసరి చేపల లభ్యత దాదాపు 11 కేజీలు. సరైన రీతిలో నిల్వ చేయకపోతే చేపలు త్వరగా పాడైపోతాయి. కనుక చేపల నిల్వ, ప్రాసెసింగ్ కోసం నూతన సాంకేతికతపై చూపు సారించాలి. మత్స్యకారులకు అవి అందుబాటులో ఉండేలా చేయాలి. వండటానికి, తినడానికి అనువుగా- విలువ జోడించి చేసే ప్యాకింగ్, నిల్వ పద్ధతుల్ని అమలుపరుస్తున్నారు. చేపలతో పాటు రొయ్యల మంచూరియా, కర్రీ, వాటి ఆవకాయ కూరలు తయారు చేసి చక్కని ప్యాకింగ్‌తో మార్కెటింగ్ చేస్తున్నారు. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఉత్పత్తులను తీర్చిదిద్దుతున్నారు.

చేపలు పట్టే వృత్తి అతి ప్రాచీనమైన కళ, వంశపారంపర్యంగా వచ్చేది.



మత్స్యకారులకు దక్కని అవకాశాలు

అనిశ్చితితో కూడుకున్నది. సముద్ర ఆటుపోట్ల మధ్య, నది సుడిగుండాల నడుమ జీవన్మరణ సమస్యగా వారి జీవనం కొనసాగుతుంది. సంపద అంతా వారి ముంగిట ఉన్నా, ఏ రోజుకు ఆ రోజు సంపాదనతో జీవనం గడుపుతుంటారు. వారి సామాజిక ఆర్థిక పరిస్థితులు మెరుగుపడకపోవడానికి కారణాలు- నిరక్షరాస్యత, పేదరికం. చేపలు పట్టడం పురుషుల పని. అమ్మకంలో మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అసంఘటిత కార్మికులుగా వారు అనేక ఇబ్బందులకు లోనవుతున్నారు. పట్టిన చేపలకు ధర రాక దళారుల చేతుల్లో దగాపడుతున్నారు. విలువైన చేపలకు తక్కువ ధర ఇచ్చి మత్స్యకారులను దళారులు అక్షరాలా దోచుకుంటున్నారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర మాదిరిగా చేపలకూ సరైన ధర లభించేటట్లు ప్రభుత్వం చేయాలి. అప్పుడే శ్రమకుతగ్గ ఫలితం లభించి మత్స్యకారుల ఆదాయాలు ఇనుమడిస్తాయి. సహకారసంఘాలు ఉన్నప్పటికీ, అవి అంతంత మాత్రంగా పనిచేస్తున్నాయి. స్వయంసహాయక గ్రూపుల ద్వారా నేడు కొంత ప్రయోజనం కనిపిస్తుంది. 200 మైళ్లలోపు ఉన్న సముద్రతీరంలో అపారమైన మత్స్య సంపద లభ్యమవుతోంది. మత్స్యసంపద ఉన్నది కదా అని వాటిని యథేచ్ఛగా వాడేస్తే జీవవైవిధ్యం దెబ్బతినే పరిస్థితి వస్తుంది. చేపల సంతతిని పెంపొందించడానికి ప్రభుత్వం వేటకు విరామాన్ని అమలు చేస్తుంది. ఆ సమయంలో మత్స్యకారులను ప్రభుత్వం సాయం అందిస్తున్నా అది అరకొర. బడ్జెట్‌లో మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్‌కార్డులు ఇవ్వడం, పశుసంవర్ధక, మత్స్యరంగానికి రూ.10,000 కోట్లు కేటాయించడం హర్షదాయకం.

ఆదుకొనే మార్గాలు

సముద్రతీర ప్రాంతంలో పరిశ్రమలు వెల్లువెత్తుతున్నాయి. పోర్టులు వస్తున్నాయి. మత్స్యకారుల తరతరాల జీవనోపాధిని దెబ్బతీస్తున్న పరిణామాలివి. పర్యావరణ, జల కాలుష్యాల వల్ల చేపల సంతతి అంతరించే ప్రమాదం ఉంది. పరిశ్రమల వ్యర్థాలు నేరుగా కాకుండా, శుద్ధి చేసిన తరవాత కాలువల్లోకి వదలాలి. చేపపిల్లల ఉత్పత్తి, ఆక్వా కల్చర్ యూనిట్ల స్థాపన వల్ల పంట భూముల్లో పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతాయి. కొన్ని సందర్భాల్లో అవి ప్రజల ఆగ్రహానికి కారణమవుతున్నాయి. మత్స్యకారుల గ్రామాలకు వైద్యం, విద్య, మంచినీటి లభ్యత రోడ్లు, రవాణా సదుపాయాలు కల్పించాలి. స్వచ్ఛత, శుభ్రత పాటించి చేపల ఉత్పత్తులను ఆధునిక ప్యాకింగ్ విధానాలతో వినియోగదారులకు అందుబాటులోకి తేవాలి. ప్రైవేటు-ప్రభుత్వ భాగస్వామ్యంతో వివిధ అభివృద్ధి పథకాలను అమలుపరచాలి. మెగా ఫుడ్ పార్కులను నెలకొల్పి ఎగుమతి ప్రోత్సాహకాలను అందించాలి. అప్పుడే అభివృద్ధి ఫలాలు మత్స్యకారులకు అందుతాయి. గంగపుత్రులుగా ఉన్న వారికి గిరిజనుల మాదిరిగా ప్రత్యేక హక్కులు కల్పించాలి. చేపల విలువ జోడింపు కార్యకలాపాలపై దృష్టి నిలపాలి. విదేశీ ఎగుమతులను దృష్టిలో ఉంచుకొని నాణ్యత, పరిశుభ్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలి. మత్స్యకారులు తమ ఆర్థిక అవసరాల కోసం నేటికీ వడ్డీవ్యాపారులు, దళారులపైనా ఆధారపడాల్సి వస్తోంది. ఈ పరిస్థితి పోవాలి. సామాజికంగా, ఆర్థికంగా మత్స్యకారులను బలోపేతం చేయడానికి బ్యాంకులు, స్వయం సహాయక గ్రూపులు, సహకార సంఘాలే కాకుండా సామాజిక సేవాసంస్థలు తోడ్పాటు అందజేయాలి. అప్పుడే వారి జీవితాల్లో వెలుగులు నిండుతాయి!

– ఆచార్య కె.పరమేశ్వరరావు

జీవన్ముక్తి

ఇసుకలో ఆడుకొంటున్న పిల్లల్ని చూస్తుంటాం. అద్భుతంగా గుడి కడతారు. తీరికగా అలంకారాలు అద్దుతారు. తోచినంతసేపు హాయిగా ఆడుకుంటారు. పొద్దు వాలేటప్పటికి, ఆ కట్టడాలన్నింటినీ చటుక్కున కూలదోస్తారు. కిలకిల నవ్వులతో నిశ్చింతగా ఇంటిదారి పడతారు. అక్కడి ఆ నిర్మాణాలకు సంబంధించిన మమకారాలు, వియోగ దుఃఖాలు ఏవీ వారికి ఉండవు. 'అంతగా అయితే, మరునాడు వచ్చి మళ్ళీ కడతాం. పోయేదేముందీ' అనే ధీమాతో పిల్లలందరూ 'సొంతిళ్ల'కు వెళ్లిపోతారు.

'త్ర్యంబకం యజామహే...' అనే మృత్యుంజయ మహామంత్ర సారాంశమూ అదే. 'జీవితాన్ని ఎంతైనా నిర్మించుకో... ఆత్మీయ బంధాలెన్నింటినో పెంచుకో. ప్రేమానురాగాల్ని గాఢంగా పంచుకో. ఆట ముగిసే సమయానికి, వాటిని అదేవిధంగా సునాయాసంగా తెంచుకో' అని ఆ మంత్రం బోధిస్తుంది. వాటికి, మనిషికి మధ్య ముడి 'ఉర్వారుకమివ బంధనం'లా ఉండాలంటుంది. పచ్చి దోసకాయ ముచికకు, దోస తీగకు మధ్య బంధం ఎంత గట్టిగా ఉంటుందంటే- ఆ కాయను పట్టుకు లాగితే ఆ తీగ మొత్తం వచ్చేస్తుంటుంది. అవి ఒకదాన్ని మరొకటి అంత గట్టిగా పట్టుకొని ఉంటాయి.

అదే రీతిలో మనిషి తన చుట్టూ ఉన్న పరివారంతో, ప్రపంచంతో బంధాన్ని అంత గట్టిగానూ పెనవేసుకొని ఉంటాడు. పిల్లలు ఇసుక గూళ్ళు కట్టినంత ప్రీతిగా తన, తనవారి జీవితాల్ని తీర్చిదిద్దుకుంటాడు. దోసపండు మిగలముగ్గేనాటికి పరిస్థితి



అంతర్యామి

మారుతుంది. ఉన్నట్లుండి ఆ తీగ నుంచి అది చటుక్కున విడిపోతుంది. అప్పుడు చూస్తే ముచిక గాని, తీగ గాని ఎండి ముదిరిపోయినట్లు ఉంటాయి. అంతవరకు ఆ రెండూ ఒకదానితో మరొకటి గాఢంగా, బలంగా అతుక్కునే ఉన్నాయా అనే అనుమానం వస్తుంది.

వయసు పడమటికి వాలేటప్పటికి, ప్రతి మనిషీ పసివారి మాదిరే తాను నిర్మించుకొన్న జీవితంపై పట్టు వదిలించుకోవాలి. తుది పిలుపు చెవిన పడేవరకు వదులుగా ఉంచుకోవాలి. ఆ సమయం రాగానే, దోసపండు మాదిరే పాత చిహ్నాలేవీ మిగలకుండా ప్రపంచం అనే తీగ నుంచి విడిపోగలిగిన స్థితికి రావాలి. పసిపిల్లల ధోరణిలోనే 'మరో గుడి కట్టుకుందాంలే' అన్నంత ధీమాతో ఈ శిథిలాలయాన్ని నిర్మూలనకు వదిలేయాలి.

సునాయాసంగా మరణించాలని కోరుతూ చేసే ప్రార్థనను పెద్దలు 'మృత్యుంజయ మంత్రం'గా ప్రకటించడం ఓ విశేషం! ఆ రహస్యం బోధపడితే, మృత్యువును ఆహ్వానించగల స్థితికి మనిషి చేరుకోగలడు. మృత్యువును జయించడం అంటే- చావు లేకుండాపోవడం కాదు... మృత్యుభీతిని జయించడం!

ప్రపంచంతో అన్నింటినీ చివరన తెంచుకోగలిగితే, 'ఈ ఆత్మ నిత్యం' అని నమ్మగలిగితే మృత్యుభయాన్ని అధిగమించడం సాధ్యమవుతుంది. సాయంత్రం అయ్యేసరికి పిల్లలు నిశ్చింతగా సొంతింటికి తిరిగి వెళ్లిపోయినట్లు, ఈ అద్దె ఇంటితో అనుబంధాన్ని వీడాలన్నదే ఆ మంత్ర మహోపదేశం! 'వీడి వెళుతున్నాను' అనేది అసురీ భావం. 'అద్దె గృహాన్ని వీడుతున్నాను' అనేది అమృత భావన! అలా అమృతత్వ స్థితిలోకి చేరుకోవడమే ముక్తి అనిపించుకుంటుంది. మనిషి జీవించి ఉండగానే సాధించాల్సిన స్థితి అది. అందుకే దాన్ని 'జీవన్ముక్తి' అంటారు. మనుషులందరూ దానికి అర్హులే!

– ఎర్రాప్రగడ రామకృష్ణ

'ఎస్పీవీ'పై ఇరకాటంలో తెదేపా!

- విద్య, ఇతర సంస్థల పురోగతిని ప్రత్యక్షంగా పరిశీలిద్దాం
- భాజపా ఏపీ కోర్ కమిటీ సమావేశంలో నిర్ణయాలు!

ఈనాడు అమరావతి: కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు ఏపీ ప్రభుత్వం ప్రత్యేక సంస్థ (స్పెషల్ పర్పస్ వెహికల్-ఎస్పీవీ) ఏర్పాటు చేస్తుందా? లేదా? అన్న దానిపై భాజపా దృష్టిపెట్టింది. ఒకవేళ.. రాష్ట్ర ప్రభుత్వం ఎస్పీవీని ఏర్పాటుచేయకుండా ఉంటే పార్టీకి మంచి అస్త్రం దొరికినట్లేనని భాజపా వర్గాలు పేర్కొంటున్నాయి. విజయవాడలో ఆదివారం జరిగిన కోర్ కమిటీ సమావేశంలో నేతలు పొత్తు కొనసాగింపు వ్యవహారాన్ని పార్టీ అధిష్ఠానవర్గానికి వదలిపెట్టారు. పెద్దల ఆదేశాల ప్రకారం రాజ్యసభ ఎన్నికల్లో వ్యవహరించాలని నిర్ణయించారు. రాష్ట్రానికి కేంద్రం ఏమీ చేయలేదని ఫ్లెక్సీలు వెలసిన నేపథ్యంలో వీటిని తిప్పికొట్టేలా పార్టీపరంగా కూడా ఫ్లెక్సీలను అందరికీ అర్థమయ్యే రీతిలో ఏర్పాటుచేసే విషయంపైనా చర్చించారు. వచ్చేనెల ఆరో తేదీన పార్టీ సంస్థాగత దినోత్సవం సందర్భంగా మోటారుసైకిల్ ర్యాలీల ద్వారా ప్రచారాన్ని మరింత ఉద్ధృతం చేయాలని నిర్ణయించారు. కేంద్ర నిధులతో జరిగే విద్య, ఇతర సంస్థల నిర్మాణాలను కూడా ప్రత్యక్షంగా పరిశీలించాలని నిర్ణయించారు.

వైకాపాతో వెళ్లాల్సిన అవసరం లేదు?: వైకాపాతో కలిసేందుకు భాజపా ప్రయత్నిస్తుందన్న తెదేపా నాయకుల వ్యాఖ్యలూ కోర్ కమిటీ సమావేశంలో చర్చకు వచ్చాయి. ఈ సందర్భంగా సీనియర్ నేత ఒకరు కల్పించుకుని.. వైకాపాతో వెళ్లాల్సిన అవసరం లేదని భాజపా అగ్రనాయకత్వం స్పష్టం చేసినట్లు సమాధానమిచ్చినట్లు సమాచారం.

భాజపాలో చేరిన సినీనటి కవిత!: సినీనటి కవిత ఆదివారం భాజపా ఏపీ అధ్యక్షుడు హరిబాబు సమక్షంలో భాజపాలో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెదేపాను వదిలిపెట్టాల్సి వస్తుందని ఊహించలేదన్నారు. కొందరు కక్షగట్టి తనను బయటకు గెంటివేశారని ఆవేదన వ్యక్తంచేశారు.

తెదేపా రాజ్యసభ అభ్యర్థులు వీరే

- సి.ఎం.రమేష్‌కి మళ్లీ అవకాశం
- అనూహ్యంగా కనకమేడల రవీంద్రకుమార్ ఎంపిక
- మూడోఅభ్యర్థి లేనందున ఎన్నిక ఏకగ్రీవమే..!



సీఎం రమేష్ ★ కనకమేడల రవీంద్రకుమార్

ఈనాడు – అమరావతి

తెదేపా రాజ్యసభ అభ్యర్థులు ఖరారయ్యారు. రాజ్యసభ ప్రస్తుత సభ్యుడు, కడప జిల్లాకు చెందిన సి.ఎం.రమేష్, పార్టీ న్యాయ విభాగం అధ్యక్షుడు, కృష్ణా జిల్లాకు చెందిన కనకమేడల రవీంద్రకుమార్‌ల అభ్యర్థిత్వాలను తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదివారం ప్రకటించారు. వీరిద్దరూ సోమవారం ఉదయం 11.30 గంటలకు నామినేషన్లు దాఖలు చేస్తారు. మూడో అభ్యర్థిని నిలబెట్టరాదని తెదేపా నిర్ణయించిన నేపథ్యంలో రాజ్యసభ ఎన్నికలు ఏకగ్రీవం కానున్నాయి. రాష్ట్రం నుంచి మూడు రాజ్యసభ స్థానాలు ఖాళీ అవుతుండగా... రెండు తెదేపాకి, ఒకటి వైకాపాకి దక్కుతాయి. వైకాపా నుంచి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇప్పటికే నామినేషన్ వేశారు. తెదేపా నుంచి సి.ఎం.రమేష్ అభ్యర్థిత్వంపై శనివారమే స్పష్టత వచ్చింది. రెండో స్థానానికి కనకమేడల రవీంద్రకుమార్ పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. వివిధ రాజకీయ, సామాజిక సమీకరణాలు, పార్టీ అవసరాల్ని పరిగణనలోకి తీసుకుని చివరి నిమిషంలో ఈ పేరుని ముఖ్యమంత్రి ఖరారు చేశారు. సి.ఎం.రమేష్ 1989 నుంచి తెదేపాలో ఉన్నారు. మొదట చిత్తూరు జిల్లాలో పనిచేశారు. రాయలసీమలో పార్టీకి కీలక సమయంలో సేవలందించారు. విపక్ష నాయకుడు వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డిది కడప జిల్లానే కావడంతో, ఆ జిల్లాలో తెదేపాని మరింత బలోపేతం చేసే క్రమంలో రమేష్‌కి మరోసారి రాజ్యసభ అవకాశం కల్పించినట్టు పార్టీ వర్గాల సమాచారం.

రవీంద్రకుమార్‌కి భలే ఛాన్స్..!

రవీంద్రకుమార్‌కి తెదేపాతో సుదీర్ఘ అనుబంధం ఉంది. ఆయన 22 ఏళ్లుగా పార్టీ న్యాయవిభాగంలో ఉంటూ సేవలందిస్తున్నారు. కొన్నేళ్లుగా పార్టీ న్యాయ విభాగానికి అధ్యక్షుడిగా ఉన్నారు. గడచిన రెండు దశాబ్దాల్లో ఏ ఎన్నికలు వచ్చినా పార్టీ కార్యాలయంలోనే ఉంటూ న్యాయపరమైన అంశాల్ని సమన్వయం చేస్తూ క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు పదేళ్ల పాటు విపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయనపైనా, పార్టీలోని ఇతర నాయకులపైనా అప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెట్టిన కేసుల్ని ఆయన వాదించారు. న్యాయపరంగా పార్టీకి ఏ సేవలు అవసరమైనా ఆయన వైపే చూస్తుంటారు. హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా, సౌమ్యుడిగా ఆయనకు పేరుంది. బార్ కౌన్సిల్ సభ్యుడిగాను క్రియాశీల పాత్ర నిర్వహిస్తున్నారు. ఆయన పార్టీకి చేసిన సేవలకు గుర్తింపుగా ఇది వరకే శాసనమండలి సభ్యుడిగా అవకాశమివ్వాలని ముఖ్యమంత్రి భావించారు. ఎమ్మెల్సీ స్థానానికి అప్పటి రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కడప జిల్లాకు చెందిన రామసుబ్బారెడ్డిని ఎంపిక చేయాల్సి వచ్చింది. ఇప్పుడు రాజ్యసభకు ఇద్దర్నే పంపించే అవకాశం ఉన్న నేపథ్యంలో... పార్టీలో తీవ్రమైన పోటీ ఉన్నప్పటికీ దిల్లీలో ఉన్న అవసరాల దృష్ట్యా రవీంద్రకుమార్ వైపు ముఖ్యమంత్రి మొగ్గు చూపారు. విభజన చట్టంలోని అంశాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు తెదేపా ఎంపీలు పోరాడుతున్నారు. ఆ బృందంలో న్యాయ సంబంధిత అంశాల్లో నిపుణుడు ఉంటే మంచిదన్న ఉద్దేశంతోనే రవీంద్రకుమార్‌ను రాజ్యసభకు ఎంపిక చేయాలని ముఖ్యమంత్రి నిర్ణయించినట్టు పార్టీ వర్గాల సమాచారం. మొత్తం మీద అప్పట్లో ఎమ్మెల్సీ పదవి రాకపోయినా... ఇప్పుడు అంతకంటే పెద్దదైన ఎంపీ పదవి రవీంద్రకుమార్‌ని వరిస్తోంది. చివరి వరకు పరిశీలనలో వర్లరామయ్యకు నిరాశ ఎదురైంది. తనకు పిలుపు రావచ్చన్న ఉద్దేశంతో ఆదివారం ఆయన సీఎం నివాసానికి బయల్దేరారు. కృష్ణా కరకట్ట మార్గంలోనే వాహనం ఆపి కొంత సేపు ఎదురుచూశారు. తనకు బదులు రవీంద్రకుమార్‌ని ఎంపిక చేసినట్టు తెలియడంతో ఆయన నిరాశగా వెనుదిరిగారు. పార్టీ తీసుకున్న నిర్ణయం తనకు బాధ కలిగించినా, చంద్రబాబు ఆదేశమే శిరోధార్యమని ఆ తర్వాత మీడియా ప్రతినిధులకు రామయ్య స్పష్టం చేశారు. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో మూడో అభ్యర్థిని పోటీకి నిలబెడితే ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉందనుకున్న తెదేపా నాయకత్వం ఆ ప్రతిపాదన విరమించుకుంది. ముఖ్యమంత్రి తనపై అచంచల విశ్వాసంతో రెండోసారి రాజ్యసభకు పంపిస్తున్నందుకు సీఎం రమేష్ ధన్యవాదాలు తెలిపారు. వైకాపా నాయకులు విజయమ్మ, వివేకానందరెడ్డిని ఇప్పటికే ఓడించామని, వచ్చే ఎన్నికల్లో జగన్‌నూ ఓడించి హ్యాట్రిక్ కొడతామని పేర్కొన్నారు. ఎంతో పోటీ ఉన్నప్పటికీ పార్టీకి తాను చేస్తున్న సేవల్ని గుర్తించి పూర్తి న్యాయం చేశారని పేర్కొంటూ ముఖ్యమంత్రికి కనకమేడల రవీంద్రకుమార్ కృతజ్ఞతలు చెప్పారు. విభజన చట్టంలోని అంశాలు, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికిచ్చిన హామీల్ని సాధించుకోవడానికి ముఖ్యమంత్రి సారథ్యంలో పనిచేస్తానన్నారు.

జీవీఎల్ నరసింహారావుకు రాజ్యసభ అవకాశం

- 18 మంది అభ్యర్థులతో జాబితా ప్రకటించిన భాజపా

దిల్లీ: భాజపా అధికార ప్రతినిధి, తెలుగు వ్యక్తి జీవీఎల్ నరసింహారావు రాజ్యసభకు వెళ్లనున్నారు! ఆయనతోపాటు మరో 17 మందిని పెద్దల సభ ద్వైవార్షిక ఎన్నికలకు తమ అభ్యర్థులుగా భాజపా ఆదివారం ప్రకటించింది. ఈ జాబితాలో మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారాయణ్ రాణె, పార్టీ ప్రధాన కార్యదర్శులు అనిల్ జైన్, సరోజ్ పాండే, అధికార ప్రతినిధి అనిల్ బలూని కూడా ఉన్నారు. జీవీఎల్, జైన్ ఉత్తర్ ప్రదేశ్ నుంచి బరిలో దిగనున్నారు. రాణె మహారాష్ట్ర నుంచి, పాండే ఛత్తీస్‌గఢ్ నుంచి, బలూని ఉత్తరాఖండ్ నుంచి పోటీ చేస్తారు. భాజపా ప్రకటించిన తాజా జాబితాలో కిరోడిలాల్ మీనా, మదన్‌లాల్ సైనీ, వి.మురళీధరన్, అజయ ప్రతాప్ సింగ్, కైలాష్ సోనీ, రాజీవ్ చంద్రశేఖర్, సమీర్ ఉర్నావ్, డి.పి.వత్స్, అశోక్ బాజ్‌పేయీ, విజయ్ పాల్ సింగ్ తోమర్, సకల్‌దీప్ రాజ్‌భర్, కంటా కర్దమ్, హర్‌నాథ్ సింగ్ యాదవ్ ఉన్నారు. సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకొని భాజపా తాజా జాబితాను ప్రకటించినట్లు తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని బలోపేతం చేయడంపైనా దృష్టిపెట్టినట్లు కనిపిస్తోంది.



జీవీఎల్ నరసింహారావు

నేషనల్ పీపుల్స్ పార్టీ(ఎన్‌పీపీ) ఎమ్మెల్యేగా ఉన్న కిరోడిలాల్ మీనాను ఆదివారమే తిరిగి భాజపాలో చేర్చుకొని రాజ్యసభ సీటు ఖరారు చేశారు. ఆయన వెంట మరో ఇద్దరు ఎన్‌పీపీ ఎమ్మెల్యేలు భాజపాలో చేరారు. కిరోడిలాల్‌కు రాజస్థాన్ నుంచి రాజ్యసభ సీటు ఖరారు చేయడం వల్ల మీనా వర్గం ప్రాబల్యం ఉన్న తూర్పు, దక్షిణ రాజస్థాన్‌లలో భాజపాకు లాభిస్తుందని భావిస్తున్నారు. మరోవైపు ఆయా రాష్ట్రాల అసెంబ్లీల్లో భాజపాకు ఉన్న బలాబలాల దృష్ట్యా.. ప్రస్తుతం ప్రకటించిన రాజ్యసభ అభ్యర్థులంతా విజయం సాధించడం దాదాపు ఖాయమే. ఈ నెల 23న రాజ్యసభ ఎన్నికలు జరగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు సోమవారమే తుది గడువు.

మోదీ ప్రధాని అవుతారని 2011లోనే జోస్యం: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జీవీఎల్ నరసింహారావుకు మంచి వక్తగా పేరుంది. రాజకీయ విశ్లేషకుడిగా ఆయన సుపరిచితులు. 'డెమోక్రసీ ఎట్ రిస్క్, కెన్ వి ట్రస్ట్ అవర్ ఈవీఎంస్?' పేరుతో ఆయన రాసిన పుస్తకం జనవరి 1, 2010న విడుదలైంది. నరేంద్ర మోదీ భారత ప్రధానమంత్రి అవుతారని జీవీఎల్ 2011లోనే జోస్యం చెప్పారు. మోదీ ప్రధాని పదవిని చేపడతారని బహిరంగంగా అందరికంటే ముందుగా ఊహించి చెప్పింది ఆయనే.

ఎమ్మెల్యే కోనప్పపై చర్య తీసుకోవాలి

తెలంగాణ ఆబ్కారి గెజిటెడ్ అధికారుల సంఘం

ఈనాడు, హైదరాబాద్: విధి నిర్వహణలో ఉన్న ఆబ్కారీ అధికారులను దూషించిన కాగజ్‌నగర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పపై చర్య తీసుకోవాలని తెలంగాణ ఆబ్కారీ గెజిటెడ్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. సంఘం అధ్యక్షులు టి.రవీందర్‌రావు, ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్, ఇతర నేతలు ఆదివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈనెల 9న కాగజ్‌నగర్‌లో కోనప్ప బెల్లం వ్యాపారులకు వంతపాడుతూ ఆబ్కారీ సీఐలు మంగమ్మ, రాకేజ్‌కుమార్‌ల విధులకు ఆటంకం కలిగించారని వారు ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తామని తెలిపారు.



తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో తెరాసలోకి చేరిన ఆర్మూర్ కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్‌కు భవిష్యత్తు లేదు: కేటీఆర్

ఈనాడు, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో భవిష్యత్తు లేదని, చివరికి కార్యకర్తలు కూడా మిగలరని మంత్రి కేటీఆర్ అన్నారు. ఆదివారంనాడు నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గంగామోహన్, సేవాదళ్ అధ్యక్షుడు శ్రీనివాస్, శేఖర్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డిల సమక్షంలో తెరాసలో చేశారు. కేటీఆర్ వారిని అభినందించారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ఆ పార్టీని ముఖ్యనేతలంతా వీడుతున్నారన్నారు.

తెరాస ఎల్పీ సమావేశానికి ఎమ్మెల్యే శోభ గైర్హాజరు

తెరాస ఎల్పీ సమావేశానికి చొప్పదండి ఎమ్మెల్యే బొడిగె శోభ గైర్హాజరయ్యారు. ఆమెపై స్థానిక కార్యకర్త ఫిర్యాదు గురించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జిల్లా పోలీసు అధికారి సమాచారం అందించారు. ఈవిషయమై సీఎం సమావేశంలో ప్రస్తావించారు.

రాష్ట్ర బంద్ వాయిదా

ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ

సికింద్రాబాద్, విద్యానగర్, న్యూస్‌టుడే: ఇంటర్ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా ఈ నెల 13 చేపట్టాలనుకున్న రాష్ట్ర బంద్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ వెల్లడించారు. ఆదివారం రాత్రి సికింద్రాబాద్‌లోని ఎమ్మార్పీఎస్ కేంద్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బంద్ వాయిదా వేసిన నేపథ్యంలో అదే రోజున జిల్లా, మండల, గ్రామస్థాయిల్లో నిరసనలు చేపట్టాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ ఏర్పాటు నుంచి అన్ని వర్గాలవారు తమకు మద్దతు ఇచ్చారని.. వారెంత ముఖ్యమో పిల్లలు కూడా అంతే ముఖ్యమన్నారు. బంద్ స్థానంలో మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎవరికీ ఇబ్బంది కలగని రోజు బంద్ చేపడతామని తెలిపారు. పార్లమెంట్‌లో భాజపా త్వరితగతిన బిల్లు పెట్టి, వర్గీకరణ కోసం మాట్లాడాలన్నారు. ప్రధానికి రాహుల్‌గాంధీ లేఖ రాయాలని.. అది ఎప్పుడు రాస్తారో ఆ తేదీని బహిరంగపర్చాలని కోరారు. ముస్లింల రిజర్వేషన్ల కోసం అయిదు రోజులు ఆందోళన చేసిన తెరాస ఎంపీలు, వర్గీకరణ బిల్లుకు అయిదు నిమిషాలు కూడా మాట్లాడలేక పోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్లమెంట్‌లో తెలంగాణ ఎంపీలు మాట్లాడకపోతే పల్లెల్లో తిరగనీయమని హెచ్చరించారు. అంతకుముందు మందకృష్ణ తన నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ.. జైలులో తనను హతమార్చేందుకు జరిగిన కుట్ర చర్యను ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఖండించకపోవడం విచారకరమన్నారు.

వర్గీకరణను తెలంగాణ వరకైనా చేయాలని కోరాం: కడియం

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణను కనీసం తెలంగాణ వరకైనా పరిమితం చేసి చేయాలని కేంద్రాన్ని కోరినట్లు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి తెలిపారు. ఆదివారమిక్కడ ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణపై శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేసి 2016, మే 10న సీఎం, తాను కలిసి ప్రధాని మోదీకి అందించామని.. దీనిపై అనేక సార్లు లేఖలు కూడా రాశామన్నారు. అఖిలపక్షాన్ని దిల్లీ తీసుకెళ్లేందుకు సమయం కోరినా సరైన స్పందన రాలేదన్నారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోపే వర్గీకరణ, ముస్లిం రిజర్వేషన్ల కోసం దిల్లీలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి ధర్నా చేయనున్నట్లు కడియం వెల్లడించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఈ నెల 13న ఎమ్మార్పీఎస్ తలపెట్టిన బంద్‌ను వాయిదా వేసుకోవాలని కోరారు.

తెరాసను వీడే ప్రసక్తి లేదు: డీఎస్

ఈనాడు, దిల్లీ: పార్టీని వీడే ప్రసక్తి లేదని తెరాస రాజ్యసభ సభ్యుడు డి.శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారమిక్కడ ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లోకి రావాలని ఆ పార్టీ నేతలెవరూ తనతో సంప్రదించలేదన్నారు. ఎంతో గౌరవంగా పార్టీని రెండుసార్లు అధికారంలోకి తీసుకొస్తే అంతకన్నా అగౌరవంగా తనను పార్టీ నుంచి బయటకు వచ్చేలా చేశారని ఆయన తెలిపారు. రాజకీయ కుటుంబాల్లో ఎవరు ఏ పార్టీలో ఉండాలనేది వారి వ్యక్తిగత ఇష్టమని, అదే విధంగా తన కుమారుడు ఏ పార్టీతో ఉండాలనేది అతడిష్టమని డీఎస్ అన్నారు. సీఎం కేసీఆర్ చెప్పినట్లుగా దేశంలో ఫెడరల్ ఫ్రంట్ ఆవశ్యకత ఉందన్నారు.

మునివేళ్లపై పరుగు.. గిన్నిస్ ప్రయత్నం



మునివేళ్లపై పరుగెడుతున్న శ్రీనివాస్

కరీంనగర్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: మునివేళ్లపై పరుగెత్తి ఓ యువకుడు గిన్నిస్ రికార్డు కోసం ప్రయత్నించిన సంఘటన ఆదివారం కరీంనగర్‌లో చోటుచేసుకుంది. కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌కు చెందిన రాపెల్లి శ్రీనివాస్ చిన్నతనంలోనే మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందాడు. పలువురు ప్రదర్శనలిస్తూ గిన్నిస్‌బుక్‌లో రికార్డులు నమోదు చేసుకోవడాన్ని స్ఫూర్తిగా తీసుకొని పదేళ్లుగా సాధన చేస్తున్నాడు. ఈ ప్రయత్నంలోనే ఆయన గిన్నిస్ రికార్డుకు దరఖాస్తు చేసుకోగా.. వారు వీడియో చిత్రీకరించి పంపడానికి ఫిబ్రవరి 27న ఈమెయిల్ ద్వారా అనుమతినిచ్చారు. దీంతో ఆదివారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ మైదానంలో కాలి మునివేళ్లపై పరిగెత్తాడు. నిమిషంలో 130 మీటర్ల దూరం పరుగు పూర్తి చేయడానికి నమోదు చేసుకోగా.. 137.1 మీటర్ల దూరం పరుగెత్తి రికార్డు పూర్తి చేశాడు. శ్రీనివాస్ చేసిన సాధన వీడియో, గిన్నిస్ వరల్డ్ బుక్ రికార్డు ప్రధాన కార్యాలయానికి ఈ-మెయిల్ ద్వారా పంపిస్తామని పరిశీలకులు, గిన్నిస్‌బుక్ రికార్డు గ్రహీత ఎం.విజయభాస్కర్‌రావు తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిష్ఠాత్మకం

- **నేటి నుంచి శాసనసభ బడ్జెట్ సమావేశాలు**
- **సమర్థ నిర్వహణకు సమాయత్తం**
- **వాడివేడిగా కొనసాగే అవకాశం**
- **సీఎం కేసీఆర్ ప్రత్యేక ఆకర్షణ**

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి జరగనున్నాయి. ఉదయం 10 గంటలకు గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగంతో ఉభయ సభలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో సమావేశాలు వాడిగా, వేడిగా, ఉత్కంఠగా కొనసాగే వీలుంది. తెరాస ప్రభుత్వానికి ఇది అయిదో బడ్జెట్ కాగా సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్ సమావేశాలు. వీటిని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. సమావేశాలను సమర్థంగా నిర్వహించాలని భావిస్తోంది. సమావేశాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ మూడు దఫాల సమీక్షలు నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం నాలుగేళ్ల ప్రగతితో పాటు పథకాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడానికి దీన్ని వేదికగా ఉపయోగించుకోవాలని సీఎం భావిస్తున్నారు. సమావేశాల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశించారు. ప్రధానంగా విపక్షాలు నిరసనలు, ప్రతిఘటనలకు పూనుకుంటే వాటిని ఎదుర్కొనేందుకు దీటైన వైఖరిని అవలంబించాలని సూచించారు. ఇప్పటివరకూ జరుగుతున్న సమావేశాల్లో ఆటంకాలను ప్రభుత్వం సహించడం లేదు. బాధ్యులైన వారిని సస్పెండ్ చేస్తోంది. ఈసారి కూడా అదే పంథాను అవలంబించనున్నట్లు తెలిసింది. సభ్యులు సమావేశాలను సజావుగా జరిగేందుకు సహకరిస్తే సమన్వయంతో కార్యకలాపాలు సాగించాలని సీఎం సూచించారు. కాంగ్రెస్ తొలిరోజు గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుంటుందని నిఘావర్గాల సమాచారం అందడంతో కేసీఆర్ ఆదివారం జరిగిన తెరాస శాసనసభాపక్ష సమావేశంలో సభ్యులను అప్రమత్తం చేశారు. రాజకీయ లక్ష్యాలకు శాసనసభ వేదిక కానీయరాదని, గవర్నర్ ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ నిరసనలకు దిగితే సెషన్ మొత్తం సస్పెండ్ చేయాలని, దురుసుగా వ్యవహరిస్తే బాధ్యులను మహారాష్ట్రలో మాదిరిగా మూడేళ్ల వరకూ సస్పెండ్ చేసేందుకు సభాపతికి సిఫార్సు చేయాలని సీఎం సూచించారు. సమావేశాల నిర్వహణకు వ్యూహ కమిటీని మంత్రి హరీశ్‌రావు, ఇతర మంత్రులతో, చీఫ్ విప్‌లు, విప్‌లతో కలిసి ఏర్పాటుచేశారు. ప్రతిరోజూ ఈ కమిటీ సమావేశమై ప్రణాళికను రూపొందిస్తుంది.

మధ్యాహ్నం బీఏసీ సమావేశాలు

గవర్నర్ నరసింహన్ ప్రసంగం ముగిసిన వెంటనే సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు శాసనసభ కార్యకలాపాల కమిటీ(బీఏసీ) సమావేశం, అదే సమయానికి మండలి బీఏసీ సమావేశాన్ని నిర్వహిస్తారు. ఈసమావేశాలను మార్చి 29 వరకు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. మార్చి 31లోగా బడ్జెట్ ఆమోదం పొందాల్సి ఉన్నందున దానిని పూర్తి చేయాలనుకుంటోంది.

మెరుగైన బడ్జెట్‌కు రూపకల్పన

ఈనెల 15న బడ్జెట్‌ను రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. గడిచిన నాలుగింటి కంటే మెరుగైన రీతిలో ఉండేలా కొత్త బడ్జెట్‌కు ప్రభుత్వం రూపకల్పన చేస్తోంది. దీనిపై ప్రతీ అంశాన్నీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. సమావేశాల్లో బడ్జెట్ పద్దులన్నింటిపై చర్చ జరిపించాలనుకుంటోంది. కీలకమైన బిల్లులను ఆమోదానికి తెస్తారు.

సీఎం ప్రసంగాలే కీలకం

ముఖ్యమంత్రి కేసీఆర్ బడ్జెట్ సమావేశాల్లో ప్రధానాకర్షణగా నిలువనున్నారు. ఇటీవల ఆయన జాతీయ స్థాయిలో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటు ఆలోచనను వెల్లడించి, దానికి కార్యాచరణను ప్రకటించారు. కాంగ్రెసేతర, భాజపాయేతర పార్టీలకు ప్రత్యామ్నాయ కూటమి ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఆయన ప్రకటనలు, ప్రసంగాలు కీలకం కానున్నాయి. కాంగ్రెస్, భాజపాల వైఖరి ఎలా ఉంటుందనే అంశాలపై ఉత్కంఠ నెలకొంది. సీఎం సైతం శాసనసభ, మండలి రెండింటిలోనూ చర్చలు, ప్రశ్నోత్తరాల్లో విస్తృతంగా పాల్గొనే అవకాశం ఉంది.

భారీ భద్రత

శాసనసభ బడ్జెట్ సమావేశాలను పురస్కరించుకొని పోలీసు యంత్రాంగం భారీఎత్తున భద్రత ఏర్పాట్లు చేసింది. సచివాలయంలో సందర్శకులను నియంత్రించనున్నారు. సోమవారం ఉభయసభల్లో గవర్నర్ ప్రసంగం అనంతరం మంగళవారం నుంచి శాసనసభ, మండలి సమావేశాలు విడిగా జరగనున్నాయి. శాసన మండలి కోసం ఉమ్మడి రాష్ట్రంలోని పాతమండలి భవనాన్ని వినియోగించనున్నారు. ఏపీ ప్రభుత్వంతో చర్చించి, దానిని తీసుకున్నారు.

ప్రతిపక్షాలకు ప్రాజెక్టులంటే భయం పట్టుకుంది

మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్, న్యూస్‌టుడే: ప్రతిపక్షాలకు సాగునీటి ప్రాజెక్టులంటే భయం పట్టుకుందని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. తెరాస హయాంలో ప్రాజెక్టులు పూర్తయితే ప్రజలు తమను మరచిపోతారేమోనని ప్రతిపక్షాలు లేనిపోనివి కల్పించి దుష్ప్రచారం చేస్తున్నాయని అన్నారు. మల్లన్నసాగర్ నిర్వాసితులకు నిర్మించి ఇవ్వనున్న రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణానికి ఆదివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ముట్రాజ్‌పల్లిలో భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'భూములు సేకరించి కంపెనీలకు ఇస్తారు తప్ప.. మల్లన్నసాగర్ ప్రాజెక్టును నిర్మించరు' అంటూ ప్రచారం చేసిన కాంగ్రెస్, తెదేపా నాయకులకు పనులు ప్రారంభమైన తీరు చూసైనా కనువిప్పు కలగాలన్నారు. 50 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించే మల్లన్నసాగర్ రిజర్వాయర్‌కు సంబంధించి ఇప్పటివరకు 12 వేల ఎకరాల భూ సేకరణ (90 శాతం) పూర్తయిందన్నారు. ప్రాజెక్టు కోసం సర్వస్వం త్యాగం చేసిన రైతులకు, ప్రజలకు ప్రభుత్వం ఎంతిచ్చినా తక్కువేనన్నారు. పెద్ద మనసు చేసుకుని ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్న నిర్వాసితులకు దేశంలోనే ఎక్కడా లేనన్ని సౌకర్యాలతో ఇళ్లు నిర్మిస్తామన్నారు. ఆర్నెల్లలో ఇళ్లను పూర్తి చేసి తాళాలు వారి చేతిలో పెట్టిన తర్వాతే గ్రామాలు ఖాళీ చేయిస్తామన్నారు. ప్రాజెక్టు కోసం సేకరించేవరకూ ఆయా భూములకు ఎకరాకు రూ.4 వేల చొప్పున పెట్టుబడి సహాయాన్ని కూడా వర్తింపజేస్తామన్నారు.

సభ ద్వారా ప్రజలకు వాస్తవాలు

- **ప్రతిపక్షాలు మమ్మల్ని ప్రశ్నించాలి**
- **మంచి విమర్శలను స్వీకరిస్తాం**
- **చర్చల ద్వారానే రాష్ట్రానికి మేలు**
- **రచ్చలతో సాధించేదేమీ లేదు**
- **'ఈనాడు'తో తెలంగాణ శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి హరీశ్‌రావు**

ఈనాడు, హైదరాబాద్: శాసనసభ, శాసనమండలిలు చట్టబద్ధ ప్రజాస్వామిక వేదికలు. వాటి ద్వారా రాష్ట్రానికి, ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయి. వీటిని అధికారపక్షంతో విపక్షాలు సహా అందరూ సద్వినియోగం చేసుకోవాలి. సభలో ప్రతి సభ్యునికీ హక్కులుంటాయి. తమ నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర సమస్యల గురించి చర్చించి, సమాధానాలు రావాలని కోరుకుంటారు. అధికారపక్షమైన తమను ప్రతిపక్షాలు ప్రశ్నలు అడగాలని కోరుకుంటున్నాం. సద్విమర్శలను మనస్ఫూర్తిగా స్వీకరిస్తాం. రచ్చలతో సాధించేదేమీ లేదని తెలంగాణ శాసనసభ వ్యవహారాల మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం నుంచి శాసనసభ సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆదివారం



ఆయన 'ఈనాడు'కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

కీలకమైన సమావేశాలు

శాసనసభ, మండలిలో బడ్జెట్ సమావేశాలు అత్యంత కీలకమైనవి. ప్రజల ఆశలు, ఆకాంక్షలను చాటడంతో పాటు రాష్ట్రానికి దిశానిర్దేశం చేస్తాయి. బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం, పూర్తిస్థాయిలో ఆమోదం పొందడం మా కర్తవ్యం. ఈసారి పంచాయతీరాజ్ బిల్లు ఆమోదం పొందాలి. ఈ వ్యవస్థను బలోపేతం చేయడం, కొత్త పంచాయతీల ఏర్పాటు వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. సోమవారం గవర్నర్ ప్రసంగం ముగిశాక జరిగే బీఏసీ సమావేశాల్లో సభ, మండలి ఎన్నిరోజులు జరగాలి. ఏయే అంశాలను చర్చించాలనేది నిర్ణయిస్తాం.

అన్నింటిపైనా చర్చ జరగాలి

కొన్ని విపక్షాలు తమ పార్టీ వేదికలు, సభల్లో ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నాయి. వారిని సభలో మాట్లాడాలంటున్నాం. దీనిద్వారా ప్రజలకు నిజాలేమిటో తెలుస్తాయి. సభ అంటే 120 మందికి సంబంధించింది. ప్రతిపక్షాలు ప్రశ్నలు బాగా అడగాలని మేం కోరుకుంటున్నాం. చర్చ జరిగితే దేనికైనా జవాబిచ్చేందుకు సిద్ధం. విపక్షాలు మాపై విమర్శలను చేస్తే ఎదుర్కొంటాం. అవి అర్థవంతంగా, వాస్తవాలకు దగ్గరగా ఉండాలి. సభలో తమ ఆధిపత్యం సాగాలని, తమ మాటే నెగ్గాలని ఎవరైనా అల్లరికి యత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తాం.

ఆదర్శంగా తెలంగాణ శాసనసభ, మండలి

తెలంగాణ శాసనసభ, మండలిలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయి. సుదీర్ఘకాలం సభలను నిర్వహిస్తున్నాం. ఇంతకుముందు ఎక్కువరోజులు సభ జరపాలంటే ప్రభుత్వం పారిపోయేది. మేం ఎన్ని గంటలు, ఎన్ని రోజులైనా మేం వెనుకాడటం లేదు. ఎక్కువ రోజులు సభ అంటే విపక్షాలు పారిపోతున్నాయి. గతంలో మార్చి నెలలో బడ్జెట్ సమావేశాలంటే మంచినీరు, విద్యుత్, ఇతర సమస్యలుండేవి. తెరాస ప్రభుత్వం వచ్చాక వాటి జాడలేదు. ఉమ్మడి రాష్ట్రంలో పద్దులపై చర్చ జరిగిన సందర్భంలేదు. మేం ప్రతి పద్దుపై అర్ధరాత్రి దాటినా చర్చిస్తున్నాం. ఈసారి అలాగే సభ జరుగుతుంది. తెలంగాణ నీటిపారుదల, మిషన్ భగీరథ, కాకతీయ, పరిశ్రమలు, ఐటీ రంగాల్లో పురోగమిస్తోంది. ఇవన్నీ ప్రజలకు తెలియాలి.

సమస్యలపై పోరుకు సన్నద్ధం

- **ప్రారంభం నుంచే రైతులపై చర్చ**
- **ఉద్యోగాల భర్తీపై శ్వేతపత్రం విడుదలకు డిమాండ్**
- **బడ్జెట్ సమావేశాలపై కాంగ్రెస్ వ్యూహం**

ఈనాడు, హైదరాబాద్: ప్రజాసమస్యల అజెండాతో తెరాస ప్రభుత్వంపై దాడే లక్ష్యంగా శాసనసభ బడ్జెట్ సమావేశాలకు కాంగ్రెస్ శాసనసభాపక్షం సిద్ధమైంది. కీలకమైన బడ్జెట్ సమావేశాల్లో తెరాస ఎన్నికల హామీలు, రైతుల సమస్యలు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై గట్టిగా నిలదీయాలని వ్యూహం రూపొందించింది. తెరాస ప్రభుత్వం ప్రవేశపెడుతున్న చివరి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో ఈ సమావేశాల్లో ప్రధానంగా తెరాస ఎన్నికల హామీలపై నిలదీయడానికి సిద్ధమవుతున్నారు. రెండుపడకల గదుల ఇళ్ల నిర్మాణం, దళితులకు మూడెకరాల భూమి అంశంపై సభలో చర్చకు పట్టుబట్టనున్నారు. గిట్టుబాటు ధరలు, వ్యవసాయ రుణాలు.. వీటిపై వడ్డీ మాఫీ, ఎర్రజొన్నల రైతుల సమస్యలు, ఉద్యోగాల భర్తీ సహా వివిధ అంశాలపై సభలో లేవనెత్తాలని నిర్ణయించారు. ఏయే అంశాలపై ఎవరు మాట్లాడాలో నిర్ణయించి. సదరు ప్రజాప్రతినిధులు వాటిపై అవగాహన కలిగిఉండేలా చేయనున్నారు. వాయిదా తీర్మానాలను ఇవ్వడంతో పాటు సోమవారం జరిగే శాసనసభ నిర్వహణ సలహా మండలి (బీఏసీ)లోనే చర్చకు పట్టుబట్టాల్సిన అంశాలపై ఇప్పటికే నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. బడ్జెట్ సమావేశాల్లో పూర్తిస్థాయిలో సభ్యుల హాజరు ఉండాలని సీఎల్పీ సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు స్పష్టం చేశారు. నల్గొండ మున్సిపల్ ఛైర్మన్ భర్త శ్రీనివాసులు హత్యతో పాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ అరెస్టు, ఇసుకలారీల ప్రమాదాలు సహా శాంతిభద్రతలకు సంబంధించిన వివిధ అంశాలపై చర్చకు పట్టుబట్టాలని నిర్ణయించారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్ల హామీలపై అజెండా ద్వారా.. ప్రభుత్వం ఒప్పుకోకుంటే వాయిదా తీర్మానాలు ఇచ్చి చర్చకు పట్టుబట్టాలని నిర్ణయించారు. ఉద్యోగాల భర్తీపై శ్వేతపత్రం కోసం డిమాండ్ చేయనున్నారు. ఫీజు బకాయిలపై గణాంకాలు సహా కాంగ్రెస్ పార్టీ చర్చకు సిద్ధమైంది.

కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా బలరాం నాయక్

రాజ్యసభ ఎన్నికల బరిలో కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ పేరును పార్టీఅధిష్ఠానం ఖరారు చేసింది. ఈ మేరకు ఏఐసీసీ ఆదివారం రాత్రి ప్రకటించింది. అభ్యర్థిగా ప్రకటించిన నాయక్ సోమవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాజ్యసభ అభ్యర్థిత్వానికి పలువురు ముందుకు వచ్చినా కాంగ్రెస్ అధిష్ఠానం వివిధ సమీకరణల నేపథ్యంలో ఈయన్ను ఎంపిక చేసింది.

రాజ్యసభ ఎన్నికలకు విప్ జారీచేస్తాం

- **దేశంలో థర్డ్ ఫ్రంట్‌కు అవకాశం లేదు**
- **కాంగ్రెస్ శాసనసభాపక్షనేత జానారెడ్డి**

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యులకు విప్ జారీ చేస్తామని కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత జానారెడ్డి తెలిపారు. ఆదివారం నల్గొండ జిల్లా మిర్యాలగూడలో ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ నుంచి గెలుపొందిన ఏడుగురు శాసనసభ్యులు అధికార పార్టీలో చేరారని, వీరికి సంబంధించి ప్రస్తుతం పార్టీ ఫిరాయింపుల కేసు సుప్రీంకోర్టులో నడుస్తుందన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీకి బలం లేకపోయినప్పటికీ ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఎటువైపు మొగ్గు చూపుతారో బయటపడుతుందని తెలిపారు. పార్టీ విప్ జారీ చేసిన పక్షంలో ఆ పార్టీ నుంచి గెలిచిన శాసనసభ్యుడు తప్పనిసరిగా ఆ పార్టీ అభ్యర్థికే ఓటువేసే నిబంధన ఉందని, అది కూడా ఎన్నికల అధికారికి చూపించి ఓటు వేయాల్సి ఉంటుందని చెప్పారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలు తెరాసకు ఓటు వేస్తే దీని ఆధారంగా సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు సులభతరం అవుతుందన్నారు. దేశానికి యుపీఏ, ఎన్‌డీఏ తప్ప మూడో ప్రత్యామ్నాయం లేదని, థర్డ్‌ఫ్రంట్‌కు అవకాశమే లేదని జానారెడ్డి తేల్చి చెప్పారు.



మహిళా దినోత్సవసభలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

కాంగ్రెస్‌లోనే మహిళలకు ప్రాధాన్యం

టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

అమీన్‌పూర్, న్యూస్‌టుడే: దేశంలో, రాష్ట్రంలో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చిన పార్టీ కాంగ్రెస్ ఒకటే అని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా బీరంగూడ గుట్టపైన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే అన్నారు. రాష్ట్రంలో మహిళలకు మంత్రి పదవులివ్వకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ వారిని అవమానించారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం పథకాన్ని రూపుమాపి, మహిళలు పొదుపు చేసుకున్న డబ్బును రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందన్నారు. రాష్ట్రంలో ఆరు లక్షల మహిళా సంఘాల్లో 70 లక్షల మంది మహిళలు ఉన్నారని ప్రభుత్వం వారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదని అన్నారు. గతంలో కాంగ్రెస్ మహిళలకు వడ్డీలేని రుణాలను అందించిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రతి మహిళా సంఘానికి రూ.లక్ష రివాల్వింగ్ ఫండ్, రూ.పది లక్షల వరకు వడ్డీలేని రుణాలు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, తదితరులు పాల్గొన్నారు.

హామీలపై నిలదీద్దాం

- **రైతు, నిరుద్యోగ సమస్యలపై పట్టు**
- **శాసనసభ సమావేశాల్లో భాజపా వ్యూహం**

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో రైతు, నిరుద్యోగ సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీయాలని భాజపా నిర్ణయించింది. ఎన్నికల సమయంలో తెరాస ఇచ్చిన హామీలు, ప్రభుత్వ వైఫల్యాలపై ఎండగట్టేలా వ్యూహరచన చేస్తోంది. సోమవారం నుంచి ప్రారంభమయే సమావేశాల్లో దూకుడుగా వ్యవహరించాలని కమలదళం నిర్ణయించింది. రెండు పడకగదుల ఇళ్లనిర్మాణం, దళితులకు మూడెకరాల భూపంపిణీ, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు, సాగునీటి ప్రాజెక్టుల రీడిజైనింగ్‌తో ఆర్థికభారం, నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ మూసివేత తదితర అంశాల్ని లేవనెత్తేలా ప్రణాళిక రూపొందించుకుంది. ఇప్పటివరకు రాష్ట్రంలో దాదాపు 16 వేల ఉద్యోగాల్నే భర్తీచేశారంటురన్న కమలనాథులు మిగిలిన ఖాళీలను భర్తీచేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామంటున్నారు. రెండు పడకగదుల ఇళ్లు పథకాన్ని నత్తనడకన సాగిస్తోందని.. రాష్ట్రవ్యాప్తంగా సొంత ఇళ్లులేని 30 లక్షల కుటుంబాల ఇబ్బందులు, ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నించాలని భాజపా నిర్ణయించింది. నాలుగేళ్లలో పెరిగిన అప్పులు, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిపై నిలదీయాలని భాజపా శాసనసభాపక్షం భావిస్తోంది. ముస్లిం రిజర్వేషన్లు, పార్లమెంటు సమావేశాల్లో తెరాస అనుసరించిన వైఖరిని దృష్టిలో పెట్టుకున్న భాజపా కేంద్రంపై తెరాస చేసిన విమర్శల్ని శాసనసభ వేదికగా తిప్పికొట్టాలని నిర్ణయించింది. మతపరమైన రిజర్వేషన్లకు భాజపా వ్యతిరేకమన్న అభిప్రాయాన్ని మరోసారి శాసనసభలో స్పష్టం చేయడంతో పాటు.. ఈ తరహా రిజర్వేషన్లకు ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభుత్వాన్ని సవాలు చేయాలన్న వ్యూహంలో ఉంది. సమావేశాల్ని అడ్డుకోవద్దని భాజపా భావిస్తోంది. సోమవారం తొలిరోజు సమావేశాల్లో అటు శాసనసభలో, ఇటు శాసనమండలిలో నిరుద్యోగ సమస్యను లెవనెత్తాలని భాజపా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు నిర్ణయించారు. బషీర్‌బాగ్‌లోని బాబూజగ్జీవన్‌రాం విగ్రహం నుంచి ఉదయం 9 గంటలకు పాదయాత్రగా బయలుదేరి శాసనసభకు చేరుకోనున్నారు.

ప్రభుత్వ వైఫల్యాల్ని ఎండగట్టాలని సీపీఎం నిర్ణయం

ఈనాడు, హైదరాబాద్: ప్రజలకిచ్చిన హామీల అమలులో రాష్ట్రప్రభుత్వం విఫలమైందన్న భావనతో ఉన్న సీపీఎం సోమవారం నుంచి ప్రారంభమయ్యే శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వతీరును ఎండగట్టాలని నిర్ణయించింది. గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ల అమలు, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ, రెండు పడకగదుల ఇళ్లనిర్మాణం, ఉచితవిద్య, ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్ పునరుద్ధరణతో పాటు వ్యవసాయ కార్మికుల సమస్యలు, సామాజిక దాడులు అంశాల్ని సమావేశాల్లో లేవనెత్తాలని నిర్ణయించింది. రాష్ట్రంలో 93శాతం ఉన్న బహుజనుల సామాజిక, ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రత్యామ్నాయ విధానాల్ని శాసనసభలో చర్చకు తెస్తామని సీపీఎం శాసనసభపక్షనేత సున్నం రాజయ్య పేర్కొన్నారు.

కోదండరాంతో సోమనాథ్ భారతీ భేటీ

ఆమ్ ఆద్మీ పార్టీ దక్షిణ భారత ఇన్‌ఛార్జి, శాసనసభ్యులు సోమనాథ్ భారతీ ఆదివారమిక్కడ ఐకాస ఛైర్మన్ కోదండరాంతో భేటీ అయ్యారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై చర్చించారు. 2014 ఎన్నికల్లో బలమైన జాతీయ పార్టీగా కేంద్రంలో అధికారంలోకి వచ్చిన భాజపాను ధీటుగా ఎదుర్కొవడంలో.. దిల్లీ రాష్ట్ర శాసనసభ పీఠంపై ఆప్ అధికారాన్ని అధిరోహించడం వెనుక అవలంబించిన వ్యూహాలపై చర్చ కొనసాగింది.

కేసీఆర్ రాజకీయస్వార్థం కోసమే తృతీయ ఫ్రంట్: రఘువీరా

గన్నవరం, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి కావాలనే దురాలోచనతోనే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తృతీయ ఫ్రంట్‌ను మళ్లీ తెరపైకి తీసుకొస్తున్నారని ఏపీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి అన్నారు. కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు, తెలంగాణ కాంగ్రెస్ నేత భట్టి విక్రమార్కలతో కలిసి ఆదివారం దిల్లీ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న రఘువీరారెడ్డి అనంతరం మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో ఎన్నికలు నిర్వహిస్తే చిత్తుగా ఓడిపోయే తెరాస తృతీయ ఫ్రంట్ పెట్టే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. ఏపీకి ప్రత్యేక హోదా తీసుకురావాలనే చిత్తశుద్ధి తెదేపాకి ఉంటే రాజ్యసభ ఎన్నిక బహిష్కరించాలన్నారు. కేంద్రం, రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలోపేతమైందని, తెలంగాణలో కాంగ్రెస్‌కు పూర్తి విజయం ఖాయమని, ఆంధ్రాలోనూ అదే పరిస్థితి ఉందని చెప్పారు.

మా చిరునామా: వారెవ్వా! ఈనాడు
ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ,
హైదరాబాద్ - 501 512

varevva@eenadu.in



మట్టిపిసికే రైతుకు వాట్సాప్‌తో, ఫేస్‌బుక్‌తో పనేంటి? అని మనలాంటోళ్లు అనుకోవచ్చు! ఆయన మాత్రం అలా అనుకోలేదు. యూట్యూబ్, యాప్, ఫేస్‌బుక్ వంటి శక్తిమంతమైన సామాజిక మాధ్యమాల తోడుగా రైతులకు 'పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయం'పై చక్కని అవగాహన తీసుకురావడం మొదలుపెట్టారు. పత్రికలు, సామాజిక మాధ్యమాల సాయంతో ఆధునిక వ్యవసాయ పోకడలపైన వేలాదిమంది కర్షకులకు మేలుకొలుపు పాడుతున్నారు. ఆయనే 'రైతునేస్తం' ఫౌండేషన్ స్థాపించిన యడ్లపల్లి వెంకటేశ్వరావు...

అన్నదాతల 'యాప్'ద్బాంధవుడు

బియ్యం దగ్గర నుంచి ఆకుకూరలు, కాయగూరల వరకు ఏది తినాలన్నా మందులు చల్లనివి దొరకడం అసాధ్యం. కాస్తంత పెరటి స్థలం ఉండి... శ్రద్ధగా, ఓపిగ్గా నాలుగు కాయగూరలు పండించుకుందామంటే విత్తనాలు ఎక్కడ దొరుకుతాయో, రసాయనాలు లేకుండా క్రిమిసంహారకాలను ఇంట్లోనే ఎలా తయారుచేసుకోవాలో మనకు తెలియదు. ఇక నగరాల్లో ఉండే వారి పరిస్థితి గురించి ప్రత్యేకించి చెప్పడానికేముంది? ఈ సమస్యలని దృష్టిలో ఉంచుకునే మిద్దెమీద కూడా వ్యవసాయం చేసుకునేలా 'రూఫ్ కిచెన్ గార్డెన్' వంటి ఆధునిక వ్యవసాయ విధానాలు సైతం తేలిగ్గా అర్థమయ్యేలా 'రైతునేస్తం' యాప్‌ని రూపొందించాం అంటున్నారు వెంకటేశ్వరావు.

అరచేతిలో వ్యవసాయజ్ఞానం...

ఈ యాప్ అరచేతిలో ఉంటే వ్యవసాయంలో అ..ఆలు తెలియని ఈ తరం పిల్లలకూ అవగాహన పెరుగుతుంది. వివిధ రకాల వ్యవసాయ పరికరాలతో మొదలు పెట్టి వివిధ రకాల వ్యవసాయ విధానాల గురించి లోతుగా తెలుసుకోవచ్చు. పెద్ద చదువులు చదువుకునీ వ్యవసాయంలో అద్భుతాలు చేస్తున్న 'చదువుకున్న రైతుల' విజయగాథలెన్నో వీడియోల రూపంలో లభిస్తున్నాయి. మీరే స్వయంగా వ్యవసాయం చేయాలనుకున్నా కావాల్సిన స్పష్టమైన మార్గనిర్దేశం అందుతుంది. చీడపీడల నివారణకు అవసరం అయిన సేంద్రియ మందుల తయారీని చదివి, చూసి స్వయంగా తెలుసుకోవచ్చు. ముఖ్యంగా రసాయనాలు వాడకుండా చేసే సేంద్రియ వ్యవసాయ విధానం గురించిన ప్రాథమిక సమాచారంతోపాటు.. ఈ రంగంలో విజయాలు సాధించిన కర్షకులతో నేరుగా సంప్రదింపులు చేయొచ్చు. మీకున్న సందేహాలను ప్రశ్నల రూపంలో వారిని అడగొచ్చు. కరివేపాకు, ఆముదం, అనాస, దానిమ్మ, సపోట, కోకో, జీడిమామిడి, గులాబి, జర్బరా వంటి వైవిధ్యమైన పంటల గురించిన సమాచారం చక్కగా తెలుగులో అందుబాటులో ఉంటుంది. ప్రస్తుత మార్కెట్ ధరల దగ్గర నుంచి.. వాతావరణ వివరాల వరకూ సమస్త సమాచారం ఈ యాప్‌లో అందుబాటులో ఉంటుంది. ఈ యాప్ సాయంతో దళారుల ప్రమేయం లేకుండా నేరుగా మన పంటలని మనమే అమ్ముకోవచ్చు. ఏవైనా సందేహాలు వస్తే వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులని అడిగేందుకు వీలుగా ఫోన్‌నంబర్లూ అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం పాతికవేలమందికిపైగా రైతులు ఈ యాప్‌ని వాడుకుంటున్నారు. ప్లేస్టోర్‌లో రైతునేస్తం పేరుతో ఈ యాప్ అందుబాటులో ఉంది. పేరు, ఊరు, ఫోన్‌నంబరు వంటి వివరాలు అందిస్తేచాలు సేవలు పొందొచ్చు.

ఆలోచనకు స్ఫూర్తి...

మట్టిని మంచి చేసుకోవాలి.. మొలకని పలకరించాలి. చినుకుతో చెలిమిచేయాలి. వ్యవసాయంలో ఇవి ఓనమాలు. వీటితో మొదలుపెట్టి ఆధునిక వ్యవసాయంలో పట్టు పుచ్చుకోవాలంటే రైతన్నలకు చక్కని మార్గదర్శకం కావాల్సిందే. అందుకే రైతునేస్తం, పశునేస్తం, ప్రకృతినేస్తం వంటి పత్రికలతో పాటు రైతులకు స్వయంగా దగ్గరుండి ప్రకృతి వ్యవసాయంలో శిక్షణ ఇచ్చేందుకు 'రైతునేస్తం ఫౌండేషన్'ను స్థాపించా అంటున్నారు వెంకటేశ్వరావు. 'మాది గుంటూరు దగ్గర కొర్నెపాడు గ్రామం. బీకాం చదువుకున్నా. నాన్న వ్యవసాయదారు కావడంతో నాకు వ్యవసాయం కొత్తకాదు. నాకు ఊహతెలిసాక మిర్చీ, పత్తి పంటలే ఎక్కువగా పండించేవాళ్లం. అంతకుముందు వరిగ, రాగులతోపాటు అనేకరకాల తృణధాన్యాలని పండించేవారు. చిన్నప్పుడు నాన్నతో కలిసి పత్తితీతలకు, పొలం పనులకు వెళ్లేవాడిని. అలా సాగులో లోతుపాతులు బాగా తెలిసిన వాడినే. చదువైపోయిన తర్వాత ఏదైనా ఉద్యోగం చేద్దామనుకున్నా. హైదరాబాద్ వచ్చి కొన్నాళ్లపాటు అకౌంటెంట్‌గా పనిచేసిన తర్వాత ప్రింటింగ్ ప్రెస్ పెట్టుకున్నా. 2004లో... తీవ్రమైన కరవు. ఎటుచూసిన రైతు ఆత్మహత్యలు. మితిమీరిన రసాయనాల వాడకం, దానికి తగ్గట్టుగా గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటివన్నీ అన్నదాతలని ఆత్మహత్యల దిశగా నడిపిస్తున్నాయి. రైతుకి ఎందుకీ పరిస్థితి అని ఆలోచిస్తే... రసాయనాల కోసం ఎక్కువగా డబ్బుని వెచ్చిస్తున్నాడు. ఆ పెట్టుబడులకు తగ్గట్టుగా పంటకు గిట్టుబాటు ధరలేకపోతే అప్పుల వలలో చిక్కుకుంటున్నాడు. అలాగే గతంలో మాదిరిగా ఇప్పుడు ఎవరికీ పాడి లేదు. పాలు, పెరుగు సైతం కొనుక్కోవాల్సిందే. పూర్వం గట్లమీద కాయగూరలు పెంచుకుని.. స్వచ్ఛమైన, మందులు వేయని తిండితినేవారు. ఇప్పుడు వాటికోసమూ రోడ్డెక్కాలిందే. వీటన్నింటి ఖర్చు నెలకి వేలల్లో. కానీ ఆదాయం చూస్తే అంత ఉండటం లేదు. వాతావరణం అనుకూలిస్తే ఫర్వాలేదు. లేకపోతే అప్పులే మిగులుతున్నాయి. రసాయనాల వాడకం తగ్గించడం కోసం రైతుకు నావంతుగా ఏదైనా చేద్దాం అనుకున్నా. అలా 2005లో 'రైతునేస్తం' పత్రికని ప్రారంభించాను. ఇందులో వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతుల అనుభవాలను స్వయంగా మాట్లాడి అందించడం మొదలుపెట్టాం. యువతలో వ్యవసాయంపై ఆసక్తి పెంచడం, ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తగ్గించడమే లక్ష్యంగా మరో రెండు పత్రికలూ ప్రారంభించా. వీటికి చక్కని స్పందన వచ్చింది. మరో అడుగు ముందుకేసి 'రైతునేస్తం ఫౌండేషన్' స్థాపించా' అంటున్నారు వెంకటేశ్వరావు.

ఖర్చు తగ్గించాలనే...

కర్షకులు పెట్టుబడులను తగ్గించుకోగలిగితే అప్పుల ఊబిలో కూరుకుపోవాల్సిన అవసరం ఉండదు. ఆనక.. ఆత్మహత్యల పరిస్థితే రాదు. అది సాధ్యం కావాలంటే రైతుకు ఖర్చు గణనీయంగా తగ్గించే 'జీరో బడ్జెట్' వ్యవసాయ విధానం గురించి తెలియాలంటారు వెంకటేశ్వరావు. ఈ జీరోబడ్జెట్ విధానాలతో పాటు రైతన్నలకు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకుని ఆ ప్రయోజనాలు పొందడం ఎలానో కూడా చెబుతున్నారాయన. ఈ మహోద్యమంలో అందరినీ భాగాస్వామ్యం చేయాలనే తపనతో వ్యవసాయ రంగంలో విశేషంగా కృషిచేసిన శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు, వ్యవసాయ విలేకరులకు సైతం అవార్డులు ఇచ్చి ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారు.

ఐదు ఎకరాలని ప్రయోగశాలగా మార్చా...

కొర్నెపాడు గ్రామంలో ఐదెకరాల స్థలంలో వ్యవసాయ ప్రయోగశాలని ఏర్పాటు చేశారు వెంకటేశ్వరావు. పత్తి, మిర్చి, కాయగూరలు, తృణధాన్యాలని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించి వాటిని రైతులకు పాఠాలుగా బోధిస్తున్నారు. ప్రతిజిల్లాలోని రైతుల వద్దకు తమ సిబ్బంది పంపి ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ అందిస్తున్నారు. ఇంతవరకూ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఐదొందల గ్రామాల్లో ఉన్న లక్షలాది మంది రైతులకు ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాలు అందించారు. జీవివైవిధ్యాన్ని కాపాడే దిశగా.. హైబ్రిడ్ విత్తనాలు కాకుండా అరుదైన దేశి విత్తనాలని సేకరించడం.. అవసరమైన వారికి వాటిని అందుబాటులో ఉంచడం ఈ ఫౌండేషన్ లక్ష్యాల్లో ఒకటి. డీవీడీలు, యూట్యూబ్‌ల ద్వారా రైతుల అనుభవాలను అందరికీ చేరువ చేస్తున్నారు. వాట్సాప్ గ్రూపులు, ఫేస్‌బుక్ వంటి వాటి ద్వారా ఎప్పటికప్పుడు వ్యవసాయ సమాచారాన్ని రైతులకు చేరువచేస్తున్నారు.

–శ్రీసత్యవాణి గొర్లె

భద్రం నేస్తమా



జీవితం గుణపాఠమై.. తనే పాఠమై..

కాలం కొందరిని ఓడిస్తుంది.
కష్టం ఇంకొందరిని నలిపేస్తుంది.
ప్రమాదం మరికొందరిని చంపేస్తుంది.
ఈ మూడు చుట్టుముట్టినా ఓ కుర్రాడ్ని ఏం చేయలేకపోయాయి.
అతని ధైర్యం ముందు కాలం వెనుకడుగువేసింది.
అతని స్ఫూర్తికి కష్టం తలవంచింది.
అతని తెగువకు ప్రమాదమే ప్రమాదంలో పడింది.
బతుకుతో పోరాడుతున్న ఆ యోధుడెవరు?
ఎందరినో బతికించడానికి పరిగెడుతున్న ఆ యువకుడెవరు?



శివశంకర్... అందరిలాంటి కుర్రాడే... సొంతూరు కడప జిల్లా పోరుమామిళ్ల. తండ్రి వెంకటయ్య కడప 11వ బెటాలియన్‌లో ఏపీఎస్పీ కానిస్టేబుల్. తల్లి గృహిణి. అన్న కానిస్టేబులే. అప్పుడు ఇంటర్ మీడియట్ చదువుతుండేవాడు... 2010 ఆగస్టు 3వ తేదీ మధ్యాహ్నం... మరో ఇద్దరు మిత్రులతో కలిసి ద్విచక్రవాహనంపై సరదాగా వెళుతున్నారు. కడప రిమ్స్‌రోడ్డులో అండర్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే ప్రమాదం..

వెనుకవైపు నుంచి ఓ లారీ వచ్చి ఢీకొట్టింది.

ముగ్గురూ కింద పడిపోయారు.

మధ్యలో ఉన్న యువకుడి నడుముకు లారీ బంపర్ తగిలింది..

హాహాకారాలు..

అంతా అయోమయం.. అటుగా వెళుతున్న కొందరు గమనించి రిమ్స్ ఆసుపత్రికి తరలించారు..

తల్లిదండ్రులు, కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.. రెండు రోజులు చికిత్స జరిగింది.. ఆ యువకుడికి మాత్రం స్పృహరాలేదు..వైద్యులు చేతులెత్తేశారు. వెల్లూరు సీఎంసీకి హుటాహుటిన తీసుకెళ్లారు. గండం గడిచింది... నెలరోజుల తర్వాత కోలుకున్నాడు. పరిగెడుతున్న జీవితం ఆగిపోయింది. అతను నడిచే శక్తిని కోల్పోయాడు. వెన్నెముక విరిగిపోవడంతో నిల్చోవడం అటుంచి మంచంపై కూర్చోవడం కూడా కష్టమైంది. జీవితాంతం చక్రాల కుర్చీకే పరిమితమవ్వాలని వైద్యులు తేల్చి చెప్పేశారు. అప్పటి వరకు ఉన్న మిత్రులు దూరమయ్యారు. అయినవాళ్లు దూరం పెట్టారు. అంతా చీకటి.. భవిష్యత్తును తలచుకుంటే అంతులేని భయం..

రెండేళ్ల పాటు నాలుగు గోడలే ప్రపంచం. నరకయాతన వెంటాడింది. ఆ యాతనలో నుంచే ఓ ఆశయం పుట్టింది. అది సంకల్పంగా మారింది. శరీరం సహకరించకున్నా పట్టుదల ప్రజ్వలించింది. తన పరిస్థితి వేరొకరికి రాకూడదనే ఆకాంక్ష. తన కుటుంబానికి వచ్చిన కష్టం మరే కుటుంబానికీ రాకూడదన్న తపన.. వెరసి జీవితం శివశంకర్‌ను కొత్తదారిలో నడిపించింది. తన జీవితాన్నే గుణపాఠంగా అందరికీ చెబుతూ యువతను ప్రమాదాలకు దూరంగా ఉండమని బోధిస్తున్నాడతను. ఆ ఆలోచన ఇప్పుడు అనేక మందిని అప్రమత్తం చేస్తుండగా, రోడ్డు భద్రతపై ప్రభుత్వ సంకల్పానికి బాసటగా మారుతోంది. ఇప్పటికి పదివేల మందికి అవగాహన కల్పించిన ఆయన వెనుదిరగకుండా ముందుకెళుతున్నారు.. రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం కల్పించాలన్న ఉత్సుకతతో చక్రాల కుర్చీనే ప్రచార రథంగా మార్చుకున్నాడు. చక్రాల కుర్చీలో ఉంటూనే రవాణా, పోలీసుశాఖల సహకారం కోరుతూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాడు కడప జిల్లాలోనే చాలా వరకూ అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి తన సందేశాన్ని అందించాడు. రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించాలనే తలంపుతో ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే విశాఖ, గుంటూరులో సదస్సులు జరిపారు. ప్రకాశం, కర్నూలులోనే సదస్సులు జరిపేందుకు ప్రస్తుతం సిద్ధమయ్యారు. ఆ సదస్సుల్లో శివశంకర్ తన జీవితాన్నే ప్రత్యక్ష ఉదాహరణగా చూపుతూ ప్రయాణంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నారు. తాను సబ్‌ఇన్స్‌పెక్టర్‌గా ఉద్యోగం సంపాదించి, తన తండ్రి కంటే ఓ ర్యాంకు ఎక్కువగా ఉండాలని కలలుగన్నాడు. అయితే రోడ్డుప్రమాదం తన జీవితాన్ని ఛిన్నాభిన్నం చేసేయడంతో కలలు కల్లలయ్యాయి. అయితే తాను పోలీసు ఉద్యోగాన్ని దక్కించుకోలేకపోయినా.. అదే పోలీసులతో కలిసి రోడ్డుభద్రత కోసం పోరాడుతూ ప్రత్యేకత చాటుతున్నాడు. శివశంకర్ సోషల్ సర్వీస్ సొసైటీ ఏర్పాటు చేసి తన తండ్రి, అన్న జీతం సొమ్ములో కొంత సొసైటీ ద్వారా వికలాంగుల సంక్షేమానికి ఖర్చు చేస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడమే తన ధ్యేయంగా చెబుతున్నాడు శివశంకర్.
'ఈనాడు-ఈటీవీ'తో ఆయన మాట్లాడుతూ.. జీవితం చాలా విలువైనదన్నారు. వేగం వద్దని జీవితమే ముద్దని వివరిస్తున్నాడా కుర్రాడు.

– గాలి సురేష్, ఈనాడు, కడప



రండి...తినండి

డబ్బులడగని హోటల్

హోటల్ భోజనం తినాలంటే ముందు జేబులో డబ్బులున్నాయా లేదా చూసుకుంటాం. కానీ కేరళలోని 'జనకీయ భక్షణశాల' హోటల్‌లోకి అడుగుపెట్టాలంటే ఆ భయమే లేదు. హాయిగా వెళ్లి తినేసి రావొచ్చు. అక్కడ టోకెన్లు ఇచ్చే కౌంటరు కానీ... బిల్లు వసూలు చేసుకునే సర్వర్లు కానీ ఉండరు. ఇవ్వాలని మీ మనసుకు అనిపిస్తే మాత్రం మాచక్కా ఇచ్చిరావొచ్చు. అలాని ఇదేదో ఆషామాషీ హోటల్ అనుకునేరు. సుమారు రెండువేలమంది తినే సామర్థ్యం ఉన్న ఈ హోటల్‌లో నిమిషాల్లో వంటను పూర్తిచేసే స్టీమ్‌కిచెన్, శుభ్రమైన నీటిని అందించే వాటర్‌ప్లాంట్, వ్యర్థాలను ఉపయోగంలోకి తెచ్చే వేస్ట్‌మేనేజ్‌మెంట్ ప్లాంట్‌తో సహా ఉన్నాయి. 'కావల్సినంత తినండి... ఇవ్వాలనిపించేంత ఇచ్చిపొండి' అనే థీమ్‌తో కేరళ స్టేట్ ఫైనాన్షియల్ ఎంటర్‌ప్రైసెస్ సంస్థ సామాజిక బాధ్యతగా ఈ హోటల్‌ని ప్రారంభించింది. చేతిలో పైసా లేకుండా కూడా ఈ హోటల్‌లో అడుగుపెట్టి అద్భుతమైన రుచులని ఆరగించవచ్చని అంటున్నారు నిర్వాహకులు. అలెప్పూజాకు వెళ్లే దారిలో ఈ హోటల్ ఉంటుందట.

అడిగిందిచ్చే యంత్రుడు

జపాన్ వ్యాపార సూత్రం

జపాన్‌లో 'వెండింగ్ మిషన్లు' మిగతా దేశాలతో పోలిస్తే ఎక్కువే. టీ, కాఫీ, శీతలపానియాలు, ఐస్‌క్రీమ్స్, నూడిల్స్, రైస్‌బౌల్, శాకాహారం, మాంసాహారం, సిగరెట్లు, అరటిపండ్లు.. ఇలా వెండింగ్ మిషన్లకు కాదేదీ అనర్హం అంటోంది జపాన్. చేతిలో స్వైప్‌కార్డు, క్రెడిట్ కార్డుంటే చాలు ధైర్యంగా జపాన్ అంతా చుట్టేయవచ్చు. ఎందుకంటే కనీస అవసరాలను తీర్చే అక్షయపాత్రలైన ఈ యంత్రాలే పలకరిస్తాయి. ప్రతీ 23 మందికీ ఓ యంత్రం ఉంటుందక్కడ. ఇంటి దగ్గర.. వీధి చివర్లో.. బడి పక్కన.. గుడిపక్కన.. సినిమాహాల్.. పెట్రోల్ బంకు.. పార్కు, అటవీ ప్రాంతం సమీపంలో.. ఇలా ఎక్కడ చూసినా జపాన్‌లో ఇవి కనిపిస్తాయి.

అక్కడ 'అమ్మకం మిషన్ల' హవా!

ఇంగ్లండ్‌లో 1880 సంవత్సరంలో వెండింగ్ మిషన్‌ను పోస్టల్ శాఖలో తొలిసారి ఉపయోగించారు. కాయిన్ మిషన్‌లో వేయగానే అందులోంచి కార్డులు, కవర్లు, స్టాంపులు వచ్చేవి. ఏడేళ్ల తర్వాత ఓ జర్మన్ చాక్లెట్ కంపెనీ రిఫ్రిజిరేటర్‌లాంటి వెండింగ్ మిషన్లను పదిహేనువేల వరకూ దుకాణాల్లో ఉంచి చాక్లెట్లను విపరీతంగా అమ్ముకుంది. ఆ తర్వాత కొన్ని సిగరెట్ కంపెనీలు సిగరెట్లు, మ్యాచ్‌బ్యాక్స్, చూయింగ్‌గమ్‌లు ఉంచటం ప్రారంభించాయి. తర్వాత్తర్వాత స్నాక్స్, బేవరేజస్, ఆల్కహాల్, న్యూస్‌పేపర్లు.. ఇలా నిత్యావసరాలను ఈ యంత్రాల్లో ఉంచి అమ్ముతున్నారు. వెండింగ్ మిషన్ ఇంగ్లండ్‌లో పుట్టినా.. మహారాజ పోషకులు మాత్రం జపనీయులే. వీటిలో ఆహారం అయిపోతే ఎప్పటికపుడు నింపుతుంటారు. ఓ అధికారిక లెక్కప్రకారం జపాన్‌లోనే 50 లక్షల వెండింగ్ మిషన్లున్నాయి. అసలెందుకు ఇవి జపాన్‌లోనే ఇంతగా ఉన్నాయంటే.. జపనీయులు ఇతరుల వస్తువులను గౌరవిస్తారు. వీటి మీద దుమ్ముధూళి కనిపిస్తే శుభ్రం చేసి మరీ వెళ్తారు. ఇంత బాధ్యతగా ఉంటారు కాబట్టే ఇక్కడ వీటి విస్తృతి పెరుగుతోంది.

పోలీసులకు పట్టిస్తాయి..

జపాన్‌లో 30 రకాల వెండింగ్ యంత్రాలు లభ్యమవుతాయి. ఇవి మనుషుల ఆలోచనే మార్చేంతగా ఆకర్షిస్తాయి. కూల్ డ్రింక్ తీసుకోవాలని వెళితే ఏ చాక్లెటో, స్నాక్స్ తెచ్చేసుకుంటారు. జపాన్‌లో ఉండే 50 లక్షల యంత్రాల్లో సంవత్సరానికి 7 ట్రిలియన్ యన్‌ల వ్యాపారం జరుగుతుంది. ఒక్కోటి 1.4 మిలియన్ యన్‌లను సంపాదిస్తుంది. ఈ యంత్రం ఒక్కోదానికీ విద్యుత్తు ఖర్చు 4,300 ఎన్ చెల్లిస్తారు. దీన్ని బలవంతంగా తీయాలని రెండుసార్లు గట్టిగా లాగితే అందులోని పిహెచ్ఎస్ ట్రాన్స్‌మీటర్స్ ఆధారంగా క్షణాల్లో లోకల్ పోలీసులకు ఫోన్ వెళ్తుంది. అలా యంత్రం తనకు తాను రక్షించుకుంటుంది. టోక్యో లాంటి నగరాల్లో అత్యాధునిక యంత్రాలు ఉంటాయి. వాటిని కంపెనీలే అమర్చుతాయి. కాఫీ కప్పు నింపే సమయంలో బోర్ కొట్టకుండా యంత్రంపై టీవీ ఉంటుంది. కావాల్సిన పదార్థం దగ్గర చేతితో టచ్ చేస్తే చాలు దాన్నే అందిస్తాయి. కొన్ని యంత్రాల్లో 61 రకాల సిగరెట్లు లభ్యమవుతాయి. అయితే ఇవి రాత్రి పదకొండు గంటలకు ఆగిపోతాయి. ఎందుకంటే వీటి నిర్వహణ, తనిఖీలు చేస్తారు. మొత్తానికి బిజీలైఫ్ గడిపే జపనీయుల కల్పతరువు ఈ వెండింగ్ మిషన్.





ఈనాడు సినిమా


రవితేజ

యాక్షన్ హంగామా

రవితేజ అంటేనే మాస్. యువ దర్శకుడు కల్యాణ్‌కృష్ణ శైలీ అదే. అందుకే ఈ ఇద్దరి కలయికలో సినిమా అనగానే చిత్ర పరిశ్రమలో ప్రత్యేకమైన ఆసక్తి, ప్రేక్షకుల్లో అంచనాలు పెరిగిపోయాయి. అందుకు తగ్గట్టుగానే పక్కా మాస్ హంగామాతో చిత్రం రూపుదిద్దుకొంటోంది. ఈ చిత్రానికి 'నేల టికెట్' అనే పేరు ప్రచారంలో ఉంది. రవితేజ సరసన మాళవిక శర్మ కథానాయికగా నటిస్తోంది. మాళవికని ఇటీవలే ట్విట్టర్ ద్వారా పరిచయం చేశారు కల్యాణ్‌కృష్ణ. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్ పరిసరాల్లో జరుగుతోంది. రవితేజ, ఇతర ప్రతినాయక బృందంపై సాగే పోరాట ఘట్టాల్ని దిలీప్ సుబ్బరాయన్ నేతృత్వంలో తెరకెక్కిస్తున్నారు. ఆ వెంటనే మరో పోరాట ఘట్టాన్ని రామ్‌లక్ష్మణ్ నేతృత్వంలో రూపొందించనున్నారు. ఉగాది సందర్భంగా సినిమా పేరును, ఫస్ట్‌లుక్‌ని విడుదల చేయనున్నట్టు తెలిసింది. మేలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారని సమాచారం. జగపతిబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు.


మాళవిక శర్మ

తాత పాత్రలో మనవడు


అక్కినేని నాగేశ్వరరావు

అక్కినేని నాగేశ్వరరావుగా ఆయన మనవడు నాగచైతన్య కనిపించబోతున్నారు. నటి సావిత్రి జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న 'మహానటి'లో ఏఎన్నార్‌తో పాటు, ఎన్టీఆర్, ఎస్వీ రంగారావు, జెమినీ గణేశన్, చక్రపాణి తదితర ప్రముఖుల పాత్రలు కీలకం. ఎస్వీ రంగారావుగా మోహన్‌బాబు, చక్రపాణిగా ప్రకాష్‌రాజ్ నటిస్తున్నారు. మరి ఎన్టీఆర్, ఏఎన్నార్ పాత్రల్లో ఎవరు కనిపిస్తారనే విషయంపై ఆసక్తి నెలకొంది. ఏఎన్నార్ పాత్ర కోసం ఆయన మనవడైన నాగచైతన్యని ఎంపిక చేసుకొంది చిత్రబృందం. తాత పాత్రని పోషించడానికి ఒప్పుకొన్న నాగచైతన్య త్వరలోనే సెట్స్‌పైకి అడుగుపెట్టబోతున్నారు. వైజయంతీ మూవీస్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్నారు. సావిత్రిగా కీర్తి సురేష్, జెమినీ గణేశన్ పాత్రలో దుల్కర్ సల్మాన్ నటిస్తున్నారు. సమంత ముఖ్య భూమిక పోషిస్తున్నారు.


నాగచైతన్య


రాశీ ఖన్నా

గీతోపదేశం

లక్ష్యం ఎన్నటికీ
దీక్షకు బంధువురా
విజయం ఎప్పటికీ
చెమటకు చుట్టంరా

గీతం: చూద్దాం ఆకసం అంతం...
చిత్రం: విక్రమసింహ
రచన: చంద్రబోస్

– పంపినవారు: పి.కారుణ్య, కనిగిరి

నమ్ముతారో లేదో కానీ...

ఈ సినిమా ఫలితం గురించి నాకు ముందే తెలుసు అని జయాపజయాల గురించి విశ్లేషించే తారల్ని చూస్తూనే ఉంటాం. కథానాయిక రాశీ ఖన్నా మాత్రం 'నమ్ముతారో లేదో కానీ... సెట్లో దర్శకుడు చెప్పింది చేయడం తప్ప నాకు మరొకటి తెలియదు' అంటూ నవ్వేస్తోంది. "నమ్మకం లేకపోతే ఏ సినిమా చేయలేం. రోజూ వందశాతం నమ్మకంతోనే సెట్లోకి అడుగుపెడతాను. ఫలితాల గురించి ఎప్పుడూ ఆలోచించలేదు. సినిమా ఏమవుతుందో ఏంటో అని ఆలోచిస్తూ పనిచేస్తుంటే నటనని ఆస్వాదించలేం. ఇప్పుడనే కాదు, చిత్ర పరిశ్రమకి వచ్చిన కొత్తలోనూ నా పంథా ఇదే. అందుకే జయాపజయాలు నాపై ఏ దశలోనూ ప్రభావం చూపించలేదు. వరుస పరాజయాలు ఎదురైనా నిరుత్సాహ పడలేదు. నా పని తీరే నన్ను నిలబెడుతుందనే నమ్మకం నాలో ఎప్పుడూ ఉంటుంది" అని చెప్పింది రాశి. ప్రస్తుతం నితిన్‌తో కలిసి 'శ్రీనివాస కళ్యాణం'లో నటిస్తోంది.

కిరాక్ పార్టీ.. గీతాలాపన


నిఖిల్, అల్లరి నరేష్, సిమ్రన్ పరీంజా

నిఖిల్, సంయుక్త హెగ్డే, సిమ్రన్ పరీంజా నాయకానాయికలుగా నటించిన చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కొప్పిశెట్టి దర్శకుడు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. అజనీష్ స్వరాలు సమకూర్చిన ఈ చిత్ర గీతాలను విజయవాడలో అల్లరి నరేష్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "నాకు నిఖిల్‌ని చూసినప్పుడల్లా డ్యూరో సెల్ బ్యాటరీ గుర్తుకొస్తుంది. ఆహుతి ప్రసాద్ తనయుడు కార్తీక్ ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది. కన్నడలోలాగే తెలుగులోనూ మంచి విజయాన్నందుకోవాల"న్నారు. నిఖిల్ మాట్లాడుతూ "అల్లరి నరేష్ ఆడియో విడుదల చేసిన నా ప్రతి సినిమా మంచి హిట్. అలాగే ఈ చిత్రం కూడా విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా. దర్శకుడికి మంచి పేరు తీసుకువస్తుంది. వినోదంతో పాటు మంచి సందేశం ఉన్న సినిమా ఇది" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "మార్చి 16న విద్యార్థులంతా మాస్ బంక్ కొట్టి మరీ 'కిరాక్ పార్టీ'ని చూసి ఆనందిస్తారని కోరుకుంటున్నా. ప్రతి విద్యార్థికి వినోదం పంచేలా ఉంటుంది" అన్నారు. సిమ్రన్ పరీంజా మాట్లాడుతూ ''ఇంత మంచి చిత్రంతో తెలుగులో అడుగుపెట్టడం ఆనందంగా ఉంది. ట్రైలర్, పాటలకు మంచి ఆదరణ లభించింద"న్నారు. మాటలు: చందూ మొండేటి, స్క్రీన్ ప్లే: సుధీర్ వర్మ.

ఒకటే కథ

శ్రీవిష్ణు కథానాయకుడిగా నటించిన చిత్రం 'నీది నాది ఒకే కథ'. సాత్నా టైటస్ కథానాయిక. వేణు ఊడుగుల దర్శకుడు. ప్రశాంతి, కృష్ణ విజయ్, అట్లూరి నారాయణరావు నిర్మాతలు. ఈ నెల 23న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "శ్రీవిష్ణు ఓ విద్యార్థి పాత్రలో నటించిన చిత్రమిది. ఇటీవల విడుదలైన టీజర్‌కి మంచి స్పందన లభించింది. చిత్రంపై అంచనాల్ని, ఆసక్తిని పెంచింది. చిత్తూరు యాసలో శ్రీవిష్ణు పలికిన సంభాషణలు యువతరాన్ని ఆకట్టుకున్నాయి. చిత్రమూ అదే తరహాలో ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకం మాకుంది" అన్నారు నిర్మాతలు. పోసాని కృష్ణమురళి, దేవిప్రసాద్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, కళ: టి.ఎన్.ప్రసాద్, ఛాయాగ్రాహకుడు: రాజ్ తోట.


శ్రీవిష్ణు, సాత్నా టైటస్

పంచ్ డైలాగ్

ప్రేమించే వాళ్లందర్నీ ద్వేషిస్తే ఈ దేశంలో ద్వేషం మాత్రమే ఉంటుంది. ప్రేమ ఉండదు.

చిత్రం: **దేనికైనా రెడీ**

- పంపినవారు: టి.సాయిసంతోషిణి, కూర్మన్నపాలెం

తెలంగాణ ఎలా వచ్చింది?

బిపిన్ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బంగారు తెలంగాణ'. హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ సినిమా ఆడియో సీడీలను తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ విడుదల చేశారు. బిపిన్ మాట్లాడుతూ "తెలంగాణ కోసం ఎంతో మంది ఆత్మ బలిదానం చేశారు. ప్రాణాలకు తెగించి కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. అసలు తెలంగాణ ఎలా వచ్చింది అనే కథాంశంతో చిత్రాన్ని తెరకెక్కించాం. ఇందులోని ఐదు పాటలు ఆకట్టుకుంటాయి. త్వరలో సినిమా విడుదల చేస్తామ"న్నారు. సమర్పకుడు అంజిరెడ్డి మాట్లాడుతూ "విభిన్నమైన కథాంశంతో సినిమాను రూపొందించాం. పాటలు బాగున్నాయి. ముందస్తు విడుదల వేడుకను త్వరలో కేటీఆర్, కవిత, హరీష్‌రావు సమక్షంలో నిర్వహిస్తామ"న్నారు. బాబూమోహన్, రమ్య, అక్షర, ఏవీ స్వామి, సాయి త్రిశాంక్ ప్రధానపాత్రల్లో నటించారు. కూర్పు: నాగిరెడ్డి, ఛాయాగ్రహణం: మధు, ఎ.నాయుడు, ఆళ్ల రాంబాబు.

పల్లెటూరి పెద్దారెడ్డి


సతీష్‌రెడ్డి, మౌర్యానీ

సతీష్‌రెడ్డి, మౌర్యానీ, ముంతాజ్ నాయకానాయికలుగా వీజే రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'నెల్లూరి పెద్దారెడ్డి'. రఘునాథరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రభాస్ శ్రీను, అంబటి శీను, సమ్మెట గాంధీ ఇతర ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకొస్తోంది. దర్శకుడు మాట్లాడుతూ "పల్లెటూరి నేపథ్యంలో సాగే కథ ఇది. ప్రేక్షకులకు మంచి వినోదాన్ని, ఆహ్లాదాన్ని పంచుతుంది. నలుగురికి మంచి చేయాలనుకొనే తత్వమున్న పెద్దారెడ్డి ఓ యువతి కుటుంబానికి ఆశ్రయమిస్తాడు. ఈ క్రమంలో అతనికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయో తెరపైనే చూడాలి" అన్నారు.

యువతరం డాలర్ కష్టాలు


తేజస్, పల్లవి డోర

తేజస్, పల్లవి డోర, వైవా హర్ష, వంశీకృష్ణ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'అమీర్‌పేట్ టు అమెరికా'. రామ్మోహన్ కొమండూరి, భానుకిరణ్ సంయుక్తంగా దర్శకత్వం వహించారు. పద్మజ కొమండూరి నిర్మాత. ఈ సినిమా ప్రచార చిత్రాల్ని ఆదివారం హైదరాబాద్‌లో నటుడు తనికెళ్ల భరణి, రవికుమార్ ఆవిష్కరించారు. అనంతరం తనికెళ్ల భరణి మాట్లాడుతూ "టైటిల్ బాగుంది. అమీర్‌పేట్ టు అమెరికా ప్రయాణాన్నంతా ఇందులో చూపించారు. నేను మంచి పాత్ర పోషించా. యువతరాన్ని అలరించే అన్ని అంశాలున్నాయ"న్నారు. రామ్మోహన్ మాట్లాడుతూ "అమీర్‌పేట్ నుంచి అమెరికాకు వెళ్లి, అక్కడ డాలర్లు సంపాదించడానికి యువత ఎన్ని కష్టాలు పడుతున్నారో చిత్రంలో చూపించాం. ఈ నెల 23న పాటలను 30న సినిమాను విడుదల చేస్తామ"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "నటీనటులంతా బాగా చేశారు. మంచి కథాంశంతో వస్తున్న సినిమా. విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా" అన్నారు.


ప్రియమణి

సూర్య గ్రహణం కాల చక్రం

ప్రియమణి ప్రధానపాత్రలో ప్రేమ్‌ఆర్య దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'అంగుళీక'. కోటి తూముల, ఎ.హితేష్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్ర టీజర్‌ను ఆదివారం హైదరాబాద్‌లో దర్శకుడు కోడి రామకృష్ణ విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఈ కథ నాకు ముందే తెలుసు. టీజర్ బాగుంది. ఈ సినిమా చిత్ర బృందానికి మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నా" అన్నారు. నిర్మాతలు మాట్లాడుతూ "సూర్యగ్రహణం, కాలచక్రంతో కూడుకున్న కథాంశమిది. దర్శకుడు చక్కగా తీశాడ"న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కాలచక్రంతో ముడిపడి ఉన్న ఇద్దరు ప్రేమికుల వీరగాథ ఇది. ప్రియమణి చక్కగా నటించారు. సూర్యగ్రహణం ఘడియల్లో విడిపోయిన ప్రేమ జంట మళ్లీ ఆ సూర్యుడి ఆశీస్సులతో 585 ఏళ్ల తర్వాత ఎలా కలుసుకుంటారు? వారిపై దుష్టాత్మ ఎలా పగ తీర్చుకుంది అన్నది చిత్రానికి ఆకర్షణగా నిలుస్తుంద"న్నారు.

వాడే నా ఐరన్‌మ్యాన్


కరీనా కపూర్

బాలీవుడ్ కథానాయిక కరీనా కపూర్‌లో తల్లయ్యాక చాలా మార్పొచ్చింది. కుమారుడు తైమూర్ అలీఖాన్‌నే తన ప్రపంచంగా భావిస్తోంది. బుల్లి తైమూర్‌ను కరీనా ముద్దు చేస్తున్న ఫొటోలు ఆన్‌లైన్‌లో చక్కంఱ్లు కొడుతూ అభిమానులను ఆనంద పరుస్తున్నాయి. అంతేనా.. కరీనా ఎవరితో మాట్లాడినా ఏ కార్యక్రమానికి వెళ్లినా తైమూర్ ముచ్చట్లు తప్పక ఉంటాయి. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న కరీనా మరోసారి తన బుజ్జాయిపై ఉన్న అమితమైన ప్రేమను వెల్లడించింది. "తైమూర్ అనే పేరుకు అర్థం ఉక్కు. వాడే నా ఐరన్‌మ్యాన్. నా కొడుకు యోధుడిగా ఎదుగుతాడని సైఫ్ అలీఖాన్(భర్త)కు చెప్పాన"ని అంది కరీనా. కాగా ఈమధ్య బాలీవుడ్‌లో అవకాశాల విషయంలో బంధుప్రీతి ప్రభావం ఎక్కువగా ఉందని విమర్శలు వస్తున్న సంగతి తెలిసిందే. కపూర్ వంశ వారసురాలిగా చిత్రసీమలో అడుగుపెట్టిన కరీనా ఈ విషయంపై స్పందించింది. "బాలీవుడ్‌లో ఎంతో మంది వారసులుగా వచ్చిన నటులున్నారు. నిజంగా బంధువులకే అవకాశాలు ఇచ్చే పరిస్థితి ఉంటే వారంతా అగ్రస్థానంలోనే ఉండేవార"ని చెప్పిందామె. ఎలాంటి వారసత్వం లేకుండా వచ్చిన రణ్‌వీర్ సింగ్ తన ప్రతిభ, కష్టపడే గుణంతో ఉన్నత స్థాయికి ఎదిగిన తీరే అందుకు నిదర్శనమంది. చిన్నప్పుడు శ్రీదేవి, మాధురీ దీక్షిత్ పాటలకు అద్దం ముందు డ్యాన్స్ చేసేదాన్నని, ఆ స్ఫూర్తితోనే తర్వాత నటనపై మనసు మళ్లిందని చెప్పింది.

ఆ నంబరు వెనక?

కార్తిక్, నిరంజన నాయకానాయికలుగా తమిళంలో తెరకెక్కిన '465' చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు అడ్డాల వెంకట్రావ్, ఎ.టి.కృష్ణన్. సాయిసత్యం దర్శకత్వం వహించారు. నిర్మాతలు మాట్లాడుతూ "తమిళంలో విడుదలై విజయాన్ని అందుకొందీ చిత్రం. భయపెట్టే అంశాలతో పాటు, ఆద్యంతం ఉత్కంఠ రేకెత్తిస్తూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచింది. తెలుగు ప్రేక్షకులకి కూడా 'పిశాచి', 'పిజ్జా' చిత్రాల్లాగా తప్పకుండా నచ్చుతుందీ చిత్రం. '465' నంబరు వెనకనున్న రహస్యమేంటన్నది తెరపైనే చూడాలి. శశాంక్ వెన్నెలకంటి రాసిన సంభాషణలు చిత్రానికి ప్రధాన బలం. మనోబాల, జయశ్రీ తదితరులు నటించిన ఈచిత్రానికి సంగీతం: రవిచంద్రన్, ఛాయాగ్రహణం: పి.ఆర్.సుందర్.


కార్తిక్, నిరంజన

నా ప్రేమ నువ్వే

వాసుదేవ్ కథానాయకుడిగా స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'నాలో ప్రేమ నువ్వేనా'. అవని కథానాయిక. జై చిరంజీవ ఆర్ట్స్ క్రియేషన్స్ సంస్థ నిర్మిస్తోంది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో సినిమాలోగోని ప్రముఖ ఛాయాగ్రాహకుడు ఛోటా కె.నాయుడు ఆవిష్కరించారు. వాసుదేవ్ మాట్లాడుతూ "కొత్తతరం ప్రేమకథతో తెరకెక్కిస్తున్న చిత్రమిది. హాస్యం, భావోద్వేగాలకి సమ ప్రాధాన్యం ఉంది. త్వరలోనే పాటల్ని విడుదల చేస్తాం. వేసవిలో చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం" అన్నారు. రాశీ సైనా, సంజయ్ శివలింగమ్, రాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అర్జున్, ఛాయాగ్రహణం: సాంబమూర్తి.


అవని

బ్లెండర్‌ను శుభ్రం చేస్తున్నారా?



మేకప్ బ్రష్‌ల స్థానాన్ని కాస్తో కూస్తో బ్యూటీ బ్లెండర్లు భర్తీచేశాయి. వాటిని వాడటం కూడా సులువవడంతో చాలామంది బ్రష్‌లతో పోలిస్తే వాటికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే వాటి వాడకంలో కొన్ని జాగ్రత్తలూ, చిట్కాలు తెలుసుకుందామా!

❒ ఫౌండేషన్ రాసుకోడానికి చాలామంది దీన్ని నేరుగా వాడేస్తుంటారు. అలాకాకుండా కొంచెం తడిపి వాడితేనే మేకప్ వేసుకోవడం సులువవుతుంది. ముఖం మొత్తం ఒకేలా అంటుతుంది. నీళ్లలో ముంచడం, లేదంటే మేకప్ లిక్విడ్ స్ప్రే ఉంటే దాన్ని వాడినా సరిపోతుంది. అయితే దాంట్లో నీళ్లు ఎక్కువగా లేకుండా చూసుకోవాలి. ఒకసారి సున్నితంగా పిండేసి ఆ తరువాత ఉపయోగించాలి.

❒ మేకప్ బ్రష్‌ను వాడుతున్నప్పుడు దాన్ని చర్మం మీద రుద్దుతూ ఉంటాం. కానీ బ్లెండర్‌తో కూడా అలాగే చేయాల్సిన అవసరం లేదు. పైపైన అద్దితే సరిపోతుంది. కాస్త ఆలస్యమైనా కూడా మేకప్ బాగా వస్తుంది.

❒ వీటిని మేకప్ వేసుకున్న తర్వాత తప్పకుండా శుభ్రం చేయాలి. ఆ తరువాతే ఇంకోసారి వాడాలి. లేదంటే బ్యాక్టీరియా చేరి చర్మవ్యాధులు వచ్చే అవకాశం లేకపోలేదు. వీటిని శుభ్రం చేసేందుకు కూడా ఒక పద్ధతుంటుంది. ఎక్కువ సువాసన లేని సబ్బుతోనే దీన్ని శుభ్రం చేయాలి. గట్టిగా పిండకూడదు. నీళ్లు మొత్తం పోయేదాకా టిష్యూ మీద ఫ్యాన్‌గాలి కింద ఉంచితే సరిపోతుంది.

❒ దీన్ని కేవలం ఫౌండేషన్ రాసుకోడానికే పరిమితం చేయాల్సిన అవసరం లేదు. పౌడర్, సన్‌స్క్రీన్, బ్లష్... ఇలా ఏది రాసుకోడానికైనా చక్కగా వాడుకోవచ్చు. ఇది పైనుంచి కింది వరకు ఒకే ఆకారంలో ఉండకపోవడమే దీనికి కారణం. దీన్ని అవసరమైన వైపు మాత్రమే ఉపయోగించుకోవడం మేలు.

మీ ఆహారంలో ఇవి ఉన్నాయా?



చదువులూ, ఉద్యోగం, కెరీర్... అంటూ పరుగులు తీసే అమ్మాయిలకు ఆరోగ్యం గురించి ఆలోచించే తీరికే ఉండట్లేదు. ఎన్ని వ్యాపకాలు ఉన్నప్పటికీ ఆహారం... ఆరోగ్యం కూడా రోజువారీ ప్రణాళికలో భాగమే అని గుర్తించాలి. వయసునూ, పరిస్థితిని బట్టి తీసుకునే ఆహారం మీదా శ్రద్ధ పెట్టాలి. దూసుకుపోయే ఉత్సాహం సొంతమై.. దృఢంగా ఉండాలంటే... ఈ విటమిన్లూ, మినరళ్లూ ఎంతో అవసరం.



ఫోలిక్ యాసిడ్: ఇది అమ్మాయిలకు చాలా అవసరం. ఇరవై ఏళ్ల వయసు నుంచే ఫోలిక్ యాసిడ్ అందే ఆహారానికి ప్రాధాన్యమివ్వాలి. ముందునుంచీ ఇది బాగా అందితేనే సంతానసాఫల్య సమస్యలుండవు. శిశువు ఎదుగుదలా బాగుంటుంది. అందుకే గర్భం దాల్చిన వెంటనే వైద్యులు ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లు ఇస్తారు. ఈ లోపం ఉన్నట్లైతే బిడ్డ పలు సమస్యలతో జన్మిస్తుంది. ఇది నీళ్లలో కరిగే విటమిన్. అందుకే శరీరంలో నిల్వ ఉండదు. అందుకే ప్రతిరోజూ అందేలా చూసుకోవడం చాలా అవసరం. మనం తీసుకునే ఆకుకూరలు ముఖ్యంగా తోటకూరా, చుక్కకూరా, పుదీనా, పాలకూరల్లో ఎక్కువగా ఉంటుంది. అలానే క్యారెట్, సెనగలూ, పెసలూ, మినుములూ, కంది పప్పూ, నువ్వులూ, సోయాబీన్, నారింజా, గోరుచిక్కుళ్లూ, నట్స్, లివర్ వంటి వాటిలో బాగా లభిస్తుంది. ఇక గర్భం దాల్చిన నాలుగువారాల తరవాతి నుంచి ఐరన్ కలిపిన ఫోలిక్ యాసిడ్ సప్లిమెంట్లు అందిస్తారు. ఇవి తీసుకోవడం వల్ల రక్తహీనత దూరమవుతుంది. కొన్నిసార్లు గర్భిణుల్ని మైక్రోఫైతిక్ ఎనీమియా బాధిస్తుంది. దీనివల్ల పిల్లలు బరువు అంతగా పెరగరు. అందుకే ఐరన్‌తో కూడిన ఫోలిక్ యాసిడ్ తీసుకోవడం తప్పనిసరి.



విటమిన్ సి: ఇది నీళ్లలో కరిగే విటమిన్. రోజూ దీని అవసరం ఉంటుంది. బొప్పాయి, నారింజ, జామ, కమల, నిమ్మ..వంటి పండ్లలో ఇది ఎక్కువగా లభిస్తుంది. అయితే ఈ విటమిన్ శరీరానికి సక్రమంగా అందాలంటే.. తాజా పండ్లను రోజూ తీసుకోవాలి. చెట్టు నుంచి కోశాక ఆలస్యమయ్యే కొద్దీ విటమిన్ సి శాతం తగ్గుతుంది. అలానే దీంతోపాటు విటమిన్ ఈ కూడా అవసరం. ఇదీ విటమిన్ సి లానే శరీరంలో యాంటీఆక్సిడెంట్ మాదిరి పనిచేస్తుంది. ఈ రెండూ లోపిస్తే సప్లిమెంట్లు తీసుకోవడం తప్పనిసరి.



ఐరన్: నెలసరి మొదలైనప్పట్నుంచీ దీని అవసరం బాగా ఉంటుంది. గర్భిణులకీ అంతే. ఇది ఆకుకూరల్లో, సెనగపప్పూ, క్యాలీఫ్లవర్, లివర్, నువ్వులూ, బెల్లంలో ఎక్కువగా లభిస్తుంది. ఐరన్ లోపించినప్పుడు రక్తహీనతా, అలసటా, నీరసం ఇబ్బంది పెడతాయి. కొన్నిసార్లు ఈ సమస్యలను తగిన ఆహారం తీసుకుని అదుపులోకి తెచ్చుకోవచ్చు. మరికొన్నిసార్లు సప్లిమెంట్లు వాడాల్సి రావచ్చు. అలా వాడాల్సివచ్చినప్పుడు ఆహారం తీసుకోవడానికి ముందు అంటే ఖాళీ పొట్టతోనే స్వీకరించాలి. అప్పుడే పనితీరు బాగుంటుంది. క్యాల్షియంతోపాటు ఐరన్ సప్లిమెంట్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోకూడదు. ఇలా తీసుకుంటే కనుక ఐరన్‌ని శరీరం త్వరగా గ్రహించలేదు. గర్భిణులకు నాలుగో నెల నుంచీ ఈ పోషకాన్ని తప్పనిసరిగా ఇస్తారు. వారు ఐరన్, అయోడిన్ సమ్మిళితంగా దొరికే ఉప్పును ఎంచుకోవడం మంచిది. అలానే టీ, కాఫీల అలవాటు ఉంటే తగ్గించడంగానీ, మానేయడం కానీ చేయాలి. వీటిని ఎప్పుడూ ఐరన్ సమృద్ధిగా లభించే పదార్థాలతో తీసుకోకూడదు. గంట ముందూ లేదా తరవాత తీసుకోవాలి. అంతేకాదు మైదా, రిఫైండ్, పాస్తా.. వంటి ప్రాసెస్డ్ పదార్థాలూ, పచ్చళ్లతో కలిపి తీసుకుంటే మాత్రం శరీరంలో ఐరన్ పనితీరు తగ్గిపోతుంది.



క్యాల్షియం: ఇది ఎముక ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తుంది. సాధారణంగా మహిళల్లో ఇరవై ఒక్క ఏళ్ల వరకూ ఎముక సాంద్రత వృద్ధి అవుతూ ఉంటుంది. అందుకే చిన్న వయసు నుంచీ పిల్లలకు క్యాల్షియం అందివ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. ఈ లోపం ఉంటే మాత్రం ఎముక సాంద్రత అంతగా ఉండదు. చిన్న వయసులోనే ఆస్టియోపోరోసిస్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. గర్భిణులకూ ఇది చాలా అవసరం. ఇది బాగా లభించేది కేవలం పాలూ, పాల సంబంధిత పదార్థాల్లోనే. పాలంటే కేవలం గేదె పాలే తీసుకోవాలని లేదు. టోన్డ్ మిల్క్ ఎంచుకున్నా సరిపోతుంది. కొందరు పాలు తాగడానికి ఇష్టపడరు. అలాంటి వారు పెరుగూ, పనీర్ తీసుకున్నా సరిపోతుంది. ఇంకా ఇది నువ్వులూ, ఆకుకూరలూ, గింజలూ, ఎండుఫలాలూ, నూనెలూ, సెనగలూ, ఉలవలూ, నువ్వులూ, కొబ్బరిబోండాం, చిన్న ముల్లు ఉన్నచేపల్లోనూ ఉంటుంది. పాలతో పోలిస్తే వీటిల్లో లభించే శాతం తక్కువ. పదహారు కప్పుల ఆకుకూరలో ఉండే క్యాల్షియం కేవలం కప్పు పాలల్లో లభిస్తుంది. నాలుగు కప్పుల ఎండు ఫలాల్లో ఉండే క్యాల్షియం కూడా కేవలం కప్పు పాలల్లో ఉంటుంది.

బీకాంప్లెక్స్ విటమిన్లు: ఎనిమిది రకాల బి విటమిన్లు కలిస్తే బీకాంప్లెక్స్ అవుతుంది. నేడు చాలామంది మహిళలు ఈ లోపాన్ని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మాంసాహారం తిననివారిలో ఈ సమస్య ఎక్కువ కనిపిస్తుంది. ఇది పాలూ, మాంసాహారం నుంచి ఎక్కువగా లభిస్తుంది. విరేచనాలు, ఉదరసంబంధ సమస్యలు, శాకాహారం తీసుకునేవారిలో బీ విటమిన్ లోపం బాధిస్తుంది. ఫలితంగా రక్తహీనత ఎదురవుతుంది. హిమోగ్లోబిన్ తగ్గుతుంది. ఆయాసం, అలసటా, నీరసం ఇబ్బంది పెడతాయి. ఈ లక్షణాలను గమనించుకుని బీ లోపాన్ని సవరించుకోవాలి. చేపలు, పాల సంబంధిత పదార్థాలూ, పీతలూ, రొయ్యల వంటి వాటిని ఎక్కువగా తీసుకోవాలి.



ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు: ఇది ఫ్యాటీ యాసిడ్. ఇది మహిళలకు చాలా అవసరం. ఇది చేపనూనెలో ఎక్కువగా లభిస్తుంది. చేపలు తినని వారు నట్స్, అక్రోట్, వాల్‌నట్, అవిశె గింజలూ, నూనెని తీసుకోవాలి. కానీ వీటి వల్ల అంతగా అందదు. మాంసాహారం తినే వారికి చేపలు అయితే సరిపోతుంది. నలభై ఏళ్లు దాటిన వారికి తప్పకుండా ఇది అందాలి.

విటమిన్ డి: ఇది శరీరంలో కొవ్వును కరిగించే విటమిన్. ఈ లోపం ఉన్నప్పుడు శరీరం క్యాల్షియాన్ని సరిగా గ్రహించదు. దీన్ని ఎప్పుడైనా సరే భోజనం తిన్నాక తీసుకుంటే మంచిది. అప్పుడే శరీరం చక్కగా గ్రహిస్తుంది. ఇది మనకు ఆహారం నుంచి ఎక్కువగా అందదు. అందినా గుడ్డులోని పసుపు సొన నుంచి కాస్త అందొచ్చు. ఎండ నుంచి మనకు బాగా అందుతుంది. అతినీలలోహిత బి కిరణాలు ప్రత్యక్షంగా మన చర్మం మీద పడేలా చూసుకోవాలి. ఈ కిరణాలు ఉదయం పదకొండు గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఉంటాయి. ప్రత్యక్షంగా ఎండలో ఉంటేనే మంచిది. అలాకాకుండా సన్‌స్క్రీన్ రాసుకోవడం, అద్దం పక్కన నిల్చోవడం వంటివి చేయకూడదు. చర్మతత్వాన్ని బట్టి ఐదు నుంచి ఏడు నిమిషాలు ఎండలో నిల్చోమని వైద్యులు చెబుతుంటారు. ముఖ్యంగా ఈ కిరణాలూ ముఖం, కాళ్లూ, చేతులకు తగిలేలా చూసుకోవాలి. విటమిన్ డి మహిళల్లో 30నానో గ్రాములు మించి ఉండాలి. తక్కువ ఉన్నప్పుడు మాత్రం వైద్యుల్ని సంప్రదించాలి. సూర్యకాంతితో పెంచుకోవచ్చు అనుకోవడం పొరబాటు. వైద్యులు సప్లిమెంట్లు ఇస్తారు. ఇంజక్షన్లు సూచిస్తారు. డి విటమిన్ మహిళల్లో హార్మోన్ మాదిరి పనిచేస్తుంది కాబట్టి నిర్లక్ష్యం చేయకూడదు.



డా. లతాశశి
పోషకాహార నిపుణురాలు
ఫెర్నాండెజ్ హాస్పిటల్

గర్భిణులకు క్యాలెండర్!



ప్రసవం ప్రతి స్త్రీకి పునర్జన్మ లాంటిదే అంటారు. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా చివరకు ఆమె ప్రాణాలకే ముప్పు. సంగారెడ్డి జిల్లా వైద్యశాఖ ఎక్స్‌పెక్టెటెడ్ డేట్ ఆఫ్ డెలివరీ(ఈడీడీ) క్యాలెండర్‌ను రూపొందించి గత ఏడు నెలలుగా మాతృత్వపు మరణాలే లేకుండా చేసింది. ఆ వివరాల్లోకి వెళితే...

ఎంతగా అభివృద్ధి చెందామని చెప్పుకున్నా...ఇప్పటికీ మనదేశంలో ప్రసూతి మరణాల సంఖ్య ఎక్కువే. ఆ లెక్కన చూసినా... గత కొన్నేళ్లుగా సంగారెడ్డి జిల్లాలో ఏడాదికి సగటున 30 వరకు మాతృత్వ మరణాలు సంభవిస్తున్నాయి. ఆ పరిస్థితే అప్పటి జిల్లా పాలనాధికారి మాణిక్యారాజ్‌ని ఆలోచింపచేసింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులతో చర్చించి ఎక్స్‌పెక్టెడ్ డేట్ ఆఫ్ డెలివరీ(ఈడీడీ) క్యాలెండర్‌ను రూపొందించాలనే నిర్ణయం తీసుకున్నారు.

ఇదెలా పనిచేస్తుందంటే...

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ ప్రసవానికి పేర్లను నమోదు చేసుకున్న గర్భిణులను బిడ్డ పుట్టేవరకూ కూడా పర్యవేక్షించడం దీని ఉద్దేశం...గర్భిణిగా పేరు నమోదైన తర్వాత ఆమె ఏ నెలలో ఏ పరీక్షలు చేయించుకోవాలో సూచించేలా వారి పేర్లతో పాటు ఫోన్ నంబర్లనూ ఆ క్యాలెండర్‌లో నమోదు చేస్తారు. దాని ఆధారంగా పీహెచ్‌సీలోని వైద్యులు, ఇతర సిబ్బంది ఆ తేదీన గర్భిణులు వచ్చారా లేదా అనేది పరిశీలించి రాని పక్షంలో ఫోన్ చేస్తారు. మళ్లీ ఎప్పుడు రావాలనే సమాచారాన్నీ అందిస్తారు. సుమారుగా ఏ తేదీన ప్రసవిస్తారనే విషయాన్ని అంచనా వేసి ఈడీడీ క్యాలెండర్‌ను సిద్ధం చేస్తారు. ఒకవేళ వారు ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లినా, వేరే జిల్లాలో ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు చేయించుకుంటున్నా కూడా ఆ వివరాలనూ పొందుపరుస్తున్నారు.

కాల్‌సెంటర్... ఇందుకోసం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనిద్వారా రోజూ రెండువందల మంది గర్భిణులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకుంటారు. ఈ క్యాలెండర్లలో తొలిసారి తల్లి కాబోతున్న వారి పేర్లను ఆకుపచ్చ రంగుతో ముద్రిస్తారు. వీరి ప్రాధాన్యం సహజ ప్రసవమే. పరీక్షల అనంతరం రక్తహీనతా, ఇతరత్రా సమస్యలున్నట్లు గుర్తిస్తే వారి పేర్లను ప్రత్యేకంగా నమోదు చేసుకుని చికిత్స అందిస్తారు. వారిని సమీపంలోని ఏరియా ఆస్పత్రి లేదా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తీసుకెళతారు. ఈ జాగ్రత్తలతో జూన్ నుంచి ఇప్పటి వరకు ఒక్క మాతృత్వమరణమూ చోటు చేసుకోలేదు. జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో జూన్ 2017 నుంచి ఇప్పటి వరకు 12 వేల పైచిలుకు ప్రసవాలు జరగ్గా... ఇందులో 75 శాతం సహజ ప్రసవాలే కావడం విశేషం. ఈ జిల్లాలో అనుసరిస్తున్న విధానాన్ని తెలుసుకునేందుకు రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచీ అధికారులు వచ్చి పరిశీలించి వెళుతున్నారు. తెలంగాణలోని మరో ఆరుజిల్లాల్లోనూ దీన్ని అమలు చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- రాజేందర్ సురకంటి, ఈనాడు, సంగారెడ్డి

ప్రేమ విషయం చెప్పడమే తప్పా!

? నాకు రెండేళ్ల క్రితం పెళ్లయ్యింది. పెళ్లికి ముందు మరో వ్యక్తిని ప్రేమించినప్పటికీ పెద్దలు ఒప్పుకోకపోవడంతో వేరే పెళ్లి చేసుకున్నా. పెళ్లికి ముందే నా ప్రేమ విషయం కాబోయే భర్తకి చెప్పాను. అప్పుడు ఆయన గతం మరిచిపో కొత్త జీవితంలో సంతోషంగా ఉందాం అన్నారు. నేనూ సంతోషించా. నాతో ప్రేమగానే ఉన్నప్పటికీ నేనెవరితో ఫోన్ మాట్లాడినా సరే! పాత ప్రేమికుడితోనే అనుకుంటారు. మాకో పాప పుట్టింది. అతనికి పుట్టలేదని బాధపడుతుంటారు. నేను తనని నిర్లక్ష్యం చేస్తున్నా అని అనుమానించి తరచూ ఆత్మహత్యాప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ మధ్య కూడా అలాంటి ప్రయత్నమే చేస్తే అత్తమామలకు తెలిసింది. నా పాత ప్రేమికుడితో కలిసి పారిపోవడానికి వాళ్లబ్బాయిపై హత్యాయత్నం చేశానని వాళ్లు నా మీద కేసుపెట్టారు. పెళ్లయ్యాక కనీసం నా పాత ప్రేమికుడి గురించి తెలుసుకునే ప్రయత్నం కూడా నేనెప్పుడూ చేయలేదు. అత్తింట్లోంచి గెంటేశారు. పుట్టింటివాళ్లు రానివ్వడం లేదు. ఇప్పుడు నన్ను నేను నిరూపించుకునేదెలా? మా వారితో తిరిగి కాపురం చేసేదెలా?

– ఓ సోదరి

✔ వివాహ బంధంలో పాత ప్రేమ తాలూకు జ్ఞాపకాలు ఎన్నో జీవితాల్ని చిన్నాభిన్నం చేస్తున్నాయి. మీ సమస్య గృహహింస చట్టం కిందకు వస్తుంది. మీ సమస్యను ప్రొటెక్షన్ ఆఫీసర్ ముందు పెట్టండి. మీ వారి మానసిక స్థితికి కౌన్సెలింగ్ అవసరం అవుతుంది. ప్రేమించిన వాడిని పెళ్లి చేసుకోలేకపోవడం, పెళ్లి చేసుకున్నవాడి మీద ప్రేమ చూపిస్తున్నా అతను నమ్మలేకపోవడం రెండు విధాలా మీరు దెబ్బతిన్నారు. కానీ మనోధైర్యం కోల్పోకండి. జరిగిన సంఘటనల్ని బట్టి చూస్తే మిమ్మల్ని మీరు నిరూపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. మీరు ప్రేమించిన వాడితో ఎటువంటి సంబంధాలు పెట్టుకోలేదని ఆధారాలు చూపించాల్సి వస్తుంది. మీ మాటల్ని నమ్మే పరిస్థితి లేదు కాబట్టి మీ పాత ప్రేమికుడి తరఫు నుంచి ఎవరైనా మీ ఇరుకుటుంబాలకూ సాక్ష్యంగా నిలబడితే మీ సమస్య చక్కబడొచ్చు. నిజానికి కాపురాన్ని నిలబెట్టాల్సిన ఇరుకుటుంబాల పెద్దలూ నిజనిర్ధారణ చేయకుండానే మీదే తప్పు అని చెప్పడం వల్ల అతని అనుమానానికి బలం చేకూరుతుంది. మీ వారితో పాటు అవసరమైతే మీ ఇరుకుటుంబ సభ్యులకూ కూడా కౌన్సెలింగ్ చేయడం వల్ల వారికి వాస్తవ పరిస్థితి అర్థమవ్వొచ్చు. ఇక మీ అత్తమామలు మీపై పెట్టిన కేసులో మీరు నిరూపించుకోవాలంటే కొన్ని ఆధారాలు కావాలి. దానికి మీ ఫోన్ కాల్ డేటా, మీ వారి మానసిక స్థితికి సంబంధించిన వైద్యనివేదికలు సాయపడొచ్చు. మీ అత్తింట్లో ఉండటానికి గృహహింస చట్టం ద్వారా షేర్డ్ హౌస్‌హోల్డ్ కొరకు ప్రయత్నించండి. విడాకులు తీసుకోలేదు కాబట్టి మీ అత్తగారింట్లో తలదాచుకోవడానికి ఈ చట్టం ఉపయోగపడుతుంది. లేదా గృహహింస చట్టంలో ఆధారం లేని స్త్రీకి ఆధారం కల్పించాల్సిన బాధ్యత ప్రొటెక్షన్ ఆఫీసర్‌లకు ఉంది. ఏదైనా షెల్టర్‌హోమ్‌లో మీకు ఆశ్రయం చూపించాలి. మీ వారు మీతో కాపురం చేయడానికి సెక్షన్ 9 హిందూ వివాహచట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ ఆఫ్ కజుంగల్ రైట్స్ కింద కుటుంబన్యాయస్థానంలో కేసువేసుకోవచ్చు. అన్ని సమస్యలకీ పరిష్కారం అందరికీ మీ మీద ఏర్పడిన అపోహలు తొలగిపోవడమే ప్రధానమని మరిచిపోవద్దు.

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

– మీ సందేహాలను, సమస్యల్ని vasulegal@eenadu.net కు పంపించగలరు.

దివ్యాంగుల్లో 'వెలుగు' నింపిన జుబేదా

వారంతా దివ్యాంగులు... ఎవరిపైనా ఆధారపడకుండా స్వయంసమృద్ధి సాధించడమే వాళ్ల ధ్యేయం. అందుకే సౌరదీపాలను తయారు చేసి ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తున్నారు. దాదాపు నాలుగు జిల్లాల్లోని పలువురు దివ్యాంగులు ఈ ఉపాధితో మేలు పొందుతున్నారు. ఇదంతా ఎలా సాధ్యమైందంటే వారి చెప్పే పేరు జుబేదా. ఇంతకీ ఎవరీ జుబేదా... ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.



దివ్యాంగులు... ఈ పదం ఇప్పుడిప్పుడు వినిపిస్తోంది. ఒకప్పుడు వికలాంగులు అంటూ చాలామంది అవకరాలు ఉన్నవాళ్లని చులకన చేసి మాట్లాడేవారు. జుబేదా అలాంటివెన్నో తట్టుకుని ఇక్కడివరకూ వచ్చింది. అందుకే తనలాంటివారికి దారి చూపించగలుగుతోంది. ఇంతకీ ఆమె సౌరదీపాల తయారీ ఎందుకు నేర్చుకోవాల్సి వచ్చిందంటే..

జుబేదాది సంగారెడ్డి జిల్లా కంది. ఐదుగురు సంతానంలో జుబేదా నాలుగో అమ్మాయి. అయితే కుడికాలికి పోలియో. తండ్రి భవన నిర్మాణ కార్మికుడు. నిరుపేద కుటుంబం నేపథ్యం. ఆమెకు పోలియో ఉండటంతో బంధువులు ఎవరూ వాళ్ల ఇంటికి కూడా వచ్చేవారు కాదట. చాలా చిన్న చూపు చూసేవారు. కాళ్లు సరిగా లేని పిల్లకు పెళ్లి ఎలా అవుతుంది అంటూ మాట్లాడేవారు. అయినా అవేమీ పట్టించుకోలేదు జుబేదా. ఎందుకు ఇలా మాట్లాడతారో అని బాధపడేది. పదేళ్ల వయసులో బడికి వెళ్లడం మొదలుపెట్టింది. ఎలాగైనా మంచిగా బతకాలి, తండ్రి కష్టాలు తీర్చాలని ఆలోచించేది. అందుకే చదువుకుంటూనే టైలరింగ్ నేర్చుకుంది. తరవాత కుట్టు పనిచేస్తూ కుటుంబానికి అండగా ఉండేది. పదో తరగతి అయ్యాక అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా డిగ్రీ పూర్తి చేసింది.

ఏడాది కష్టపడితే బూత్: కుట్టుపనితో వచ్చే డబ్బులు అంతంత మాత్రమే. ఇంకేదైనా ఉపాధి ఉంటే బాగుంటుందనుకుంది. అందుకే టెలీఫోన్ డబ్బా పెట్టుకుందామని దరఖాస్తు చేసుకుంది. . ఆ సమయంలో ఎంతో మంది విమర్శించారు. అయినా సరే ఏడాది కష్టపడ్డాక ఎస్టీడీ ఫోన్ బూత్ పెట్టుకునే అవకాశం ఆమెకు వచ్చింది. కానీ అది తనకి సంతోషానివ్వలేదు. తనలాంటి వారిలో చైతన్యం తేవాలనుకుంది. ఒకవైపు బూత్‌ని చూసుకుంటూనే దివ్యాంగులకు చేయూతనిచ్చే ఓ స్వచ్ఛంద సంస్థలో చేరింది. దీని ద్వారా గ్రామాల్లోకి వెళ్లి దివ్యాంగులకి వారి హక్కులు తెలియజేస్తూ సంఘాలనూ ఏర్పాటు చేసింది.

300 మందికి ఇళ్లు: దివ్యాంగులకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలంటూ ప్రభుత్వంతో నాలుగేళ్లు పోరాడింది. ఆమె పోరాటంతో మూడు వందల మందికి ఇళ్ల స్థలాలు మంజూరయ్యాయి.. వారికోసం ఓ కమ్యూనిటీ హాలునీ నిర్మించారు. అయితే జుబేదా ఈ ఒక్క ఎన్జీఓకే పరిమితం కాలేదు. వేర్వేరు సంస్థల ద్వారా వంద మందికి ఉపాధి కల్పించింది. ఆమె సేవకు గుర్తింపుగా ఎన్నో అవార్డులు వచ్చాయి. అయినప్పటికీ ఆమె సంతృప్తి పడలేదు. 'అంతా బాగానే ఉంది కానీ బయటకు వచ్చి చురుగ్గా ఉండే వారికి ఉపాధిని ఇప్పించగలిగా. మరి అంత సులువుగా కదల్లేని వారి పరిస్థితి ఏంటీ... అని ఆలోచించా. అలాంటి వారికి ఏదైనా మార్గం చూపించమని అప్పటి కలెక్టర్‌ని అడిగా. ఆయన ఎన్ఐఆర్‌డీ వాళ్లతో మాట్లాడి మాకు సోలార్ విద్యుత్ దీపాల తయారీని నేర్పించేలా చూశారు. దాదాపు మేం అక్కడ పది రకాల సోలార్ బల్బుల తయారీని నేర్చుకున్నాం. అదయ్యాక 2016లో దివ్యాంగుల సోలార్ సొసైటీని సంగారెడ్డిలో ఏర్పాటు చేశా. దివ్యాంగ్ పేరుతో సోలార్ లైట్లను ఉత్పత్తి చేయడం మొదలుపెట్టాం. దీనికి మొదట్లో.. కలెక్టర్ సర్, ప్రభుత్వం నుంచి సాయం అందింది. ప్రస్తుతం నా దగ్గర యాభై మందికిపైనే దివ్యాంగులు ఉపాధి పొందుతున్నారు. ఒక్కొక్కరికి నెలకు మూడు వేల రూపాయలు ఇస్తున్నా. మరింత మందికి ఇలాంటి ఫలాలు అందాలనే ఉద్దేశంలో మహబూబ్‌నగర్, జనగామ, కామారెడ్డిలోనూ సోలార్ సొసైటీని ఏర్పాటుచేశా. ఈ సోలార్ సొసైటీ వల్ల దాదాపు మూడొందల మంది ఉపాధి పొందుతున్నారు. మేం ఈ లైట్లని ప్రభుత్వ కార్యాలయాలకు తీసుకెళ్లి అమ్ముతుంటాం. కొందరు మా గురించి తెలుసుకుని మా దగ్గరకే వచ్చి ఆర్డర్లు ఇస్తారు. ఇంకా మరిన్ని ప్రాంతాల్లోని వారికి సోలార్ లైట్ల తయారీ నేర్పించి వారినీ ఆదాయంబాట పట్టించాలన్నదే నా లక్ష్యం'. .అని చెబుతుంది జుబేదా.

నజరానా

టాయిలెట్ కమోడ్ రంగు మారితే గడువుతేదీ దాటిన శీతలపానీయంతో కడిగిచూడండి.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

తెలంగాణ పోస్టల్ సర్కిల్‌లో 1058 ఖాళీలు

పోస్టు: గ్రామీణ్ డాక్ సేవక్ (జీడీఎస్)

ఖాళీలు: 1058 **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణత, కంప్యూటర్ పరిజ్ఞానం. **వయసు:** 18-40 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: అకడమిక్ ప్రతిభ ఆధారంగా

దరఖాస్తు ఫీజు: రూ.100 (ఎస్సీ, ఎస్టీలు; దివ్యాంగులు, మహిళలు ఫీజు చెల్లించనవసరం లేదు) **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది:** 09.04.2018

వెబ్‌సైట్: www.appost.in/gdsonline/

బీఈసీఐఎల్, నోయిడాలో 131 పోస్టులు

సంస్థ: భారత సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్), నోయిడా.

పోస్టులు: పేషెంట్ కేర్ మేనేజర్ (పీసీఎం)-35, పేషెంట్ కేర్ కోఆర్డినేటర్ (పీసీసీ)-96

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, అనుభవం. **వయసు:** 40 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక: బీఈసీఐఎల్ నిబంధనల ప్రకారం.

దరఖాస్తు: ఆఫ్‌లైన్ **చివరితేది:** 09.04.2018

వెబ్‌సైట్: www.becil.com/vacancies

కేంద్రీయ విద్యాలయం, ఎద్దుమైలారం

పాఠశాల: కేంద్రీయ విద్యాలయం, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, ఎద్దుమైలారం, మెదక్ జిల్లా.

పోస్టులు: టీచింగ్, నాన్ టీచింగ్ **ఖాళీలు:** 22

అర్హత, వయసు: స్కూలు నిబంధనల ప్రకారం.

ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా.

దరఖాస్తు: పోస్టులో పంపాలి లేదా నేరుగా స్కూలులో అందజేయవచ్చు.

చివరితేది: స్కూలులో అందజేయడానికి 10.03.2018, పోస్టు ద్వారా పంపడానికి 15.03.2018.

వెబ్‌సైట్: www.kvemailaram.edu.in

ప్రవేశాలు

టీఎస్ పాలిసెట్ - 2018

తెలంగాణ రాష్ట్రంలోని పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికిగానూ డిప్లొమా కోర్సుల ప్రవేశానికి నిర్వహించే పరీక్ష.

కోర్సు: ఇంజినీరింగ్ డిప్లొమా

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత.

ఎంపిక: ప్రవేశపరీక్ష (పాలిసెట్) ద్వారా.

పాలిసెట్ తేది: 21.04.2018

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 14.03.2018 నుంచి 11.04.2018 వరకు

వెబ్‌సైట్: https://polycetts.nic.in/

నేషనల్ షుగర్ ఇన్‌స్టిట్యూట్, కాన్పూర్

కోర్సులు: ఫెలోషిప్, పీజీ డిప్లొమా, సర్టిఫికెట్

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, ఇంటర్మీడియట్, పదోతరగతి.

ఎంపిక: ప్రవేశపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా.

ప్రవేశపరీక్ష తేది: 10.06.2018

పరీక్షా కేంద్రాలు: పుణె, చెన్నై, దిల్లీ, కాన్పూర్, కోల్‌కతా, పట్నా.

దరఖాస్తు: ఆఫ్‌లైన్/ ఆన్‌లైన్.

దరఖాస్తు ఫీజు: రూ.1200

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: 19.03.2018

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేది: 04.05.2018

హార్డ్ కాపీలను పంపడానికి చివరితేది: 14.05.2018

వెబ్‌సైట్: http://nsi.gov.in/

వాక్ ఇన్ ఇంటర్వ్యూ

దిల్లీ ఐఐటీలో జేఆర్ఎఫ్ ఖాళీలు

సంస్థ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ దిల్లీలో జేఆర్ఎఫ్ ఖాళీలకు ఇంటర్వ్యూలు

ఖాళీలు: 02.

అర్హత: పీజీ(పాలిమర్ సైన్స్/ ఫైబర్ సైన్స్/ రబ్బర్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ కెమిస్ట్రీ/ పాలిమర్ నానో టెక్నాలజీ) ఉత్తీర్ణత.

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.

ఇంటర్వ్యూ తేది: 19.03.2018.

వేదిక: కాన్ఫరెన్స్ రూం, దిల్లీ ఐఐటీ, న్యూ దిల్లీ.

వెబ్‌సైట్: www.iitd.ac.in

ఐఐడబ్ల్యూఎం, భువనేశ్వర్

సంస్థ: ఐకార్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వాటర్ మేనేజ్‌మెంట్ (ఐఐడబ్ల్యూఎం), భువనేశ్వర్.

పోస్టు: సీనియర్ రిసెర్చ్ ఫెలో (ఎస్ఆర్ఎఫ్)

ఖాళీలు: 04

అర్హత: సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, నెట్, పీహెచ్‌డీ, అనుభవం.

వయసు: 35 ఏళ్లకు మించకూడదు.

ఇంటర్వ్యూ తేది: 2018, మార్చి 13, 14.

వేదిక: ఐకార్-ఐఐడబ్ల్యూఎం, భువనేశ్వర్.

వెబ్‌సైట్: http://www.iiwm.res.in/

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.

డిగ్రీ కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల అర్హత పరీక్ష కోసం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సెట్ ప్రకటనలు వెలువడ్డాయి. ఇప్పటికే జాతీయస్థాయి అర్హత పరీక్ష (నెట్) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. ఇదే సమయంలో ఈ సెట్ ప్రకటనలు రావటం వల్ల ఒకే సన్నద్ధతతో మూడు పరీక్షలు రాసుకొనే అవకాశం వచ్చింది. పి.జి. పూర్తిచేసిన, ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాస్తున్న తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు ఇది సంతోషదాయకం!



పరీక్షలు మూడు.. ప్రిపరేషన్ ఒకటే!

మాతృభాషలో పరీక్ష రాసుకునే బృహత్తర అవకాశం స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) ద్వారా కలుగుతోంది. యూజీసీ- సీఎస్ఐఆర్, యూజీసీ-నెట్ ఆంగ్లం, హిందీ మాధ్యమాల్లో మాత్రమే రాసుకునే అవకాశం (భాషా పేపర్లు తప్ప) ఉంటుంది. కానీ సెట్‌లో చాలా పేపర్లు ఆంగ్ల మాధ్యమంతోపాటు తెలుగు మాధ్యమంలోనూ ప్రశ్నపత్రాలుంటాయి. అందువల్ల యూజీసీ-సీఎస్ఐఆర్, యూజీసీ-నెట్ పరీక్షల్లోని భాషా అవరోధాలను అధిగమించి మంచి ఫలితాలు పొందే అవకాశముంది.



డాక్టర్ వి. బ్రహ్మం

ఏ పరీక్ష ఎప్పుడు? ఎలా?

టీఎస్ సెట్– 2018

తెలంగాణలో టీఎస్ సెట్‌ను ఉస్మానియా విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది. అర్హతగల అభ్యర్థులు తమ సన్నద్ధతను వెంటనే ప్రారంభించడం శ్రేయస్కరం. **దరఖాస్తు స్వీకరణ ఆన్‌లైన్‌లో:** 14.3.2018 నుంచి 14.4.2018 వరకు.

పరీక్ష తేది: 15.07.2018

గమనిక: రూ.3000 ఆలస్య రుసుముతో 15.5.2018 లోపు దరఖాస్తు చేసుకొనేవారు హైదరాబాద్ కేంద్రాల్లో మాత్రమే పరీక్ష రాయాల్సి ఉంటుంది.

ఏపీసెట్– 2018

ఆంధ్రప్రదేశ్‌లో ఏపీసెట్- 2018ను ఆంధ్ర విశ్వవిద్యాలయం నిర్వహిస్తోంది. పూర్తిస్థాయి ప్రకటన మార్చిలో విడుదలవుతుంది. ప్రాథమిక సమాచారం మేరకు...

ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ: 26.03.18 నుంచి 02.05.18 వరకు. **పరీక్ష తేది:** 01.07.2018

అర్హతలు

- సంబంధిత సబ్జెక్టులో పోస్టుగ్రాడ్యుయేషన్ లేదా తత్సమాన అర్హత కల్గిన డిగ్రీ ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సరం పీజీ పరీక్షలు రాసేవారూ దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే పరీక్ష ఫలితాల అనంతరం పీజీ ఉత్తీర్ణత సర్టిఫికెట్‌ను సెట్ కార్యాలయంలో సమర్పించి, ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.
- జనరల్ అభ్యర్థులకు పీజీ డిగ్రీలో సంబంధిత సబ్జెక్టులో 55%, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు (పీడబ్ల్యూడీ)-50% మార్కులతో ఉత్తీర్ణత తప్పనిసరి.

ఎలా చదవాలి?

గతంలో 3 పేపర్లు ఉండేవి. యూజీసీ నెట్‌లో మారిన పరీక్ష విధానంలా, సెట్‌లోనూ ప్రస్తుతం 2 పేపర్లు మాత్రమే ఉంటాయి. పేపర్-1 అభ్యర్థులందరికీ ఒకేలా, పేపర్-2 వారు ఎంచుకున్న సబ్జెక్టులో ఉంటుంది. పరీక్ష సమయాన్ని చాలా తగ్గించారు. సబ్జెక్టులోని కాన్సెప్టుల్లో సామర్థ్యాన్ని పెంచుకునేలా కృషిచేస్తూనే నిర్ణీత సమయంలో అన్ని ప్రశ్నలకూ సరైన సమాధానాలు రాయాలి. ఈ ప్రకారం అభ్యర్థులు అభ్యాసం, ఆచరణ చేపట్టాలి.

సన్నద్ధతకు కింది అంశాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుంది.



- నిర్దేశించిన సిలబస్‌ను పూర్తిగా అభ్యసించాలి.
- గత సంవత్సరాల నెట్, సెట్ ప్రశ్నపత్రాలను విశ్లేషణ చేయాలి. ముఖ్యమైన అంశాలను ప్రాధాన్య క్రమంలో గుర్తించి స్టడీ మెటీరియల్/నోట్స్ తయారు చేసుకోవాలి.
- వీలైనంతవరకు షార్ట్‌కట్‌లను తయారు చేసుకోవాలి.
- ప్రామాణిక పుస్తకాలు, మెటీరియల్ ఆధారంగా సొంతంగా నోట్స్ తయారు చేసుకోవాలి.
- ప్రతిరోజూ అంశాలను అభ్యాసం చేయడంతోపాటు, పునశ్చరణనూ చేయాలి.
- స్వీయ విశ్లేషణ చేసుకొని, పొరపాట్లు సరిదిద్దుకోవాలి.
- కఠినమైన అంశాల అవగాహనకు స్నేహితులనూ, అధ్యాపకులనూ సంప్రదించాలి.
- సమయపాలన చాలా ప్రధానం. నిర్ణీత సమయంలో అన్ని ప్రశ్నలకూ సమాధానాలు రాసేలా సాధన చేయాలి.
- ఆత్మవిశ్వాసం, ప్రేరణ తుదివరకూ కొనసాగించాలి.
- పరీక్షలో సహజంగానే కొంత ఆందోళన, ఒత్తిడి వుంటుంది. సరైన ప్రణాళిక, అభ్యాసం, ఆచరణతో ఉత్తమ ఫలితాలు సొంతమవుతాయి.

ఎన్ని పేపర్లు?

స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్‌లో పేపర్-1, పేపర్-2 అనే రెండు పేపర్లను అభ్యర్థులు రాయాల్సి ఉంటుంది.

✦ **పేపర్–1:** జనరల్ పేపర్ (టీచింగ్ & రిసెర్చ్ ఆప్టిట్యూడ్) 50 ప్రశ్నలు 100 మార్కులు

✦ **పేపర్–2:** పీజీ స్థాయిలో అభ్యర్థులు ఎంచుకొన్న సబ్జెక్టు 100 ప్రశ్నలు 200 మార్కులు

- గరిష్ఠ వయఃపరిమితి లేదు.
- ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయవలసి ఉంటుంది.
- **పూర్తి సమాచారానికి.. టీఎస్ సెట్:** www.telanganaset.org లేదా www.osmania.ac.in

ఏపీ సెట్: apset.net.in లేదా andhrauniversity.edu.in వెబ్‌సైట్లు చూడొచ్చు.

సిలబస్

పేపర్-1 అందరికీ ఒకేలా ఉంటుంది. ఇందులో ప్రధానంగా అభ్యర్థుల బోధనా, పరిశోధనాంశాల్లో జ్ఞానం, అవగాహన సామర్థ్యాలను మదింపు చేస్తారు. జ్ఞానాత్మక సామర్థ్యాలు, అవగాహన, విశ్లేషణ, మూల్యాంకనం, ఆగమన, నిగమన, తార్కిక వివేచనలు, సహజ వనరులు, పర్యావరణ అంశాలపై సాధారణ పరిజ్ఞానం, ఆధునిక జీవన విధానంపై వీటి ప్రభావం మొదలైన అంశాలపై లోతైన అవగాహన అవసరం.

పేపర్-1లో ముఖ్యమైన ప్రతి అంశం నుంచీ ప్రశ్నలు అడిగే అవకాశముంది. ప్రధానంగా 10 విభాగాలున్నాయి. ప్రతి విభాగం నుంచి ప్రశ్నలు అడిగే ఆస్కారమున్న కాన్సెప్టులను ఎంచుకుని సన్నద్ధమవటం మేలు.

1) బోధనాభిరుచి (టీచింగ్ ఆప్టిట్యూడ్) 2) పరిశోధనాభిరుచి (రిసెర్చ్ ఆప్టిట్యూడ్) 3) పఠనావగాహన (రీడింగ్ కాంప్రహెన్షన్) 4) సంభాషణ (కమ్యూనికేషన్) 5) గణిత వివేచన (మేథమేటికల్ రీజనింగ్) 6) తార్కిక వివేచన (లాజికల్ రీజనింగ్) 7) దత్తాంశ వ్యాఖ్యానం (డేటా ఇంటర్‌ప్రిటేషన్) 8) ఐ.సి.టి. (ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ) 9) ప్రజలు - పర్యావరణం (పీపుల్-ఎన్విరాన్‌మెంట్) 10) ఉన్నత విద్యావ్యవస్థలో సుపరిపాలన (హయ్యర్ ఎడ్యుకేషన్ సిస్టమ్- గవర్నెన్స్)

పై విభాగాల్లో బోధనా స్వభావం, లక్ష్యాలు, లక్షణాలు, బోధనా పద్ధతులు, మూల్యాంకనం, పరిశోధన-స్వభావం, సోపానాలు, పద్ధతులు, విలువలు, పరిశోధన వ్యాసం-లక్షణాలు, కమ్యూనికేషన్ లక్షణాలు, రకాలు, అవరోధాలు, తార్కిక వివేచనలు, ఇంటర్నెట్, ఈ-మెయిల్, ఐసీటీ లాభాలు, నష్టాలు; పర్యావరణం, కాలుష్యం, మానవ జీవనంపై వాటి ప్రభావం, ఉన్నత విద్యాసంస్థల నిర్మాణం, నియత, దూరవిద్య, వృత్తి, సాంకేతిక విద్య, సాధారణ విద్య, విలువల విద్య, పరిపాలన మొదలైన అంశాలను విస్తృతంగా అధ్యయనం చేయవలసి ఉంటుంది.

✦ సెట్ ఉత్తీర్ణత పొంది, అర్హులైనవారు ఆయా రాష్ట్రాల్లో మాత్రమే డిగ్రీ కళాశాలలు, యూనివర్సిటీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు అర్హులు.

✦ యూజీసీ సీఎస్ఐఆర్, యూజీసీ నెట్ ఉత్తీర్ణత పొంది, క్వాలిఫై అయినవారు దేశంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు అర్హులు.

✦ ఒకటి కంటే ఎక్కువ పీజీ కోర్సుల్లో ఉత్తీర్ణత పొందినవారు, తమకు ఎక్కువ ప్రతిభ ఉన్నదాంట్లో నెట్/సెట్ రాయడం మంచిది. ఒకే నెలలో (జులై) పరీక్షలు ఉన్నందున ఇష్టపడి కృషి చేస్తే .. విజయం తథ్యం!

నవోదయల్లో తొమ్మిదిలోకి ఎంట్రీ

ఉత్తమ పాఠశాల విద్యను ఉచితంగా అందించే విద్యాలయాలుగా జవహర్ నవోదయలు దేశవ్యాప్త ఖ్యాతి గడించాయి. వీటిలో ప్రవేశం లభిస్తే విద్యార్థులు నిశ్చింతగా చదువుకోవడమే కాకుండా వారిలోని ప్రతిభ, సృజనాత్మకతలకు మరింత మెరుగులద్దవచ్చు. సీబీఎస్ఈ సిలబస్‌లో బోధిస్తారు. వసతి, భోజనం మొదలైనవన్నీ ఉంటాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఉన్న ఖాళీ సీట్ల భర్తీకి నవోదయ విద్యాసమితి ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాలు చూద్దాం...


ప్రశ్నపత్రం ఇలా...

వంద మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో ఇంగ్లిష్ నుంచి 15, హిందీ నుంచి 15, మ్యాథ్స్ నుంచి 35, సైన్స్ నుంచి 35 మార్కులకు ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నలన్నీ ఎనిమిదో తరగతి స్థాయిలో ఉంటాయి. పరీక్ష వ్యవధి రెండున్నర గంటలు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం ఇంగ్లిష్/ హిందీ మాధ్యమాల్లో ఉంటుంది.

దేశవ్యాప్తంగా (తమిళనాడు తప్ప) దాదాపు ప్రతి జిల్లాలోనూ ఈ విద్యాసంస్థలను నెలకొల్పారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు ఇక్కడ విద్య అందిస్తారు. నిధులన్నీ పూర్తిగా కేంద్రమే భరిస్తుంది. కేంద్ర మానవ వనరుల శాఖ ఆధ్వర్యంలో నవోదయ విద్యా సమితి పనిచేస్తుంది. ఆరో తరగతిలో చేరిన విద్యార్థులు మధ్యలో వైదొలిగితే ఆ ఖాళీలను తొమ్మిదో తరగతిలో భర్తీ చేస్తారు. ఇందుకోసం ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు లేటరల్ ఎంట్రీ విధానంలో ప్రవేశపరీక్ష రాసుకోవచ్చు.

నవోదయల్లో కో ఎడ్యుకేషన్ విధానం అమలులో ఉంది. ఒకే తరగతి గదిలో విద్యార్థులు చదువుకుంటారు. బాలబాలికలకు వేర్వేరుగా వసతి సౌకర్యాలు కల్పిస్తారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతోపాటు దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న విద్యార్థినీవిద్యార్థులకు బోధనతోపాటు వసతి, భోజనం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అన్నీ ఉచితంగానే అందిస్తారు. ప్రభుత్వోద్యోగుల పిల్లలైతే ఇందుకోసం ప్రతి నెలా రూ.1500 చొప్పున చెల్లించాలి. మిగిలినవారు ప్రతినెలా రూ.600 చెల్లిస్తే సరిపోతుంది.

నాణ్యమైన ఆధునిక విద్యను అందించడం నవోదయ విద్యాలయాల ప్రత్యేకత. చదువులకే పరిమితం కాకుండా విద్యార్థులకు పరిసరాలపై అవగాహన కల్పిస్తారు. సంస్కృతి, విలువలు పెంపొందేలా చేస్తారు. ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు



ప్రాధాన్యం ఉంటుంది. అలాగే ప్రతి విద్యార్థీ మూడు భాషల్లో రాణించేలా కృషి చేస్తారు. ఇందుకోసం హిందీ రాష్ట్రాల్లో చదువుతున్న విద్యార్థులను ఇతర రాష్ట్రాలకు అలాగే ఇతరులను హిందీ రాష్ట్రాలకు పంపుతారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 626 నవోదయలు ఉన్నాయి. వీటిలో చేరినవారు ప్లస్ 2 (ఇంటర్మీడియట్) వరకు చదువుకోవచ్చు.

ఖాళీల వివరాలు

ఆంధ్రప్రదేశ్‌లో: చిత్తూరు-9, తూర్పు గోదావరి -11, పశ్చిమ గోదావరి- 8, గుంటూరు- 13, కడప-7, కృష్ణా-9, కర్నూలు-2, నెల్లూరు-6, ప్రకాశం-12, శ్రీకాకుళం-3, విశాఖపట్నం-4, విజయనగరం-5

తెలంగాణలో: ఆదిలాబాద్- 2, కరీంనగర్- 7, ఖమ్మం-7, మహబూబ్ నగర్-7, మెదక్ -6, నల్గొండ-6, నిజామాబాద్-9, రంగారెడ్డి-5, వరంగల్-2.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: ఏప్రిల్ 5

పరీక్ష తేదీ: మే 19 (శనివారం). నవోదయ విద్యా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తారు.


వెబ్‌సైట్: http://nvshq.org

Q&A

పెట్రో ఇంజినీరింగ్‌కు ఏ అర్హతలు?

పెట్రోలియం ఇంజినీరింగ్ చేయాలనుంది. మనదేశంలో దీనికున్న అవకాశాలేంటి? - *సుమంత్ నాయుడు*

జ: పెట్రోలియం ఇంజినీరింగ్ చేయాలనుకునేవారు 10+2లో మేథ్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్ చదివుండాలి. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ద్వారా ఐఐటీ ఖరగ్‌పూర్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ- విశాఖపట్నం, రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ-అమేథి, యూనివర్సిటీ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ స్టడీస్, ఐఐటీ- బాంబే, ఐఐటీ- ధన్‌బాద్ వంటి ప్రముఖ విద్యాలయాల్లో బీటెక్ (పెట్రోలియం ఇంజినీరింగ్) కోర్సులో ప్రవేశాన్ని పొందవచ్చు. వీరికి డ్రిల్లింగ్ ఇంజినీర్, ప్రొడక్షన్ ఇంజినీర్, రిజర్వాయర్ ఇంజినీర్, ఆఫ్ షోర్ డ్రిల్లింగ్ ఇంజినీర్ వంటి ఉద్యోగావకాశాలుంటాయి. ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు ఆయిల్ సంస్థలైన ఓఎన్‌జీసీ, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, రిలయన్స్ పెట్రోలియం ఎస్సార్ ఆయిల్ వంటి ప్రముఖ ఆయిల్ సంస్థలు మంచి వేతనంతో కూడిన ఉద్యోగావకాశాలను కల్పిస్తున్నాయి.




ఏం నేర్చుకుంటే మేలు?

నా తమ్ముడు బీటెక్ (సీఎస్ఈ) 2015లో పూర్తిచేశాడు. తరువాత ఐబీఎంలో ఏడాదిపాటు మాన్యువల్ టెస్టర్‌గా పనిచేసి, మానేశాడు. ప్రస్తుతం సెలెనియం కోర్సును నేర్చుకుంటున్నాడు. దీంతోపాటు ఏం నేర్చుకుంటే అతని భవిష్యత్తు బాగుంటుంది? - *కె. కులదీప్*


జ: ఆటోమేటెడ్ టెస్టింగ్ టూల్స్ రాకతో మాన్యువల్ టెస్టింగ్ నిపుణులకు అవకాశాలు తగ్గాయి. దీంతో మాన్యువల్ టెస్టర్స్ ప్రసిద్ధ ఆటోమేటెడ్ టెస్టింగ్ టూల్ అయిన సెలెనియాన్ని నేర్చుకుంటున్నారు. వెబ్ బేస్‌డ్ అప్లికేషన్ టెస్టింగ్‌కు సెలెనియం ఉపయోగకరం. టెస్టింగ్ రంగంలో విజయం సాధించాలనుకునేవారు సెలెనియం టూల్‌తోపాటు జావా బేసిక్స్‌పై పట్టు సాధించాలి. క్వాలిటీ అస్యూరెన్స్ (క్యూఏ)పై మంచి అవగాహన ఉండాలి. ఐఓఎస్/ ఆండ్రాయిడ్ అప్లికేషన్స్ టెస్టింగ్ కోసం ఉపయోగపడే ఏపీపీఐయూఎం టూల్‌ను నేర్చుకుంటే తమ ఉద్యోగావకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

- ప్రొ.బి. రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



పిల్లల పదో తరగతి చదువు పూర్తవుతుందంటే.. తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. కార్పొరేట్ జూనియర్ కళాశాలలు ఫీజుల పేరిట రెండేళ్లపాటు ఒక్కో విద్యార్థి నుంచి లక్షల్లో సొమ్ములు పిండేస్తున్నాయి. రుసుములపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో యాజమాన్యాలు ఎంత చెబితే అంత కిక్కురుమనకుండా చెల్లించడం తప్పనిసరయిపోయింది. రాష్ట్రంలో కార్పొరేట్ కళాశాలల విద్యా వ్యాపారం రూ.3 వేల కోట్లు దాటుతోందంటే రుసుముల పేరిట ఎంత దోపిడీ జరుగుతుందో అర్థమవుతోంది. కొన్ని చోట్ల ఏడాదికి రూ.3 లక్షల వరకు ఫీజులు వసూలు చేయడం యాజమాన్యాల బరితెగింపును కళ్లకు కడుతోంది. పర్యవేక్షించాల్సిన ఇంటర్ బోర్డు.. కార్పొరేట్ కళాశాల యాజమాన్యాల చేతుల్లో కీలుబొమ్మగా మారిందన్న విమర్శ యాజమాన్యాల పెత్తనం ఏ స్థాయిలో ఉందో చెబుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా చేష్టలుడిగి చూస్తుండడం పరిస్థితిని మరింత క్లిష్టంగా మారుస్తోంది. పదో తరగతి పరీక్షలు ఇంకా ప్రారంభమే కాలేదు.. అప్పుడే కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల ప్రవేశాలకు వాలిపోతున్నాయి. పాఠశాలల నుంచి విద్యార్థుల ఫోన్ నెంబర్లను సేకరిస్తున్న పీఆర్వోలు విద్యార్థుల ఇళ్లకు వెళ్లడం, ఫోన్లలో సంప్రదింపులు మొదలుపెట్టేశారు. ఇప్పుడు సీటు బుక్ చేసుకుంటే రుసుములు తగ్గిస్తామని, నెల తర్వాత వస్తే సీట్లే ఉండవంటూ విద్యార్థుల తల్లిదండ్రులను హైరానా పెడుతున్నారు. పదో తరగతి పరీక్షలు ఈ నెల 15 నుంచి ప్రారంభమవుతున్నాయి.. త్వరలో ప్రవేశాలకు ఇంటర్ బోర్డు కాలపట్టిక జారీ చేయబోతోంది. ఈ నేపథ్యంలో కార్పొరేట్ కళాశాలల్లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న రుసుములు, రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీనతపై 'ఈనాడు' ప్రత్యేక కథనం.

ఫీజులు పిండేస్తున్నారు..



కార్పొ'రేటు' కళాశాలల దందా
ఏటా రూ.3 వేల కోట్లకు పైగా వ్యాపారం

ఈనాడు - హైదరాబాద్

తెలంగాణలోని కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ కొనసాగుతూనే ఉంది. ఈ కళాశాలలు అత్యధికం హైదరాబాద్, చుట్టుపక్కలే ఉన్నాయి. రాష్ట్రంలో అయిదారు కార్పొరేట్ గ్రూపు సంస్థలున్నాయి. వాటిల్లో రెండు గ్రూపులదే హవా. అవి ఒక్కో కళాశాలలకు ఒక్కో పేరు పెడతాయి. అందులో ఏసీ, నాన్-ఏసీ రెసిడెన్షియల్, సెమీ రెసిడెన్షియల్, డే స్కాలర్.. ఇలా రకరకాల బ్యాచ్‌లు. ఒక్కో బ్యాచ్‌కు ఒక్కో రుసుము. ఐపీఎల్, నియాన్, నియాన్ ఐసీ, సూపర్ 60, ఎయిమ్స్ సూపర్ 60, ఐకాన్ తదితర ఎన్నో పేర్లు పెడుతున్నారు. ఒక్కో దానికి ఒక్కో ప్రత్యేకత చెబుతారు. ఇంటర్+ ఎంసెట్, ఇంటర్+ జేఈఈ మెయిన్ (ఎన్ఐటీ), ఇంటర్+ జేఈఈ అడ్వాన్స్‌డ్ (ఐఐటీ), ఇక బైపీసీ గ్రూపు విద్యారులకు ఇంటర్+ ఎంసెట్, ఇంటర్+ ఎంసెట్+ నీట్, ఇంటర్+ నీట్+ఎయిమ్స్... ఇలా పేర్లు పెట్టి ఒక్కో దానికి ఒక్కో రకమైన రుసుములు వసూలు చేస్తున్నారు. మొత్తానికి రెసిడెన్షియల్ విద్యారులకు రూ.70 వేల నుంచి రూ.2.60 లక్షల వరకు రుసుములున్నాయి.

అప్పులు చేసి.. ఆస్తులమ్మి

రుసుములను మూడు విడతల్లో చెల్లించాలి. చివరి వాయిదాను పరీక్షలకు ముందే కట్టేయాలి. లేదంటే హాల్‌టిక్కెట్లు ఇచ్చేది లేదని బెదిరిస్తారు. ఈ కళాశాలల్లో చదివిస్తున్న వారిలో ఎక్కువ మంది చిరుద్యోగులు, చిన్నసన్నకారు రైతులే. పంటలు పండక, పండినా గిట్టుబాటు ధరలు దక్కక రైతులు పిల్లల్ని చదివించేందుకు అప్పులు చేస్తున్నారు. చిరుద్యోగులు, చిన్నవ్యాపారులు కూడా అప్పులు చేస్తేగానీ పిల్లల చదువులు గట్టెక్కడం లేదు. తర్వాత వాటికి వడ్డీలు కట్టి, వాయిదాల్లో చెల్లించేది కొందరయితే.. ఉన్న కాస్తో కూస్తో భూమిని అమ్ముకుని అప్పులు తీరుస్తున్నవాళ్లు మరికొందరు.

ప్రత్యామ్నాయం లేదంటూ ప్రచారం

పదో తరగతి వరకు ఎటుచూసినా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు ఉంటున్నాయి. దానివల్ల తక్కువ రుసుములతోనే చదివిస్తున్నారు. ఇంటర్‌కు వచ్చేసరికి మండలాల్లో ఒకటి రెండు కళాశాలలున్నా వాటిలో నాణ్యమైన విద్య లభించడం లేదు. దీనివల్ల అధిక శాతం మంది ప్రైవేట్ బాట పడుతున్నారు. అందులోనూ మూడు, నాలుగు కార్పొరేటు గ్రూపు విద్యాసంస్థలు తమ కళాశాలల్లో చదివితే తప్ప పిల్లలు ఇంజినీరో, డాక్టరో కావడం సాధ్యం కాదన్న భావన కల్పించాయి. అయిదారు ర్యాంకులను సాధిస్తూ విస్తృత ప్రచారం కల్పించి మిగతా కళాశాలల్లో ఎక్కడ చేరినా మీ పిల్లల భవిష్యత్తును మీరే కూల్చివేసినట్లుగా చిత్రీకరిస్తున్నాయి. దీంతో అధికశాతం తల్లిదండ్రులు పిల్లలను కార్పొరేట్ కళాశాలల్లోనే చేర్పిస్తున్నారు. రెండేళ్లపాటు చదివిన తర్వాత ర్యాంకులేమోగానీ లక్షల్లో రుసుములు చెల్లించేసరికి అప్పుల్లో మునిగిపోతున్నారు.

> ఆయన కరీంనగర్‌లోని ఓ ప్రభుత్వ కళాశాలలో ఉద్యోగి. నెల వేతనం రూ.50 వేలు. బ్యాంకు రుణం తీసుకొని కొన్నాళ్ల క్రితం ఇల్లు కట్టుకున్నారు. ఆయన కుమార్తె ప్రస్తుతం హైదరాబాద్ శివారులోని ఓ కార్పొరేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఇంటర్ మొదటి సంవత్సరంలో వార్షిక రుసుం రూ.1.60 లక్షలు. ఈ ఏడాది రూ.1.65 లక్షలు. అంటే రెండేళ్ల చదువుకు కళాశాలకు చెల్లించింది రూ.3.25 లక్షలు. పుస్తకాలు, పరీక్షల రుసుములు, పాకెట్ మనీ, ఇతరత్రా మరో రూ.50వేలు ఖర్చయ్యాయి. ఇంటికి బ్యాంకు కిస్తీలు పోగా అమ్మాయిని చదివించడం కష్టమైంది. అందుకే ఉన్న బంగారాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి రుసుములు చెల్లించారు. అప్పులు చేసి చదివిస్తున్నా త్వరలో జరగబోయే నీట్, ఎంసెట్‌లో మంచి ర్యాంకు వస్తుందా అన్న బెంగ ఆయనను నిత్యం వెంటాడుతోంది.

> జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన ఆకుల సోమనర్సయ్య సన్నకారు రైతు. తండ్రి నుంచి వచ్చిన ఎకరం పొలంలో ఆరుగాలం కష్టపడి, కూలీనాలికి వెళ్లి రూ.86 వేలు కూడబెట్టారు. చదువులో ప్రతిభావంతుడైన రెండో కుమారుడు నరేశ్‌ను బాగా చదివించాలనుకుని ఆ సొమ్ముతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ కళాశాలలో ఇంటర్‌లో చేర్పించాడు. పుస్తకాలు, పరీక్ష ఫీజులు కూడా కలిపి లక్ష రూపాయలతో మొదటి సంవత్సరం చదువు ముగిసింది. రెండో సంవత్సరం రుసుముకు చేతిలో పది రూపాయలు కూడా లేవు.. ఎక్కడా అప్పు పుట్టలేదు. ఫీజు కడితే తప్ప కళాశాలకు రావద్దని యాజమాన్యం తెగేసి చెప్పేసింది. దీంతో కుటుంబానికి జీవనాధారామైన ఎకరం పొలం అమ్మి వచ్చిన రూ.80 వేలను కొడుకు ఫీజు కట్టారు. ఇప్పుడాయన కుమారుడు మామూలుగా ఉత్తీర్ణుడై ఇంజినీరింగ్ చేస్తున్నాడు.

> జనగామకు చెందిన ఓ గృహిణి భర్త మరణంతో ఓ విద్యా సంస్థలో ఉపాధ్యాయురాలిగా నెలకు రూ.10 వేల వేతనానికి చేరారు. భర్త మరణంతో బీమా కింద వచ్చిన రూ.5 లక్షలను బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఇద్దరు పిల్లల్లో మొదటి అమ్మాయిని హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ కళాశాలలో చేర్చారు. అక్కడ ఎంపీసీ రుసుం రూ.1.60 లక్షలు. బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన సొమ్మును బయటకు తీసి రుసుము చెల్లించారు. వచ్చే ఏడాది ఫీజు చెల్లిస్తే ఇక బ్యాంకులో మిగిలేది మహా అయితే రూ.లక్షన్నర. ఇంటర్మీడియట్‌కే ఒక అమ్మాయికి చేతిలో ఉన్న డబ్బంతా అయిపోతే రెండో అమ్మాయిని ఎలా చదివించాలన్నది ఆమె ముందున్న సవాల్.

దూరా'భారం' తప్పదు

అత్యధిక కార్పొరేట్ కళాశాలలు హైదరాబాద్, నగర శివారులో ఉన్నందున అన్ని జిల్లాల పిల్లలను ఇక్కడే చేర్పిస్తున్నారు. మొత్తం 9.50 లక్షల మందిలో ఒక్క హైదరాబాద్ జిల్లా పరిధిలోనే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల విద్యారులు 1.65 లక్షల మంది ఉన్నారు. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే దాదాపు 4.50 లక్షల మంది కేవలం గ్రేటర్ హైదరాబాద్‌లోనే చదువుకుంటున్నారు. వీరిని చూడడానికి జిల్లాల నుంచి ప్రతి నెలా కనీసం రెండుసార్లయినా తల్లిదండ్రులు నగరానికి వస్తున్నారు. బస్సుల్లో అయితే సమయానికి అందుకోలేమని, నగరానికి దూరంగా ఉన్న కళాశాలల ప్రాంగణాలకు చేరుకోవడం కష్టంగా ఉండడంతో నలుగురైదుగురు లేదా రెండు కుటుంబాలు కలిసి కార్లలో వస్తున్నారు. అందుకు ప్రతి నెలా ఖర్చు తప్పడం లేదు. కరీంనగర్‌కు చెందిన రెండు కుటుంబాలు హైదరాబాద్ నిజాంపేటలోని తమ పిల్లల కోసం నెలకు రెండుసార్లు వస్తున్నాయి. వారి వాహన ఖర్చే నెలకు రూ.2,500- రూ.3 వేలు. ఇటీవల కాలంలో నగరంలో అద్దె ఎక్కువగా ఉంటుందని కొన్ని కళాశాలలను ఔటర్ రింగ్ రోడ్డు అవతలికి మార్చారు. దాంతో అక్కడికి వచ్చి పిల్లలను చూసి తిరిగి వెళ్లాలంటే కారు ప్రయాణం తప్పనిసరవుతోంది.

ఇంటర్ బోర్డు ఏం చేస్తోంది?

పాఠశాలల్లో రుసుముల నియంత్రణపై 1994 లోనే జీవోలు జారీ అయ్యాయి. వాటిలో ఎన్నో నియమ నిబంధనలను పేర్కొన్నారు. ఏటా సెప్టెంబరులోపు ఆడిట్ నివేదికను కూడా విద్యాశాఖకు సమర్పించాలి. విచిత్రమేమిటంటే ఇంటర్ విద్యకు అలాంటి నిబంధనలుగానీ, జీఓగానీ లేకపోవడమే. ఎన్ని సెక్షన్లకు అనుమతి తీసుకున్నారు? రుసుం చెల్లించి అనుబంధ గుర్తింపు తీసుకున్నారా? లేదా? అన్నదే ఇంటర్ బోర్డు చూస్తోంది. వాస్తవానికి ఇంటర్ ప్రథమ సంవత్సరానికి రూ.1760, ద్వితీయ ఇంటర్‌కు రూ.1940ని ప్రభుత్వం బోధనా రుసుం కింద చెల్లిస్తోంది. కార్పొరేట్ కళాశాలలేమో రెసిడెన్షియల్ విధానంలో నడుస్తున్నాయి. అందుకు ఎంత రుసుం అన్నది ఎక్కడా పేర్కొనలేదు. తాము ఇంటర్ పాఠాలు మాత్రమే బోధించడం లేదని, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు కూడా శిక్షణ ఇస్తున్నామని... ఇంటిగ్రేటెడ్ విధానమని యాజమాన్యాలు చెప్పుకుంటున్నాయి. దాంతో ఫీజు ఎంత వసూలు చేసుకోవాలన్న నియంత్రణ లేక యాజమాన్యాల ఇష్టారాజ్యమైంది. ఆడిట్ నివేదిక కూడా సమర్పించేది లేకపోవడంతో కొన్ని కళాశాలలు బరి తెగిస్తున్నాయి. ఇంటర్ బోర్డు సైతం కార్పొరేట్ యాజమాన్యాల చేతుల్లో కీలుబొమ్మగా మారిపోయిందన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రయోగ పరీక్షల్లో జంబ్లింగ్, వాటికి సీసీ కెమెరాల నిఘా, ఆన్‌లైన్ ప్రవేశాలు, రుసుముల నిర్ధారణ.. ఇలా ఏ ఒక్కటీ అమలు కాకపోవడానికి కార్పొరేట్ శక్తులే కారణమని తెలుస్తోంది. ఇంటర్ బోర్డు మాత్రం ప్రగల్భాలు పలుకుతూ కాలం గడిపేస్తోంది.



- ఏసీ ప్రాంగణంలో ఇంటర్+ ఎయిమ్స్‌కు అత్యధికంగా **రూ.2.60 లక్షలు** ఫీజు వసూలు చేస్తున్నారు
- ఏసీ ప్రాంగణంలో జేఈఈ అడ్వాన్స్‌డ్ (ఐఐటీ)కు **రూ.2.25 లక్షల** నుంచి **రూ.2.50 లక్షల** వరకు రుసుము తీసుకుంటున్నారు. నాన్ ఏసీకి **రూ.1.50 లక్షల** నుంచి **రూ.2 లక్షలు**
- జేఈఈ మెయిన్ (ఎన్ఐటీ)కు నాన్ ఏసీకి **రూ.1.20 లక్షల** నుంచి **రూ.1.80 లక్షలు.**

వేల కోట్ల వ్యాపారం

రాష్ట్రంలో చదివే ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో నాలుగైదు గ్రూపు కళాశాలల్లోనే 40 శాతం మంది చదువుతున్నారు. అందులోనూ 80 శాతం మంది కేవలం రెండు కార్పొరేట్ కళాశాలల్లోనే. ఇక్కడ రుసుం రూ.2.60 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. కొందరి నుంచి రూ.3 లక్షలు కూడా తీసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో చదువుతున్నారు. సగటున ఒక్కో విద్యార్థికి రూ.75 వేలు అనుకున్నా మొత్తం విద్యా వ్యాపారం రూ.3 వేల కోట్లు. దీర్ఘకాలిక శిక్షణ తీసుకుంటున్న దాదాపు 30 వేల మందిపై జరిగే రూ.375 కోట్ల వ్యాపారం దీనికి అదనం.

రూ.కోట్లలో లాభాలు

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో ఓ కార్పొరేట్ బ్రాంచిలో 1800 మంది విద్యార్థులున్నారు. అంతా డే స్కాలర్లే. ఇక్కడ ఎంపీసీ, బైపీసీ గ్రూపులు, దాంతోపాటు ప్రవేశ పరీక్షల శిక్షణలకు కలిపి ఏడాదికి రూ.35 వేల నుంచి రూ.75 వేల వరకు రుసుము వసూలు చేస్తున్నారు. కనీస రుసుములను పరిగణనలోకి తీసుకుంటే ఆ రూపేణా వచ్చే ఆదాయం రూ.6.55 కోట్లు. అందులో యాజమాన్యానికి కనీసం మిగిలేది రూ.2 కోట్లు. అంటే 30%. తక్కువ రుసుములుండే ప్రాంగణాల నుంచి 15-20%, అధిక రుసుములున్న కళాశాలల నుంచి 25-30% లాభాలు దక్కుతాయని హైదరాబాద్‌లో రెండు కళాశాలల బ్రాంచీలను నడుపుతున్న యజమానే చెప్పడం గమనార్హం.

ఏడాదికి వ్యయం ఇలా... (రూ.లలో)

కళాశాల భవనం అద్దె	1.44 కోట్లు
సీనియర్ అధ్యాపకులు 30 మంది వేతనాలకు	1.08 కోట్లు
జూనియర్ అధ్యాపకుల వేతనాలు 10 మందికి	14.40 లక్షలు
బోధనేతర సిబ్బంది 30 మందికి	62 లక్షలు
అటెండర్లు, ఇతర సిబ్బంది	12 లక్షలు
విద్యుత్తు బిల్లు	12 లక్షలు
తనిఖీ, అనుబంధ గుర్తింపు కోసం బోర్డుకు చెల్లించేది	4 లక్షలు
ఇతరత్రా ఖర్చులు మరో	కోటి

మొత్తం ఖర్చు
రూ.4.56 కోట్లు
లాభం
రూ.2 కోట్లు (30%)

(గమనిక: ఇది హాస్టల్ సౌకర్యం లేని కళాశాల లెక్క. వసతి సౌకర్యం ఉండి మంచి భోజనం అందిస్తే నెలకు రూ.2500, గదికి రూ.1000కి మించదని కళాశాలల యజమానులే చెబుతున్నారు.)

పందెం కోళ్లు!

కార్పొరేట్ కళాశాలల్లోనే దాదాపు 40 శాతం మంది చదువుతుండగా యాజమాన్యాల దృష్టి అంతా కేవలం కొన్ని బ్యాచ్‌లపైనే ఉంటుంది. పదో తరగతిలో ప్రతిభ చాటినవారు, ఇంటర్‌లో చేరాక రెండు, మూడు నెలల్లో నిర్వహించిన పరీక్షల్లో సత్తా చూపినవారిని ప్రత్యేక బ్యాచ్‌లుగా విడగొడతారు. కళాశాలల దృష్టి అంతా ఆ బ్యాచ్‌ల్లోని విద్యార్థులపైనే. అంటే వారు ఒక రకంగా పందెం కోళ్లు అన్నమాట. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్, నీట్, ఎయిమ్స్ పరీక్షల్లో మొదటి 10 ర్యాంకుల్లో మూడు నాలుగు వచ్చినా చాలు... ఆ ర్యాంకులను చూపి లక్షల మందిని ఆకర్షిస్తారు. రేసుగిత్తలకు సెలవులు కూడా తక్కువే. ర్యాంకుల కోసం కొందరు విద్యార్థులను రూ.లక్షలు చెల్లించి కొనేస్తారన్న ఆరోపణలున్నాయి. అంటే వారికి కనీసం మొదటి 50 ర్యాంకుల్లో ఏదో ఒక ర్యాంకు పక్కా. వారిని సాన బెట్టేందుకు ఉద్ధండులైన అధ్యాపకులను, ఐఐటీల్లో బీటెక్, ఎంటెక్, ఎమ్మెస్సీ చదివిన వారిని సంవత్సరానికి రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ఇచ్చి నియమిస్తాయి. వారు ప్రత్యేక బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తారు. ఫీజు ఎక్కువని ఎవరైనా అడిగితే అత్యధిక వేతనం ఇచ్చే కొద్ది మంది అధ్యాపకుల గురించి యాజమాన్యాలు చెబుతుంటాయి.

తెలంగాణలో ఫీజుల భారం ఇలా..

ఇంటర్ విద్యార్థుల సంఖ్య	9.30 లక్షలు
ప్రభుత్వ కళాశాలలు	402
వాటిలో చదివేవారు	1.80 లక్షలు
ఇతర ప్రభుత్వ కళాశాలలు, గురుకులాల్లో	1 లక్ష
ప్రైవేట్ కళాశాల సంఖ్య	1500
వాటిల్లో చదివేవారు	6.50 లక్షలు
ప్రైవేట్‌లో కార్పొరేట్ కళాశాలలు	225
కార్పొరేట్ కళాశాలల్లో చదివే విద్యార్థులు	4 లక్షలు
హాస్టల్లో ఉండే వారికి ఏడాది రుసుం	రూ.75,000 - రూ.2,60,000

- ఏడాదికి తల్లిదండ్రులు చెల్లిస్తున్న ఫీజులు రూ.3,000 కోట్లు (సగటు ఒక్కో విద్యార్థి రూ.75,000)
- మెడిసిన్, ఐఐటీ అడ్వాన్స్‌డ్ దీర్ఘకాల శిక్షణ పొందేవారు: 30 వేల మంది
- రూ.1.25 లక్షల చొప్పున వీరు చెల్లించేది: రూ.375 కోట్లు

ఏఈ ఉద్యోగ పరీక్షలకు 54,599 మంది హాజరు

ఈనాడు, హైదరాబాద్: ట్రాన్స్‌కో 'సహాయ ఇంజినీరు'(ఏఈ) పోస్టులకు ఆదివారం నిర్వహించిన రాత పరీక్షలకు 68,171 మందికి గాను 54,599 మంది హాజరయ్యారు. 13,572 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 3 రకాల పోస్టులకు విడివిడిగా పరీక్షలు జరిగాయి. ఏఈ ఎలక్ట్రికల్ విభాగంలో 37732 మందికి గాను 31,719, టెలికం విభాగంలో 18,616 మందికి 13,476, సివిల్ విభాగంలో 11,823 మందికి 9404 మంది పరీక్షలు రాశారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసిన ఇతర రాష్ట్రాల అభ్యర్థుల్లో ఇద్దరికి మాత్రమే హైకోర్టు ఆదేశంతో హాల్‌టికెట్లు ఇచ్చి మిగతావారికి నిరాకరించారు. తెలంగాణలో 4 నుంచి 10వ తరగతి లోపు కనీసం నాలుగేళ్లు చదివిన వారినే స్థానికులుగా గుర్తించి హాల్‌టికెట్లు ఇచ్చినట్లు ట్రాన్స్‌కో జేఎండీ శ్రీనివాసరావు తెలిపారు. రాష్ట్రంలో చదివిన వారికి కూడా కొందరికి హాల్‌టికెట్లు రాక ఇబ్బందులు పడ్డారని ఆయన దృష్టికి తీసుకురాగా దరఖాస్తులు సక్రమంగా నింపి పంపిన వారందరికీ ఇచ్చినట్లు చెప్పారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని త్వరలో ఫలితాలు వెల్లడిస్తామన్నారు.


ఈ నెల 13 నుంచి ఏఈఈ పోస్టులకు మౌఖిక పరీక్షలు

ప్రభుత్వ విభాగాల్లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఏఈఈ) పోస్టులకు ఈ నెల 13 నుంచి 23 వరకు తొలివిడత మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణిప్రసాద్ తెలిపారు. ఇంటర్వ్యూలు టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో ఉంటాయని, అభ్యర్థుల జాబితా, మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

మంథనిలో కల్యాణశోభ

- 218 మంది జంటలకు ఉచిత పెళ్లిళ్లు

మంథని, న్యూస్‌టుడే: పెద్దపల్లి జిల్లా మంథనిలో నిర్వహించిన సామూహిక వివాహాలకు అపూర్వ స్పందన లభించింది. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలకు చెందిన 218 పేదింటి జంటలు మూడు ముళ్ల బంధంతో ఏకమయ్యాయి. మంథని శాసనసభ్యుడు పుట్టమధుకర్ తన తల్లిపేరిట నిర్వహిస్తున్న పుట్టలింగమ్మ ట్రస్టు ద్వారా ఈ కార్యక్రమాన్ని జరిపించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు 218 జంటలకు వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య సాంప్రదాయ రీతిలో వివాహాలు జరిపించారు. ఇందులో హిందువులతోపాటు క్రైస్తవులు, ముస్లిం జంటలు కూడా పాల్గొనడంతో వారి సంప్రదాయం మేరకు పెళ్లిళ్లు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, భానుప్రసాద్‌రావు, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. కల్యాణలక్ష్మి కింద మంజూరైన చెక్కును మంత్రి చేతుల మీదుగా ఓ జంటకు అందజేశారు. నిర్వాహకులు నూతన వధూవరులకు మంచం, బీరువా, సైకిల్, గ్యాస్‌స్టవ్, వంట సామగ్రిని బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. పేదరికం ఎవరికీ శాపం కావద్దన్నారు. పుట్టమధుకర్ సామూహిక వివాహాల ద్వారా 218 మందికి తండ్రిగా, మామగా మారాడన్నారు.



సామూహిక వివాహాలు

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే: టీపీయూఎస్

ఈనాడు, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పింఛను పథకం రద్దు అంశం రాష్ట్ర పరిధిలోనిదే అని కేంద్రం ప్రకటించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంతరావు అన్నారు. ఆదివారం ఇక్కడ జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతూ సీపీఎస్‌ను రద్దుచేయాలని కోరారు. విద్యారంగ సమస్యలపై రాష్ట్రస్థాయిలో ధర్నాలు, నిరసనలు చేయనున్నట్లు తెలిపారు. సర్వీసు నింబధనల సమస్యను పరిష్కరించి, ఈ వేసవిలోనే అన్నిరకాల పదోన్నతులిచ్చి, బదిలీలు చేపట్టాలని కోరారు. పండిట్లు, పీటీలను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు సురేష్, భూమయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడడుగుల బంధం!



బంధుమిత్రులతో వధూవరులు మహేందర్, నవనీత

పెళ్లి దుస్తుల్లో ఉన్న ఈ జంటను చూసిన వారెవరైనా బాల్య వివాహం జరిగిందేమో అనుకోవడం సహజమే. వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నం. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లికి చెందిన వారాల మహేందర్ (25) జన్యు పరమైన సమస్యలతో కేవలం మూడున్నర అడుగుల ఎత్తే పెరిగాడు. ఐటీఐ వరకు చదివాడు. ఇదే సమస్యతో దాదాపు అంతే ఎత్తు పెరిగిన భువనగిరి యాదాద్రి జిల్లా రాపాకకు చెందిన నవనీత (21) ఆయనతో కలిసి జీవించేందుకు సిద్ధమైంది. బంధు మిత్రుల సమక్షంలో సింగరాజుపల్లిలో ఆదివారం జరిగిన వివాహంతో వీరురువురూ ఒక్కటయ్యారు.

– న్యూస్‌టుడే, దేవరుప్పుల

నిజాం చక్కెర కర్మాగారాన్ని తెరిపించేందుకు కృషి

- కేంద్ర సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారం



ఈనాడు, నిజామాబాద్: బోధన్ నిజాం చక్కెర కర్మాగారాన్ని తెరిపించేందుకు కృషి చేస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారం ఆహిర్ అన్నారు. సమస్యను ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి సహకరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జగిత్యాల జిల్లా ముత్యంపేట చక్కెర కర్మాగారం నుంచి బోధన్ వరకు తొమ్మిది రోజుల పాటు భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధర్మపురి అర్వింద్, మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ చేపట్టిన పాదయాత్ర ముగింపు సభను ఆదివారం బోధన్‌లో నిర్వహించారు. దీనికి హాజరైన హన్స్‌రాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో మూతపడిన రామగుండం ఎరువుల కర్మాగారం, హైదరాబాద్‌లోని ఐడీపీఎల్, నిర్మల్‌లోని స్పిన్నింగు మిల్లులను తెరింపించిన ఘనత భాజపా ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. త్వరలో జరగనున్న కర్ణాటక ఎన్నికల్లో కాషాయజెండా ఎగురవేస్తామని తెలిపారు. ఈశాన్య రాష్ట్రాల్లో సాధించిన విజయం స్ఫూర్తితో తెలంగాణలో కూడా భాజపా అధికారంలోకి రావడం పెద్ద కష్టమేమి కాదన్నారు. భాజపా అధికార ప్రతినిధి రఘునందనరావు తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో హాజరు


స్టాఫ్‌నర్సు పోస్టులకు 99.9శాతం
ప్రశాంతంగా ముగిసిన పరీక్ష

ఈనాడు, హైదరాబాద్: వైద్యఆరోగ్యశాఖలో 3311 స్టాఫ్‌నర్సు పోస్టులకు నిర్వహించిన పరీక్షకు రికార్డుస్థాయిలో 99.9శాతం హాజరు నమోదైంది. ఆదివారం ఉదయం 10నుంచి 12.30 వరకు కంప్యూటర్ ఆధారిత (సీబీఆర్‌టీ) పద్ధతిలో నిర్వహించిన పరీక్షకు 21,391 మంది హాజరయ్యారు. తెలంగాణ వ్యాప్తంగా 5 జిల్లా కేంద్రాల్లో జరిగిన పరీక్షకు హాజరయ్యేందుకు 21,400 మంది అభ్యర్థులు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. వీరిలో తొమ్మిది మంది తప్ప మిగతావారంతా పరీక్ష రాశారు.

33960-34060 శ్రేణిలో నిరోధం!

సెన్సెక్స్ విశ్లేషణ

మార్చి 9తో ముగిసిన వారానికి



సమీక్ష : అంతర్జాతీయ పరిణామాలపై అప్రమత్తతతో వ్యవహరించడం వల్ల గత వారం దేశీయ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఉక్కు, అల్యూమినియం దిగుమతిపై అమెరికా సుంకం పెంచడంతో లోహ షేర్లు కుదేలయ్యాయి. బ్యాంకింగ్ షేర్ల నష్టాలు కొనసాగగా, సంస్థాగత మదుపర్ల కొనుగోళ్లు మందకొడిగా ఉండటం సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీస్తారన్న ఆందోళనల నేపథ్యంలో మార్కెట్లు వారాన్ని బలహీనంగా ప్రారంభించాయి. ఐరోపా కార్ల తయారీ సంస్థలు సైతం ఇదే విధమైన సూచనలు ఇవ్వడం ప్రభావం చూపింది. కొత్త ఆర్డర్లు తగ్గడంతో భారత సేవల రంగం ఫిబ్రవరిలో ప్రతికూల వృద్ధిని నమోదు చేయడం, ఫిబ్రవరిలో ఎఫ్ఐఐలు రూ.11,000 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకోవడం ఇందుకు తోడైంది. పెరిగినప్పుడల్లా మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడంతో వారంలో ఎక్కువ భాగం మార్కెట్లు నష్టాల్లోనే ట్రేడయ్యాయి. ప్రభుత్వ రంగ బ్యాంకుల భవిష్యత్‌పై ఆందోళనలు ఈ రంగ షేర్లపై ప్రతికూల ప్రభావం చూపాయి. అమెరికా, ఉత్తరకొరియాలు చర్చలకు ముందుకు రావడాన్నీ మార్కెట్లు పట్టించుకోలేదు. ఈ పరిణామాలతో వారం మొత్తం మీద సెన్సెక్స్ 2.17 శాతం నష్టపోయి 33,307 వద్ద ముగిసింది. నిఫ్టీ 2.21 శాతం తగ్గి 10,226 దగ్గర స్థిరపడింది. విదేశీ సంస్థాగత మదుపర్ల (ఎఫ్ఐఐలు) నికర విక్రయాలు రూ.281 కోట్లుగా నమోదయ్యాయి. డీఐఐలు, ఫండ్లు మాత్రం రూ.131 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశాయి.

లాభపడ్డ, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 2:5గా నమోదుకావడం.. మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడిని సూచిస్తోంది.

ఈవారంపై అంచనా } ఇటీవలి కనిష్ఠ స్థాయి అయిన 33,482 పాయింట్ల దిగువకు సెన్సెక్స్ చేరడంతో.. మధ్య కాలవ్యవధిలో నష్టాలు కొనసాగే అవకాశం ఉంది. అయితే స్వల్పకాలంలో సూచీ తిరిగి పుంజుకునే అవకాశాలూ లేకపోలేదు. ఇదే జరిగితే సెన్సెక్స్‌కు 33960-34060 పాయింట్ల శ్రేణిలో నిరోధం ఎదురుకావొచ్చు. మరోవైపు నష్టాలు కొనసాగితే. . 200 రోజుల సగటు కదలికల స్థాయి అయిన 32,750 పాయింట్ల దగ్గర మద్దతు లభించొచ్చు.


ప్రభావిత అంశాలు } అంతర్జాతీయ సంకేతాలు, దేశీయ ఆర్థిక గణాంకాలు మార్కెట్లకు ఈ వారం దిశానిర్దేశం చేయొచ్చు. జనవరి పారిశ్రామికోత్పత్తి, రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు నేడు (12న) వెలువడనున్నాయి. టోకు ద్రవ్యోల్బణం 14న వెలువడనుంది. వచ్చే నెలలో జరగనున్న ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమీక్షలో నిర్ణయాలకు, ద్రవ్యోల్బణ గణాంకాలు కీలకం కానున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి కదలికలపై మదుపర్లు దృష్టి పెట్టొచ్చు. గత కొన్ని వారాలుగా రూపాయిపై అమ్మకాల వెల్లువ, వాణిజ్య యుద్ధం భయాలు ప్రభావం చూపుతున్నాయి. డాలర్ కదలికల వల్ల రూపాయికి ఒడుదొడుకులు కొనసాగొచ్చు. అంతర్జాతీయంగా చూస్తే.. దిగుమతులపై సుంకాలు పెంచాలన్న ట్రంప్ నిర్ణయం ప్రభావం చూపొచ్చు. ముడిచమురు ధరలు, ఎఫ్ఐఐలు, డీఐఐల పెట్టుబడులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపుతాయి.

తక్షణ మద్దతు స్థాయిలు: 32,791, 32,502, 31,994; **తక్షణ నిరోధ స్థాయిలు:** 33,700, 34,060, 34,500

మార్కెట్లు పుంజుకుంటే 33960- 34060 పాయింట్ల శ్రేణిలో నిరోధం ఎదురుకావొచ్చు.

– సతీశ్ కంతేటి, జెన్ మనీ





కోడిగుడ్లు

11న ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	330	వరంగల్	332
చిల్లరగా (ఒక గుడ్డు)	3.90	విశాఖపట్నం	332
బెంగళూరు	365	చెన్నై	370
12వ తేదీకి...		చిత్తూరు	363
విజయవాడ/గోదావరి	322	నమక్కల్	360

పరిమిత శ్రేణిలోనే..

- ఆర్థిక గణాంకాలపై దృష్టి
- ఏప్రిల్ వరకు ఒడుదొడుకులు?
- అమెరికా పరిణామాలూ కీలకమే
- బ్యాంకింగ్, ఔషధ రంగాలకు ఒత్తిడే

స్టాక్ మార్కెట్ ఈ వారం

ఈ వారం కూడా సూచీలు పరిమిత శ్రేణిలో కదలాడవచ్చన్నది విశ్లేషకుల అంచనా. దేశీయంగా టోకు-రిటైల్ ద్రవ్యోల్బణం, పారిశ్రామికోత్పత్తి గణాంకాలు వెలువడనున్నందున మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరిస్తారని భావిస్తున్నారు. ఈ వారం నిఫ్టీ 10100-10430 శ్రేణిలో కదలాడవచ్చని అంచనా వేస్తున్నారు. నిఫ్టీ 10140 పాయింట్ల కన్నా దిగువకు చేరదని, ఇదే క్రమంలో 10430 పాయింట్ల వద్ద గట్టి నిరోధం ఎదుర్కొంటుందని సాంకేతిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఏప్రిల్ వరకు మార్కెట్లలో ఒడుదొడుకులు కొనసాగవచ్చని, అయితే ఎటువంటి ప్రతికూల వార్తలు, కుంభకోణాలు బయట పడకపోతే, పునరుత్తేజం సాధ్యమేనని చాయిస్ ఈక్విటీ బ్రోకింగ్ పేర్కొంటోంది. విశ్లేషకుల అంచనాలివీ..



ఐటీ: రూపాయి విలువ మరింత తగ్గుతుందనే అంచనాల నడుమ, ఐటీ రంగ షేర్లు రాణించవచ్చు. పన్ను కోతల వల్ల అమెరికాలో సంస్థల వ్యయాలు పెరుగుతాయని, ఇందువల్ల దేశీయ ఐటీ కంపెనీలకు ప్రయోజనం చేకూరుతుందని భావిస్తున్నారు. చైనా కంపెనీ నుంచి ఆర్డరు పొందిన నేపథ్యంలో టీసీఎస్ రాణించవచ్చు. ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ షేర్లు కూడా తక్కువ విలువల వద్ద లభిస్తున్నందున, లాభపడొచ్చు. ఆదాయపు పన్ను మోసం కేసులో సీబీఐ ప్రాథమిక సమాచార నివేదికలో ఇన్ఫోసిస్ పేరు లేకపోవడం ఆ సంస్థకు కలిసిరావచ్చు. హెచ్‌సీఎల్ టెక్‌కు రూ.962-930; ఇన్ఫోసిస్‌కు రూ.1172-1151, టీసీఎస్‌కు రూ.3110-2938, టెక్ మహీంద్రాకు రూ.632-599, విప్రోనకు రూ.289-281 వద్ద నిరోధం, మద్దతు లభిస్తాయని అంచనా.



ఔషధ: సానుకూల అంశాలేమీ లేనందున, ఔషధ షేర్లకు బలహీనత కొనసాగొచ్చు. అమెరికా, దేశీయ విపణుల్లో నియంత్రణలకు తోడు ఔషధ ధరలపై ఆందోళనలు ఇందుకు కారణం. అరబిందో ఫార్మాకు రూ.610-580, క్యాడిలా హెల్త్‌కేర్‌కు రూ.399-375, సిప్లాకు రూ.591-557, డాక్టర్ రెడ్డీస్‌కు రూ.2223-2048, లుపిన్‌కు రూ.564-514, సన్‌ఫార్మాకు రూ.525-495 వద్ద నిరోధం, మద్దతు లభిస్తాయని అంచనా.

బ్యాంకింగ్: సెంటిమెంటు బలహీనంగానే ఉన్నందున, ఈ రంగ షేర్లకు నష్టాలు కొనసాగొచ్చు. అయితే పరిమిత శ్రేణిలో అయినా కొన్ని ప్రైవేటు బ్యాంకుల షేర్లు రాణిస్తాయని అంచనా వేస్తున్నారు. యాక్సిస్ బ్యాంక్‌కు రూ. 529-490, బ్యాంక్‌ఆఫ్ బరోడాకు రూ.137-127, కెనరా బ్యాంక్‌కు రూ.257-223, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు రూ.1874-1832, ఐసీఐసీఐ బ్యాంక్‌కు రూ.303-285, ఎస్‌బీఐకి రూ.259-248, యెస్ బ్యాంక్‌కు రూ.314-295 వద్ద నిరోధం, మద్దతు లభిస్తాయని అంచనా.






చమురు: ప్రభుత్వరంగ చమురుశుద్ధి సంస్థలైన ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ పరిమిత శ్రేణిలో బలహీనంగా కదలాడొచ్చు. మార్కెట్ కదలికలతో పాటు అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు కూడా ఒత్తిడి పెంచుతాయి. ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాపైనా ఈ ప్రభావం ఉంటుంది. బీపీసీఎల్‌కు రూ.447-433, హెచ్‌పీసీఎల్‌కు రూ.367-350, ఆయిల్‌ఇండియాకు రూ.337-310, ఓఎన్‌జీసీకి రూ.184-177, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు రూ.922-906 వద్ద నిరోధం, మద్దతు లభించవచ్చని భావిస్తున్నారు.



వాహన: టాటా మోటార్స్, మారుతీ సుజుకీ ఇండియాలతో పాటు ఈ రంగ షేర్లు బలహీనపడొచ్చు. అశోక్‌లేలాండ్‌కు రూ.149-143, బజాజ్‌ఆటోకు రూ.2988-2891, ఎం అండ్ ఎంకు రూ.746-714, మారుతీ సుజుకీకి రూ.8818-8570, టాటా మోటార్స్‌కు రూ.352-334, టీవీఎస్‌కు రూ.662-627 వద్ద నిరోధం, మద్దతు లభించవచ్చని అంచనా.



టెలికాం: రిలయన్స్ జియో తక్కువ ధరల ఆఫర్లు కొనసాగుతున్నందున, ఇతర టెలికాం కంపెనీల ఆర్థిక స్థితిపై ప్రభావం పడొచ్చు. ఈ రంగ షేర్లు మిశ్రమ ధోరణిలో కదలాడొచ్చు. రూ.390 పైన ఉంటే, భారతీ ఎయిర్‌టెల్ రాణించొచ్చని సాంకేతిక విశ్లేషకులు పేర్కొంటున్నారు. భారతీ ఎయిర్‌టెల్‌కు రూ.413-391, ఐడియా సెల్యులార్‌కు రూ.81-77, ఆర్‌కామ్‌కు రూ.26.50-19.80, టాటా కమ్యూనికేషన్స్‌కు రూ.634-608 వద్ద నిరోధం, మద్దతు లభించవచ్చని అంచనా.



సిమెంట్: ధరలపై ఒత్తిడి వల్ల ఈ రంగ షేర్లు నష్టపోవచ్చు. కొన్ని సంస్థలు కుమ్మక్కయ్యాయనే ఆరోపణలపై ప్రభుత్వం చర్యలు తీసుకునే అవకాశం ఉండటమూ ఇందుకు ఒక కారణం. ఏసీసీ, అంబుజా, అల్ట్రాటెక్ నష్టపోతాయని చెబుతున్నారు. ఏసీసీకి రూ.1564-1512, అంబుజా సిమెంట్స్‌కు రూ.239-232, ఇండియా సిమెంట్స్‌కు రూ.151-141, అల్ట్రాటెక్‌కు రూ.4171-4006 వద్ద నిరోధం, మద్దతు లభించవచ్చని అంచనా వేస్తున్నారు.



యంత్రపరికరాలు: పరిమిత శ్రేణిలో బలహీనంగా చలించొచ్చు. భెల్, ఎల్ అండ్ టీలో దిద్దుబాటు రావచ్చని, సీమెన్స్ స్థిరీకరణకు అవకాశం ఉందని అంటున్నారు. మధ్య, దీర్ఘకాలానికి థర్మెక్స్, ఎల్ అండ్ టీ, సీమెన్స్ రాణించవచ్చు. ఎల్ అండ్ టీకి రూ.1304-1272, సీజీపవర్‌కు రూ.80-76, థర్మెక్స్‌కు రూ.1174-1141, సీమెన్స్‌కు రూ.1155-1049 వద్ద నిరోధం, మద్దతు లభించొచ్చని పేర్కొంటున్నారు.

మార్కెట్ విలువ

(రూ. కోట్లలో) — మార్చి 9 / మార్చి 1; లాభం / నష్టం

మొత్తం లాభం 1648 | మొత్తం నష్టం -67154

కంపెనీ	లాభం/నష్టం	మార్చి 9	మార్చి 1
టీసీఎస్	-497	580891	581388
రిలయన్స్	-22534	577752	600286
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు	-6367	480676	487043
ఐటీసీ	-5123	316399	321522
హెచ్‌డీఎఫ్‌సీ	960	300883	299923
హెచ్‌యూఎల్	-5419	281515	286934
మారుతి	-6393	261736	268129
ఇన్ఫోసిస్	688	254100	253412
ఓఎన్‌జీసీ	-12705	230549	243254
ఎస్‌బీఐ	-8115	218520	226635



ఎఫ్ఎంసీజీ: మార్కెట్‌కు అనుగుణంగా రాణించవచ్చు. ముడిమద్యంపై జీఎస్‌టీ విధించవచ్చనే వార్తల నేపథ్యంలో, మద్యం ఉత్పత్తి సంస్థల షేర్లు వెలుగులోకి రావచ్చు. బ్రిటానియాకు రూ.4904-4792, డాబర్‌కు రూ.338-319, హిందుస్థాన్ యునిలీవర్‌కు రూ.1313-1279, ఐటీసీకి రూ.262-256 వద్ద నిరోధం, మద్దతు లభిస్తాయని అంచనా.



లోహ: రెండు వారాలుగా బలహీన పడిన లోహ, గనుల షేర్లు రాణించొచ్చు. హిందాల్కోకు రూ.228-215, హిందుస్థాన్ కాపర్‌కు రూ.66-61, హిందుస్థాన్ జింక్‌కు రూ.322-299, ఎన్ఎండీసీకి రూ.126-119, సెయిల్‌కు రూ.78-64, టాటా స్టీల్‌కు రూ.663-573 వద్ద నిరోధం, మద్దతు లభించవచ్చని అంచనా.

పెద్ద నోట్ల రద్దు ప్రభావం తొలగుతోంది: ఐఎంఎఫ్

వాషింగ్టన్: భారత ఆర్థిక వ్యవస్థ క్రమంగా కోలుకొంటోంది. పెద్ద నోట్ల రద్దుకు తోడు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు వల్ల కొంతకాలంగా నెమ్మదించిన ఆర్థిక వ్యవస్థ మళ్లీ గాడిన పడుతోందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) వెల్లడించింది. విద్య, ఆరోగ్యం వంటి కీలక రంగాల్లో సంస్కరణలకు ప్రాధాన్యం తగ్గిందని, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థల పనితీరును మెరుగుపరిచేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపింది. 'మూడో త్రైమాసికంలో వృద్ధి రేటు 7.2 శాతం చూస్తుంటే, వేగంగా వృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటనే పేరు నిలబెట్టుకుంద'ని ఐఎంఎఫ్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ టో జాంగ్ అభిప్రాయపడ్డారు. 'ఆరోగ్యం, విద్య వంటి రంగాల్లో సంస్కరణలు తీసుకురావడం, ప్రైవేటు, పబ్లిక్ పెట్టుబడుల్ని ప్రోత్సహించడం, బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థల సామర్థ్యాన్ని మెరుగుపరిస్తే సంపన్న దేశాల్లోని ఆదాయ స్థాయిల్ని భారత్ కూడా అందుకుంటుంద'ని టో జాంగ్ అంచనా వేశారు. నేటి నుంచి ఈనెల 20 వరకు ఆయన భారత్, భూటాన్‌లలో పర్యటించనున్నారు. నేడు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ)లో 'ఫైనాన్షియల్ టెక్నాలజీ' అనే అంశంపై జాంగ్ మాట్లాడబోతున్నారు.

ఆర్థిక సంస్కరణల్లో భాగం కావాలి

ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన సాయం (రీక్యాపిటలైజేషన్) అనేది ఆర్థిక సంస్కరణల్లో భాగమై, నిరర్థక ఆస్తుల్ని (ఎన్‌పీఏలు) భారీగా తగ్గించుకునేందుకు తోడ్పడేలా ఉండాలని టో జాంగ్ పేర్కొన్నారు. నీరవ్ మోదీ కేసు నేపథ్యంలో అందరి దృష్టి ఇప్పుడు ఎన్‌పీఏల వైపు మళ్లిందని వివరించారు. ఇటీవలి విధాన సంస్కరణలు బ్యాంకింగ్, కార్పొరేట్ రంగాల్లో ప్రమాదాలను పరిష్కరించుకునేందుకు చాలా ముఖ్యమైనవని టో జాంగ్ తెలిపారు. 'ప్రభుత్వ రంగ బ్యాంకులకు మూలధన సాయాన్ని మేం స్వాగతిస్తున్నాం. వాటి బలోపేతానికి, రుణ సామర్థ్యం పెరగడానికి ఇది ఎంతగానో దోహదపడుతుంద'ని జాంగ్ అభిప్రాయపడ్డారు.

ఎయిరిండియా కొనుగోలుకు

జెట్ ఎయిర్‌వేస్ బృందం ఆసక్తి

- ఎయిర్‌ఫ్రాన్స్-కేఎల్ఎం, డెల్టా ఎయిర్‌లైన్స్ సభ్యులే

దిల్లీ: ఎయిరిండియాలో వాటా కొనుగోలుకు జెట్ ఎయిర్‌వేస్, ఎయిర్‌ఫ్రాన్స్-కేఎల్ఎం, అమెరికాకు చెందిన డెల్టా ఎయిర్‌లైన్స్ సభ్యులుగా ఉన్న బృందం (కన్సార్షియం) ఆసక్తి చూపినట్లు సమాచారం. భారీ రుణభారంతో ఇబ్బంది పడుతున్న ఎయిరిండియాలో వ్యూహాత్మక వాటా విక్రయానికి 2017 జూన్‌లో ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిన సంగతి విదితమే. త్వరలోనే ఇందుకు సంబంధించి ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) లేఖలను బిడ్డర్ల నుంచి ఆహ్వానించవచ్చని సమాచారం. ఈ నేపథ్యంలోనే, పూర్తిస్థాయి విమానయాన సేవలు అందించే 3 సంస్థలు కలిసి బిడ్ దాఖలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. దీనిపై అభిప్రాయం తెలిపేందుకు జెట్ ఎయిర్‌వేస్ ప్రతినిధి నిరాకరించారు. ఎయిర్‌ఫ్రాన్స్-కేఎల్ఎం, డెల్టా నుంచి బదులే రాలేదు.

- ✦ నరేశ్ గోయెల్ నేతృత్వంలోని జెట్ ఎయిర్‌వేస్ 2017 నవంబరులో ఎయిర్‌ఫ్రాన్స్-కేఎల్ఎం గ్రూప్‌తో సహకార ఒప్పందం చేసుకుంది. ఇందువల్ల ఐరోపా నగరాలు 106తో పాటు, దేశీయంగా 44 గమ్యస్థానాలకు అనుసంధానం మెరుగు పడనుంది. ఈ నేపథ్యంలోనే ఒక బృందంగా ఏర్పడి, ఎయిరిండియా కోసం బిడ్ దాఖలు చేయనున్నాయని సమాచారం.
- ✦ జెట్ ఎయిర్‌వేస్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ)గా గత ఏడాది బాధ్యతలు స్వీకరించిన వినయ్ దూబే, గతంలో దశాబ్దకాలంపాటు డెల్టా ఎయిర్‌లైన్స్‌లో బాధ్యతలు నిర్వర్తించారు. జెట్ ఎయిర్‌వేస్‌లో చేరేముందు డెల్టా ఎయిర్‌లైన్స్‌కు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఆసియా-పసిఫిక్)గా ఆయన వ్యవహరించారు.
- ✦ ఎయిర్‌ఫ్రాన్స్-కేఎల్ఎం, దాని భాగస్వాములైన డెల్టా, అలితాలియా రోజుకు 270 విమాన సర్వీసులు నిర్వహిస్తుంటాయి.

ఎయిరిండియా లభిస్తే..

ఎయిరిండియాకు రూ.50,000 కోట్ల రుణాలు ఉన్నా, ఆస్తులూ భారీగానే ఉన్నాయి. ఈ సంస్థను కొనుగోలు చేయడం వల్ల దేశ, విదేశాల్లో మరిన్ని గమ్యస్థానాలకు చేరగలగడంతో పాటు, ద్వైపాక్షిక హక్కులు కూడా లభిస్తాయన్నది జెట్ ఎయిర్‌వేస్ నేతృత్వంలోని కన్సార్షియం భావన. 2012లో యూపీఏ ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన పథకం కింద, 2021 వరకు రూ.30,231 కోట్ల సాయం ఎయిరిండియాకు అందుతోంది. ఇప్పటి వరకు ఇందులో రూ.26,545 కోట్లు సంస్థకు చేరాయి.



బోయింగ్ నుంచి అందిన 23వ విమానం

ముంబయి: ఒకపక్క ప్రైవేటీకరణ యత్నాలు సాగుతున్నా, బోయింగ్ సంస్థకు గతంలో ఇచ్చిన ఆర్డరు మేరకు బోయింగ్ 777 విమానాల్లో చివరిదైన 23వ విమానం ఎయిరిండియా స్వీకరించింది. ఒకసారి ఇంధనం నింపితే, ఎక్కువదూరం ప్రయాణించాల్సిన మార్గాల్లో ఈ విమానాన్ని వినియోగించనున్నారు. 2006లో బోయింగ్‌కు ఎయిరిండియా ఇచ్చిన 68 విమానాల ఆర్డరు కూడా దీనితో పూర్తయినట్లయింది. తాజాగా అందిన బీ777-300ఈఆర్ విమానంలో 300 మంది ప్రయాణించవచ్చు.

విధి విధానాలు ఖరారవ్వలేదు

ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థల్లో వాటా ఎలా విక్రయించాలనే విషయమై విధివిధానాలను మంత్రివర్గ సభ్యుల బృందం ఇంకా ఖరారు చేయలేదు. అయితే వాటా విక్రయాన్ని ఈ ఏడాదిలో పూర్తిచేయాలన్నది ప్రభుత్వ నిర్ణయమని భావిస్తున్నారు. 4 సంస్థలుగా వీటిని విక్రయిస్తుందని అంచనా వేస్తున్నారు.

- ✦ ఎయిరిండియా, దీని చౌకధరల విభాగమైన ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్, అనుబంధ సంస్థ ఏఐశాట్స్‌ను కలిసి ఒక సంస్థగా విక్రయిస్తారని భావిస్తున్నారు.
- ✦ ప్రాంతీయ విమానయాన సంస్థ అలయన్స్ ఎయిర్‌ను మరో సంస్థగా విక్రయిస్తారని అంచనా.
- ✦ ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ (ఏఐఏటీఎస్ఎల్), ఎయిరిండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ (ఏఐఈఎస్ఎల్)ను విడిగా అమ్ముతారని భావిస్తున్నారు. ఏఐశాట్స్ అనేది ఎయిరిండియా, సింగపూర్ ఎయిర్‌లైన్స్ గ్రూప్ శాట్స్ ఆధీనంలో, చెరి 50 శాతం వాటాతో ఏర్పడిన భాగస్వామ్య సంస్థ.

ఎయిరిండియా కొనుగోలుకు ఆసక్తిగా ఉన్నట్లు ఇండిగో, ఒక విదేశీ విమానయాన సంస్థ నుంచి అధికారిక లేఖలు వచ్చినట్లు పౌర విమానయాన అధికారులు తెలిపారు.

6 రోజులు.. రూ.6000 కోట్లు

ఎఫ్‌పీఐల అమ్మకాల జోరు

దిల్లీ: దేశీయ స్టాక్ మార్కెట్లలో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల (ఎఫ్‌పీఐ) అమ్మకాల జోరు కొనసాగుతోంది. ఈ నెలలో ఇప్పటివరకు జరిగిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో రూ.6,000 కోట్లను వారు వెనక్కి తీసుకున్నారు. ఇతర వర్ధమాన దేశాల్లో మెరుగైన అవకాశాలు ఉండటమే ఇందుకు కారణమని విశ్లేషిస్తున్నారు. డిపాజిటరీల వద్ద లభ్యమవుతున్న గణాంకాల ప్రకారం.. మార్చి 1-9 తేదీల మధ్య విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు ఈక్విటీల నుంచి రూ.2,410 కోట్లు, రుణ పత్రాల విపణి నుంచి రూ.3,473 కోట్లు చొప్పున మొత్తం రూ.5,883 కోట్లు వెనక్కి తీసుకున్నారు.

రూ.1,245 కోట్ల ఎన్‌పీఏల విక్రయానికి ఎస్‌బీఐ, యూకో బ్యాంక్ సిద్ధం

దిల్లీ: రూ.1,245 కోట్ల విలువైన నికర నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏలు) విక్రయానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), యూకో బ్యాంకులు సిద్ధమయ్యాయి. వీటిని విక్రయించడానికి బ్యాంకులు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు, అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలు, ఎఫ్ఐలను ఎస్‌బీఐ, యూకో బ్యాంక్‌లు ఆహ్వానించాయి. జెనిత్ బిర్లా (ఇండియా), సోనా అల్లాయ్స్‌లు ఈ జాబితాలో ఉన్నాయి. ఎస్‌బీఐకు సోనా అల్లాయ్స్ రూ.647.64 కోట్లు చెల్లించాల్సి ఉండగా, జెనిత్ బిర్లా రూ.139.36 కోట్లు బకాయిపడింది. నేటి (మార్చి 12)లోగా ఆసక్తి తెలపాల్సిందిగా బిడ్డర్లను ఎస్‌బీఐ కోరింది. ఇ-బిడ్డింగ్ ప్రక్రియ 23న జరగనుంది. ఇదిలాఉంటే, రూ.457.98 కోట్ల విలువైన 13 ఎన్‌పీఏలను యూకో బ్యాంక్ విక్రయించనుంది. రేపటి లోగా ఆసక్తి తెలిపాల్సిందిగా బిడ్డర్లను యూకో బ్యాంక్ కోరింది.

పీఎస్‌బీల్లో ప్రత్యేక ఆడిట్: ఆర్‌బీఐ

దిల్లీ: బ్యాంకుల్లో వరుస మోసాలపై ఆర్‌బీఐ దృష్టి సారించింది. వీటిల్లో ప్రత్యేక ఆడిట్ ప్రారంభించాలని ఆదేశించింది. వాణిజ్య అవసరాలకు ఇచ్చే రుణాలపై ముఖ్యంగా భరోసా పత్రాల (ఎల్ఓయూ) ద్వారా ఇచ్చే రుణాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక ఆడిట్‌ను ఆర్‌బీఐ తెర మీదకు తీసుకొచ్చిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అన్ని బ్యాంకులు తాము ఇప్పటికే ఇచ్చిన భరోసా పత్రాల వివరాల్ని కూడా తెలపాలని ఆర్‌బీఐ కోరినట్లు సమాచారం. రూ.12,646 కోట్ల పీఎన్‌బీ కుంభకోణం తరవాత సీబీఐ దిల్లీకి చెందిన వజ్రాభరణాల ఎగుమతిదారైన ద్వారకాదాస్ సేథ్ ఇంటర్నేషనల్‌పై కేసు నమోదు చేసింది. ఓబీసీ నుంచి 2007-12 మధ్య కాలంలో రూ.389.85 కోట్ల రుణాన్ని సేథ్ పొందారు. వాణిజ్య రుణం యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని 2015లో దిల్లీకి చెందిన ఇద్దరు వ్యాపారులు బీఓబీను రూ.6,000 కోట్లకు మోసం చేశారు. ఇలాంటి వరుస మోసాల నేపథ్యంలో ఆర్‌బీఐ పలు కీలక నిర్ణయాలు తీసుకొంటోంది.

సెనగలకు అమ్మకాల సెగ!

కమొడిటీస్ ఈ వారం

● పసిడి, వెండి



పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు గత వారం రూ.30,460 వద్ద ప్రారంభమైంది. ఆ తరవాత రూ.30,687 వద్ద వారం గరిష్ఠాన్ని చేరింది. అనంతరం దిద్దుబాటుకు లోనై రూ.30,280 స్థాయికి దిగివచ్చింది. అయితే శుక్రవారం వెలువడిన అమెరికా ఉద్యోగ గణాంకాలు ప్రోత్సాహకరంగా ఉండటంతో పసిడి కాంట్రాక్టు పుంజుకున్నా, చివరకు 0.19% నష్టంతో రూ.30,401 వద్ద ముగిసింది. పసిడి కాంట్రాక్టు ఈవారం రూ.30,747 కంటే పైన చలించకుంటే రూ.30,137; రూ.30,049కి పడిపోయే అవకాశం ఉంది. అందువల్ల ప్రస్తుత షార్ట్‌సెల్ పొజిషన్లు అట్టేపెట్టుకోవచ్చు. ఈవారం అమెరికా ద్రవ్యోల్బణం గణాంకాలపై ట్రేడర్లు దృష్టి సారించాలి. వడ్డీ రేట్లపై ఫెడ్ నిర్ణయం కూడా కీలకమే. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కూడా పసిడి కాంట్రాక్టుకు కలిసొచ్చే అవకాశం ఉంది. వెండి మే కాంట్రాక్టు రూ.38,460 వద్ద ఆరంభమైంది. రూ.39,499ను చేరాక లాభాల స్వీకరణ చోటుచేసుకోవడంతో రూ.38,058కి దిగివచ్చింది. ఆఖరుకు 1.27% లాభంతో రూ.38,947 వద్ద స్థిరపడింది. ఈవారం కాంట్రాక్టు రూ.38,686 స్థాయి కిందకు రాకుంటే సానుకూలంగా చలించేందుకు అవకాశం ఉంటుంది. ఇలాంటప్పుడు లాంగ్ పొజిషన్లు కొనసాగించడం మంచిదే. అదే రూ.38,686 స్థాయి కంటే కిందకు వస్తే రూ.37,962కి పడిపోవచ్చు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని లాంగ్ పొజిషన్లు తీసుకున్నవారు స్టాప్‌లాస్‌ను తప్పక పెట్టుకోవాలి.

● ప్రాథమిక లోహాలు




రాగి ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం రూ.456 ఎగువకు వెళ్లకపోతే, పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లాలి. రూ.461.80 వద్ద స్టాప్ లాస్‌తో షార్ట్ సెల్ పొజిషన్లు కూడా అట్టేపెట్టుకోవచ్చు. సీసం మార్చి కాంట్రాక్టు ఈవారం అమ్మకాల ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. అయితే రూ.151 వద్ద గట్టి మద్దతు లభించొచ్చు. ఈ స్థాయి నుంచి తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపొచ్చు. జింక్ నవంబరు కాంట్రాక్టు ఈవారం రూ.212 స్థాయి ఎగవకు వెళ్లకుంటే అమ్మకాల ఒత్తిడి ఎదురయ్యే అవకాశం ఉంది. అందువల్ల రూ.204.85; ఆ తరాత రూ.201.65 వరకు షార్ట్‌సెల్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.217.80 ఎగువన స్టాప్‌లాస్‌ను పెట్టుకోవాలి. అల్యూమినియం మార్చి కాంట్రాక్టుకు రూ.143.85 వద్ద నిరోధం కనిపిస్తోంది. ఈ స్థాయిని నిలబెట్టుకుంటే కాంట్రాక్టు మరింత పైకి వెళ్లొచ్చు. నికెల్ మార్చి కాంట్రాక్టు ఈవారం రూ.865 దిగువకు వస్తే మరింత పడిపోయే అవకాశం ఉంది. అందువల్ల ఈ స్థాయికి దిగువన పెరిగినప్పుడల్లా అమ్మే వ్యూహంతో ముందుకెళ్లడం మంచిది.

● ఇంధన రంగం



ముడి చమురు మార్చి కాంట్రాక్టుకు ఈవారం రూ.3,921 ఎగువన లాంగ్ పొజిషన్లు తీసుకోవచ్చు. అయితే రూ.3,866 వద్ద స్టాప్‌లాస్‌ను తప్పక పరిగణించాలి. ఒకవేళ షార్ట్‌సెల్ పొజిషన్లు తీసుకోదలిస్తే రూ.4,158 వరకు వేచిచూడటం మంచిది. సహజ వాయువు మార్చి కాంట్రాక్టుకు ఈవారం కూడా లాంగ్ పొజిషన్లు కొనసాగించొచ్చు. అలాగే ధర తగ్గినప్పుడల్లా మరిన్ని పొజిషన్లు జతచేసుకోవడం మేలే.

● వ్యవసాయ ఉత్పత్తులు



సెనగలు ఏప్రిల్ కాంట్రాక్టు ఈవారం కూడా డీలాపడొచ్చు. రూ.3,667; ఆ తరవాత రూ.3,589 స్థాయిలకు పడిపోవచ్చు. రూ.3,667 వద్ద మద్దతు కనిపిస్తోంది. ఈ స్థాయి కంటే కిందకు రాకుంటే కొనుగోలుకు మొగ్గు చూపొచ్చు. ధనియాలు ఏప్రిల్ కాంట్రాక్టు సాంకేతికంగా దిద్దుబాటు అయ్యే అవకాశం కనిపిస్తోంది. రూ.5,319 దిగువకు రాకుంటే కాంట్రాక్టు తిరిగి పుంజుకోవచ్చు. గోరు చిక్కుడు మార్చి కాంట్రాక్టును ఈవారం రూ.4,141 స్థాయి దరిదాపులో కొనుగోలు చేయడం మంచిదే.

గతవారం పొజిషన్లు ఇలా

కమొడిటీ (కాంట్రాక్టు)	ప్రారంభం (రూ.లలో)	ముగింపు (రూ.లలో)	వృద్ధి/(క్షీణత) (శాతంలో)
రాగి (ఏప్రిల్)	453.15	452.30	(0.19)
సీసం (మార్చి)	160.10	155.40	(2.94)
జింక్ (మార్చి)	219.75	214.30	(2.48)
అల్యూమినియం(మార్చి)	139.80	137.40	(1.72)
నికెల్ (మార్చి)	873.40	896.10	2.60
ముడి చమురు (మార్చి)	4,006	4,017	0.27
సహజ వాయువు (మార్చి)	176.60	178.20	0.91
సెనగలు (ఏప్రిల్)	3,755	3,745	(0.27)
ధనియాలు (ఏప్రిల్)	5,554	5,492	(1.12)
గోరు చిక్కుడు (మార్చి)	4,377	4,265	(2.56)

–ఆర్ఎల్‌పీ కమొడిటీ& డెరివేటివ్స్


ఓటింగ్‌లో పాల్గొన్న జిన్‌పింగ్

ఇక జీవితకాలం అతడే..
చైనా చక్రవర్తి!


ఓటింగ్ ఫలితాల అనంతరం పార్లమెంట్‌లో హర్షం వ్యక్తం చేస్తున్న జిన్‌పింగ్ (వృత్తంలో)

బీజింగ్

చైనాలోని ఏకపార్టీ రాజకీయ వ్యవస్థలో కీలక మార్పు చోటుచేసుకుంది. దేశాధ్యక్షుడి రెండు విడతల పదవీకాలంపై ఉన్న పరిమితిని ఎత్తివేసే చరిత్రాత్మక రాజ్యాంగ సవరణకు దేశ 'రబ్బర్ స్టాంపు' పార్లమెంటు ఆమోదం తెలిపింది. దీంతో ప్రస్తుత అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ జీవితకాలం పాటు పదవిలో కొనసాగడానికి మార్గం సుగమమైంది. రెండో దఫా అధికారానికి లాంఛనంగా ఆమోద ముద్ర వేయించుకున్న 64 ఏళ్ల జిన్‌పింగ్ ప్రస్తుతం అధికార చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ)కి, శక్తిమంతమైన సైనిక కమిషన్‌కూ నాయకత్వం వహిస్తున్నారు. పార్టీ వ్యవస్థాపక ఛైర్మన్ మావో జెడాంగ్ తర్వాత జీవితకాలం పాటు అధికారంలో కొనసాగిన రెండో నేతగా ఆయన గుర్తింపు పొందనున్నారు.

ప్రస్తుతం చైనా అధ్యక్షుడు విడతకు ఐదేళ్ల చొప్పున.. రెండు విడతలు మాత్రమే అధికారంలో కొనసాగే వీలుంది. మావో పాలన తర్వాత మరో జీవితకాల నియంతృత్వం తలెత్తకుండా ఉండేందుకు 1982లో చైనా నాయకుడు డెంగ్ జియావోపింగ్ ఈ పరిమితిని తెచ్చారు. తాజాగా దానికి కాలం చెల్లింది. అధ్యక్షుడితో పాటు ఉపాధ్యక్షుడి పదవీకాలంపై ఉన్న పరిమితిని ఎత్తివేసే ప్రతిపాదనపై చైనా పార్లమెంటు 'నేషనల్ పీపుల్స్ కాంగ్రెస్' (ఎన్‌పీసీ) లాంఛనంగా ఆమోద ముద్ర వేసింది. అధికార సూచనలకు అనుగుణంగా నడుచుకుంటుందనే పేరు ఎన్‌పీసీకి ఉంది. అందుకే దీన్ని 'రబ్బర్ స్టాంప్' పార్లమెంటుగా పేర్కొంటారు. తాజా ప్రతిపాదనపైనా అదేరీతిలో వ్యవహరించింది. ఎన్‌పీసీలోని 2958 మంది దీనికి అనుకూలంగా ఓటువేశారు. వ్యతిరేకంగా రెండు ఓట్లుపడగా, ముగ్గురు గైర్హాజరయ్యారు. పార్టీలో భిన్నత్వం ఉందని చెప్పుకొనేందుకు పార్టీయే రెండు వ్యతిరేక ఓట్లు వేయించి ఉంటుందని భావిస్తున్నారు. బీజింగ్‌లోని 'గ్రేట్ హాల్ ఆఫ్ పీపుల్'లో పోడియం వరకూ నడుచుకుంటూ వెళ్లి, బ్యాలెట్ పేపర్ ద్వారా మొదటి ఓటును జిన్‌పింగ్ వేశారు. ఓట్ల లెక్కింపు అనంతరం ఫలితాన్ని ప్రకటించగానే.. కరతాళ ధ్వనులతో ఆ హాలు మారుమోగింది. తాజా ప్రతిపాదనపై ఎన్‌పీసీలో డిప్యూటీలు ఓటు వేయడానికి ముందు ఏడుగురు సభ్యుల స్థాయీ సంఘం ఆమోద ముద్ర వేసింది. సీపీసీలో ఇదే అత్యున్నత వ్యవస్థ.

ఆలోచనలకు రాజ్యాంగంలో చోటు..

సోషలిజంపై జిన్‌పింగ్ వ్యక్తంచేసిన ఆలోచనలను రాజ్యాంగంలో చేర్చడానికి ఎన్‌పీసీ సమ్మతి తెలిపింది. దీన్ని ఇప్పటికే పార్టీ నియమావళిలో చేర్చారు. అధికారంలో ఉండగా మావో తర్వాత ఇలాంటి ఘనత దక్కించుకున్న నేతగా జిన్‌పింగ్ చరిత్ర సృష్టించారు. రాజకీయ సిద్ధాంతాన్ని పాఠశాల, కళాశాల విద్యార్థులు, ప్రభుత్వ కర్మాగారాల్లోని సిబ్బంది చదవాల్సి ఉంటుంది. అవినీతి వ్యతిరేక విభాగానికి చట్టబద్ధ అధికారాలు కల్పించే నిబంధనలనూ తాజాగా రాజ్యాంగంలో చేర్చారు.

అతిపెద్ద రాజకీయ మార్పు

చైనా మొదటి రాజ్యాంగం 1954లో అమల్లోకి వచ్చింది. ప్రస్తుత రాజ్యాంగం 1982 నుంచి అమల్లో ఉంది. ఇప్పటివరకూ నాలుగుసార్లు (1988, 1993, 1999, 2004లో) సవరణలు చేశారు. 1949 నుంచి అమల్లో ఉన్న ఏకపార్టీ వ్యవస్థలో.. పదవీకాల పరిమితి తొలగింపే అతిపెద్ద రాజకీయ మార్పుగా పరిగణిస్తున్నారు.

సమష్టి నాయకత్వానికి తెర

తాజా రాజ్యాంగ సవరణతో చైనా.. ఏకపార్టీ దేశం నుంచి ఏక నాయకుడి దేశంగా మారుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే జిన్‌పింగ్‌ను చక్రవర్తిగా కొందరు అభివర్ణిస్తున్నారు. మావో హయాంలో సాంస్కృతిక విప్లవం వంటి ఘటనల్లో లక్షల సంఖ్యలో ప్రజలు హతమయ్యారు. ఈ నేపథ్యంలో నియంతృత్వాన్ని నివారించేందుకు సీపీసీ సమష్టి నాయకత్వ వ్యవస్థను అనుసరిస్తోంది. జిన్‌పింగ్‌కు ముందు అధ్యక్ష పదవులను నిర్వహించిన జియాంగ్ జెమిన్ (1993-2003), హు జింటావో (2003-2013).. ఆ వ్యవస్థను ప్రోత్సహించారు. రెండు విడతల నిబంధనను పాటించడంతోపాటు పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి నుంచీ వారు తప్పుకొన్నారు. జింటావో హయాంలో పొలిట్‌బ్యూరో స్థాయీ సంఘంలో భిన్నాభిప్రాయాలు ఉండేవి. కమ్యూనిస్టు పార్టీలోని భిన్న వర్గాలను ఆయన సంతృప్తి పరచాల్సి ఉండేది.

2013లో అధ్యక్ష పదవిని, సీపీసీ ప్రధాన కార్యదర్శి, శక్తిమంతమైన కేంద్ర సైనిక కమిషన్ (సీఎంసీ) పదవులనూ జిన్‌పింగ్ దక్కించుకున్నారు. పార్టీలో వ్యతిరేకత లేకపోవడంతో మావో తర్వాత అత్యంత శక్తిమంతమైన నాయకుడిగా ఎదిగారు. చైనా అధ్యక్ష పదవి లాంఛనప్రాయమే. వాస్తవ అధికారం సీపీసీ ప్రధాన కార్యదర్శి, సైనిక కమిషన్ ఛైర్మన్ వద్ద ఉంటుంది.

పొరుగుకు ఆందోళన

'లింగ్‌ష్యూ' (ప్రతిష్ఠాత్మక నాయకుడు) బిరుదు కలిగిన జిన్‌పింగ్.. చైనా సైనిక ఆధునికీకరణను వేగవంతం చేశారు. ఆధునిక యుద్ధాల్లో గెలిచే ప్రబల శక్తిగా తన సైన్యాన్ని తీర్చిదిద్దడం ఆయన ఉద్దేశం. ఆయనకు అపరిమిత పదవీకాలాన్ని కట్టబెట్టడంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా చైనాకు పొరుగునున్న దేశాల్లో ఇవి ఎక్కువగా ఉన్నాయి. జిన్‌పింగ్ కొనసాగింపు వల్ల భారత్‌పై ప్రభావం ఉంటుంది. గత ఏడాది డోక్లామ్‌లో భారత్‌కు ముప్పు కలిగించే రీతిలో రోడ్డు నిర్మాణానికి చైనా పూనుకోవడంతో 73 రోజుల పాటు ప్రతిష్టంభన ఏర్పడింది. ఆక్రమిత కశ్మీర్ గుండా చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా నిర్మాణం, నేపాల్, శ్రీలంక, మాల్దీవుల్లో రవాణా సంధాన ప్రాజెక్టులు వంటివీ జిన్‌పింగ్ చేపట్టారు. ఇవన్నీ భారత్‌కు వ్యూహాత్మకంగా తలనొప్పులు కలిగించేవే.

ఉపాధ్యక్షుడిగా వాంగ్

తాజా సవరణతో ఉపాధ్యక్షుడి పదవీకాలంపై కూడా పరిమితి తొలగిపోయింది. జిన్‌పింగ్‌కు విశ్వాసపాత్రుడైన వాంగ్ క్విషాన్ (69)కు ప్రయోజనం చేకూర్చడమే దీని ఉద్దేశమని భావిస్తున్నారు. తదుపరి ఉపాధ్యక్షుడిగా ఆయన పేరు దాదాపుగా ఖరారైంది. 68 ఏళ్ల కల్లా నేతలు పదవీవిరమణ పొందాలి. ఆ వయసు మీరినప్పటికీ జిన్‌పింగ్.. వాంగ్ వైపే మొగ్గుతున్నారు. 2013 నుంచి జిన్‌పింగ్ చేపట్టిన అవినీతి వ్యతిరేక కార్యక్రమానికి వాంగ్ నాయకత్వం వహిస్తున్నారు.

నిరసనలకు కళ్లెం..

తాజా సవరణలకు ఎన్‌పీసీ ఆమోదముద్ర వేయడంపై చైనీయుల్లో మౌనం రాజ్యమేలుతోంది. సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక వ్యాఖ్యానాలను ప్రభుత్వ సంస్థలు తొలగిస్తున్నాయి. అనుకూల వ్యాఖ్యానాలనే అనుమతిస్తున్నాయి.

అవినీతికి దారితీయకూడదు: జిన్‌పింగ్

'పడకింటి కబుర్లు' మిమ్మల్ని అవినీతివైపునకు మళ్లించకుండా చూసుకోవాలని జిన్‌పింగ్.. అధికారులను హెచ్చరించారు. స్వీయ నియంత్రణ కలిగి ఉండాలని సూచించారు. "మీ సంతానం.. మీ పేరును దుర్వినియోగం చేయకుండా చూసుకోండి. మీ చుట్టూ ఉన్నవారి వల్ల వివాదాల్లో చిక్కుకోకండి. అన్ని నిబంధనలను తప్పకుండా పాటించండి" అని ఎన్‌పీసీ డిప్యూటీలను ఉద్దేశించి పేర్కొన్నారు. జిన్‌పింగ్.. దేశ చరిత్రలోనే అత్యంత భారీ అవినీతి వ్యతిరేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీని కింద గత ఐదేళ్లలో పౌర, సైనిక ఉన్నతాధికారులు సహా 15 లక్షల మందికి శిక్షలు పడ్డాయి. ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని అధికారంపై ఆయన పట్టు పెంచుకున్నారన్న విమర్శలు ఉన్నాయి.

గుహ నుంచి 'అధికార గృహం'లోకి

పూర్వాశ్రమంలో గుహలో గడిపి, పొలాల్లో శ్రమించి ఆ తర్వాత అధికారాన్ని దక్కించుకున్న నాయకులు 21వ శతాబ్దంలో మనకు పెద్దగా కనిపించరు. కానీ ఐదు దశాబ్దాల కిందట 'సాంస్కృతిక విప్లవం' గుప్పెట్లో చిక్కిన చైనాలో 15ఏళ్ల షీ జిన్‌పింగ్.. పర్వతమయ లియాంగ్జియాహే గ్రామంలో దుర్భర జీవితాన్ని గడిపారు. అక్కడి నుంచి ప్రస్థానం మొదలుపెట్టిన జిన్‌పింగ్ ఇప్పుడు చైనాకు జీవితకాల అధ్యక్షుడయ్యే స్థాయికి ఎదిగారు.

నగరాల్లోని లక్షల మంది యువకులు గ్రామాలకు తరలివెళ్లి, రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని 1968లో ఛైర్మన్ మావో జెడాంగ్ ఆదేశాలు జారీ చేశారు. అయితే అది జిన్‌పింగ్ జీవితాన్ని మార్చేసింది. నేటి తన ఆలోచనలకు నాటి గుహ జీవితంలోనే బీజాలు పడ్డాయని ఆయన చెబుతుంటారు. "పసుపుపచ్చటి ఈ భూమికి నేను ఎప్పటికీ పుత్రుడినే. నా హృదయాన్ని లియాంగ్జియాహేలో పోగొట్టుకున్నా. 15 ఏళ్ల వయసులో నేను అక్కడికి వెళ్లినప్పుడు నేను చాలా ఉద్వేగంగా.. గందరగోళంగా ఉండేవాడిని. 22 ఏళ్ల వయసులో ఆ గ్రామాన్ని నేను వీడేటప్పటికి నా జీవిత లక్ష్యాలపై నాకు స్పష్టత వచ్చింది. నాలో అణువణువూ ఆత్మవిశ్వాసంతో నిండిపోయింది" అని ఆయన ఒకానొక సందర్భంలో వ్యాఖ్యానించారు.

రెండు జీవితాలు..

గుహలోకి రాకముందు జిన్‌పింగ్ రెండు రకాల జీవితాలను అనుభవించారు. ఆయన 1953లో బీజింగ్‌లో జన్మించారు. ఆయన తండ్రి షీ జోంగ్‌షన్.. కమ్యూనిస్టు పార్టీలో అగ్రనేత. ఆ పార్టీ వ్యవస్థాపక నాయకుల్లో ఒకరు. కమ్యూనిస్టు విప్లవ హీరోగా ఆయనను ఆరాధించేవారు. దీంతో జిన్‌పింగ్‌కు 'యువరాజు' మర్యాదలు దక్కేవి. అయితే అందమైన ఈ చిత్రం.. 1960లలో వచ్చిన రాజకీయ తుపాను ధాటికి చెదిరిపోయింది. సాంస్కృతిక విప్లవానికి ముందు 1962లో జిన్‌పింగ్ తండ్రిని పార్టీ నుంచి తొలగించి, జైల్లో పెట్టారు. ఆయన కుటుంబాన్ని తీవ్రంగా అవమానించారు. జిన్‌పింగ్ సోదరి ఆత్మహత్య చేసుకుంది. 13 ఏళ్ల వయసు వచ్చేసరికి అతడి చదువు ఆగిపోయింది. బీజింగ్‌లో తరగతులు నిలిచిపోవడమే ఇందుకు కారణం. వీధుల్లో తిరుగుతూ సాంస్కృతిక విప్లవం తాలూకు కఠిన శిక్షలను అక్కడికక్కడే అమలు చేస్తున్న మావో సైనికులైన 'రెడ్ గార్డ్'ల బారి నుంచి రక్షించేవారెవరూ లేకపోవడంతో బీజింగ్‌లో జిన్‌పింగ్ రెండో జీవితం మొత్తం.. మరణం, నిర్బంధాన్ని తప్పించుకుంటూనే గడిచిపోయింది. ఆ సమయంలో.. 14 ఏళ్ల వయసులో రెడ్‌గార్డ్స్‌కు తనకు మధ్య జరిగిన సంభాషణను ఆయన తర్వాతి కాలంలో ఓ విలేఖరితో పంచుకున్నారు.

రెడ్ గార్డ్స్: నీ నేరాలు ఎంత తీవ్రమైనవో తెలుసా?

జిన్‌పింగ్: మీరే అంచనా వేయండి. నాకు మరణశిక్ష విధించడానికి అవి సరిపోతాయా?

రెడ్ గార్డ్స్: ఒక్కసారి కాదు.. వందసార్లు నీ ప్రాణాలను మేం తీయాల్సి ఉంటుంది.

జిన్‌పింగ్: నా దృష్టిలో ఒక్కసారి చంపినా.. వందసార్లు చంపినా.. తేడా లేదు.

జిన్‌పింగ్ వ్యక్తిగతం..

- సింగ్‌హువా విశ్వవిద్యాలయం నుంచి కెమికల్ ఇంజినీరింగ్‌లో పట్టా పొందారు.
- 1987లో సౌందర్యరాశి అయిన గాయనీ పెంగ్ లియువాన్‌ను వివాహమాడారు.
- వారికి ఒక కుమార్తె ఉంది. ఆమె పేరు షీ మింగ్జే. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకుంది.

ఇది నాటి యువత మనస్తత్వాన్ని ప్రతిబింబిస్తోంది. తాము చదువు ఆపేసి, స్వీయ ఎత్తుగడలతో జీవించడం నేర్చుకున్నామని జిన్‌పింగ్ తరంలోని అనేక మంది చెబుతుంటారు. భావోద్వేగ కాఠిన్యాన్ని, స్వతంత్ర ఆలోచనలను ప్రోది చేసుకున్నామని తెలిపారు.

కఠిన జీవితం..

అలాంటి కఠోర పరిస్థితుల నడుమ జిన్‌పింగ్.. లియాంగ్జియాహే గ్రామం చేరుకున్నారు. 1960లలో చైనాలోని గ్రామీణ జీవితం చాలా కఠినంగా ఉండేది. విద్యుత్ సౌకర్యం, వాహనాలు ఉండేవి కావు. యాంత్రిక సాధనాలూ కనిపించేవి కావు. సేంద్రియ ఎరువును చేరవేయడం, డ్యామ్‌ల నిర్మాణం, రోడ్లకు మరమ్మతులు వంటివి జిన్‌పింగ్ నేర్చుకున్నారు. గుహలో మరో ముగ్గురితో కలసి ఇటుకలతో నిర్మించిన పడకపై ఈగల మధ్యే ఆయన నిద్రించేవారు. జిన్‌పింగ్‌లో హాస్యచతురత ఉండేదికాదని నాడు ఆయనతో కలసి గుహను పంచుకున్న లు హౌషెంగ్ గుర్తుచేసుకున్నారు. ఆటలు, యువకులతో సరదాగా తిరగడంపై, గర్ల్‌ఫ్రెండ్‌ను కలిగి ఉండాలన్న తలంపూ ఆయనలో కనిపించేవే కావని చెప్పారు. 18 ఏళ్ల వయసులోనే ఆయన రాజకీయ జీవిత నిర్మాణానికి ఉపక్రమించాడని చెప్పారు.

పార్టీపై ప్రేమ

తన కుటుంబాన్ని అస్తవ్యస్తం చేసిన కమ్యూనిస్టు పార్టీపై జిన్‌పింగ్ ద్వేషాన్ని పెంచుకోలేదు. దాన్ని హృదయపూర్వకంగా హత్తుకున్నారు. జిన్‌పింగ్ తొలుత కమ్యూనిస్టు యువ లీగ్‌లో చేరారు. తండ్రి జైలుపాలు కావడం, కుటుంబ అప్రతిష్ఠ వంటి కారణాలతో ఆయన సభ్యత్వ వినతిని కమ్యూనిస్టు పార్టీ పలుమార్లు నిరాకరించింది. ఎట్టకేలకు 1974లో.. 21 ఏళ్ల వయసులో ఆయన పార్టీలో చేరగలిగారు.


తాను ఒకప్పుడు గడిపిన గుహలో జిన్‌పింగ్

వ్యూహం ప్రకారం..

జిన్‌పింగ్ తొలుత హెబెయ్ ప్రావిన్స్‌లో పార్టీ కార్యదర్శిగా పనిచేశారు. ఆయనకు 25 ఏళ్ల వయసుకు వచ్చేటప్పటికి తండ్రి షీ జోంగ్‌షన్‌కూ రాజకీయ పునరావాసం లభించింది. గువాంగ్‌డాంగ్ ప్రావిన్స్‌కు జోంగ్‌షన్‌ను పంపారు. తన పలుకుబడితో కుమారుడి ఎదుగుదలకు బాటలు పరిచారు. తండ్రి ప్రయత్నాలకు సమాంతరంగా.. జిన్‌పింగ్ కూడా సొంతంగా నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్నారు. పార్టీలో ఉన్నతస్థానానికి చేరేలా జాగ్రత్తగా తన కెరీర్‌ను నిర్మించుకున్నారు. 1970ల చివర్లో సైనికాధికారిగా పనిచేశారు. పార్టీలో క్రమంగా పెరుగుతున్న పలుకుబడికి అనుగుణంగా జిన్‌పింగ్‌కు ఉన్నత పదవులు దక్కాయి. 1980ల నుంచి 2000ల వరకూ పార్టీలోను, ప్రభుత్వంలోను వివిధ హోదాల్లో పనిచేశారు. షాంఘై సహా పలు ప్రావిన్స్‌లకు గవర్నర్‌గా వ్యవహరించారు. ఆయన నాయకత్వం వహించిన రాష్ట్రాలు ఆర్థిక సంస్కరణల్లో ముందుండేవి.

2007లో జిన్‌పింగ్‌కు అత్యున్నత నిర్ణాయక వ్యవస్థ అయిన పొలిట్ బ్యూరో స్థాయీ సంఘంలో సభ్యత్వం దక్కింది. నాటి అధ్యక్షుడు జింటావోకు వారసుడిగా పార్టీ ఎంపిక చేసింది. ఇది చాలా మందికి ఆశ్చర్యం కలిగించింది. అయితే జిన్‌పింగ్ వేసిన వ్యూహ ఫలితంగానే ఇది సాధ్యపడింది. 2012లో ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శిగా, సైన్యంపై పర్యవేక్షణ సాగించే మిలటరీ కమిషన్‌కు ఛైర్మన్‌గా ఎంపికయ్యారు. 2013లో అధ్యక్ష బాధ్యతలను చేపట్టారు. 2016లో ఆయనకు 'కోర్' నాయకుడి హోదా దక్కింది. జిన్‌పింగ్‌కు రెండో దఫా అధ్యక్ష పీఠాన్ని కట్టబెడుతూ 2017లో పార్టీ నిర్ణయం తీసుకుంది. అయితే అప్పట్లో జిన్‌పింగ్ వారసుడిని ఎంపిక చేయకపోవడంతో.. జీవితకాలం పాటు ఆయననే అధ్యక్షుడిగా కొనసాగించాలన్న నిర్ణయానికి పార్టీ వచ్చిందన్న అభిప్రాయం వ్యక్తమైంది.

ఆరాధన..

అధ్యక్ష పీఠంలో ఉన్నప్పుడు తొలి ఐదేళ్లలో తన చుట్టూ 'వ్యక్తి ఆరాధన' జరిగేలా జిన్‌పింగ్ వ్యవహరించారు. ప్రజల మనిషి అనే ముద్రను ఏర్పర్చుకున్నారు. విస్తృతంగా పర్యటనలు చేస్తూ, గ్రామీణ భాషను మాట్లాడేవారు. బన్ దుకాణం ముందు క్యూలో నిల్చొని.. డబ్బు చెల్లించి, భోజనం చేసేవారు.

- ఒకప్పుడు జిన్‌పింగ్ గడిపిన గ్రామం ఇప్పుడు పార్టీ విధేయులకు దర్శనీయ ప్రదేశం.
- అప్పట్లో ఛైర్మన్ మావోకు చెందిన 'రెడ్ బుక్'ను అందరూ చదివేవారు. నేడు ఛైర్మన్ షీ జిన్‌పింగ్ ఆలోచనలను వివరించే భారీ హోర్డింగ్‌లు దర్శనమిస్తున్నాయి. ఆయన గౌరవార్థం ఒక మ్యూజియం కూడా వెలిసింది.

దూకుడుగా..

చైనా పునరుత్థానం కోసం.. అధ్యక్ష హోదాలో జిన్‌పింగ్ కృషి చేశారు. ఆర్థిక మందగమనాన్ని ఎదుర్కోవడానికి సంస్కరణలు తెచ్చారు. ప్రపంచాన్ని సంధానించేందుకు 'వన్ బెల్ట్, వన్ రోడ్' వాణిజ్య ప్రాజెక్టును తెచ్చారు. ఆయన నాయకత్వంలో అంతర్జాతీయ వేదికలపై చైనా మరింత దూకుడుగా వ్యవహరించింది. ప్రపంచదేశాల నిరసనలను బేఖాతరు చేస్తూ దక్షిణ చైనా సముద్రంపై ఆధిపత్యం వహించడం నుంచి ఆసియా, ఆఫ్రికాల్లో వందల కోట్ల డాలర్లు కుమ్మరించి, ఆయా దేశాలను తమ వైపునకు తిప్పుకోవడం వరకూ ఎన్నో వ్యూహాలను జిన్‌పింగ్ అమలు చేశారు. అమెరికాకు అడుగడుగునా సవాళ్లు రువ్వారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం


సినీ నటి శ్రీదేవి సంతాప సభ ఆదివారం చెన్నైలో నిర్వహించారు. శ్రీదేవి భర్త బోనీకపూర్, ఆమె కుమార్తెలు, కుటుంబ సభ్యులు, కోలీవుడ్ ప్రముఖులు సూర్య, జ్యోతిక, శివకుమార్, భాగ్యరాజా, ప్రభు తదితరులు పాల్గొన్నారు

దర్శకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్.శంకర్

ఈనాడు, హైదరాబాద్: తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం అధ్యక్షుడిగా ఎన్.శంకర్ ఎన్నికయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో సానా యాదిరెడ్డిపై ఆయన 310 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఎన్.శంకర్‌తో పాటు ఆయన ప్యానల్‌కు చెందిన జి.రామ్‌ప్రసాద్ ప్రధాన కార్యదర్శిగా, కాశీ విశ్వనాథ్ కోశాధికారిగా, ఎ.ఎస్.రవికుమార్ చౌదరి, ఎస్.వి.భాస్కర్‌రెడ్డి ఉపాధ్యక్షులుగా, కె.రంగారావు, ఎమ్.సత్య శ్రీనివాస్ సంయుక్త కార్యదర్శులుగా, డి.వి.రాజు(కళింగ), ఎన్.గోపీచంద్ కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగుతుంది.


విజయ చిహ్నం చూపుతున్న ఎన్.శంకర్, తదితరులు

సకల ఉద్యోగుల మహాసభకు వేలాదిగా తరలిరండి

ఉద్యోగ ఐకాస పిలుపు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: భాగస్వామ్య పింఛను పథకం(సీపీఎస్)ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 25న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సకల ఉద్యోగుల మహాసభకు వేలాదిగా తరలిరావాలని తెలంగాణ ఉద్యోగుల రాష్ట్ర ఐకాస ఛైర్మన్ కారం రవీందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. దీనికి సన్నాహకంగా ఆదివారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఇందులో ఐకాస సెక్రటరీ జనరల్ వి.మమతతో పాటు 31 జిల్లాల ఐకాస ఛైర్మన్లు, భాగస్వామ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దు కోసం నిర్వహించనున్న మహాసభలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనుదారులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. 17న ఖమ్మం, 19న వరంగల్, 20న మహబూబ్‌నగర్, 21న నిజామాబాద్, 22న హైదరాబాద్‌లో సన్నాహక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కమలమ్మ కన్నుమూత



పోచమ్మమైదాన్(వరంగల్), న్యూస్‌టుడే: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, సీపీఐ సీనియర్ నాయకురాలు చెన్నబోయిన కమలమ్మ(90) ఆదివారం తెల్లవారుజామున కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం తుదిశ్వాస విడిచారు. వరంగల్ పోచమ్మ మైదాన్ ప్రాంతంలోని స్వగృహానికి భౌతికకాయాన్ని తీసుకురాగా సీపీఐతోపాటు వివిధ పార్టీల నాయకులు, కళాకారులు, ప్రముఖులు నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. సై సై గోపాల్‌రెడ్డి.. పాటతో నిజాంను గడగడలాడించిన వీరవనితగా కమలమ్మ పేరొందారు. భర్త అప్పన్నతో కలిసి సాయుధ పోరాటంలో ఆమె పాల్గొన్నారు. ఆ క్రమంలోనే కొడుకుని ఓ తండాలోని గిరిజనులకు అప్పగించి పోరుబాటలో కొనసాగిన త్యాగమూర్తి అని పలువురు ఆమె సేవలను కొనియాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆమెను మహిళా అవార్డుతో సత్కరించింది. కమలమ్మ ఆశయాలను కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి తెలిపారు. కమలమ్మ మృతి పట్ల తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు జయధీర్ తిరుమల్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన వీర వనితని పేర్కొన్నారు.

జమిలి ఎన్నికలు అవసరమే

- 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' సదస్సులో వక్తలు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి జమిలి ఎన్నికలు అవసరమని రాజ్యసభ సభ్యుడు స్వపన్‌దాస్ గుప్తా పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో జాగృతి, సెంటర్ ఫర్ లీడర్‌షిప్ అండ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో 'ఒకే దేశం- ఒకే ఎన్నిక' అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన స్వపన్‌దాస్ గుప్తా మాట్లాడుతూ.. ఎన్నికలు, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, వాటిలో మనం తీసుకురావాలనుకుంటున్న సంస్కరణలపై దేశ వ్యాప్తంగా విస్తృత చర్చ జరగాలన్నారు. ఈ విషయంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలోని తేడాను, దేశ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రధాని జమిలి ఎన్నికల ప్రస్తావన తీసుకురావడం వెనకున్న కారణాలు ఏవైనా.. ప్రస్తుత పరిస్థితుల్లో అది ఆహ్వానించదగిన పరిణామమని అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలను సాధారణంగా చూడాలే తప్ప.. అసాధారణంగా చూడొద్దన్నారు. చట్టసభల్లో మంచి వారికి అవకాశం కల్పించడానికి మోదీ ప్రతిపాదన దోహదపడుతుందన్నారు. అంతకుముందు కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి కె.పద్మనాభయ్య మాట్లాడుతూ.. అసెంబ్లీ, పార్లమెంట్‌తో పాటు స్థానిక సంస్థలకూ ఎన్నికలు ఒకేసారి నిర్వహించాలన్నారు. దాని వల్ల ఒనగూరే ప్రయోజనాలు, రాజ్యాంగ, న్యాయపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్ నారాయణ ప్రసంగిస్తూ.. నచ్చిన నాయకుడికి ఎన్నుకునే అవకాశం ప్రజలకు నేరుగా కల్పించినప్పుడే ఓట్లకోసం పాకులాడే వ్యవస్థలో మార్పు సాధ్యమవుతుందన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ మాజీ వైస్ ఛైర్మన్ మర్రి శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. తరచూ వచ్చే ఎన్నికలు అభివృద్ధి, పాలనపై దుష్ప్రభావం చూపుతున్నాయన్నారు. జాగృతి సంపాదకుడు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామాలయంలో శివస్వామి వినూత్న నిరసన

భద్రాచలం, న్యూస్‌టుడే: అమరావతి సమీపంలోని శ్రీశైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి ఆదివారం భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ దర్శనానికి వచ్చిన క్రమంలో వివాదం తలెత్తింది. అయోధ్యలో రామమందిరం నిర్మాణం చేపట్టాలని కోరుతూ అంబాసత్రంలో యజ్ఞ నిర్వహణకు శివస్వామి భద్రాచలం వచ్చారు. సాయంత్రం 4 గంటల సమయంలో శిష్యులు, భక్తులతో కలిసి ఆలయ దర్శనానికి వెళ్లారు. ఆ సమయంలో రామాలయ వైదిక పెద్దలకు, శివస్వామికి మధ్య ఆసక్తికర చర్చ జరిగింది. శివస్వామి తరపున విశ్వధర్మ పరిరక్షణ వేదిక పేరిట 'పునాదులు కదులుతున్న భద్రాద్రి' అనే శీర్షికతో ఇటీవల కరపత్రాలను విడుదల చేశారు. ఇందులో ఇక్కడి పూజల్లో వచ్చిన మార్పులను తప్పుబట్టారు. ఈ కరపత్రాల గురించి వైదిక పెద్దలు అడగడంతో తర్వాత దీని చర్చిద్దాం ముందు దర్శనానికి వెళ్లాలని శివస్వామి బదులిచ్చి వెళ్లారు. ప్రధాన ఆలయంలో పూజలు చేసిన అర్చకులు క్షేత్ర విశిష్టతను వివరిస్తూ రాముడ్ని ఓంకార రాముడు, వైకుంఠ రాముడు, రామ నారాయణుడు అంటారని ప్రవచించారు. ఇందులో రామ నారాయణుడు అనేది వివాదానికి దారి తీసింది. శివస్వామి అభ్యంతరం వ్యక్తం చేస్తూ.. రాముడు అందరివాడని రామ నారాయణ అనడం తగదని కోవెలలో నిరసన వ్యక్తం చేశారు. అధికారులు శివస్వామితో చర్చించి తాత్కాలికంగా వివాదానికి తెరదించారు.


వైదిక బృందానికి, శివస్వామికి మధ్య వాదన

మాతృభాషను కాపాడుకోవాలి

- ఇందుకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కృషి చేయాలి
- డీటీఏ ఉగాది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు
- దిల్లీ తెలుగు అకాడమీకి శాశ్వత భవనం కావాలి: జస్టిస్ ఎన్వీరమణ



దిల్లీలో జరిగిన దిల్లీ తెలుగు అకాడమీ 30వ ఉగాది ఉత్సవాల్లో జస్టిస్ ఎన్వీ రమణ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్

ఈనాడు, దిల్లీ: భాష ఆంగ్లమైనా భావన భారతీయత కావాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తెలిపారు. మాతృభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆ దిశగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, కేసీఆర్‌లు కృషి చేయాలని కోరారు. ఆదివారం నాడిక్కడ నిర్వహించిన దిల్లీ తెలుగు అకాడమీ(డీటీఏ) 30వ ఉగాది ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. దిల్లీలో తెలుగువారి మనోవికాసానికి డీటీఏ చేస్తున్న కృషిని అభినందించారు. అచ్చమైన తెలుగుదనానికి ప్రతీక ఉగాది అని, షడ్రుచుల మేళవింపుతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే తెలుగు వారందరి జీవితాల్లో వసంతం రావాలని ఆకాంక్షించారు. అమ్మ అనే పిలుపు అంతరాళం నుంచి వస్తుందని మాతృభాషను విస్మరించొద్దని ఉద్ఘాటించారు. పురస్కార గ్రహీతలు ఇతరులకు ఆదర్శంగా కావాలని వెంకయ్యనాయడు పేర్కొన్నారు.

తెలుగు సాహిత్యం, భాష పటిష్ఠపరిచే ప్రయత్నాలు జరగాలని సభ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీరమణ ఆకాంక్షించారు. దేశరాజధానిలో తమిళ భాష కార్యక్రమాలు తరచూ జరుగుతుంటాయన్నారు. అలాంటి చర్చలు, ఇష్టాగోష్ఠులు మనభాషలోనూ జరగడానికి దిల్లీ తెలుగు అకాడమీకి శాశ్వత భవనం కావాలన్నారు. ఇందుకు ఉపరాష్ట్రపతి చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. ఆయనను తెలుగుతల్లి ముద్దుబిడ్డ అని జస్టిస్ ఎన్వీరమణ కొనియాడారు.

పలువురికి సన్మానం

జీవనసాఫల్యం పురస్కారంతో ఇఫ్కో ఎండీ సీఈవో ఉదయశంకర్ అవస్థి, నటుడు జగపతిబాబులను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, జస్టిస్ ఎన్వీరమణలు సత్కరించారు. డీటీఏ ఉద్యోగరతన్ పురస్కారం శైలజాకిరణ్‌కు, డీటీఏ ప్రతిభ భారతి పురస్కార్‌లను.. సంజీవరావు, ఎంఎం.శ్రీలేఖ, రమ్యకృష్ణ, ఆర్పీ పట్నాయక్, వైద్యురాలు ఆర్.సుధారాణిలకు అందజేసి సన్మానించారు. గాయకులు విజయలక్ష్మి, కె.హారిక, ఇ.మనీష, పీవీఎన్ఎస్ రోహిత్, సాకేత్‌లను సత్కరించారు. డీటీఏ కార్యనిర్వాహక ఛైర్మన్ ప్రవీణ్ ప్రకాశ్, ఛైర్మన్ మోహన్ కందా, ప్రధాన కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

తెలుగువారిని చూస్తుంటే ఉత్సాహం

మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్

దిల్లీలో తెలుగువారిని చూస్తుంటే తనకెంతో ఉత్సాహం వచ్చిందని డీటీఏ ఉద్యోగరతన్ ఉగాది పురస్కార గ్రహీత మార్గదర్శి ఎండీ శైలజాకిరణ్ తెలిపారు. దేశరాజధానిలో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా సత్కారం అందుకోవడం గొప్ప అనుభూతిని కలిగించిందన్నారు. ‘‘మార్గదర్శికి 28 ఏళ్ల వయసులో నన్ను మేనేజింగ్ డైరెక్టర్‌గా రామోజీరావు ప్రకటించారు. చిన్న వయసులో ప్రజల డబ్బు నిర్వహణ చేయగలనా అని భయమేసింది. ఇది మన డబ్బు కాదు ప్రజల డబ్బు. ప్రతి ఒక్కరికీ వెనక్కి ఇవ్వాలన్న బాధ్యతతో నడుచుకుంటే ఇబ్బంది ఉండదని రామోజీరావు సూచించారు. ఆ మేరకు నడుచుకుంటూ ప్రస్తుతం 105 శాఖలతో 9500 కోట్ల రూపాయల టర్నోవర్ సాధించాం. 4400 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. మూడున్నర లక్షల మంది జీవితాల్లో నమ్మకం కలిగించి వాళ్లకి అవసరమైన సమయాల్లో సకాలంలో సొమ్ములు ఇవ్వగలిగాం. పిల్లల చదువులు, పెళ్లిళ్లు ఇలా అవసరమైనప్పుడు మార్గదర్శి ద్వారా అందజేయగలుతున్నాం. వారంతా చక్కగా అభివృద్ధి చెందుతున్నారు. దేశరాజధానిలోని తెలుగువారంతా అభివృద్ధి చెందాలని, ఉగాది పర్వదినాన మరింత ముందుకెళ్లాలని కోరుకుంటున్నా’’ అని శైలజాకిరణ్ ఆకాంక్షించారు.


సదస్సును ప్రారంభిస్తున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వినిత్ శరణ్, హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజుపండా తదితరులు

బాల నేరస్థులకు మార్గదర్శకం చేయాలి

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర

కటక్, న్యూస్‌టుడే: బాలనేరస్థులకు న్యాయం అందించేందుకు అన్ని రంగాలవారూ సహకరించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్‌మిశ్ర పిలుపునిచ్చారు. ఆదివారం ఒడిశాలోని కటక్‌లో రాష్ట్ర శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాన్ఫరెన్స్ ఆన్ జువైనల్ జస్టిస్ అనే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బాలనేరస్థులకు మార్గదర్శనం చేస్తూ ఉపాధిపై శిక్షణ ఇచ్చి వారిలో మనోధైర్యం పెంచితే రాణిస్తారన్నారు. వీరిలో మనోధైర్యం పెంచే విషయంలో ప్రభుత్వాలు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఒడిశా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వినీత్‌శరణ్ మాట్లాడుతూ చాలాచోట్ల బాల్యం నుంచి మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతున్నవారు నేరమయ జీవితంవైపు మళ్లుతున్నారని విశ్లేషించారు. పేదరికం, నిరక్షరాస్యత చిన్నారులను అడ్డదారి పట్టిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం పేద బాలల సంక్షేమంపై శ్రద్ధ చూపాలన్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సంజుపండా పాల్గొన్నారు.

“నాన్న హంతకులను ప్రియాంకా... నేనూ క్షమించేశాం”: రాహుల్‌గాంధీ

సింగపూర్: తమ తండ్రి రాజీవ్‌గాంధీని హత్యచేసిన వారిని తాను, సోదరి ప్రియాంకా గాంధీ కూడా సంపూర్ణంగా క్షమించేశామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ స్పష్టం చేశారు. శనివారం నాడిక్కడ ఆయన ట్విటర్‌లో ఈ విషయాన్ని పేర్కొన్నారు. ఎవరినైనా సరే ఎల్లకాలం ద్వేషించడం అనేది ఎంతో కష్టంగా ఉంటుందనిపించినట్లు చెప్పారు. ఐఐఎం పూర్వ విద్యార్థులతో రాహుల్ ఇక్కడ మాట్లాడారు. ‘‘నాన్న చనిపోతారనీ.... నాన్నమ్మ చనిపోతారని కూడా తెలుసు. ఎందుకంటే... రాజకీయాల్లో వ్యతిరేక శక్తులను ఎదుర్కొన్నప్పుడు.... వాటికి ఎదురు నిలిచి దృఢంగా నిలబడినప్పుడు మరణం ఖాయం’... అని రాహుల్ ట్విటర్‌లో పెట్టిన వీడియోలో పేర్కొన్నారు. తాను, సోదరి ప్రియాంక కూడా ఎంతో బాధపడ్డాం. నాన్న హంతకుల మీద పట్టరాని ఆగ్రహం ఉండేది. అయితే ఎందుకనో... మేము వారిని క్షమించేశాం అని రాహుల్ అన్నారు.

15న టీటీవీ దినకరన్ కొత్త పార్టీ ప్రకటన?

చెన్నై, న్యూస్‌టుడే: తమిళనాడులోని ఆర్కేనగర్ ఎమ్మెల్యే టీటీవీ దినకరన్ మదురై వేదికగా ఈనెల 15న కొత్త పార్టీ పేరు ప్రకటించనున్నట్లు సమాచారం. అన్నాడీఎంకే నుంచి ఉద్వాసనకు గురయ్యాక కొత్త పార్టీ ప్రారంభించడానికి దినకరన్ ప్రయత్నాలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందుకు అవాంతరాలు ఎదురైన నేపథ్యంలో న్యాయపోరాటం ద్వారా ఆయన పైచేయి సాధించారు. దినకరన్‌కు ప్రెషర్ కుక్కర్ గుర్తు, ఆయన పార్టీకి పేరు కేటాయించాలని ఎన్నికల సంఘాన్ని దిల్లీ హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో శనివారం తన నివాసంలో మద్దతుదారులతో భవిష్యత్తు కార్యాచరణ గురించి దినకరన్ చర్చలు జరిపారు.

18 ఏళ్లు వచ్చిన వారు ఆ ఏడాదంతా ఓటరుగా నమోదు చేసుకోవచ్చా!

ఈసీని కోరిన ప్రభుత్వం

దిల్లీ: ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ఉవ్విళ్లూరుతున్న యువ ఓటర్లకు ఇది ఒకరకంగా శుభవార్తే కావచ్చు. 18 ఏళ్ల వయసు వచ్చిన యువజనులు ఆ ఏడాది పొడవునా ఎప్పుడైనా సరే ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేసుకోగలిగే వెసులు బాటు ఉంటుందా అనే విషయాన్ని తెలియ చేయాల్సిందిగా ఎన్నికల సంఘాన్ని కేంద్రం కోరింది. ఇప్పటిదాకా కూడా... జనవరి 1 నాటికి 18 సంవత్సరాల వయసు వచ్చిన వారిని ఆ ఏడాది ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవడానికి అనుమతినిస్తున్నారు. ఆ తర్వాత అంటే... జనవరి ఒకటోతేదీ దాటిన తర్వాత పద్దెనిమిదేళ్ల వయసు వచ్చిన వారు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవడానికి మరుసటి ఏడాదిదాకా ఆగాల్సి వస్తోంది. ఒకవేళ అదే సంవత్సరం ఎన్నికలేమైనా ఉంటే... ఆ యువజనులకు ఓటు వేసే అవకాశమే లేకుండా ఉంది. ఈ పరిస్థితి మారాలనీ... 18 ఏళ్లు వచ్చిన తర్వాత ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఉద్దేశించిన గడువు తేదీలు వేర్వేరుగా ఉండాలని ఈసీ ఎప్పటి నుంచో కోరుతోంది. అందులో భాగంగా కొన్ని తేదీలను ప్రతిపాదించింది. అయితే, 2016లో న్యాయశాఖ జనవరి ఒకటి. ...జులై ఒకటో తేదీలను గడువులుగా ప్రతిపాదించింది.

1700 మంది ప్రజాప్రతినిధులపై క్రిమినల్ కేసులు పెండింగ్!

దిల్లీ: దేశవ్యాప్తంగా దాదాపు 17 వందల మంది సిట్టింగ్ ఎంపీలు. ..ఎమ్మెల్యేలు క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. వీరిపై పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల సంఖ్య 3,045గా ఉన్నట్లు సుప్రీంకోర్టుకు కేంద్రప్రభుత్వం తెలియచేసింది. అంతేకాదు..., ఈ క్రిమినల్ కేసులను విచారించేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసుకోవలసిందిగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరినట్లు కూడా కేంద్రం వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో సహా 11 రాష్ట్రాల్లో ప్రత్యేక కోర్టుల ఏర్పాటు ప్రక్రియ నడుస్తున్నట్లు తెలిపింది. ఇక, రాష్ట్రాల వారీగా చూస్తే.... అత్యధిక క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధుల సంఖ్య ఉత్తరప్రదేశ్‌లో ఎక్కువగా ఉంది. ఇక్కడ 248 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులున్నాయి. ఆ తర్వాతి స్థానంలో తమిళనాడు, బిహారు, పశ్చిమబెంగాల్‌లున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళల్లో వందమందికిపైగా ప్రజా ప్రతినిధులపై పలు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయంటూ సుప్రీంకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం వివరించింది.

యూపీ లోక్‌సభ ఉపఎన్నికల్లో తగ్గిన పోలింగ్

లఖ్‌నవూ, పట్నా: ఉత్తర్‌ప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్, ఫుల్పూర్, బిహార్‌లోని అరారియా లోక్‌సభ స్థానాలకు ఆదివారం ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. గోరఖ్‌పూర్‌లో 47 శాతం, ఫుల్పూర్‌లో 38, అరారియాలో 57 శాతం ఓటింగ్ నమోదైందని ఎన్నికల అధికారులు తెలిపారు. గోరఖ్‌పూర్‌లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఓటుహక్కును వినియోగించుకున్నారు. సార్వత్రికానికి ముందు జరుగుతున్న ఇవి సన్నాహక ఎన్నికలని.. భాజపా అత్యధిక ఆధిక్యంతో విజయం సాధిస్తుందని ఆదిత్యనాథ్ ధీమా వ్యక్తంచేశారు. మరోవైపు బిహార్‌లోని భబువా, జెహనాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల ఉపఎన్నికల్లో వరసగా 54.03, 50.06 శాతం ఓటింగ్ నమోదైంది.

హైపర్‌సోనిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించిన రష్యా

మాస్కో: ధ్వని కంటే 10 రెట్లు ఎక్కువ వేగంతో దూసుకువెళ్లగలిగే హైపర్‌సోనిక్ క్షిపణిని ఆదివారం విజయవంతంగా పరీక్షించినట్లు రష్యా తెలిపింది. దీనినొక ‘ఆదర్శవంతమైన ఆయుధం’గా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. ఈ ‘కింఝాల్’ (డాగర్) క్షిపణిని మిగ్-31 సూపర్‌సోనిక్ జెట్ నుంచి ప్రయోగించారు. అన్నీ అనుకున్న ప్రకారమే జరిగి, నిర్ణీత లక్ష్యాన్ని ఈ క్షిపణి ఛేదించిందని రష్యా రక్షణ మంత్రిత్వశాఖ తెలిపింది. అత్యాధునిక ఆయుధాల సమీకరణలో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. కింఝాల్ క్షిపణిని తీసుకుపోయే మిగ్-31 జెట్‌లను ఆధునికీకరించే పని కూడా పూర్తయిందని ఉప ప్రధాని ద్మిత్రి రొగొజిన్ తెలిపారు.

జమ్ము చేరిన రజనీకాంత్



జమ్ము: హిమాలయాల్లో 15రోజుల ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా సూపర్ స్టార్ రజనీకాంత్ ఆదివారం ఇక్కడికి చేరుకున్నారు. ఏటా ఆయన ఇలాంటి యాత్రను నిర్వహించే సంగతి ఈ సందర్భంగా గమనార్హం. ఇక్కడికి సమీపంలోని రేసీ జిల్లాలోని శివాలయాన్ని రజనీకాంత్ సందర్శించుకుని పూజలు నిర్వహించారు. తాను కేవలం ఆధ్యాత్మికపరమైన యాత్రకోసమే ఇక్కడికి వచ్చానన్నారు. తాను ఇదివరకు హిమాచల్ ప్రదేశ్‌లో ఉన్నాననీ... అనంతరం కశ్మీరుకు కూడా వెళ్లినట్లు చెప్పారు. జమ్ము రావడం ఇదే తొలిసారని పేర్కొన్నారు. తాను ఇక్కడి నుంచి హిమాలయాలు, రిషికేశ్, తదితర ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు చెప్పారు. తన వద్ద ఎన్నో యోచనలున్నాయనీ.... ఇప్పుడు వాటిని వెల్లడించాలనుకోవడం లేదని తెలిపారు.

రాజ్యాంగేతర శక్తుల్లా వ్యవహరించొద్దు

- చట్టాల రూపకల్పనపై దృష్టిపెట్టాలి
- ప్రజాప్రతినిధులకు వెంకయ్యనాయుడు హితవు
- అధికార, ప్రతిపక్షాలు సర్దుబాటు స్ఫూర్తితో నడుచుకోవాలని సూచన

ఈనాడు – దిల్లీ

చట్టసభలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాకులాడుతూ సభా కార్యకలాపాలను అడ్డుకుంటుండంవల్ల ప్రజల్లో విశ్వాసం సన్నగిల్లుతోందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ఆందోళన వ్యక్తం చేశారు. ‘వుయ్ ఫర్ డెవలప్‌మెంట్’ పేరుతో పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన ప్రజాప్రతినిధుల సదస్సు ముగింపు సమావేశంలో ఆయన ప్రసంగించారు. ‘‘కార్యనిర్వాహక వ్యవస్థపై పట్టు పెంచుకోవడం. నేరనేపథ్యం, చట్టసభలకు ఎన్నికైన తర్వాత ఆస్తుల్లో ఊహించని వృద్ధి, చట్టసభల్లో ప్లకార్డులు-బ్యానర్ల ప్రదర్శన, నిరంతరం సభలను అడ్డుకోవడం, ఫిరాయింపులు, ఎన్నికల అక్రమాల్లాంటి చర్యల వల్ల ప్రజాప్రతినిధుల విశ్వసనీయత దెబ్బతింటోంది. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి తీవ్ర సవాల్‌గా మారుతోంది. ప్రజాప్రతినిధుల చట్టబద్ధత ఇప్పుడు ప్రధాన సమస్యగా మారుతోంది.

ప్రజాప్రతినిధులు ప్రజలకు ఉపయోగపడే చట్టాలు రూపొందించేలా ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడానికి ప్రజా ఉద్యమాలు నిర్వహించాల్సిందిపోయి అధికార కేంద్రాలుగా మారడానికి ప్రయత్నించడం నానాటికీ పెరిగిపోతోంది. రాజ్యాంగం ప్రకారం ప్రజాప్రతినిధులు, కార్యనిర్వాహక వర్గం స్వతంత్రంగా పనిచేయాలి. ఆ రెండింటి మధ్య అవాంఛనీయ సంబంధాలు నెలకొనడం పార్లమెంటరీ ప్రజాసామ్యానికి మంచిదికాదు. శాసనవ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్గించాలంటే ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టాల రూపకల్పనపై పూర్తిగా దృష్టిసారించాలి. ప్రభుత్వం, ప్రజల మధ్య వారధిలా పనిచేయాలి. ప్రజాస్వామ్యంలో చర్చలే అన్ని సమస్యలకూ పరిష్కారమార్గాలు. ప్రజల విస్తృత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అధికార, ప్రతిపక్షాలు రెండూ సర్దుబాటు సిద్ధాంతాన్ని స్ఫూర్తిగా తీసుకొని పనిచేయాలి. అత్యంత అరుదైన విషయాల్లో మాత్రమే సంఖ్యాబలాన్ని ప్రయోగించాలి. చట్టసభల్లోకి నేరనేపథ్యం ఉన్నవారి సంఖ్య పెరిగిపోతున్నట్లు ప్రసారమాధ్యమాల్లో వార్తలొస్తున్నాయి. మంచి అభ్యర్థులను ఎంచుకోవడంపై రాజకీయపార్టీలు ప్రధానంగా దృష్టిపెట్టాలి. చట్టవ్యతిరేకమైన రాజకీయ చర్యల నిరోధానికి ఫిరాయింపులు, ఎన్నికల సంబంధమైన కేసులను నిర్దుష్టగడువులోగా పరిష్కరించాలి. సభలను అడ్డుకోవడానికి బదులు నాణ్యమైన చర్చలు జరపడానికి సభ్యులు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రజాప్రతినిధులు రాజ్యాంగేతర శక్తులుగా ప్రవర్తించడానికి బదులు భాగాస్వామ్య అభివృద్ధిలో పాలుపంచుకోవాలి’’ అని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సూచించారు.

తెగిపోయిన కాలే.. తలగడగా

ఉత్తర్ ప్రదేశ్‌లో వైద్య సిబ్బంది నిర్వాకం

ఝాన్సీ: ప్రమాదంలో కోల్పోయిన కాలిని బాధితుడి తలగడగా వైద్య సిబ్బంది ఉపయోగించిన ఉదంతమిదీ..! విస్తుగొలిపే ఈ ఘటన ఉత్తర్ ప్రదేశ్‌లోని మహారాణీ లక్ష్మీబాయి వైద్య కళాశాల ఆసుపత్రిలో జరిగింది. శనివారం రాత్రి ఓ బస్సు ప్రమాదంలో 28ఏళ్ల ఘన్‌శ్యామ్ ఓ కాలును కోల్పోయారు. ప్రాణాలతో పోరాడుతున్న ఆయన్ను ఆసుపత్రికి తరలించారు. అతడి తలను శరీరంకంటే కాస్త ఎత్తులో ఉంచేందుకు ఓ తలగడను వేయాలని వైద్యులు సూచించారు. దీంతో వైద్య సిబ్బందిలో ఒకరు కాలినే తలగడగామార్చారు. తలకింద కాలితో బాధితుడ్ని తరలిస్తున్న దృశ్యాలు అంతర్జాలంలో స్వైరవిహారం చేశాయి. దీంతో ఇద్దరు వైద్యులు, ఇద్దరు నర్సులపై రాష్ట్ర ప్రభుత్వం వేటువేసింది. కాలిని తలకింద ఎవరు పెట్టారో విచారించేందుకు నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటుచేశామని వైద్య కళాశాల ఆసుపత్రి ప్రిన్సిపల్ సాధనా కౌశిక్ తెలిపారు.

పిల్లల చదువులపై అమ్మానాన్నల శ్రద్ధ భారత్‌లో ఎక్కువ!

తాజా అధ్యయనంలో వెల్లడి

లండన్: పిల్లల హోంవర్క్...పాఠశాలకు సంబంధించి వారికి అప్పగించే ఇతరత్రా పనుల విషయంలో చిన్నారులకు చేదోడువాదోడుగా ఉండేందుకు తాపత్రయపడే తల్లిదండ్రుల్లో భారతీయులే అగ్రస్థానంలో ఉన్నారు. బ్రిటన్ కేంద్రంగా పనిచేసే వార్కే ఫౌండేషన్ నిర్వహించిన తాజా అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. 29 దేశాల్లో దాదాపు 27వేల మందిపై వార్కే ఫౌండేషన్ అధ్యయనం నిర్వహించింది. ఈ అధ్యయనంలోనే పిల్లల చదువుసంధ్యల పట్ల భారతీయ తలిదండ్రులు 95శాతం దృష్టిపెడతారు. శ్రద్ధచూపుతారు. పిల్లలకోసం ఎక్కువ సమయాన్ని కేటాయిస్తారు. యుకెలో ఈ పరిస్థితి భిన్నంగా ఉంది. బ్రిటన్‌లో తల్లిదండ్రులు రోజుకు గంట కంటే తక్కువ సమయాన్ని పిల్లల చదువు సంధ్యల కోసం కేటాయిస్తున్నారు. భారతదేశంలో విద్యాప్రమాణాలు గత పదేళ్లలో బాగా మెరుగుపడినట్లు తల్లిదండ్రులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. 87 శాతం మంది భారతీయ తల్లిదండ్రులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

కేన్సస్‌లో కూచిభొట్ల శ్రీనివాస్ భార్య సునయన శాంతియాత్ర

హ్యూస్టన్: కేన్సస్ నగరంలో గత ఫిబ్రవరిలో జాతి విద్వేషానికి బలైపోయిన తెలుగు ఇంజినీరు శ్రీనివాస్ కూచిభొట్ల భార్య సునయన దుమాల ఇక్కడ ‘శాంతి యాత్ర’ను నిర్వహించారు. తన భర్త శ్రీనివాస్ 34వ పుట్టిన రోజైన శుక్రవారం నాడు ఈ యాత్ర నిర్వహించారు. అతడు పనిచేసిన గార్మిన్ సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి జాతి విద్వేషాగ్నికి బలైపోయిన బార్ వరకూ సుమారు మూడుకిలోమీటర్ల పొడవున ఈ శాంతియాత్ర సాగింది. ఆమె సారథ్యంలో జరిగిన శాంతి యాత్రలో శ్రీనివాస్ స్నేహితులు, సహోద్యోగులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం శ్రీనివాస్ పనిచేసిన గార్మిన్ సంస్థ కార్యాలయం వెలుపల హాజరైన వందలాది మందిని ఉద్దేశించి సునయన ప్రసంగించారు. ఓ వ్యక్తి జాతివిద్వేషానికి ఓ అమాయకమైన ప్రాణం బలైపోయింది అంటూ ఆమె పేర్కొన్నారు.

‘తెలుగు’ ఎన్‌ఐటీల్లో అమ్మాయిలు అధికమే!

- 23.5 శాతంతో ఏపీ ఎన్‌ఐటీ ప్రథమ స్థానం.. 19.5 శాతంతో వరంగల్ తృతీయ స్థానం
- జాతీయ సగటు 14.3 శాతమే
- తెలుగు రాష్ట్రాల్లో మినహా 14 ఎన్‌ఐటీల్లో వచ్చే ఏడాది బాలికలకు పెరగనున్న సీట్లు

ఈనాడు, హైదరాబాద్: దేశవ్యాప్తంగా జాతీయ సాంకేతిక సంస్థ(ఎన్‌ఐటీ)ల్లో ఇంజినీరింగ్ విద్యనభ్యసిస్తున్న అమ్మాయిలు శాతం తక్కువగా ఉన్నా.. తెలుగు రాష్ట్రాల్లోని రెండు ఎన్‌ఐటీల్లో మాత్రం అధికంగా ప్రవేశాలు పొందుతున్నారు. ఈ మేరకు కేంద్ర సర్వేలో తేలింది. ఇంజినీరింగ్ విద్యలో బాలికల శాతం తక్కువగా ఉంటుందని భావించిన కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ.. వారి సంఖ్యను పెంచేందుకు సూపర్ న్యూమరీ సీట్లు కేటాయించాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే దేశంలోని అన్ని ఎన్‌ఐటీల్లో అమ్మాయిల ప్రవేశాల సంఖ్యపై గణాంకాలను సేకరించింది. ఇందులో ఏపీలోని తాడేపల్లిగూడెం ఎన్‌ఐటీ 23.5 శాతం బాలికలతో ప్రథమ స్థానంలో ఉండగా.. తెలంగాణలోని వరంగల్ ఎన్‌ఐటీ 19.5 శాతంతో తృతీయ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఈ రెండు రాష్ట్రాల్లో బాలికలకు సీట్లు పెరగవని అధికారులు స్పష్టంచేస్తున్నారు. ఇంజినీరింగ్ రంగంలో కూడా బాలికలు ఎక్కువగా ప్రవేశిస్తే దేశానికి అన్ని విధాలా ప్రయోజనమని ఓ కమిటీ సిఫారసు చేయడంతో కేంద్రం ఐఐటీ, ఎన్‌ఐటీల్లో వారి శాతాన్ని 20కి పెంచాలని నిర్ణయించింది. మొత్తం 31 ఎన్‌ఐటీల్లో 17,061 సీట్లుండగా వాటిల్లో 2016లో 22 శాతం బాలికలకు లభించాయి. 2017లో అది 14.3 శాతానికి పడిపోయింది. ప్రస్తుతం జంషెడ్‌పూర్‌లో కేవలం 5.9 శాతం బాలికలకే ప్రవేశం పొందారు. దిల్లీలో 8, అలహాబాద్‌లో 8.3, అసోంలో 9.3 శాతమే సీట్లు దక్కించుకున్నారు. మొత్తానికి జాతీయసగటు 14.3శాతమే ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో బాలికలకు ప్రత్యేకంగా సీట్లు పెంచాలని కేంద్రం నిర్ణయించింది. వచ్చే విద్యా సంవత్సరం ప్రతి ఎన్‌ఐటీలో కనీసం 14 శాతానికి, 2019-20లో 17శాతానికి, 2020-21కి 20 శాతానికి పెంచనున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో పెరగవు..: గత రెండు మూడు దశాబ్దాల నుంచి తెలుగు విద్యార్థులు ఇంజినీరింగ్, మెడికల్‌పై ఆసక్తి చూపుతూ వస్తున్నారు. జేఈఈ మెయిన్‌లో కూడా మంచి ప్రతిభ చూపుతుండటంవల్ల తెలుగు రాష్ట్రాల అమ్మాయిలు ఎన్‌ఐటీల్లో చేరుతున్నారు. నిబంధనల ప్రకారం ఏ రాష్ట్రంలో ఎన్‌ఐటీ ఉంటే అందులో 50 శాతం సీట్లు సొంత రాష్ట్రానికి కేటాయించారు. దీనివల్ల ఏపీ, తెలంగాణ విద్యార్థినులు స్థానిక ఎన్‌ఐటీల్లోనే చేరుతున్నారని నిపుణులు చెబుతున్నారు. ‘14 శాతం కంటే తక్కువ ఉన్న చోట్లే వచ్చే విద్యా సంవత్సరం వారికి సూపర్ న్యూమరీ సీట్లు సృష్టిస్తారని, అందువల్ల తెలుగు రాష్ట్రాల్లోని ఎన్‌ఐటీల్లో సీట్లు పెరగవు’ అని వరంగల్ ఎన్‌ఐటీ సంచాలకుడు ఎన్‌వీ రమణారావు తెలిపారు. ఈ క్రమంలో మొత్తం 31 ఎన్‌ఐటీల్లో 14శాతం కంటే తక్కువఉన్న సంస్థలు 14 ఉన్నాయి. వాటిల్లో మాత్రమే అమ్మాయిలకు సీట్లు పెరుగుతాయి.

ప్రజాస్వామ్యాలకు ఇది పరీక్షా సమయం

- ఆసియా భవిష్యత్తుకు భారత్ కీలక పాత్ర పోషించాలి
- అమెరికా అధ్యక్షునిగా ట్రంప్ తగరు
- ఇక ఎన్నికల్లో పోటీ చేయను
- హిల్లరీ క్లింటన్ వెల్లడి

ముంబయి: అమెరికా, భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య దేశాలకిది పరీక్షా సమయమనీ, వాటిని బలోపేతం చేయాల్సిన ఆవశ్యకత ఉందనీ అమెరికా విదేశాంగ శాఖ మాజీ మంత్రి హిల్లరీ క్లింటన్ పేర్కొన్నారు. కేవలం ప్రభుత్వాలు, రాజకీయ నాయకులకే కాకుండా సాధారణ ప్రజలు, ప్రసార మాధ్యమాలు, వ్యాపారవేత్తలకూ ఇది కీలక సమయమని చెప్పారు. శనివారం రాత్రి ముంబయిలో ‘ఇండియా టుడే కాంక్లేవ్’లో ఆమె ప్రధాన ప్రసంగం చేశారు. ‘మన భవిష్యత్తు అంతా చాలా వరకు ఆసియాపై ఆధారపడి ఉంది. ఈ విషయంలో భారత్ మరింత క్రియాశీల పాత్రను పోషించాలి’ అని హిల్లరీ ఆకాంక్షించారు.

భారత్ అడుగుజాడల్లో...

‘శాస్త్ర సాంకేతికత, నవకల్పనలు సహా అనేక రంగాల్లో భారత్ మంచి ముందడుగు వేస్తోంది. వాతావరణ మార్పులు, మానవ హక్కులు తదితరాల్లో భారతదేశ అడుగుజాడల్లో ప్రపంచం నడుస్తోంది. ప్రజాస్వామ్యం, బహుళత్వం, అవకాశాలు, నవకల్పనలపై మనకున్న విశ్వాసానికి మునుపటికంటే ఇప్పుడు ప్రాధాన్యం పెరిగింది. ఆర్థిక సవాళ్లు, ఉగ్రవాద ముప్పు, అణ్వస్త్ర వ్యాప్తి, ఉద్యోగాల కల్పన సహా అనేక అంశాల్లో మన రెండు దేశాలకూ సారూప్యతలున్నాయి. అన్ని వర్గాల ప్రజలూ ముందుకు వచ్చి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన సమయం ఆసన్నమయింది’ అని ఆమె చెప్పారు. భారతదేశానికి తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందన్నారు.



భారత్ అనేక రూపాల్లో ఇచ్చిన కానుకలతో ప్రపంచ ప్రజల జీవితాలు సుసంపన్నమయ్యాయని కొనియాడారు.

అవి రియాలిటీ టీవీ ఎన్నికలు: 2016లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికలను రియాలిటీ టీవీ ఎన్నికలుగా హిల్లరీ అభివర్ణించారు. అమెరికా అధ్యక్షునిగా ఉండేందుకు డొనాల్డ్ ట్రంప్ తగిన వ్యక్తి కారని నిందించారు. ఆ ఎన్నికల్లో రష్యా జోక్యం ఉందని పునరుద్ఘాటించారు. ఇకపై తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని చెప్పారు. పారిస్ ఒప్పందంలో అమెరికా లేకపోవడం సిగ్గు చేటన్నారు. ఉగ్రవాదులకు పాకిస్థాన్ స్థావరంగా మారిందని ఆరోపించారు. అంతర్జాతీయ ఉగ్రవాది ఒసామా బిన్‌లాడెన్‌పై దాడి చేయాల్సిందిగా అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాకు తాను సిఫార్సు చేసినట్లు చెప్పారు.

ఇండోర్ చేరుకున్న హిల్లరీ క్లింటన్

ఇండోర్: అమెరికా విదేశాంగశాఖ మాజీమంత్రి హిల్లరీ క్లింటన్ మూడురోజుల పర్యటన నిమిత్తం ఆదివారం ఇక్కడికి చేరుకున్నారు. ప్రయివేటు విమానంలో ఆమె ఆదివారం ఉదయం ఎనిమిదిగంటలకు ఇక్కడి దేవి అహల్యా బాయ్ హోల్కర్ విమానాశ్రయంలో దిగారు. ఈ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

హిల్లరీ తన మూడురోజుల మధ్యప్రదేశ్ పర్యటనలో భాగంగా నర్మదా నదిలో పడవలో విహరిస్తారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మహేశ్వరి చీరల నేత ప్రక్రియను స్వయంగా చూస్తారు. ఇక్కడి పలు దర్శనీయ స్థలాల్లో పర్యటిస్తారు. అలనాటి హోల్కర్ రాజ కుటుంబానికి చెందిన రిచర్డ్ హోల్కర్ ఆహ్వానంపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఇది పూర్తిగా హిల్లరీ క్లింటన్ వ్యక్తిగత పర్యటన మాత్రమేనని అధికారులు తెలిపారు.

ఓట్ల లెక్కకు కూడిక యంత్రాలు అనవసరం

- వాటిని వాడడం వల్ల ప్రజా ప్రయోజనాలేవీ నెరవేరవు
- సుప్రీంకోర్టులో కేంద్రం ప్రమాణపత్రం దాఖలు

దిల్లీ: కొన్ని పోలింగ్ కేంద్రాల ఓట్లను కలిపి లెక్కించడానికి కూడిక యంత్రాలు (టోటలైజర్లు) వాడాల్సిన అవసరం లేదని కేంద్రం అభిప్రాయపడింది. వీటిని వాడడం వల్ల విస్తృత ప్రజా ప్రయోజనాలు నెరవేరవని సుప్రీంకోర్టులో తేల్చిచెప్పింది. మంత్రుల బృందం చేసిన సిఫార్సులు ఆధారంగా ఈ నిశ్చితాభిప్రాయానికి వచ్చినట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ తెలిపింది. మానవ వనరుల్ని ఆదా చేయడానికి వీలుగా పార్లమెంటు, శాసనసభలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ భాజపా నేత అశ్వినీ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఆదేశానుసారం కేంద్రం ప్రమాణపత్రాన్ని దాఖలు చేసింది. కూడిక యంత్రాలను వాడాల్సిన ఆవశ్యకత తరుణంలో లేదని కేంద్రహోంమంత్రి రాజ్‌నాథ్ నేతృత్వంలోని మంత్రుల బృందం సిఫార్సు చేసింది. 14 పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓట్లను కలిపి ఒకేసారి లెక్కించడానికి టోటలైజర్లు ఉపయోగపడతాయి. పోలింగ్ కేంద్రాల వారీగా విడివిడిగా ఓట్ల వివరాలు తెలిస్తే అభ్యర్థులకు తాము ఎక్కడ బలహీనంగా ఉన్నామో అర్థమై, ఆ ప్రాంతాలపైదృష్టి సారించడానికి వీలవుతుందని మంత్రుల బృందం అభిప్రాయపడినట్లు న్యాయశాఖ ఈ ప్రమాణపత్రంలో తెలిపింది. ఎన్నికల సంస్కరణల దిశగా అన్ని చర్యలూ చేపడుతున్నామని తెలిపింది. ఏ ప్రాంతంలో ఎవరికెన్ని ఓట్లు పడిందీ తెలిసిపోతున్న దృష్ట్యా టోటలైజర్లను ప్రవేశపెట్టేలా ఆదేశించాలని కక్షిదారు కోరారు. ఉమ్మడి ఓటర్ల జాబితా జారీ, ఆదివారాల్లో ఎన్నికలు నిర్వహించడం, ఓటర్ల నమోదుకు తపాలా కార్యాలయాలను ఉపయోగించుకోవడం వంటివి ఎన్నికల సంఘం చూసుకోవాల్సిన విషయాలనీ, పిటిషన్‌ను కొట్టివేయాలనీ కేంద్రం కోరింది.

ఛాంపియన్



పేస్‌తో ఆడాల్సిందే..

• బోపన్న అభ్యంతరాన్ని పట్టించుకోని ఏఐటీఏ
• డేవిస్‌కప్ జట్టులో లియాండర్

దిల్లీ: వెటరన్ టెన్నిస్ స్టార్ లియాండర్ పేస్ తిరిగి డేవిస్‌కప్ జట్టులోకి వచ్చాడు. రోహన్ బోపన్న అభ్యంతరాలను తోసిరాజంటూ అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) చైనాతో పోరుకు పేస్‌కు జట్టులో స్థానం కల్పించింది. దీంతో సెలక్షన్ వ్యవహారాల్లో ఆటగాళ్ల జోక్యాన్ని సహించేంది లేదని గట్టిగా సందేశం పంపినట్లయింది. డబుల్స్ ర్యాంకింగ్స్‌లో తిరిగి టాప్-50లో చోటు సంపాదించడంతో పేస్‌కు మార్గం సుగమమైంది. ఐదుగురు సభ్యుల సెలక్షన్ కమిటీ.. పేస్‌తో పాటు యుకి బాంబ్రి, రామ్‌కుమార్ రామనాథన్, సుమిత్ నగాల్, రోహిత్ బోపన్నలను ఎంపిక చేసింది. దివిజ్ శరణ్ రిజర్వ్ సభ్యుడిగా ఉంటాడు. కెనడాతో ప్రపంచ గ్రూప్ ప్లే ఆఫ్ పోరులో పేలవ ప్రదర్శన చేసిన పూరవ్ రాజాపై ఊహించినట్లుగానే వేటు పడింది. చైనాతో ఆసియా/ఓషియానా జోన్ గ్రూప్-1 రెండో రౌండ్ పోరు (ఏప్రిల్ 6- 7)తియాంజిన్ (చైనా)లో జరుగుతుంది.



బోపన్న

భూపతి లేఖ రాసినా..: పేస్ తన డేవిస్‌కప్ ప్రపంచ రికార్డు సాధించేందుకు వీలుగా రోహన్ బోపన్న చైనాతో పోరు నుంచి తప్పుకోవాలనుకుంటున్నాడని పేర్కొంటూ నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌కు లేఖ రాసినట్లు ఏఐటీఏ వర్గాలు తెలిపాయి. అంటే పేస్‌తో జోడీగా ఆడడం తనకు ఇష్టం లేదని బోపన్న చెప్పకనే చెప్పాడన్నమాట. ఐతే సెలక్షన్ కమిటీ మాత్రం పేస్, బోపన్నలను ఇద్దరినీ ఎంపిక చేసింది. బంతిని బోపన్న కోర్టులోకి నెట్టింది. ఇక ఆడాలో లేదో తేల్చుకోవాల్సింది అతడే. "పేస్‌తో విభేదాలను బోపన్న ఇంకా మరిచిపోలేదని, ఈ ఇద్దరి మధ్య కోర్టులో ఇప్పటికీ సమన్వయం లేదని నాన్ ప్లేయింగ్ కెప్టెన్ మహేశ్ భూపతి ఏఐటీఏతో చెప్పాడు. తనతో ఆడేలా బోపన్నను పేస్ మాత్రమే ఒప్పించగలడన్నది అతడి భావన" అని ఓ ఏఐటీఏ అధికారి చెప్పాడు. "బోపన్న ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందుకుంటున్నాడు. ఒకవేళ అతడు వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి, దేశం తరపున ఆడలేనంటే..ఏఐటీఏ అతడికి మద్దతివ్వదు. ఏడాదిలో రెండు లేదా మూడు సార్లు మాత్రమే వాళ్లు దేశం తరపున ఆడాల్సివుంటుంది. ఎలాంటి అజెండా లేకుండా ఓ రెండు వారాలు ఆడలేరా?" అని ఆ అధికారి అన్నాడు. బోపన్న చాలా కాలంగా పేస్‌తో ఆడేందుకు తిరస్కరిస్తున్న సంగతి తెలిసిందే. పేస్ మాత్రం బోపన్నతో ఆడేందుకు తనకెలాంటి అభ్యంతరం లేదని అంటున్నాడు. "తిరిగి భారత డేవిస్‌కప్ జట్టులో చోటు దక్కినందుకు సంతోషంగా ఉంది. నేను ఎంతో శ్రమించి ర్యాంకింగ్స్‌లో మెరుగయ్యా. బోపన్నతో కలిసి ఆడాలనుకుంటున్నా. మాది మంచి జోడీ అవుతుంది. రోహన్ ఎంతో ప్రతిభావంతుడు. ఒక ఆటగాడిగా అతణ్ని గౌరవిస్తా" అని 44 ఏళ్ల పేస్ అన్నాడు. పేస్ గత ఏప్రిల్‌లో ఉజ్బెకిస్థాన్‌తో పోరుకు జట్టులో స్థానం కోల్పోయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత పరిస్థితుల్లో లియాండర్ పేస్, రోహన్ బోపన్నలే అత్యుత్తమ డబుల్స్ జోడీ అని భారత డేవిస్‌కప్ కోచ్ జీషన్ అలీ అన్నాడు.



అఖిల్‌కు పసిడి

షూటింగ్ ప్రపంచకప్

దిల్లీ: షూటింగ్ ప్రపంచకప్‌లో భారత యువ ఆటగాళ్ల జోరు కొనసాగుతోంది. ఇప్పటికే షాజార్ రిజ్వి, మను బాకర్, మెహులి ఘోష్, అంజుమ్ పతకాలు గెలవగా.. తాజాగా అఖిల్ షెరోన్ సత్తా చాటాడు. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీలో అతను 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్ విభాగంలో స్వర్ణం కైవసం చేసుకున్నాడు. ఫైనల్లో 455.6 పాయింట్లు సాధించిన షెరోన్..బెర్న్‌హార్డ్ (ఆస్ట్రియా, 452 పాయింట్లు)ను వెనక్కినెట్టి అగ్రస్థానంలో నిలిచాడు. ఫైనల్లో షెరోన్‌తో పాటు భారత వెటరన్ షూటర్ సంజీవ్ రాజ్‌పుత్, స్వప్నిల్ కుస్లే కూడా పతకం కోసం తలపడ్డారు. ఆరంభంలో రాజ్‌పుత్ జోరు చూపించాడు. అతను రెండో స్థానంలో నిలువగా.. షెరోన్, స్వప్నిల్ ఉమ్మడిగా నాలుగో స్థానంలో కొనసాగారు. కానీ పోటీ గడుస్తున్నకొద్దీ రాజ్‌పుత్ వెనకబడగా.. షెరోన్ మెరుగయ్యాడు. ఆఖర్లో సమీప ప్రత్యర్థి బెర్న్‌హార్డ్ కన్నా పాయింట్ ఆధిక్యంలో నిలిచిన షెరోన్.. స్వర్ణం ఖాయం చేసుకోగా.. కీలక సమయాల్లో గురి తప్పిన రాజ్‌పుత్ మాత్రం పతకానికి దూరమైపోయాడు. మహిళల 25 మీటర్ల పిస్టల్‌లో మను బాకర్ ఫైనల్‌కు అర్హత సాధించింది. ఈ విభాగంలో అన్నురాజ్ సింగ్ పదో స్థానంతో సరిపెట్టుకుంది.

అమ్మాయిల జోరు కొనసాగేనా

నేడే భారత్, ఆస్ట్రేలియా తొలి వన్డే

ఉ॥ 8.50 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో



వదోదర: దక్షిణాఫ్రికా పర్యటనలో వన్డే, టీ20 సిరీస్‌లు గెలిచి ఊపు మీదున్న భారత మహిళల జట్టుకు మరో సవాల్. స్వదేశంలో ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి వన్డే జరిగేది సోమవారమే. సఫారీ పర్యటన ఇచ్చిన ఉత్సాహంతో మిథాలీ సేన ఆసీస్‌ను ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరం. సూపర్ ఫామ్‌లో ఉన్న మిథాలీతో పాటు వైస్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ రాణించడంపైనే భారత విజయావకాశాలు ఆధారపడి ఉన్నాయి. బౌలింగ్‌లో వెటరన్ పేసర్ జులన్ గోస్వామి గాయం కారణంగా దూరం కావడం భారత్‌కు దెబ్బే. మరోవైపు మెగ్ లానింగ్ సారథ్యంలోని ఆస్ట్రేలియా జోరు మీదుంది. ఆల్‌రౌండర్లు ఎలిస్ పెర్రీ, వెలాని, వికెట్‌కీపర్ అలిసా హీలీ ఆ జట్టుకు బలం.

రెండో టెస్టుపై దక్షిణాఫ్రికా పట్టు



డివిలియర్స్ (126)

పోర్ట్ ఎలిజబెత్: ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో దక్షిణాఫ్రికా విజయావకాశాలు సృష్టించుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 139 పరుగుల కీలక ఆధిక్యం సాధించిన ఆ జట్టు.. రెండో ఇన్నింగ్స్‌లోనూ ఆస్ట్రేలియాను కట్టడి చేసింది. మూడో రోజు, ఆదివారం ఆట ఆఖరుకు ఆస్ట్రేలియా 5 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఉస్మాన్ ఖవాజా (75; 136 బంతుల్లో 14×4) ఒక్కడే సఫారీ బౌలర్లకు అడ్డు నిలిచాడు. ఓపెనర్లు బాన్‌క్రాఫ్ట్ (24), వార్నర్ (13)లతో పాటు కెప్టెన్ స్టీవ్ స్మిత్ (11), షాన్ మార్ష్ (1) విఫలమయ్యారు. మిచెల్ మార్ష్ (39), టిమ్ పైన్ (5) క్రీజులో ఉన్నారు. 5 వికెట్లు చేతిలో ఉన్న ఆసీస్ ఆధిక్యం 41 పరుగులే. అంతకుముందు 263/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా.. 382 పరుగులకు ఆలౌటైంది. అద్భుత పోరాటాన్ని కొనసాగించిన డివిలియర్స్.. 126 పరుగులతో (146 బంతుల్లో 20×4, 1×6) అజేయంగా నిలిచాడు. అతడికి ఫిలాండర్ (36), కేశవ్ మహరాజ్ (30) గొప్పగా సహకరించారు. వీరితో 8, 9 వికెట్లకు వరుసగా 84 పరుగులు, 58 పరుగులు జోడించి జట్టుకు విలువైన ఆధిక్యాన్నందించాడు ఏబీ. సిరీస్‌లో 0-1తో వెనుకబడి ఉన్న దక్షిణాఫ్రికా.. సోమవారం ఆసీస్‌ను త్వరగా ఆలౌట్ చేయగలిగితే మ్యాచ్ నెగ్గడానికి మంచి అవకాశాలున్నట్లే.

దేశవాళీ ఆటగాళ్లకు సరిపోదు

కోల్‌కతా: దేశవాళీ క్రికెటర్ల మ్యాచ్ ఫీజులను మరింత పెంచాలని మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ బీసీసీఐని కోరాడు. బోర్డు ఇటీవలే ఒక రోజు మ్యాచ్ ఫీజును రూ.10 వేలు పెంచి రూ.35 వేలుగా నిర్ణయించిన నేపథ్యంలో అతడు ఈ వ్యాఖ్యలు చేశాడు. "మ్యాచ్ ఫీజు ఇంకా పెంచాలని కోరుతున్నా. ఎందుకంటే వాళ్లు ఫస్ట్‌క్లాస్ ఆటగాళ్లు. అందులో చాలా మంది కోహ్లి లేదా రహానెలు కాలేరు" అని గంగూలీ చెప్పాడు.



ముందడుగేనా!

• లంకతో నేడు భారత్ కీలక పోరు
• ముక్కోణపు టీ20 సిరీస్



రాత్రి 7 నుంచి డి స్పోర్ట్స్‌లో..

కొలంబో

ముక్కోణపు టీ20 సిరీస్ ఆరంభానికి ముందు ఆసక్తి అంతంతమాత్రమే. భారత్ ముందు శ్రీలంక, బంగ్లాదేశ్ ఏమాత్రం నిలుస్తాయో అని అందరూ తేలిగ్గా తీసుకున్నారు. కానీ తొలి మ్యాచ్‌లో భారత్‌కు లంక షాకిస్తే.. తర్వాత బంగ్లాదేశ్‌పై భారత్ అలవోకగా నెగ్గింది. ఆపై బంగ్లాదేశేమో లంకపై రికార్డు లక్ష్యాన్ని ఛేదించి ఔరా అనిపించింది. రెండేసి మ్యాచ్‌లు ఆడిన మూడు జట్లూ ఒక మ్యాచ్ నెగ్గి, ఇంకో మ్యాచ్‌లో ఓడి సమాన స్థితిలో నిలిచాయి. ఇప్పుడు సిరీస్ రసకందాయంలో పడింది. ఇప్పుడు ఫైనల్ దిశగా ముందడుగు వేసేదెవరో చూడాలి. లంక చేతిలో అనూహ్య ఓటమి తర్వాత బంగ్లాదేశ్‌ను సునాయాసంగా ఓడించిన భారత్.. బంగ్లా చేతిలో కంగుతిన్న లంకను సోమవారం ఢీకొనబోతోంది. మిగతా రెండు జట్ల కంటే నెట్ రన్‌రేట్ మెరుగ్గా ఉన్న నేపథ్యంలో ఈ మ్యాచ్ గెలిస్తే భారత్ దాదాపుగా ఫైనల్ బెర్తు ఖరారు చేసుకుంటుంది. తొలి మ్యాచ్ ఓటమి నుంచి పాఠాలు నేర్చుకున్న బౌలర్లు బంగ్లాతో మ్యాచ్‌లో చక్కటి ప్రదర్శన చేశారు. ప్రధాన పేసర్లు ఉనద్కత్, శార్దూల్‌లతో పాటు కొత్త ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ కూడా సత్తా చాటాడు. స్పిన్నర్లు చాహల్, వాషింగ్టన్ సుందర్ రెండు మ్యాచ్‌ల్లోనూ రాణించారు. బౌలర్ల నుంచి భారత్ ఇదే ప్రదర్శనను ఆశిస్తోంది. అయితే బ్యాటింగ్‌లో మాత్రం భారత్‌కు సమస్యలు కొనసాగుతున్నాయి. దక్షిణాఫ్రికా పర్యటనలో ఫామ్ కోల్పోయి రోహిత్ శర్మ.. ఇంకా కూడా గాడిన పడలేదు. ఇదే లంకపై కొన్ని నెలల కిందట అసాధారణ రీతిలో చెలరేగి ఆడాడు రోహిత్. ప్రస్తుత సిరీస్‌లో తాత్కాలికంగా జట్టు పగ్గాలు కూడా చేపట్టిన రోహిత్.. సోమవారం మ్యాచ్‌లో అయినా ఫామ్ అందుకుంటాడేమో చూడాలి. మరో ఓపెనర్ ధావన్ మాత్రం ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. మిడిలార్డర్లో రైనా, మనీష్ పాండే కీలకం. గత మ్యాచ్‌లో అవకాశం దక్కించుకున్న యువ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ విఫలమైనప్పటికీ.. అతడికి మరో అవకాశం దక్కొచ్చు. దినేశ్ కార్తీక్‌ను తప్పించి తుది జట్టులో చోటు కోసం ఎదురు చూస్తున్న కేఎల్ రాహుల్‌ను ఆడించే అవకాశాలు లేకపోలేదు. జట్టులో ఇంకేమైనా మార్పులుంటాయేమో చూడాలి. ఇక శనివారం బంగ్లాతో పోరులో విజయానికి చేరువగా వచ్చి త్రుటిలో చేజార్చుకున్న లంకను తక్కువగా అంచనా వేయలేం. ముఖ్యంగా బ్యాటింగ్‌లో ప్రమాదకర కుశాల్ పెరీరా, కుశాల్ మెండిస్‌లను కట్టడి చేయడం కీలకం.

చండిమాల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం



కొలంబో: శ్రీలంకకు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ముక్కోణపు సిరీస్‌లో ఆ జట్టు ఆడబోయే చివరి రెండు లీగ్ మ్యాచ్‌లకు కెప్టెన్ దినేశ్ చండిమాల్ దూరమయ్యాడు. శనివారం బంగ్లాదేశ్‌తో మ్యాచ్ సందర్భంగా శ్రీలంక నిర్ణీత సమయానికి నాలుగు ఓవర్లు తక్కువగా వేసింది. మిగిలిన నాలుగు ఓవర్లకు 20 నిమిషాల దాకా అదనపు సమయం తీసుకుంది. దీన్ని తీవ్ర నేరంగా పరిగణించిన రిఫరీ చండిమాల్‌పై రెండు మ్యాచ్‌ల నిషేధం విధించాడు. అంతేకాక ఆటగాళ్లందరి మ్యాచ్ ఫీజుల్లోనూ 60 శాతం కోత వేశాడు.

మొబైల్ దొరక్కుంటే పారిపోయేవాడు

విడాకులకూ దరఖాస్తు చేసేవాడు

కోల్‌కతా: భారత ఫాస్ట్‌బౌలర్ మహ్మద్ షమిపై అతడి భార్య హసీన్ జహాన్ విమర్శల దాడిని మరింత పెంచింది. తన భర్తతో సర్దుకుపోవడానికి ఎంతో ప్రయత్నించిన తాను.. అతడి తీరుతో విసిగి వేసారిపోయాకే బయటికి వచ్చి మాట్లాడాల్సి వచ్చిందని ఆమె అంది. షమి మొబైల్ తనకు దొరికి అతడి చీకటి వ్యవహారాలకు సంబంధించి సాక్ష్యాలు సేకరించడం వల్లే ఇప్పుడు తానిలా మాట్లాడగలుగుతున్నానని, లేదంటే తన పరిస్థితి దయనీయంగా ఉండేదని హసీన్ చెప్పింది. "షమికి సర్దిచెప్పడానికి ఎప్పట్నుంచో ప్రయత్నిస్తున్నాను. అతను తన తప్పిదాన్ని ఒప్పుకుని ఉండాల్సింది. కానీ అతనలా చేయలేదు. షమిలో పశ్చాత్తాప భావమే లేదు. వివిధ దేశాల్లోని అనేకమంది మహిళలతో తన సంబంధాలు కొనసాగించాడు. నిజానికి షమి మొబైల్ నా చేతికి చిక్కకపోయి ఉంటే అతను ఉత్తర్‌ప్రదేశ్‌కు పారిపోయేవాడు. నా నుంచి విడాకుల కోసం దరఖాస్తు చేసేవాడు" అని కోల్‌కతాలో విలేకరుల సమావేశంలో హసీన్ చెప్పింది. షమితో రాజీ చేసుకునే అవకాశం గురించి జహీన్‌ను ప్రశ్నించగా.. వ్యవహారం ఆ దశ దాటిపోయిందని చెప్పింది. "నా భర్తతో సర్దుకుపోవడానికి నాలుగేళ్లుగా ప్రయత్నిస్తున్నాను. నా లాయర్ సహాయకురాలు డోలా కూడా షమికి సర్ది చెప్పే ప్రయత్నం చేసింది. కానీ మేం ఆశించింది జరగలేదు. ఇప్పుడు పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ దశలో రాజీ కష్టం. ఏదైనా నా లాయర్ సలహా మేరకే నడుచుకుంటా" అని ఆమె చెప్పింది. షమి కుటుంబ సభ్యులు నలుగురు కోల్‌కతాకు చేరుకుని హసీన్‌తో మాట్లాడే ప్రయత్నం చేయగా.. ఆమె అందుబాటులోకి రాలేదని తెలిసింది. తన కుమార్తె ఒక పేరుమోసిన క్రికెటర్‌తో న్యాయ పోరాటం చేస్తున్నందున ఆమెకు పోలీసు రక్షణ పెంచాలని హసీన్ తండ్రి కోరాడు.



ఈ దశలో షమితో రాజీ కష్టమే: హసీన్

రాజీ మార్గంలో షమి: చర్చల ద్వారా తన భార్యతో సమస్యల్ని పరిష్కరించుకోవాలని భావిస్తున్నట్లు షమి చెప్పాడు. "ఇలాంటి వ్యవహారంలో మాట్లాడుకుని పరిష్కరించుకోవడం కంటే మంచి మార్గం మరొకటి ఉండదు. అది మాకు, మా అమ్మాయికి మంచిది. పరిష్కారం కోసం నేను కోల్‌కతా వెళ్లడానికి కూడా సిద్ధం. ఆమె ఎప్పుడు కోరుకుంటే నేను అప్పుడు మాట్లాడతాను. నాపై ఆరోపణలు రోజు రోజుకూ పెరుగుతున్నాయి. నేను వాటి విషయంలో వివరణ ఇవ్వదలుచుకోలేదు. వాటిపై సమగ్ర దర్యాప్తు జరగాలి" అని షమి అన్నాడు.



ఛెత్రి

ఛెత్రి హ్యాట్రిక్

ఐఎస్ఎల్ ఫైనల్లో బెంగళూరు ఎఫ్‌సీ

బెంగళూరు: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో బెంగళూరు ఎఫ్‌సీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. సునీల్ ఛెత్రి సూపర్ హ్యాట్రిక్‌తో ఆదివారం జరిగిన రెండో అంచె సెమీఫైనల్లో బెంగళూరు 3-1తో ఎఫ్‌సీ పుణె సిటీపై విజయం సాధించింది. ఛెత్రి 15వ, 65వ, 89వ నిమిషాల్లో గోల్స్ కొట్టాడు. పుణె తరపున నమోదైన ఏకైక గోల్‌ను జోనాథన్ లుకా (82వ) సాధించాడు. బెంగళూరు-పుణె మధ్య తొలి అంచె సెమీస్ 0-0తో ముగిసింది.




సెరెనా వీనస్

సోదరితో పోరుకు సై

ఇండియన్‌వెల్స్ (అమెరికా): అమెరికా స్టార్ సెరెనా విలియమ్స్ పునరాగమనంలో దూసుకెళ్తోంది. ఇండియన్‌వెల్స్ టోర్నీ రెండో రౌండ్లో ఆమె 7-6 (7-5), 7-5తో కికి బెర్టిన్స్ (నెదర్లాండ్స్)ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో మునుపటి జోరు ప్రదర్శించలేకపోయినా.. మొత్తం మీద సెరెనా ఆధిపత్యం కొనసాగింది. కీలక సమయాల్లో ప్రత్యర్థి సర్వీస్ బ్రేక్ చేసి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ విజయంతో సెరెనా.. మూడో రౌండ్లో సోదరి వీనస్ విలియమ్స్‌తో తలపడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. మరో మ్యాచ్‌లో వీనస్ 6-3, 6-4తో సొరానా క్రిస్టీ (రొమేనియా)ని ఓడించింది. వీనస్-సెరెనా చివరిగా 2017 ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో తలపడ్డారు. అప్పుడు సెరెనాదే పైచేయి అయింది. మొత్తం మీద అక్కాచెల్లెళ్లు 28సార్లు తలపడగా.. 17 సార్లు సెరెనానే గెలిచింది.

ఐపీఎల్ జట్టుకు ఏటా రూ.250 కోట్లు

ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఆదాయం ఏటా గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఫ్రాంఛైజీలకు పంచే ఆదాయం కూడా పెంచాలని బీసీసీఐ నిర్ణయించినట్లు సమాచారం. లీగ్‌లోని ఎనిమిది ఫ్రాంఛైజీలు ఏటా తలో రూ.250 కోట్లు బోర్డు నుంచి అందుకోనున్నట్లు తెలిసింది. ఐపీఎల్ ఆదాయం నుంచి ఫ్రాంఛైజీల వాటా కింద ఇప్పటిదాకా ఏటా తలో రూ.60 కోట్లు మాత్రమే అందుతున్నాయి. ఆ మొత్తాన్ని నాలుగు రెట్లకు పైగా పెంచాలని బోర్డు నిర్ణయించిందట. వచ్చే ఐదేళ్ల కాలానికి ఐపీఎల్ ప్రసార హక్కుల్ని స్టార్ స్పోర్ట్స్‌కు ఏకంగా రూ.16,347 కోట్లకు కట్టబెట్టింది బీసీసీఐ. ఈ లెక్కన బోర్డుకు ప్రసార హక్కుల ద్వారానే ఏటా రూ.3200 కోట్లు అందుతాయి. గత సీజన్ వరకు సోనీ ఛానెల్ రూ.800 కోట్లు మాత్రమే చెల్లించేది. ప్రసార హక్కుల ఆదాయం భారీగా పెరిగిన నేపథ్యంలో ఫ్రాంఛైజీలకు చెల్లించే మొత్తం కూడా అదే స్థాయిలో పెంచనున్నారు. అయితే ఫ్రాంఛైజీలు సైతం తమ ఆదాయంలో 20 శాతం వాటాను ఫీజు కింద బీసీసీఐకి చెల్లించాల్సి ఉంటుంది.




పిల్లలకు జన్మనిస్తే..
తగ్గిపోతున్న తల్లి జీవన కాలం!



వాషింగ్టన్: పిల్లలకు జన్మనివ్వడం.. మహిళల ఆయుఃప్రమాణంపై పెను ప్రభావం చూపే అవకాశముందని తాజా అధ్యయనమొకటి గుర్తించింది. బిడ్డకు జన్మనిస్తే తల్లి జీవించే కాలం దాదాపు 11 ఏళ్లు తగ్గిపోతుందని అంచనా వేసింది. అమెరికాలోని జార్జ్ మేసన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు ఈ అధ్యయనాన్ని నిర్వహించారు. సాధారణంగా డీఎన్ఏల చివర్లో టెలోమెర్లు అనే టోపీ వంటి భాగాలుంటాయి. డీఎన్ఏ ప్రతిరూప కల్పనలో ఉపయోగపడే ఈ భాగాలు.. వయసు మీదపడేకొద్దీ చిన్నగా మారుతుంటాయి. వీటి పరిమాణం ఆయుఃప్రమాణాన్ని సూచిస్తుందని గతంలో పలు అధ్యయనాలు పేర్కొన్నాయి. తాజాగా టెలోమెర్ల పొడవును.. బిడ్డలకు జన్మనివ్వడంతో ముడిపెట్టి శాస్త్రవేత్తలు పరిశీలించారు. అమ్మగా మారని మహిళలతో పోలిస్తే.. తల్లుల్లో టెలోమెర్లు పొట్టిగా ఉన్నాయని గుర్తించారు. దాదాపు 11 ఏళ్ల జీవితకాలానికి సమానమైన స్థాయిలో ఈ తేడా ఉన్నట్లు తెలిపారు. తాజా అధ్యయన ఫలితాలను నిర్ధారించుకోవడానికి మరిన్ని పరిశోధనలు అవసరమని అభిప్రాయపడ్డారు.

గుండె వైఫల్యం వెనుక 36 జన్యువులు



లండన్: ప్రాణాంతక గుండె జబ్బులకు మెరుగైన చికిత్సా మార్గాలను అభివృద్ధి చేసే దిశగా అమెరికాలోని నార్త్‌వెస్టర్న్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ముందంజ వేశారు. గుండె వైఫల్యంతో సంబంధమున్న 36 జన్యువులను గుర్తించారు. గుండెపై ఒత్తిడిని పెంచే కారకాలను ఎలుకల్లోకి ఎక్కించడం ద్వారా శాస్త్రవేత్తలు తాజా పరిశోధన నిర్వహించారు. ఒత్తిడి కారకాల కారణంగా 36 భిన్న జన్యువులు తమ వ్యక్తీకరణను మార్చుకుంటున్నాయని.. ఫలితంగా గుండె వైఫల్యం సంభవిస్తోందని గుర్తించారు. వాటిలో కొన్ని జన్యువుల ప్రభావం గుండె సంబంధిత వ్యాధులపై గతంలో ఎప్పుడూ కనిపించలేదని తేల్చారు. తాజాగా గుర్తించిన 36 జన్యువుల్లో ఒకటి.. ఇతర జన్యువుల వ్యక్తీకరణను నియంత్రించే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉందని తెలిపారు. గుండె జబ్బులతో బాధపడుతున్న వ్యక్తుల్లో మెరుగ్గా పనిచేసే నిర్దిష్ట ఔషధాల తయారీకి తాజా ఆవిష్కరణ దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రొటీన్ లోపంతో
ఎముకల ఆరోగ్యంపై దెబ్బ



న్యూయార్క్: బోలు ఎముకల వ్యాధి(ఆస్టియోపోరోసిస్) బాధితులకు మెరుగైన చికిత్సలు త్వరలోనే అందుబాటులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎముకలు త్వరగా పెళుసుబారడానికి ఓ ప్రత్యేకమైన ప్రొటీన్ లోపమే కారణమని తాజా అధ్యయనంలో శాస్త్రవేత్తలు గుర్తించారు. 'ట్రిస్టెట్రాప్రోలిన్(టీటీపీ)' అనే ప్రొటీన్ ఎముకల తయారీ ప్రక్రియను క్రమబద్ధీకరిస్తుందని.. వాటి ఆరోగ్యాన్ని నియంత్రిస్తుందని అమెరికాలోని బఫలో విశ్వవిద్యాలయ ఆచార్యులు కీత్ కిర్క్‌వుడ్ తెలిపారు. ఆ ప్రొటీన్‌ను ఉత్పత్తి చేసే జన్యువును తొలగించిన ఎలుకల్లో.. ఎముకలు పెళుసుగా తయారవుతున్నట్లు తాము గుర్తించామన్నారు. ఎముకల సంబంధిత వ్యాధులకు మెరుగైన ఔషధాలు అభివృద్ధి చేసేందుకు తాజా ఆవిష్కరణ దోహదపడుతుందని పేర్కొన్నారు.

పచ్చబొట్టు గుట్టు వీడింది!



పారిస్: ఒక్కసారి వేసుకుంటే చాలు జీవితాంతం ఉండిపోయే పచ్చబొట్టు(టాటూ)ను సైతం చెరిపేసే సరికొత్త సాంకేతికత త్వరలోనే అందుబాటులోకి రానుంది! పచ్చబొట్టు దీర్ఘకాలంపాటు శరీరంపై కనిపిస్తుండటం వెనుక అసలు గుట్టును ఫ్రాన్స్ శాస్త్రవేత్తలు తాజాగా ఛేదించారు. సాధారణంగా సూది ద్వారా రంగును చర్మంలోకి చొప్పించినప్పుడు.. మాక్రోఫేజ్‌లుగా పిలిచే తెల్లరక్తకణాలు రంగుకణాలను మింగేస్తాయి. అనంతరం మాక్రోఫేజ్‌లు అక్కడే స్థిరంగా ఉండిపోవడంతో పచ్చబొట్టు కనిపిస్తుందని ఇప్పటివరకు భావించేవారు. అయితే, రంగుకణాలను మింగేసిన మాక్రోఫేజ్‌లు కొన్నాళ్లతర్వాత మరణిస్తాయని తాజా అధ్యయనంలో శాస్త్రవేత్తలు గుర్తించారు. అయినప్పటికీ పచ్చబొట్టు చెరిగిపోదని తెలిపారు. మాక్రోఫేజ్‌లు మరణించగానే.. వాటి పక్కనే ఉన్న ఇతర తెల్లరక్తకణాలు సదరు రంగుకణాలను మింగేస్తుండటమే ఇందుకు కారణమని వివరించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని.. కాబట్టి పచ్చబొట్టు ఎప్పటికీ చెరిగిపోదని వెల్లడించారు. అయితే, లేజర్ కిరణాల సాయంతో రంగుకణాలతో కూడిన మాక్రోఫేజ్‌లన్నింటినీ ఒకేసారి నాశనం చేయడం ద్వారా పచ్చబొట్టును చెరిపేసేందుకు వీలు కలుగుతుందని సూచించారు.

మరింత కచ్చితత్వంతో జన్యు సవరణ

* సరికొత్త సాంకేతికతను సృష్టించిన జపాన్ శాస్త్రవేత్తలు



టోక్యో: మానవాళి ఎదుర్కొంటున్న పలు సమస్యలకు పరిష్కారం చూపగల సామర్థ్యమున్న జన్యు సవరణ ప్రక్రియ ఇకపై మరింత మెరుగుపడనుంది. గతంలో ఎన్నడూలేనంత కచ్చితత్వంతో జన్యువులను సరిదిద్దే సాంకేతికతను జపాన్ శాస్త్రవేత్తలు తాజాగా అభివృద్ధి చేశారు. 'మైక్రోహోమాలజీ అసిస్టెడ్ ఎక్సిషన్'గా పిలుస్తున్న ఈ నూతన సాంకేతికతలో.. జన్యు కత్తిరింపు కోసం ప్రస్తుతం విరివిగా ఉపయోగిస్తున్న 'సీఆర్ఐఎస్‌పీఆర్', 'మైక్రోహోమాలజీ-మీడియేటెడ్ ఎండ్ జాయినింగ్(ఎంఎంఈజే)' అనే విధానాలు భాగంగా ఉంటాయి. ఒక్కో జన్యువును లక్ష్యంగా చేసుకొని.. అత్యంత కచ్చితత్వంతో లోపాలను సవరించేందుకు తాజా సాంకేతికత దోహదపడుతుంది. వ్యాధి కారక జన్యులోపాలను సరిదిద్దడానికి, హానికర సూక్ష్మజీవులను నాశనం చేయడానికి, అవసరమైన లక్షణాలతో కొత్త జాతులను సృష్టించడానికి జన్యు సవరణ ప్రక్రియను ఉపయోగిస్తుంటారు.


టీవీకి అతుక్కుపోయే పురుషులకు..
పెద్దపేగు క్యాన్సర్ ముప్పు!



లండన్: పురుషులూ జాగ్రత్త..! రోజూ నాలుగు గంటలకుపైగా టీవీకి అతుక్కుపోతే పెద్దపేగు క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని తాజా అధ్యయనం హెచ్చరిస్తోంది. బ్రిటన్‌లోని ఇంపీరియల్ కాలేజీ లండన్, ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ నిపుణులు దీన్ని చేపట్టారు. ఐదు లక్షల మంది ఆరోగ్య సమాచారాన్ని పరిశీలించారు. ఈ ఐదు లక్షల మందిలో 2391 మందికి పెద్దపేగు క్యాన్సర్ చుట్టుముట్టింది. వీరి సమాచారాన్ని ఇతరులతో సరిపోల్చారు. దీంతో కదలకుండా టీవీ ముందు కూర్చోవడం లాంటి అలవాట్లు పెద్దపేగు క్యాన్సర్ ముప్పును విపరీతంగా పెంచుతున్నట్లు తేలింది. అయితే కంప్యూటర్‌ల ముందు కూర్చున్నవారితోపాటు మహిళల్లోనూ ఇలాంటి ముప్పు కనపడకపోవడం గమనార్హం. 'టీవీల ముందు అలానే కదలకుండా కూర్చుంటే మొదట శరీరంలో కొవ్వు, బరువు పెరుగుతాయి. ఫలితంగా హార్మోన్లలో తేడావస్తుంది. ఈ పరిణామాలే క్యాన్సర్ ముప్పును పెంచుతున్నాయి' అని పరిశోధకులు నీల్ మర్ఫీ తెలిపారు. శారీరక వ్యాయామంతో ఈ ముప్పు నుంచి తప్పించుకునే వీలుందని వివరించారు.

లక్ష లక్ష్యానికి 'ఇనుము' గండి

- హైదరాబాద్‌లో సజావుగా సాగని లక్ష ఇళ్ల నిర్మాణం!
- ఏడాదిలో కొలిక్కివచ్చినవి 180 రెండు పడక గదుల ఇళ్లు మాత్రమే
- పెరిగిన ఇనుము ధరలతో పనులు నిలిపేసిన గుత్తేదారులు
- లబోదిబోమంటున్న ఖాళీ చేసిన మురికివాడల వాసులు



హైదరాబాద్‌లోని భోజగుట్ట మురికివాడ వాసులు రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణ స్థలం సమీపంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న నివాసాలు

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి – ఈనాడు, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో వేలాది మందికి మురికివాడలే ఆవాసాలు.. చెడువాసనల మధ్యే చిన్న గుడిసెలు వేసుకుని అనేక ఏళ్లుగా జీవనం సాగిస్తున్న వీరిలో రెండు పడక గదుల ఇళ్ల ప్రాజెక్టు ఆశలు రేపింది. ఈ ఇళ్ల నిర్మాణంతో సమస్యలకు తెరపడుతుందని భావించారు. ఇంకేం అధికారులు అడిగిందే తడవు తమ ఇళ్లను ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఇప్పుడేమో ఈ పథకం ఎప్పటికి పూర్తవుతుందో తెలియడం లేదు. ఇనుము ధర పెరిగిందని గుత్తేదారులు పనులు నిలిపివేయడమే ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో ఇళ్ల నిర్మాణం మరో రెండేళ్లకైనా పూర్తవుతుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీంతో ఖాళీ చేసిన మురికివాడల వాసులు లబోదిబోమంటున్నారు.

హైదరాబాద్‌లోని మురికివాడలను దాదాపుగా రూపుమాపి వాటిని మంచి కాలనీలుగా తీర్చిదిద్దాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మురికివాడల వాసులతో అధికారులు మాట్లాడారు. 109 మురికివాడలు, ఇతర ప్రాంతాల్లో దాదాపు 70 వేలకు పైగా కుటుంబాలను ఖాళీ చేయించి అక్కడ లక్ష రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణానికి జీహెచ్ఎంసీ టెండర్లు పిలిచి గుత్తేదారులకు అప్పగించింది. దాదాపు 50 వేల ఇళ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఈ ఏడాది చివరి నాటికి వేలాది ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. గరిష్ఠంగా తొమ్మిది అంతస్తుల్లో సమూహాలుగా ఇళ్లు నిర్మిస్తున్నారు. ఒక్కో ఇంటికి దాదాపు రూ.ఏడున్నర లక్షల నుంచి రూ.ఎనిమిదిన్నర లక్షల వరకు వ్యయమవుతుందని అంచనా వేశారు. ఒక్కో ఇంటికి మూడు టన్నులకు పైబడి ఇనుము వినియోగించాల్సి ఉంది. అయితే, ఇటీవల పెరిగిన ఇనుము ధరలు ఈ పనులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. టెండర్ల సమయంలో టన్ను ధర రూ.30 వేలు ఉండగా అంతే మొత్తానికి పనులు చేపట్టేందుకు అంగీకరించామని గుత్తేదారులు చెబుతున్నారు. అనంతరం ఇనుము ధర టన్ను రూ.46 వేలకు పైగా చేరుకుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో కంపెనీలు అందులోంచి రూ.వెయ్యి తగ్గించాయని.. అయినప్పటికీ రూ.45 వేలతో టన్ను కొనుగోలు చేయాల్సి వస్తోందని అంటున్నారు. అంటే ఒక్కో టన్నుకు తమపై రూ.15 వేల వరకు భారం పడుతుందని గుత్తేదారులు చెబుతున్నారు. లాభాపేక్ష లేకుండా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఇళ్ల నిర్మాణానికి ఒప్పుకున్నామని.. కానీ, నష్టాలు భరించాల్సి రావడంతో పనులు చేయలేకపోతున్నామని గుత్తేదారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

ఖర్చయింది రూ.500 కోట్లే..

మొత్తం ఇళ్లకు దాదాపు రూ.8500 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. ఇంత వరకు రూ.500 కోట్లు మాత్రమే వ్యయం చేశారు. గ్రేటర్‌లో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ మొదలై ఏడాది గడిచినా ఇప్పటి వరకు సింగం చెరువు తండాలోని 180 ఇళ్లు మాత్రమే గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయి. 50 వేల ఇళ్లు పునాది పూర్తి చేసుకుని గోడల దశలో ఉంటే, 40 వేల ఇళ్లు పునాదుల దశలోనే ఆగిపోయాయని గణాంకాలు చెబుతున్నాయి. మరో పది వేల ఇళ్లకు సంబంధించి పనులే మొదలుకాలేదు. ఇదే తరహాలో పనులు కొనసాగితే మరో రెండేళ్లు కాదు.. ఐదేళ్లయినా లక్ష ఇళ్లు అందుబాటులోకి రావడం కష్టమేనని అధికారులే చెబుతున్నారు. కేవలం బడా గుత్తేదారులు పనిచేసే ప్రాంతాల్లోనే పనులు అంతంత మాత్రంగా జరుగుతున్నాయి. ఇక మిగతా ప్రాంతాల సంగతి చెప్పనక్కర్లేదు. దాంతో సుమారు 50కిపైగా పని ప్రదేశాల నుంచి కూలీలు ఇంటికి పయనమయ్యారని, రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపకపోతే ఇబ్బందులు తప్పవని సీనియర్ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

రైతన్నను నాశనం చేయొద్దు

వారి ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు ఉండేలా చూడాలి

రిటైర్ అయ్యాక వ్యవసాయం చేసుకుంటా

జస్టిస్ జాస్తి చలమేశ్వర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ జాస్తి చలమేశ్వర్. చిత్రంలో ఏపీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

ఈనాడు, గుంటూరు: దేశ జనాభాకు అవసరమయ్యే ఆహార ఉత్పత్తులను పండిస్తున్న రైతులను నాశనం చేయవద్దని, వారి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. "గతేడాది మినుములకు రూ.12వేల ధర లభించగా ఈ ఏడాది రూ.4వేలు ఉందని ఇటీవల మా ఊరు వెళ్లినప్పుడు రైతులు దిగులు చెందారు. రైతుల ఉత్పత్తులకు ధరలు తగ్గకుండా చూస్తే ఎవరికి ఇబ్బంది ఉండదు" అని ప్రభుత్వాలకు సూచించారు. గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతు నేస్తం ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం ఉదయం జరిగిన రైతుల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. "దేశంలో వ్యవసాయం చేసి కోట్లు సంపాదించినవారిని చూడలేదు. ఇది లాభసాటి కాకపోయినా దేశంలో 90శాతం మంది సేద్యంపైనే ఆధారపడుతున్నారు. సేద్యంలో చోటుచేసుకునే పలు కారణాలతో రైతులు ఒడుదొడుకులకు లోనుకావటంతో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీన్నుంచి బయటపడటానికి తక్కువ వ్యయంతో కూడిన వ్యవసాయంపై అన్నదాతలు దృష్టి సారించాలి. కృత్రిమ వ్యవసాయంలో అనర్థాలు ఉన్నాయి. సేంద్రీయ వ్యవసాయంపై ఇప్పుడే రైతాంగం అవగాహన పెంచుకుంటోంది. ఇది శుభపరిణామం" అని చలమేశ్వర్ పేర్కొన్నారు. న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందాకా తాను ఊరెళ్లి వ్యవసాయం చేసుకుంటానన్నారు. కార్యక్రమంలో రైతు నేస్తం ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత భాష పరిరక్షణకు కృషి: ఎంపీ వినోద్‌కుమార్

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: అన్ని భాషలకు మూలమైన సంస్కృతాన్ని పరిరక్షించుకోవడమే కాక పరిపుష్టం చేసుకోవాల్సిన అవసరముందని.. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని కరీంనగర్ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్‌లో రాష్ట్రంలోని 31 జిల్లాల సంస్కృత భాషా పండితుల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా ఎంపీ వినోద్ హాజరై మాట్లాడారు. ఇంటర్‌వరకు తెలుగు అమలుచేయటంతో తమఉపాధి పోతుందనుకునే సంస్కృతపండితుల ఆవేదన తనకు తెలుసన్నారు. తెలుగు భాష పరిరక్షణకు సీఎం ఇంటర్మీడియట్ వరకు తెలుగు తప్పనిసరి చేశారన్నారు. సంస్కృత భాషకు ఎలా న్యాయం చేయవచ్చో, ఉపాధి అవకాశాలు ఏవిధంగా కల్పించవచ్చో అధ్యయనం చేసుకొస్తే ప్రభుత్వందృష్టికి తీసుకెళ్తామన్నారు.

భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలో 37 మంది ఐపీఎస్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. చాలాకాలంగా ఐపీఎస్‌ల బదిలీలపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. జిల్లాల్లో పెద్దగా మార్పులు లేకపోయినప్పటికీ ప్రధానంగా ఖాళీల భర్తీకి, నిరీక్షణలో ఉన్నవారికి పోస్టింగులు ఇచ్చేందుకు ప్రాధాన్యం ఇచ్చారు. డీజీపీ పోస్టుకు పోటీపడ్డ కృష్ణప్రసాద్‌కు రహదారి భద్రతా మండలి ఛైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఆయన రైల్వే భద్రతతోపాటు పోలీసు శాఖలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రహదారి భద్రతా విభాగం డీజీపీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రతిష్ఠాత్మకమైన హైదరాబాద్ కమిషనర్ పోస్టులో అంజనీకుమార్‌ను నియమించారు. హైదరాబాద్ సీపీ మహేందర్‌రెడ్డి డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దాదాపు ఐదు నెలలుగా ఆ పోస్టు ఖాళీగా ఉంది. అంజనీకుమార్‌కు గతంలో హైదరాబాద్ అదనపు కమిషనర్‌గా పనిచేసిన అనుభవం ఉండడంతో ఆయనకు కమిషనర్ పోస్టు అప్పగించారు. ఐదేళ్లుగా ప్రత్యేక నిఘా విభాగం (ఎస్ఐబీ)కే పరిమితమయిన సజ్జనార్‌కు సైబరాబాద్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించారు. వామపక్ష తీవ్రవాదానికి సంబంధించిన నిఘా వ్యవహారాలు చూసే ఎస్ఐబీ బాధ్యతలు ప్రస్తుతం అక్కడే డీఐజీగా పనిచేస్తున్న ప్రభాకర్‌రావుకు అప్పగించారు. వరుసగా ఎస్సైల ఆత్మహత్యలతో వివాదాస్పదమైన సిద్దిపేట కమిషనర్ శివకుమార్‌ను, దళిత యువకులను చిత్రహింసలకు గురిచేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న సిరిసిల్లా ఎస్పీ విశ్వజిత్ కంపాటిని బదిలీ చేశారు. అయితే డీఎస్పీ స్థాయికి చెందిన సుల్తాన్‌బజార్ ఏసీపీగా ఐపీఎస్ అధికారి చేతనను నియమించడం గమనార్హం. ప్రస్తుతం ఇక్కడ డీఎస్పీ హోదాలో పనిచేస్తున్న చక్రవర్తిని బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
కృష్ణప్రసాద్	డైరెక్టర్ జనరల్‌రైల్వే, రహదారిభద్రత	రహదారి భద్రత మండలి ఛైర్మన్
సంతోష్ మెహ్రా	వెయిటింగ్	సంచాలకులు, తెలంగాణ రాష్ట్రపోలీసు అకాడమీ
జితేందర్	సంచాలకులు, తెలంగాణ రాష్ట్రపోలీసుఅకాడమీ	అదనపు డీజీ, శాంతిభద్రతలు
అంజనీకుమార్	అదనపు డీజీ, శాంతిభద్రతలు	కమిషనర్, హైదరాబాద్
వి.వి.శ్రీనివాసరావు	అదనపు బాధ్యతలు, కమిషనర్, హైదరాబాద్	ఛైర్మన్, పోలీసు నియామక మండలి
ఎం.గోపీకృష్ణ	అదనపు డీజీ, ఆర్గనైజేషన్స్	డీజీ, అగ్నిమాపకశాఖ
రాజీవ్‌రతన్	డీజీ, అగ్నిమాపక శాఖ	అదనపు డీజీ, ఆర్గనైజేషన్స్
సందీప్ శాండిల్య	కమిషనర్, సైబరాబాద్	అదనపు డీజీ రైల్వే, రహదారి భద్రత
సౌమ్యామిశ్రా	ఐజీ, సీఐడీ, ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ అదనపు బాధ్యతలు	ఐజీ సంక్షేమం బాధ్యతలు
షికా గోయల్	ఐజీ, సీఐడీ	అదనపు సీపీ, నేరాలు, హైదరాబాద్
స్వాతి లక్రా	అదనపు సీపీ, నేరాలు, హైదరాబాద్	ఐజీ, శాంతిభద్రతలు (మహిళా భద్రత, షీ టీంలు, భరోసా)
అనిల్‌కుమార్	వెయిటింగ్	అదనపు కమిషనర్, ట్రాఫిక్, హైదరాబాద్
వి.సి.సజ్జనార్	ఐజీ, ఎస్ఐబీ	కమిషనర్, సైబరాబాద్
డి.ఎస్.చౌహాన్	వెయిటింగ్	అదనపు కమిషనర్, శాంతిభద్రతలు, హైదరాబాద్
టి.వి.శశిధర్‌రెడ్డి	సంచాలకులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్	అదనపు సంచాలకులు, తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ
జి.సుధీర్‌బాబు	కమిషనర్, వరంగల్	సంయుక్త కమిషనర్, రాచకొండ
తరుణ్‌జోషి	సంయుక్త కమిషనర్, రాచకొండ	సంయుక్త కమిషనర్, స్పెషల్ బ్రాంచి, హైదరాబాద్
రవివర్మ	వెయిటింగ్	డీఐజీ, సీఐడీ
ప్రభాకర్‌రావు	డీఐజీ, ఎస్ఐబీ	డీఐజీ, ఇంటెలిజెన్స్ (పూర్తి అదనపు బాధ్యతలు)
వి.రవీందర్	సంయుక్త కమిషనర్, ట్రాఫిక్, హైదరాబాద్	కమిషనర్, వరంగల్
శివకుమార్	కమిషనర్, సిద్దిపేట	ఎస్పీ, నిఘా
ఎ.వెంకటేశ్వరరావు	డీసీపీ, పశ్చిమ మండలం, హైదరాబాద్	డీసీపీ, మాదాపూర్
విశ్వప్రసాద్	డీసీపీ, మాదాపూర్	డీసీపీ, మధ్యమండలం, హైదరాబాద్
జోయల్ డేవిస్	డీసీపీ, మధ్యమండలం, హైదరాబాద్	కమిషనర్, సిద్దిపేట
ఎ.ఆర్.శ్రీనివాస్	డీసీపీ, ట్రాఫిక్, సైబరాబాద్	డీసీపీ, పశ్చిమ మండలం, హైదరాబాద్
ఎం.రమేష్	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్	డీసీపీ, తూర్పు మండలం, హైదరాబాద్
శశిధర్‌రాజు	ఎస్పీ (నాన్‌క్యాడర్), తూర్పుమండలం	డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలి
ఎం.శ్రీనివాసులు	వెయిటింగ్	ఎస్పీ, సీఐడీ
ఆర్. రాజేశ్వరి	వెయిటింగ్	ఎస్పీ, జోగులాంబ గద్వాల జిల్లా
ఎస్.ఎం.విజయ్‌కుమార్	ఎస్పీ, జోగులాంబ గద్వాల	గ్రూప్ కమాండర్, గ్రేహౌండ్స్
అనంతశర్మ	ఎస్పీ, జగిత్యాల	డిప్యూటీ డైరెక్టర్, తెలంగాణ పోలీసు అకాడమీ
విశ్వజిత్ కంపాటి	ఎస్పీ, సిరిసిల్ల	సంచాలకులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, జీహెచ్ఎంసీ
బి.కె.రాహుల్ హెగ్డే	ఏఎస్పీ, ఏటూరునాగారం	ఏఎస్పీ, రాజన్న సిరిసిల్ల ఎస్పీగా పూర్తి అదనపు బాధ్యతలు
సునీల్‌దత్	ఏఎస్పీ, భద్రాచలం	ఏఎస్పీ, జగిత్యాల ఎస్పీగా పూర్తి అదనపు బాధ్యతలు
అపూర్వారావు	ఏఎస్పీ, గోదావరిఖని	ఏఎస్పీ, సీఐడీ ఎస్పీగా పూర్తి అదనపు బాధ్యతలు
చేతనా మైలాబుట్ల	ఏఎస్పీ, వెయిటింగ్	ఏసీపీ, సుల్తాన్‌బజార్
రక్షిత కె మూర్తి	ఏఎస్పీ, వెయిటింగ్	ఏఎస్పీ, గోదావరిఖని
పాటిల్ సంగ్రాంసింగ్ గణపతిరావు	ఏఎస్పీ, వెయిటింగ్	ఏఎస్పీ, భద్రాచలం



సతీసమేతంగా విజయవాడ చేరుకున్న పవన్ కల్యాణ్

అమరావతిలో పవన్‌కల్యాణ్ నివాసం

సొంతింటి నిర్మాణానికి నేటి ఉదయం శంకుస్థాపన

ఆదివారం రాత్రి విజయవాడకు చేరుకున్న జనసేన అధినేత

ఈనాడు, అమరావతి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజధాని అమరావతిలో నివాసమేర్పరుచుకోనున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం కాజా సమీపంలో సొంత ఇంటి నిర్మాణానికి సోమవారం ఉదయం 8-9 గంటల మధ్య ఆయన శంకుస్థాపన చేయనున్నారు. మురగన్ హోటల్ రోడ్డులోని సాహితీ వెంచర్‌లో ఈ ఇంటి నిర్మాణం చేపట్టనున్నారు. దీని కోసం కుటుంబ సమేతంగా ఆదివారం రాత్రి విజయవాడకు చేరుకుని ఓ ప్రైవేటు హోటల్‌లో బస చేశారు. అత్యంత సన్నిహితులు, పార్టీ ముఖ్య నాయకులకు మాత్రమే ఈ కార్యక్రమానికి ఆహ్వానం అందింది. భవిష్యత్తులో దీన్ని పార్టీ కార్యాలయంగానూ వినియోగించుకునే అవకాశముందని పార్టీవర్గాల సమాచారం. ఈ కార్యక్రమం అనంతరం నాగార్జున విశ్వవిద్యాలయం ఎదురుగా ఉన్న మైదానంలో ఈ నెల 14న నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ మహాసభ ఏర్పాట్లపై పార్టీ ముఖ్యులతో సమీక్షించనున్నట్లు తెలిసింది.

మన మహనీయులు స్ఫూర్తి ప్రదాతలు..

మరోవైపు ఆవిర్భావ దినోత్సవ మహాసభను పురస్కరించుకుని "మన మహనీయులు స్ఫూర్తి ప్రదాతలు... అందుకోండి మా ప్రణామాలు" అంటూ రూపొందించిన వీడియోను జనసేన ఆదివారం విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన 49 మంది మహనీయుల చిత్రాలను ఈ వీడియోలో పొందుపరిచారు. ఇందులో గౌతు లచ్చన్న, గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామినాయుడు, అల్లూరి సీతారామరాజు, శ్రీశ్రీ, సర్ ఆర్థర్ కాటన్, డొక్కా సీతమ్మ, డా. యల్లాప్రగడ సుబ్బారావు, భోగరాజు పట్టాభిసీతారామయ్య, పింగళి వెంకయ్య, విశ్వనాథ సత్యనారాయణ, రఘుపతి వెంకటరత్నంనాయుడు, గుర్రం జాషువ, ఎన్‌జీరంగా, పుచ్చలపల్లి సుందరయ్య, బెజవాడ గోపాలరెడ్డి, తరిమెల నాగిరెడ్డి, శంకరంబాడి సుందరాచారి, జిడ్డు కృష్ణమూర్తి, సీపీ బ్రౌన్, దామోదరం సంజీవయ్య, టంగుటూరి ప్రకాశం, పొట్టి శ్రీరాములు, బూర్గుల రామకృష్ణారావు, సరోజినీ నాయుడు, స్వామి రామానంద తీర్థ, కొమరం భీం, దాశరథి కృష్ణమాచార్యులు, కాళోజీ నారాయణరావు, పి.వి.నరసింహారావు, సుద్దాల హనుమంత తదితర ప్రముఖుల చిత్రాలు ఉన్నాయి.



విజయ నిర్మలకు ప్రకటించిన జీవన సాఫల్య పురస్కారాన్ని తల్లి తరఫున అందుకుంటున్న నటుడు నరేష్

విజయనిర్మలకు జీవన సాఫల్య పురస్కారం

ఏయూ ప్రాంగణం, (విశాఖపట్నం) న్యూస్‌టుడే: ప్రముఖ సినీనటి, మహిళా దర్శకురాలు విజయనిర్మలకు ప్రకటించిన జీవన సాఫల్య పురస్కారాన్ని ఆమె కుమారుడు నటుడు నరేష్ అందుకున్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ, జె-వరల్డ్, 'వీ'టీం మేనేజ్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఐడబ్ల్యూడిఎ అవార్డులను వివిధ రంగాల్లో కృషి చేసిన మహిళలకు అందించాయి. విశాఖ గురజాడ కళాక్షేత్రంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, నటి సన తదితరుల చేతుల మీదుగా ఈ అవార్డును నరేష్‌కు అందజేశారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ నటి విజయనిర్మల తొలి మహిళా డైరెక్టర్ అని, గిన్నిస్ బుక్ రికార్డు సాధించారని పేర్కొన్నారు.

బ్రహ్మానందానికి 'హాస్య నట బ్రహ్మ' బిరుదు ప్రదానం

ఈనాడు డిజిటల్, మహబూబ్‌నగర్

హాస్యనటుడు బ్రహ్మానందం సార్థక నామధేయుడని, ఆయన పేరులోనే ఆనందం ఉందని తెలంగాణ శాసన సభాపతి మధుసూదనాచారి పేర్కొన్నారు. యావత్ జాతికి హాస్యాన్ని పంచుతున్న మహానటుడని కొనియాడారు. మహబూబ్‌నగర్‌లో ఆదివారం రాత్రి టీఎస్ఆర్ కాకతీయ లలితా కళాపరిషత్ ఆధ్వర్యంలో కాకతీయ కళా వైభవ మహోత్సవం నిర్వహించారు. 1100 చిత్రాలు పూర్తి చేసుకున్న బ్రహ్మానందంకు సంస్థ ఆధ్వర్యంలో 'హాస్యనటబ్రహ్మ' బిరుదును ప్రదానం చేశారు. బ్రహ్మానందం చేతికి మధుసూధనాచారి బంగారు కంకణం తొడిగి వీణను, జ్ఞాపికను బహూకరించారు. సభాపతి మాట్లాడుతూ.. కాకతీయ కళా వైభవం కార్యక్రమాల ద్వారా కాకతీయుల కీర్తిని విశ్వవ్యాప్తం చేయడానికి సుబ్బరామిరెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. బ్రహ్మానందం, కార్యక్రమ నిర్వాహకుడు, ఎంపీ టి. సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణలోని ప్రతి జిల్లాలో కాకతీయ కళా వైభోత్సవాలు నిర్వహిస్తానన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు, కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి, నటులు జయప్రద, రాజశేఖర్ మాట్లాడారు. ఎంపీలు జితేందర్‌రెడ్డి, నంది ఎల్లయ్య, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, సినీనటులు జీవిత, శ్రద్ధాదాస్, అలీ, బాబూమోహన్, శ్రీనివాస్‌రెడ్డి, రఘుబాబు, శివారెడ్డి పాల్గొన్నారు.



బ్రహ్మానందంకు వీణను బహూకరిస్తున్న సభాపతి మధుసూదనాచారి, చిత్రంలో సినీ, రాజకీయ ప్రముఖులు

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2018-20, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.